వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 16 సంచిక : 4 హైదరాబాద్ 201 ఏప్రిల్ 2018 పేజీలు : 68 రు. 25

* జిగ్నేష్ మేవాని - కొత్త దళిత రాజకీయాలు
* తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బడ్జెట్లు
* వరంగల్ మోనోరైల్ ఎవరి కోసం?
* ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా ఆందోళన
* ఈశాన్య భారత్ ఎన్నికల ఫలితాలు
* బ్యాంకు కుంభకోణాలు - ప్రైవేటీకరణ
* సిరియాలో మహా మానవ విషాదం

201 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఏప్రిల్ 2018
సంపుటి : 16
సంచిక : 4

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2018 మార్చ్ నెలలో వచ్చిన విరాళాలు - శ్రేయోభిలాషి - రు. 25,000; వై. రాజేశ్వరి, నెల్లూరు - రు. 400. మిత్రులకు కృతజ్ఞతలు - సం.

ఫిబ్రవరి 2018 వీక్షణం సంచికలో వచ్చిన వ్యాసాలన్నీ చాలా విజ్ఞానదాయకంగా ఉన్నాయి. డా. ఆర్.కె. రాసిన శ్రామిక అర్థశాస్త్రం, ప్రథమ పాఠాలు అనే వ్యాసాన్ని నేను చదివాను. చాలా బాగుంది అనే దానికంటే అందరికి అర్థమయ్యే విధంగా చాలా సరళంగా రాసారు. కొత్తగా రాజకీయాలు తెలుసుకోగోరే వారు గాని, పాతవాళ్లు కూడా చదవవలసిందిగా కోరుతున్నాను. 1955లో నేను హైస్కూల్‌లో ఎస్.ఎస్.ఎల్.సి. చదివేటప్పుడు కోదండ రామయ్య అనే సోషల్ టీచర్ ఉండేవారు. ఆయన రష్యా విప్లవం, మార్క్సు అదనపు విలువ సిద్ధాంతం గురించి ఎంతో సులభ శైలిలో చెప్పి పెట్టుబడిదారులకు లాభాలు ఎలా వస్తాయో మా(నా) చేతనే చెప్పించారు. అప్పుడు మాలో కొంతమందికి రాజకీయాల మీద ఆసక్తి కల్గింది. అదే సంవత్సరంలో వై. విజయకుమార్ రాసిన అర్థశాస్త్రం ప్రథమ పాఠాలు అనే పుస్తకం చదివాను. అది చదివిన తర్వాత అదనపు విలువ గురించి బాగా తెలుసుకోగలిగి మార్క్సిజం వైపు వచ్చేశాం. అప్పటి నుండి ఇప్పటి వరకు ఇక వెనుదిరగలేదు. ఇప్పుడు ఈ వ్యాసం చదివిన తర్వాత నా సూచన ఏమంటే అర్థశాస్త్రం, తత్వశాస్త్రం మీద తరగతులు నడిపి యువజనులకి రాజకీయ చైతన్యం కలిగించితే బాగుంటుంది. ఇది ఎంతో ముఖ్యమైన అంశంగా తీసుకొని ఆలోచించవలసిందిగా మేధావులని కోరుతున్నాను. అందుకు తగిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి తరగతులు ప్రారంభించా ల్సిందిగా కోరుతున్నాను. అర్థశాస్త్రం గురించి తెలుసుకుంటే గాని రాజకీయ పరిజ్ఞానం గురించి తెలుసుకోలేము. ఇలాంటి వ్యాసాలు రాసి వీక్షణం పత్రికకు అందించగలరని ఆశిస్తూ వీక్షణం వారికి నా కృతజ్ఞతలు.

– కడియాల సుబ్బనాచారి
నెల్లూరు

నేను వీక్షణంకు రెగ్యులర్ పాఠకుడిని. ప్రతి నెలా అన్ని వ్యాసాలు జాగ్రత్తగా చదువుతాను. స్నేహితులతో, కుటుంబ సభ్యులతో మాట్లాడేటప్పుడు వీక్షణం వ్యాసాల ద్వారా అందిన చైతన్యమే నాకు చాల ఉపయోగపడుతుంది. ఇప్పటివరకూ పత్రికకు ఉత్తరాలు రాయలేదు గాని కొన్ని వ్యాసాల మీద అభిప్రాయాలు కలుగుతుంటాయి. నాకు అంత శక్తి ఉందో లేదో అని అనుమానంతో రాయలేదు. మార్చ్ 2018 సంచికలో డా. కత్తి పద్మారావు గారు రాసిన 'డార్విన్ – ఆర్ ఎస్ ఎస్ దోపిడీ' వ్యాసం చదివినాక ఉత్తరం రాయాలని అనిపించింది. మామూలుగా పద్మారావు గారన్నా, ఆయన రచనలన్నా నాకు అభిమానం. కాని ఈ నాలుగు పేజీల వ్యాసంలో మూడు పేజీలు డార్విన్ గురించి రాసి, చివరి పేజీలో హఠాత్తుగా మరొక విషయంలోకి జంప్ అయిపోయారని అనిపించింది. ఆయన రచనలో అలా ఉందా, మీ దగ్గర వేరే వ్యాసం లోంచి మాటర్ వచ్చి కలిసిందా అర్థం కాలేదు.

– ఎస్. నాగేశ్వర రావు
ఖానాపూర్

అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం 'మార్చి 8' చారిత్రక నేపథ్యం గురించి తెలియజేస్తూ వీక్షణం మార్చ్ 2018 సంచికలో ప్రచురించిన 'అన్నమూ కావాలి, ఆత్మగౌరవమూ కావాలి' వ్యాసం మహిళల పక్షాన నిలబడి పోరాడే ఈతరం వారికి స్ఫూర్తిని కలిగించేదిగా ఉంది. మానవ చరిత్రలో అణగారిన వర్గాలు తమ రక్తాన్ని, స్వేదాన్ని, జీవితాల్ని ధారపోసి సాగించిన అనేక ఉద్యమాల ఫలితాలను అంచెలంచెలుగా కార్పొరేట్ శక్తులు తమ సొంతం చేసుకున్నట్టుగానే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని కూడా కార్పొరేట్ శక్తులు తమ వ్యాపార వస్తువుగా మలుచుకున్న వైనాన్ని చాలా వివరంగా తెలియజేసినందుకు రచయిత్రికి కృతజ్ఞతలు. ఇలాంటి వ్యాసాల అవసరం నేడు చాలా ఉంది కాబట్టి మరిన్ని వ్యాసాలు మీ నుంచి ఆశిస్తూ...

– ఎస్. కిశోర్ కుమార్
హైదరాబాద్

మార్చ్ 2018 సంచికలో వచ్చిన గోల్వాల్కర్ ఆలోచనల్లో హిందూ ఫాసిజం వ్యాసం చాలా బాగుంది. రచయిత బి. రామకృష్ణ గారికి అభినందనలు. ప్రస్తుతం దేశంలో మహమ్మారిలాగ విజృంభిస్తున్న హిందూ ఫాసిజం గురించి ఇటువంటి వివరమైన వ్యాసాలు ప్రతి సంచికలో వస్తే బాగుంటుంది. ముఖ్యంగా ఈ రచయిత చేసినట్టుగా హిందూ ఫాసిజం సిద్ధాంతకర్తలు స్వయంగా రాసిన పుస్తకాలను, వ్యాసాలను, ఉపన్యాసాలను, చేసిన చర్యలను ఒక్కొక్కటిగా వివరిస్తే వారి విషం ఎంత ప్రమాదకరమైనదో అర్థమవుతుంది. మీ పత్రిక తరఫున ఈ పనికి పూనుకుంటారని ఆశిస్తున్నాను.

– ఎచ్. నాగరాజు
అనంతపురం

మిఖయిల్ వి. పోపోవ్ వ్యాసం సోవియట్ రష్యాలో ఏం జరిగింది? చాలా బాగుంది. రంగనాయకమ్మ గారి పుస్తకం చదివినాక కలిగిన గందరగోళం, భయం, అనుమానాలు తొలగిపోయాయి. "రంగనాయకమ్మ తనను మార్క్సిస్టుగా చెప్పుకుంటున్నందుకూ, కొంతమంది ఈ కుహనా మార్క్సిస్టును మార్క్సిస్టుగా ఇంకా గుర్తిస్తున్నందుకూ, మనమందరం సిగ్గుపడాలి" అని అనువాదకులు రాసిన మాటతో ఏకీభవిస్తున్నాను.

– కె. రామలక్ష్మి
హైదరాబాద్

వీక్షణం ఫిబ్రవరి సంచికలో న్యాయవ్యవస్థ సంక్షోభంపై వచ్చిన వ్యాసాలు బాగున్నాయి. ప్రస్తుత పరిస్థితిలో న్యాయవ్యవస్థ విలువలు, ప్రజలకు న్యాయ వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లేలా చేస్తున్నాయి.

– సి. బాలరాజు
మహబూబ్‌నగర్

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

నెత్తురోడిన పాదాల లాంగ్ మార్చ్ సందేశం

వీక్షణం

మార్చ్ 6న మహారాష్ట్రలోని నాసిక్‌లో మొదలై 180 కిమీ నడిచి మార్చ్ 12న ముంబాయికి చేరి, తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని నిలదీసిన రైతుకూలీల, ఆదివాసుల యాత్ర ఇటీవలి కాలంలో గొప్ప ఆశాసూచిక. మహారాష్ట్రలో, ఇతర రాష్ట్రాలలో రైతాంగం, వ్యవసాయ రంగం అనుభవిస్తున్న సమస్యలు ఎంత తీవ్రమైనవో నానాటికీ పెరిగిపోతున్న ఆత్మహత్యలే తెలియజేస్తున్నాయి. వ్యవసాయ రంగం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం, ఇప్పటికీ దేశంలో అతి ఎక్కువ భాగం వ్యవసాయం వర్షాధారంగా, ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయేదిగా ఉండడం, విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, వ్యవసాయ పరికరాలు, విద్యుత్తు వంటి అన్ని వ్యవసాయోత్పత్తి కారకాల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, అవన్నీ సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థల గుప్పిట్లో ఉండడం, తత్ఫలితంగా వ్యవసాయంలో పెట్టుబడి పెరిగిపోవడం, అందువల్ల అప్పులు పెరిగిపోవడం, పంట వచ్చాక ఆ పెట్టుబడికి తగిన ప్రతిఫలమో, గిట్టుబాటు ధరో, అప్పులు తీర్చడానికి తగిన మొత్తమో రాకపోవడం, కొన్ని పంటలకు ప్రభుత్వమే ప్రకటించిన కనీస మద్దతు ధర మార్కెట్లో అమలులో లేకపోవడం, రైతులకు అనుకూలమైన మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడం, పంటల బీమా పథకాలు ఇన్సూరెన్స్ కంపెనీల ప్రయోజనాల కోసమే తయారుకావడం వంటి ఎన్నెన్నో సమస్యలతో వ్యవసాయ రంగం కునారిల్లుతున్నది. భూయాజమాన్యంలో తీవ్రమైన అసమానతలు, పెరిగిపోతున్న అనుపస్థిత భూస్వామ్యం, తత్ఫలితంగా పెరుగుతున్న కౌలుదారులు, వారికి ఎటువంటి రక్షణలూ లేకపోవడం, ఆదివాసి రైతాంగానికి అడవి మీద హక్కు ఉన్నదని చట్టాలు చెపుతున్నప్పటికీ ప్రభుత్వ శాఖలే ఆ చట్టాలను గౌరవించకుండా ఆదివాసి రైతాంగం మీద దౌర్జన్యం సాగించడం వంటి సమస్యలూ ఆదివాసులను, రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని, గ్రామీణ రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి.

నిజంగా రైతాంగ సమస్యల మీద, గ్రామీణ సమస్యల మీద పనిచేస్తూ, రైతాంగాన్ని, గ్రామీణ ప్రజానీకాన్ని సంఘటితం చేయడానికి, వారి హక్కుల సాధనకు పోరాటాలు చేయడానికి అనుకూలమైన వాతావరణం దేశంలో క్రమక్రమంగా పెరుగుతున్నది. కాని దేశవ్యాప్తంగా ఈ పోరాటాలను నిర్మించి, నిర్వహించలిగిన సమరశీల శక్తులు బలహీనంగా ఉండడంతో, రైతాంగ ఆవేదనలు సాధారణంగా వ్యక్తిగత ఆత్మహత్యల రూపం తీసుకుంటున్నాయి. లేదా అక్కడక్కడ చెదురుమదురుగా చిన్నస్థాయి నిరసన ప్రదర్శనలకో, తమ పంటను తామే చేతులారా పారబోసుకోవడానికో, ధ్వంసం చేసుకోవడానికో పరిమితమవుతున్నాయి. కొన్ని సందర్భాలలో కొంత సంఘటితంగా, జిల్లా, రాష్ట్రస్థాయిలలో, చిత్తశుద్ధి కలిగిన నాయకత్వంలో కొన్ని ఆందోళనలు జరిగి నప్పటికీ, వాటికి సమాజం నుంచి ఉండవలసినంత సంఘీభావం ఉండడం లేదు. గత రెండు మూడు దశాబ్దాలలో లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే కూడ సమాజం ఏమీ పట్టనట్టు నిర్లిప్తంగా కొనసాగుతున్నది. ఇక మామూలు నిరసనలకు స్పందన వస్తుందని ఆశించే పరిస్థితే లేదు.

ఇటువంటి నిర్లిప్తతనుంచి సమాజాన్ని మేల్కొలపడానికి, పాలకుల మెడలు వంచడానికి మరింత తీవ్రమైన నిరసనలు, సమరశీలమైన పోరాట రూపాలు అవసరమని రైతాంగం క్రమక్రమంగా గుర్తిస్తున్నది. కాకపోతే ఆ గుర్తింపును క్రమబద్ధంగా, ప్రణాళికాబద్ధంగా, శాస్త్రీయంగా ఉద్యమ రూపాలలోకి మలచి పాలనావిధానాలలో మార్పు సాధించే నాయకత్వం కావాలి. గత సంవత్సరం కనీసం స్థానిక స్థాయిలలో అటువంటి నాయకత్వాలు, కొత్త పోరాట రూపాలు వస్తున్నాయనే ఆశ కలిగింది. మహారాష్ట్ర, రాజస్తాన్, మధ్యప్రదేశ్, తమిళనాడు రైతాంగం అటువంటి పోరాటాలను చేపట్టారు.

ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా కిసాన్ సభ నాయకత్వంలో నాసిక్, పరిసర జిల్లాల రైతుకూలీలు, ఆదివాసి రైతాంగం జరిపిన లాంగ్ మార్చ్‌కు ప్రాధాన్యత ఉంది. ఆదివాసులు సాగు చేసుకుంటున్న అటవీ భూములపై అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం హక్కు కల్పించాలని, వ్యవసాయోత్పత్తులకు మెరుగైన కనీస గిట్టుబాటు ధరలను ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని, ప్రకృతి వైపరీత్యాల నుంచి మెరుగైన భద్రత కల్పించాలని, వ్యవసాయ కార్మికులకు, పేద రైతులకు పెన్షన్లు ఇవ్వాలని, ప్రభుత్వం వాగ్దానం చేసిన రైతు రుణమాఫీలను బేషరతుగా, సక్రమంగా అమలు చేయాలని, పెద్దనోట్ల రద్దు వల్ల రైతులకు కలిగిన ఆర్థిక నష్టాలకు పరిహారం ఇవ్వాలని. గత నెలలో కురిసిన అకాల వర్షాలకు, వడగళ్ల వానలకు పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్లతో సాగిన మహారాష్ట్ర రైతుల పాదయాత్ర మార్చ్ 12న ముంబాయి చేరింది.

ఈ లాంగ్ మార్చ్ ఈ దేశపు రైతాంగ ఉద్యమాల చరిత్రలో ఒక ప్రధానమైన అధ్యాయంగా నిలుస్తుంది. ఆరోజున యాభైవేల మంది రైతుకూలీలు, ఆదివాసి రైతాంగం ఈ దేశపు ఆర్థిక రాజధానికి చేరి తమ బలం ఏమిటో, తమ క్రమశిక్షణ ఎటువంటిదో చూపారు. వాళ్ల ఆకాంక్షలు నెరవేరాయా, ప్రచారం జరుగుతున్నట్టుగా ప్రభుత్వం దిగివచ్చి వారి డిమాండ్లు అంగీకరించిందా వేరే చర్చ. ప్రభుత్వం తరఫున ముగ్గురు మంత్రులు వచ్చి రైతుకూలీల ప్రదర్శనలో వారి డిమాండ్లను అంగీకరిస్తామని ప్రకటించి ఉండవచ్చు. గతంలో ఎన్నో వాగ్దానాలకు, హామీలకు జరిగినట్టే ఈ హామీలు కూడ చరిత్ర చెత్తబుట్టలోకి పోవచ్చు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) అనుబంధ సంస్థ అయిన అఖిల భారత కిసాన్ సభ ఈ ఉద్యమాన్ని మధ్యదారిలో వదిలేయవచ్చు. కాని ఈ లాంగ్‌మార్చ్‌ను గుర్తు ఉంచుకోవలసింది అది సాధించిన, సాధించలేకపోయిన విజయాల కోసం కాదు. దాన్ని గుర్తించవలసింది అది వెలువరించిన స్ఫూర్తి కోసం, అది ఇచ్చిన ఆశ్వాసం కోసం, అది ప్రేరేపించిన ఆశల కోసం. ఈ దేశ ప్రజలు పోరాడక తప్పని స్థితిలో ఉన్నారనీ, విశ్వసనీయ నాయకత్వం ఉంటే వీధుల్లోకి కూడ వచ్చి తమ హక్కుల కోసం నిలబడగలరనీ ఈ లాంగ్ మార్చ్ దేశానికి తెలియ జెప్పింది. మరీ ముఖ్యంగా విప్లవ, పోరాట చైతన్యం సన్నగిల్లు తున్నదని, ఇప్పుడందరూ రాజీ మార్గంలో ప్రపంచీకరణ బలిపీఠం ఎక్కడానికి సిద్ధంగా ఉన్నారని ప్రవచిస్తున్న మధ్యతరగతి భద్రజీవన పడకకుర్చీ మేధావుల సిద్ధాంతీకరణల ముక్కు మీద గుద్ది మరీ కఠిన వాస్తవం వివరించింది ఈ లాంగ్ మార్చ్. భౌతిక పరిస్థితులు మాత్రమే కాదు స్వీయ మానసిక శక్తులు కూడ మార్పుకు సిద్ధంగా, అనుకూలంగా ఉన్నాయని, కావలసింది విశ్వసనీయ నాయకత్వాన్ని ఇవ్వడం మాత్రమేనని ఈ లాంగ్‌మార్చ్ యాభైవేల ఎండిన గళాలతో, లక్ష నెత్తురోడిన పాదాలతో ప్రకటించింది. ఈ పాఠాన్ని ఇప్పటికైనా గుర్తిస్తామా లేదా అనేదే ప్రగతిశీల, విప్లవ శక్తులన్నీ తమకు తాము వేసుకోవలసిన ప్రశ్న. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

కూట్లె రాయి తీయలేదుగని ఏట్ల రాయి తీస్తడట!

దేశంల డెబ్బై ఏండ్లల్ల జనం బతుకుల్ల ఏమీ మార్పు రాలేదు. ఎక్కడేసిన గొంగడి అక్కణ్నే ఉన్నది. గద్దె మీద ఎవడు బోయి ఎవడొచ్చినా, కాంగ్రెసైనా, బీజేపీ అయినా జనం గురించి ఆలోచించినోడే లేడు. ఎన్నో దేశాలు మనకంటే శాన ముందరికి బోంగ, మనం అడుక్కతినే దశల ఉన్నం. అసలు ఢిల్లీ పెత్తనమేంది? రాష్ట్రాలకే ఎక్కువ అధికారాలు రావాలె. ఢిల్లీ సర్కారు రైతులకు ఏం జేసింది? అన్నిటి ధరలు పెరుగుతున్నయి గాని రైతు పండించిన పంటకు మాత్రం ధరలేదా? మద్దతుధర కావాల్నని అడిగితే జైల్ల పెడతరా? కడుపు మంట ఉన్నోడు మాట్లాడితే తప్పేనా? - ఈ మాటలు విప్లవకారులవో, ప్రభుత్వ వ్యతిరేకులవో కావు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె చంద్రశేఖర రావు మార్చ్ 4న ఢిల్లీ పీఠం మీద, కాంగ్రెస్ మీద, భారతీయ జనతా పార్టీ మీద కత్తిదూసి మాట్లాడిన మాటలు. కాంగ్రెసేతర, భాజపాయేతర ప్రత్యామ్నాయాన్ని, థర్డ్ ఫ్రంట్‌ను, పీపుల్స్ ఫ్రంట్‌ను ప్రారంభిస్తానని ఆయన ఈ సందర్భంగా హుంకరించారు. మూడున్నర దశాబ్దాలుగా రాజకీయ జీవితంలో, అతి ఎక్కువ భాగం అధికారపక్షంలోనే ఉన్న ఆయనకు మన రాజకీయాల అసలు రహస్యం సరిగ్గానే తెలిసి ఉంటుంది. మిగిలిన రాజకీయ పక్షాలకు సంబంధించిన ఆ రహస్యాన్ని ఆయన ఇప్పుడు ఇలా ప్రకటిస్తున్నారు. అయితే ఆయన అన్న ఈ మాటలన్నిటినీ ఈ నాలుగు సంవత్సరాల ఆయన పాలనకే అన్వయిస్తే తెలంగాణ రాష్ట్ర సమితి కూడ ఆ తానులోని ముక్కేనని తేటతెల్లమవుతుంది. జనం బతుకుల్లో మార్పు తేని ప్రభుత్వం, కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్న ప్రభుత్వం, ప్రశ్నిస్తే జైలు పాలు చేస్తున్న ప్రభుత్వం అక్షరాలా నడుపుతున్నది ఆయనే. ఒక కొత్త రాష్ట్రంగా, ప్రజా ఉద్యమ ఆకాంక్షలతో నెలకొన్న ప్రభుత్వంగా కొత్త పాలనారీతులు ప్రవేశపెట్టడానికి తనకు వచ్చిన అవకాశాన్ని తానే వదులుకుని, పాత పాలననే యథాతథంగా కొనసాగిస్తూ, ఇవాళ ఆ పాత పాలకుల మీద విరుచుకుపడుతున్నట్టు నటించడం వంచన మాత్రమే. తెలంగాణ కూట్లో రాయి తీయడానికి అన్ని అవకాశాలూ వచ్చినా, ఉన్న రాయి తీయకపోవడం మాత్రమే కాదు, కొత్త రాళ్లు కలిపిన వ్యక్తి ఇవాళ కేంద్ర ప్రభుత్వం అనే ఏట్లో రాళ్లు తీయడానికి వెళతానంటున్నాడంటే, ఈ మాటల వెనుక రాజకీయ ఉద్దేశాలను నిశితంగా గుర్తించవలసి ఉంది. ఇది భారతీయ జనతా పార్టీతో మైత్రిలో భాగంగా, భాజపా వ్యతిరేక వోట్లు కాంగ్రెస్ వైపు వెళ్లకుండా వేస్తున్న ఎత్తుగడ కావచ్చు. తన వారసుడికి రాష్ట్ర రాజకీయాధికారం కట్టబెట్టి తాను ప్రజల గురించి ఉదాత్తమైన ఆదర్శాలు వల్లించే దేశస్థాయి రాజకీయ నాయకుడిగా వెలగడానికి ఒక దారి కావచ్చు. భాజపా కూడ విఫలమైతే మళ్లీ రానున్న సంకీర్ణ రాజకీయాలలో తన ఇంద్రజాలాన్ని ప్రదర్శించి కేంద్ర ప్రభుత్వంలోనూ పగ్గాలు చేపట్టవచ్చుననే ఎత్తుగడ కావచ్చు. ఏది ఏమైనా వ్యక్తిగా చంద్రశేఖర రావుకు గాని, రాజకీయ పక్షంగా తెలంగాణ రాష్ట్ర సమితికి గాని కాంగ్రెసేతర, భాజపాయేతర శక్తిగా గుర్తించడానికి కనీస అర్హత, యోగ్యత లేదు. అసలు భారత పార్లమెంటరీ రాజకీయాలలో విభిన్న ముఠాలలో ఏ ఒక్క ముఠాకూ ప్రజా ప్రయోజనాల కోసం నిలబడే ఆలోచనే లేదు. నూతన ఆర్థిక విధానాలను, హిందుత్వ మతోన్మాదాన్ని వ్యతిరేకించకుండా కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తానన్నా, భాజపాను వ్యతిరేకిస్తానన్నా అది కేవలం వాగాడంబరానికీ, వంచనకూ చిహ్నమే తప్ప వాస్తవ ప్రజా ప్రయోజనాల పట్ల, ఈ దేశపు సమాఖ్య స్వభావంపట్ల శ్రద్ధాసక్తులుకాదు. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

ప్రత్యేక హోదా పాలకుల కోసం కాదు, ప్రజల కోసం

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ప్రత్యేక హోదా అనే బ్రహ్మపదార్థం చుట్టూ తిరుగుతూ రసవత్తరమైన ప్రహసనంగా మారుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 సందర్భంలో ప్రత్యేక హోదా అనే మాట వచ్చినప్పుడే దేశంలో ఈశాన్య ప్రాంతంలో, కొండ ప్రాంతాలలో ఇచ్చిన ఆ హోదా ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వడం సాధ్యంకాదని పరిశీలకులు అన్నారు. అప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి కూడ ప్రత్యేక హోదా అవసరం లేదని, ప్యాకేజీ ఇస్తే చాలునని అన్నారు. ఇప్పుడు ప్రత్యేక హోదా కావాలని ప్రతిపక్షాలు అడగడం ప్రారంభించేసరికి అధికార పక్షం కూడ ప్రత్యేక హోదా కావాలంటున్నది. చివరికి కేంద్రమంత్రివర్గంలోని తన సభ్యులతో రాజీనామాలు చేయించి, నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ భాగస్వామ్యం వదులుకుని, పార్లమెంట్‌ను స్తంభింపజేస్తూ తానే ఉద్యమం నడుపుతున్నట్టు నటిస్తున్నది. నిజానికి అటు ప్రతిపక్షాలైనా, ఇటు అధికారపక్షమైనా ఆంధ్రప్రదేశ్‌కు విభజన నాటి హామీలను నెరవేర్చమని కేంద్ర ప్రభుత్వం మీద గత నాలుగు సంవత్సరాలలో నిజంగా ప్రభావశీలమైన ఒత్తిడి తెచ్చిన సందర్భమే లేదు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో ఒక ఎన్నికల ఎత్తుగడగా ఈ అంశాన్ని లేవనెత్తుతున్నాయి. ఇంతకూ ప్రత్యేక హోదా అంటే రాష్ట్ర ప్రభుత్వానికి అదనపు రాయితీలు, నిధులు, ప్రయోజనాలు చేకూరడమనే సంకుచిత నిర్వచనమే అధికార, ప్రతిపక్షాలు రెండూ ఇస్తున్నాయి. వాస్తవానికి హైదరాబాద్ నుంచి దూరమైనందువల్ల ఆంధ్రప్రదేశ్ ప్రజలు కోల్పోయిన విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు వీలు కల్పించడమే, ఆ మేరకు వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధి సాధించడమే ఇవాళ కావాలి. కనీసం ఈ ప్రత్యేక హోదా ఆందోళనల సందర్భంలోనైనా ఆ హోదావల్ల వచ్చే అదనపు నిధులను వికేంద్రీకరించి ఖర్చు పెడతామని, పునర్వ్యవస్థీకరణ చట్టంలోనే పేర్కొన్న రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని తగ్గించడానికి ఆ ప్రత్యేక నిధులను ఖర్చు పెడతామని అధికారపక్షం అనడం లేదు. అటువంటి వికేంద్రీకృత అభివృద్ధి నమూనాయే పాలకుల లక్ష్యం కావాలని ప్రధాన ప్రతిపక్షమూ అనడం లేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్రస్తావన లేకుండా ప్రత్యేక హోదా గురించి కేకలూ పెడబొబ్బలూ వేస్తున్నారంటేనే అసలు లక్ష్యం ప్రత్యేక హోదానో, ప్రజల అభివృద్ధో కాదని తేలిపోతుంది. నాలుగు సంవత్సరాల పాలన ప్రజా జీవితంలో గణనీయమైన మార్పేమీ తేలేదు గనుక, రాజధాని అభివృద్ధి పేరుతో రాష్ట్రంలో మిగిలిన అంశాలన్నిటినీ నిర్లక్ష్యం చేయడం జరిగింది గనుక, ఆ రాజధాని అభివృద్ధి కూడ రియల్ ఎస్టేట్ అభివృద్ధిగా, పిడికెడు మంది ఆశ్రితుల లాభార్జనగా మారింది గనుక రాష్ట్రంలో ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి ఉంది. ఈ అసంతృప్తిని పక్కదారి పట్టించడానికి కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యం చేయడం అధికార పక్షపు అవసరం. ఆ అసంతృప్తిని వోట్లుగా మార్చుకుని రానున్న ఎన్నికల్లో అధికారాన్ని చేపట్టి తమ అవినీతి సామ్రాజ్యాన్ని పునర్నిర్మించుకోవడం ప్రధాన ప్రతిపక్ష అవసరం. ఈ రెండు స్వార్థపూరిత అవసరాల కోసం జరుగుతున్న ప్రహసనం నిజమైన ప్రజల అవసరాలను పట్టించుకోకపోవడం సహజమే.

వీ


చైనాలో మళ్లీ జీవితకాల అధ్యక్ష పదవి


- ఎ.నర్సింహారెడ్డి

చైనా పీపుల్స్ రిపబ్లిక్ అధ్యక్ష, ఉపాధ్యక్షుల పదవీ కాలాల పరిమితిని ఎత్తివేస్తూ రాజ్యాంగాన్ని సవరించాలని చైనా కమ్యూనిస్టుపార్టీ ఉన్నత స్థాయి నాయకత్వం గత అక్టోబర్‌లో తీసుకున్న నిర్ణయం తిరోగమన చర్య. *1976*లో మావో జెడాంగ్ మరణం తర్వాత డెంగ్ సియావో పింగ్ అధికారానికి వచ్చింది మొదలు చైనా కమ్యూనిస్టు పార్టీకి నేతృత్వం వహించిన నాయకులంతా క్రమక్రమంగా పార్టీలో, ప్రభుత్వ విధాన నిర్ణయాల్లో స్వేచ్ఛా మార్కెట్ విధానాలను అనుసరిస్తూ వచ్చారు. మావో నాయకత్వంలో సాధించిన సమసమాజ విప్లవ సంప్రదాయాల్ని, ప్రజా సాంస్కృతిక వారసత్వాన్ని, సమిష్టి సామాజికార్థిక వ్యవస్థల్ని, సంస్థల్ని పక్కన బెట్టి, ప్రపంచీకరణ విధానాలతో చైనా పెట్టుబడిదారీ దేశంగా ఎదగడానికి పింగ్ నాయకత్వం కీలకపాత్ర పోషించింది. డెంగ్ జియావో పింగ్ మొదలు జియాంగ్ జెమిన్, హు జింటావో విదేశీ పెట్టుబడులకు ద్వారాలు తెరిచారు. పెట్టుబడిదారీ పునరుద్ధరణను ముందుకు తీసుకువెళ్తూ చైనాను ఒక సామ్రాజ్యవాద శక్తిగా మార్చారు. దేశంలో శ్రమ దోపిడీ, అవినీతి, నియంతృత్వ పాలన కొనసాగిస్తూ అంతర్జాతీయంగా పెట్టుబడులతో ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రయత్నాలు చేస్తున్న చైనా పాలకులు ఇంకా సోషలిజం ముసుగులోనే పాలన సాగిస్తున్నారు. సొంత ఆస్తిని పునరుద్ధరించారు, కమ్యూన్‌లను రద్దు చేశారు. అభివృద్ధి పేరిట ప్రజలను నిర్వాసితులను చేస్తున్నారు. సోషల్ సామ్రాజ్యవాద శక్తిగా ఎదిగిన చైనా అధికార పార్టీ రంగు మార్చకుండానే దిక్కు మార్చింది. జిన్‌పింగ్‌ను మావో సరసన చేర్చింది. జిన్‌పింగ్ ఆలోచనలను 'చైనీయ లక్షణాలతో కూడిన నూతన శకపు ఆలోచనలు' అంటూ సామ్రాజ్యవాద విధానాలను ప్రబోధిస్తున్నారు.


*1982*లో డెంగ్ జియావోపింగ్ కాలంలో అప్పటి ప్రభుత్వం ఏ వ్యక్తి అయినా అధ్యక్ష పదవిని రెండుసార్లు మాత్రమే చేపట్టాలని చట్టం చేసింది. *2013*లో జిన్‌పింగ్ చైనా అధ్యక్షుడు అయ్యాడు. అవినీతి వ్యతిరేక ఉద్యమం పేరుతో పార్టీలో ప్రత్యర్థులందరినీ అడ్డు తొలగించుకున్న జిన్‌పింగ్ ఇప్పుడు ప్రభుత్వ యంత్రాంగంపై పట్టుబిగించాడు. జిన్‌పింగ్ కోసం దేశాధ్యక్ష పదవిలో ఓ వ్యక్తి రెండు పర్యాయాలు మాత్రమే కూర్చోవాలన్న నిబంధనను రద్దు చేస్తూ మార్చి *11*న పార్లమెంటు ఆమోదం తెలిపింది. దీనివల్ల ప్రస్తుత అధ్యక్షుడు జిన్‌పింగ్ జీవితకాలపు అధ్యక్షుడుగా కొనసాగేందుకు అవకాశం కలుగుతుంది. దీంతో ఆయన చైనాలో తిరుగులేని నేత అయ్యాడు. చైనా సైన్యానికి అధినేతగా కూడా జిన్‌పింగ్ ఎంపికయ్యారు. వాంగ్ చైనా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. కొత్త ప్రభుత్వంలో ప్రధాని లీ కెకియాంగ్ మినహా ఉన్నత స్థాయి అధికారులను, మంత్రిమండలిని, అక్కడి సెంట్రల్ బ్యాంకు గవర్నర్‌ను మార్చేయనున్నారు. జింన్‌పింగ్ చైనాను అంతర్జాతీయంగా సోషల్ సామ్రాజ్యవాద అగ్రరాజ్యంగా నిలబెట్టవచ్చు.

వన్ రోడ్ వన్ బెల్ట్ పేరుతో వర్తక వాణిజ్యాలలో ఆధిపత్యానికి పావులు కదుపుతున్న చైనా, ఇప్పటికే ఆసియాలో ప్రాంతీయాధిపత్యం చలాయిస్తున్నది. సైన్యం ఆధునికీకరణ వ్యూహాలు, ఇండో-పసిఫిక్ తీరంలో దుందుడుకు ధోరణులు జిన్‌పింగ్ నేతృత్వంలో చైనా విస్తరణవాద కాంక్షకు అద్దం పడుతున్నాయి. అదే సమయంలో అంతర్గతంగా దేశంలో వ్యక్తిపూజ సంస్కృతి, అధికారం కోసం రక్తపాతం, అరాచకత్వం తదితర సామాజిక సంక్షోభాలు తలెత్తవచ్చు. అవధుల్లేని అధికారం ఎన్నడూ ప్రజాస్వామికం కాదు. వీ







❖ **ఆణిముత్యాలు** – కథా సంపుటి – స్వర్గీయ ఇంజేటి మునిరత్నం జ్ఞాపకార్థం – ఇంజేటి – సాకం కుటుంబం, తిరుపతి, ప్రచురణ – 80 పేజీలు, 1/8 డెమీ, వెల అమూల్యం



❖ **సామెతలు-కవితా రూపాలు** – ఉగాది ముచ్చట – తెలుగు భాషోద్యమ సమితి ప్రచురణ – 46 పేజీలు, 1/8 డెమీ, రు. 15, ప్రతులకు: సాకం నాగరాజు, ఇ.నెం. 6-1-70, వరదరాజు నగర్, తిరుపతి




❖ **ఎడారి బతుకులు** – పల్లెకతలు – ఎండపల్లి భారతి – గుండ్లదండ ప్రచురణలు – 132 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: ఎండపల్లి భారతి, ఫోన్ : 9652802460




❖ **ఆనవాళ్లు** – కవిత్వం – దామరకుంట శంకరయ్య – సాహితీ సోపతి ప్రచురణ – 68 పేజీలు, 1/8 డెమీ, రు. 80, ప్రతులకు: శ్రీమతి శీలంపల్లి క్రాంతి, ఇ.నెం. 3-4-183, సవరన్ స్ట్రీట్, కరీంనగర్ – 505001




❖ **మనిషి నాభాష** – కవిత్వం– కిల్లాడ సత్యనారాయణ – రమ ప్రచురణలు – 116 పేజీలు, 1/8 డెమీ, రు. 75, ప్రతులకు: కె.వి. రామలక్ష్మి, పాములవాక గ్రామం, కోటారట్ల మండలం, విశాఖపట్నం జిల్లా; ఫోన్ : 9452682999




❖ **తెలంగాణ శకారంభం** – (ఉద్యమంలో పద్యం) – వెలపాటి రామరెడ్డి – విజ్ఞాన సరోవర ప్రచురణలు – 268 పేజీలు, 1/8 డెమీ, రు. 250 , ప్రతులకు: వెలపాటి రామరెడ్డి, ఇ.నెం. 23-39, శివసాయి ఫ్లోర, ఫ్లాట్ నెం. 302, క్రిష్ణవేణి నగర్, ఫ్రూట్ మార్కెట్ ఎదురుగా, కొత్తపేట్, హైదరాబాద్ – 500035



❖ **తెలంగాణ హార్వెస్ట్** – తెలుగు షార్ట్ ఫిక్షన్ 1912-2011 (ఎడిటెడ్) – మామిడి హరికృష్ణ-కె. దామోదర్ రావు – ల్యాంగ్వేజ్ అండ్ కల్చర్ హైదరాబాద్ – 437 పేజీలు, 1/8 డెమీ, రు. 500, ప్రతులకు: డైరెక్టర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాంగ్వేజ్ అండ్ కల్చర్, రవీంద్ర భారతి, హైదరాబాద్




❖ **మాగిపొద్దు** – కవిత్వం – డా. ఉదారి నారాయణ – పాలపిట్ట బుక్స్ ప్రచురణ – 120 పేజీలు, 1/8 డెమీ, రు. 70, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, ఇ.నె. 16-11-20/6/1/1, ఫ్లాట్ నెం. 403, విజయసాయి రెసిడెన్సీ, సలీమ్‌నగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500036, ఫోన్ : 040-27678430



❖ **ప్రమాదంలో భావప్రకటన స్వేచ్ఛ** – పౌరహక్కుల సంఘం ప్రచురణ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)– 56 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: ప్రొ. ఎస్. శేషయ్య, ఫ్లాట్ నెం. 49, విద్యుత్ నగర్, అనంతపురము – 515003




❖ **మోదీ ఆర్థిక విధానాలు – ప్రజాస్వామిక హక్కులు** – (చితికిపోతున్న పేద, మధ్యతరగతి బతుకులు) – పౌరహక్కుల సంఘం ప్రచురణ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) – 32 పేజీలు, 1/8 డెమీ, రు. 25, ప్రతులకు: కె. క్రాంతి చైతన్య, డోర్ నెం. 10-57, రెండవ అంతస్తు, న్యూ మారుతినగర్, ఎంఆర్ పల్లె, తిరుపతి – 517502




❖ **చిట్టిగోనె** – (పిల్లల పాటలు) – డా. వాసరవేణి పరశురాం – తెలంగాణ వివేక రచయితల సంఘం ప్రచురణ – 106 పేజీలు, 1/8 డెమీ, రు. 90, ప్రతులకు: డా. వాసరవేణి పరశురాం, ఇ.నెం. 1-29, సింగారం గ్రామం, యెల్లారెడ్డిపేట్ మండలం, రాజన్న సిరిసిల్లా జిల్లా – 505305, ఫోన్ : 949219343




❖ **విరమించని వాక్యం** – కవిత్వం – దాసరాజు రామారావు – మంజీరా రచయితల సంఘం ప్రచురణ – 130 పేజీలు, 1/8 డెమీ, రు. 60, ప్రతులకు: డి. విజయలక్ష్మి, ఫ్లాట్ నెం. 143, ఇ.నెం. 13-30/79, సాయి భగవాన్ కాలనీ, (బీరంగూడ), బిఎచ్ఇఎల్, రామచంద్రపురం, సంగారెడ్డి – 502032, ఫోన్ : 9618224503




❖ **మాడపాటి హనుమంతరావు కథలు** – మల్లికాగుచ్ఛము – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 127 పేజీలు, 1/8 డెమీ, రు. 90



❖ **యెంకి – నాయుడు బావ** – శ్రీపతి – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 158 పేజీలు, 1/8 డెమీ, రు. 110



❖ **ఆధునిక విజ్ఞానశాస్త్రం – తాత్విక అంతరార్థాలు** – ఆనందేశి నాగరాజు – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 110 పేజీలు, 1/8 డెమీ, రు. 70



❖ **తెలంగాణ తేజోమూర్తులు** – ఇల్లిందల సరస్వతీదేవి – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 100 పేజీలు, 1/8 డెమీ, రు. 70,

పై నాలుగు ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ, (నాగోల్), జిఎస్ఐ పోస్ట్, హైదరాబాద్ – 500068, ఫోన్ : 040-24224453/54

ప్రజాకాంక్షలు లేని తెలంగాణ ప్రగతి పద్దు

2018-19 తెలంగాణ బడ్జెట్ ప్రజలు ఆశించిన రీతిలో ప్రజాకాంక్షలకు ప్రతిరూపంగా లేదనీ, వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆశల పల్లకిగా సమర్పించిన బడ్జెట్‌లా ఉందనీ అంటున్నారు డా. ఎ. పున్నయ్య

మూడున్నర కోట్ల ప్రజానీకం, ఆరున్నర దశాబ్దాల బహుముఖ పోరాట ఫలితంగా ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రంలో స్వీయ పాలనలో నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకొని అయిదవ సంవత్సరానికి ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రు. 1,74,453.84 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలను ఆర్థిక మంత్రి సమర్పించారు. దీనిలో రెవెన్యూ వ్యయం రు. 1,25,456.70 కోట్లు కాగా మూలధన వ్యయం 19 శాతంతో రు. 33,369.94 కోట్లుగా ఉంది. రు. 1,04,757 కోట్లను ప్రగతి పద్దు (స్కీం ఎక్స్‌పెండిచర్)గా, రు. 69,695.94 కోట్లు నిర్వహణ పద్దుగా చూపారు. రాష్ట్రంలో ఉన్న వనరుల రీత్యా ఆవిర్భావం నుండి ఏటికాయేడు రెవెన్యూ రాబడులు పెరుగుతున్నాయి. రెవెన్యూ ఖర్చులకంటే రాబడులు అధికంగా ఉండడం చేత ఈ బడ్జెట్‌లో కూడ రెవెన్యూ మిగులు కన్పిస్తుంది.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత 2014-15 సంవత్సరంలో పది నెలల కాలానికి తొలి బడ్జెట్‌లో మొదలుకొని 2015-16 నుంచి రెవెన్యూ ఖర్చులను అధిగమించి రెవెన్యూ రాబడులను ఎక్కువ మొత్తంలోనే సాధించి, అంకెల్లో మిగులు రాష్ట్రంగానే నిలుస్తుంది. ఈ క్రమంలో రాబోయే సంవత్సరానికి రెవెన్యూ మిగులు రు. 5,520.41 కోట్లుగా బడ్జెట్ ప్రతిపాదనలో అంచనా వేశారు. 2018 ఏప్రిల్ 1 నుంచి 2019 మార్చి 31 ఆర్థిక సంవత్సర రెవెన్యూ రాబడులు రు. 1,30,975.11 కోట్లు, రెవెన్యూ ఖర్చులు రు. 1,25,454.70 కోట్లు అంటే రు. 5,520 కోట్లు మిగులు ఉంటుంది.

గత వార్షిక బడ్జెట్‌లను గమనిస్తే 2015-16 మిగులు రు. 238 కోట్లు, 2016-17లో 1,385 కోట్లు, 2017-18లో రు. 1545.39 కోట్లు మిగులు అంచనా వేశారు. ఇవేవి వాస్తవ రూపం దాల్చకపోయినా సంప్రదాయం ప్రకారం ఈసారి ఇంకాస్త ఎక్కువ అంచనాతో రు. 5,520.41 కోట్లు మిగులును అంచనా వేయడం హాస్యాస్పదమైనా మిగులు బడ్జెట్‌ను ప్రతిపాదించడం పాలకులకు పరిపాటిగా మారింది.

మూలధన వ్యయం

ఉమ్మడి రాష్ట్రంలో 2013-14లో కేవలం రు. 15,280 కోట్లు ఉండగా తెలంగాణ ఏర్పడిన తర్వాత అది రెట్టింపు కావడం స్వాగతించాల్సినదే. 2018-19లో ద్రవ్యలోటు రు. 29,077.07 కోట్లు ఉంటుందని అంచనా వేసిన ప్రభుత్వం ద్రవ్యలోటును మాత్రం రాష్ట్ర జిడిపిలో 3.45 శాతంగా నిర్ధారించింది. ఇది మొత్తంగా ఎఫ్ఆర్‌బిఎం పరిమితికి లోబడి ఉండడం విశేషమే. నిజానికి జిఎస్‌డిపి రు. 7 లక్షల కోట్లు దాటిందని తాజా గణాంకాలు చెపుతున్నాయి. దేశంలో జరిగిన వివిధ ఆర్థిక సంస్కరణల వలన కేంద్రం నుంచి రావాల్సిన నిధులు పెద్దగా ఉండవని ఈ ప్రభుత్వం నిర్ధారించుకుంది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం నుంచి వివిధ పద్దుల రూపాలలో రు. 26,857.67 కోట్లు సమకూరుతాయని భావించి భంగపడ్డది. అందువల్ల 2018-19 సంవత్సరానికి తాజా పరిస్థితుల దృష్ట్యా కేవలం రు. 29,041.88 కోట్లుగా అంచనా వేశారు. అందువల్ల ఈసారి రాష్ట్రం సొంత రాబడులనే అధికంగా నమ్ముకుంది. ఈ బడ్జెట్ మొత్తం రెవెన్యూ రాబడులు రు. 1,30,975 కోట్లు ఉంటాయని, క్యాపిటల్ రాబడులు రు. 43,50,717. 41 కోట్లుగా అంచనా వేశారు. రెవెన్యూ కాపిటల్ రాబడులు కలిపి 2018-19 బడ్జెట్‌లో రు. 1,74,482.28 కోట్లుగా ఉంటుందని అంచనా. ఇది గత బడ్జెట్ (2017-18) అంచనాలతో పోలిస్తే 16.9 శాతం అధికం. అనేక ప్రతికూలతలు, అస్పష్టతలు సవాళ్ల మధ్య ప్రవేశపెట్టిన 2018-19 సంవత్సర బడ్జెట్ కేటాయింపులను స్థూలంగా సమీక్షించుకుందాం.

వ్యవసాయరంగం

ఈ ప్రభుత్వానికి ఈ బడ్జెట్ చివరిదైనప్పటికీ సాధారణ ఎన్నికల ముందు ప్రవేశపెడుతున్న భారీ బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్‌లో నాల్గోవంతుకు పైగా అంటే 26 శాతం నిధులు వ్యవసాయానికి మళ్లించామంటూ అన్నదాతకు దన్నుగా ప్రాధాన్యం ఇచ్చి అత్యధిక ఓటర్లుగా ఉన్న రైతు లోకాన్ని ఆకట్టుకొని ఆకర్షించే ప్రయత్నమే చేసింది. రాష్ట్రం ఏర్పడగానే మొదటి బడ్జెట్‌లో రైతులకు లక్ష రూపాయల వరకు రుణమాఫీ అంటూ నాలుగు విడతలుగా ఆ రుణాన్ని మాఫీ చేసింది. ఇప్పుడు చర్చంతా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన వ్యవసాయ పెట్టుబడి సాయం పథకం. ప్రభుత్వ లెక్కల ప్రకారంగా కారుకు ఎకరాకు రు. 4 వేల చొప్పున రెండు కార్లకు రు. 8 వేలు, 1.65 కోట్ల ఎకరాల భూమికి, 76 లక్షల మందికి రు. 12 కోట్లు కేటాయించింది. ఇది బృహత్తర ఎన్నికల పథకమే అయినప్పటికీ మీడియా తమ శక్తిని మించి ప్రచార పాత్రను నిర్వహిస్తుంది.

వాస్తవ పరిస్థితులను చర్చించుకుంటే ఈ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి ఎన్‌సిఆర్‌బి రైతు స్వరాజ్య వేదిక (ఆర్ఎస్‌వి) నివేదికల ప్రకారం మహారాష్ట్ర తర్వాత అత్యధికంగా ఆత్మహత్యలు చేసుకున్న రైతులు తెలంగాణలోనే ఉన్నారు. నిజానికి రైతులు తమ పంటలకు శాస్త్రీయంగా గిట్టుబాటు ధరకు రోడ్డు మీదికి వచ్చి పోరాటాలు చేశారు. నాసిరకం

విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల నుండి రక్షించమన్నారు. మార్కెట్‌లో జరిగే మోసాలను అరికట్టి నేరుగా రైతుల నుండే కొనుగోలు జరగాలని కోరారు. సకాలంలో బ్యాంకుల నుండి రుణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాని అప్పనంగా ఎవరి దగ్గర నుండి రుపాయి ఆశించని వ్యక్తిత్వం రైతులది. కాని రైతులందరితో పాటుగా సామాన్య మధ్యతరగతి ప్రజల దృష్టిని మళ్లించేందుకు రైతులను మభ్యపెట్టేందుకు సర్కారు ప్రయత్నంగా అర్థం చేసుకోవచ్చు. మద్దతు ధర చర్చ కంటే పెట్టుబడి సాయంపై ప్రచారం అధికంగా జరుగుతుంది.

వాస్తవానికి సగటున ఒక ఎకరానికి మిర్చి పంటకు 70 వేల నుండి 80 వేల రూపాయల వరకు, పసుపు పంటకు 70 వేల నుండి 80 వేల రూపాయల వరకు, పత్తికి 35 వేల నుండి 40 వేల రూపాయల వరకు, వరికి 22 వేల నుండి 25 వేల రూపాయల వరకు, మొక్కజొన్నకు 25 వేల నుండి 30 వేల రూపాయల వరకు పెట్టుబడి అవసరంగా ఉంటుంది. (విత్తనాలు, దుక్కి దున్నేందుకు, కలుపు, పురుగు మందులకు, నాటుకు, కోతకు, మార్కెట్ తరలింపు వరకు) రైతు ఏనాడు ఉచిత సేవలను కోరుకోలేదు. తమ రక్తాన్ని స్వేదంగా మార్చి మన్నును అన్నంగా అందించేవాడు అన్నదాత. (ఈ క్రమంలో పెట్టుబడి సాయం ప్రభుత్వాన్ని ఏనాడు అడగలేదు. కాని పండిన పంటకు మద్దతు ధరను కోరాడు.)

రైతులు కోరింది స్వామినాథన్ కమిటీ చెప్పింది మద్దతు ధర అందించాలని మాత్రమే. రైతు నిస్వార్థంగా తమ కుటుంబ సాదా ఖర్చులతో పాటు పిల్లల చదువులు, పండుగలు, పెళ్లి మాత్రమే అశించాడు కాని ఏ రైతు షేర్ మార్కెట్ వ్యాపారాల్లో భాగస్వామి కాలేదు. లాభాపేక్ష లేని రైతులకు సహాయం అందించడం సంతోషదాయకమే అయినా ప్రయోజనం కన్నా ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వడమే ఆక్షేపణీయం. తెలంగాణ ప్రభుత్వం పేర్కొన్న విధానంలో కౌలు రైతులకు పెట్టుబడి సాయం లేదు. గత కొన్ని సంవత్సరాలు రైతు ఆత్మహత్యలను సమీక్షిస్తే 70 శాతం రైతు ఆత్మహత్యలు కౌలు రైతులవే. ఈ పెట్టుబడి పథకం, తమ పంట పొలాలను గ్రామాల్లోని రైతులకు కౌలుకిచ్చిన భూస్వాములను ఉద్దేశించినదిగా అర్థం అవుతుంది. కష్టపడిన రైతులకు కాకుండా పేపరు మీది రైతులకే ప్రయోజనం చేకూరే విధంగా అర్థం చేసుకోవాలి.

రైతు సమన్వయ సమితి

రైతు సమన్వయ సమితులు ప్రభుత్వానికి, రైతులకు అనుసంధానంగా ఉండి విత్తనం వేసే దగ్గర మొదలుకొని, పురుగు మందులు, ఎరువులందించడమే కాకుండా దిగుబడి, గిట్టుబాటు ధర పొందేందుకు కీలక పాత్ర వహించాలి. మార్కెట్‌లో మద్దతు ధర లభించకపోతే నేరుగా సమితులు కొనుగోలు చేసేందుకు అవసరమైన యంత్రాంగాన్ని క్షేత్రస్థాయిలో తీసుకురావాలి అనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ సమితిలో గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఒక లక్షా అరవై వేల మంది సభ్యులున్న అతి పెద్ద రంగం ఇది. ప్రభుత్వం ప్రకటించిన ఈ సమితిలో నిధులు, విధులు, విధి విధానాల్లో స్పష్టత రావాల్సి ఉంది. వ్యవసాయ శాఖ వ్యవసాయ విధానాన్ని సమన్వయం చేయాలి కాని గంపెడు ఆశలతో గంపగుత్తగా వచ్చి చేరిన 'రాజకీయ నిరుద్యోగుల' పునరావాసం కోసమే సంకల్పించిన రైతు సమన్వయ సమితులు ఒక్క రూపాయి కూడా కేటాయింపులు లేని బడ్జెట్ ద్వారా రైతు పంటలకు గిట్టుబాటు ధర లభించకపోతే ఎలా కొనుగోలు చేస్తారు వారికే తెలియాలి. పైగా అప్పటి అవసరాన్ని బట్టి బ్యాంకు ద్వారా అప్పు చేసి కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామని ప్రకటించడం మరింత విడ్డూరం. నిజానికి రైతుల పంటలను నేరుగా కొనుగోలు చేయడం నుండి తప్పుకోవాలనే మరొక కొత్త సాకు ఈ సమితిలు అనక తప్పదు. సమితి పని విధానంలో ప్రభుత్వం విఫలమైతే ముంబాయి ముట్టడి వలె 'తెలంగాణ రైతు మార్చ్'కు రైతాంగం సిద్ధంగా ఉంటుంది.

రైతు బీమా పథకం

పంట నష్ట భయాన్ని వారించడానికి రైతు బీమా పథకాన్ని అమలు చేస్తూ ఈ ఏడాది నుంచే రాష్ట్రంలోని 71 లక్షల మంది రైతులకు ఉచితంగా ప్రభుత్వమే రైతు తరపున చెల్లించి రైతులందరికి రు. 5 లక్షల బీమా సదుపాయాన్ని కల్పించేందుకు బడ్జెట్‌లో రు. 500 కోట్లు కేటాయించింది. ఇక నుండి ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు కూడా ఈ బీమా అమలయితే ఈ పథకం వల్ల రైతులకు ఉపయోగమే. రైతులకిచ్చే వడ్డీలేని పంట రుణాలకు రు. 500 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణ ప్రోత్సాహానికి రు. 52 కోట్లు కేటాయించి ట్రాక్టర్లు, సేద్యపు పరికరాలతోపాటు, కోత, నాటు వేసే పరికరాలను సబ్సిడీపై అందిస్తామన్న ప్రకటనలో స్పష్టత లేదు. కేటాయించిన నిధులు ఏమూలకు చాలవు. వ్యవసాయానికి పెద్దపీట అంటే నిధులు లేని రైతు సమన్వయ సమితి, కేటాయింపులు లేని రైతు బీమా పథకమే కనిపిస్తుంది.

నీటి పారుదల రంగం

కోటి ఎకరాలకు సాగు నీటిని అందించే లక్ష్యంలో భాగంగా వ్యవసాయం తర్వాత సాగునీటి పారుదల కోసం మూడోసారి రు. 25 వేల కోట్లు కేటాయించింది. ఈ కేటాయింపుల్లో కాళేశ్వరం, పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకే సగం నిధులు కేటాయించారు. 2017-18లో అత్యధికంగా ఇప్పటికే రు. 20 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినా అందులో బడ్జెట్ కేటాయింపుల నుంచి సగం నిధులు కూడా వ్యయం కాలేదు. బ్యాంకుల నుంచి రుణం తీసుకొని రు. 9000 కోట్లకు పైగా చెల్లించడంతో మొత్తం మీద సాగునీటి ప్రాజెక్టుల ఖర్చు రు. 20 వేల కోట్లు దాటింది. జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన కల్వకుర్తి, నెట్టంపాడు, భీమా, కొయల్‌సాగర్, దేవాదుల, ఎల్లంపల్లి ప్రాజెక్టుల ప్రధాన పనులు పూర్తి చేయడానికి అవసరమైన కనీస నిధుల కేటాయింపు జరగలేదు.

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రు. 35,210 కోట్లతో పరిపాలనా అనుమతి ఇచ్చి రు. 29,659 కోట్లకు గుత్తేదారుతో ఒప్పందం కూడా పూర్తి అయింది. దీని ప్రకారం సంవత్సరానికి రు. 15 వేల కోట్లు ఖర్చు చేస్తే గాని వచ్చే రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తికాదు. కాని ఈ బడ్జెట్‌లో రు. 3135 కోట్లు అంటే 10 శాతం లోపు మాత్రమే కేటాయించారు. దీని ప్రకారం ఈ ప్రాజెక్టు పూర్తి కావాలంటే సుమారు పది సంవత్సరాలు పట్టే అవకాశముంది. ఇక డిండి ఎత్తిపోతల పథకంకు రు. 4 వేల కోట్లుగా నిర్ధారిస్తే నేటికి రు. 500 కోట్లు కూడా ఖర్చు

జరగలేదు. ఈ బడ్జెట్‌లో రు. 525 కోట్లు మాత్రమే కేటాయించారు.

సీతారామ ప్రాజెక్టుకు రు. 10 వేల కోట్లకు పైగా చెల్లించాలి, కాని ఈ బడ్జెట్‌లో రు. 1725 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ ప్రాజెక్టులతో కార్పొరేషన్ ఏర్పాటు చేసి రుణం తీసుకోవాలని ప్రభుత్వమే నిర్ణయించింది. అలాగైనా ఈ ప్రాజెక్టులు పూర్తిగాకపోతే ఈ ప్రాజెక్టుల కొరకు సేకరించిన భూమితోపాటు పారుదల కోసం ఎదురు చూస్తున్న భూములన్నీ బీడుబారే ప్రమాదం ఉంది.

విద్యారంగం

ఒక ప్రాంతం సమగ్రాభివృద్ధి ఆ ప్రాంత విద్యారంగంపైన ఆధార పడుతుంది. విద్యారంగం అభివృద్ధి చెందితేనే సుస్థిర భవిష్యత్, మొత్తం సమాజం అభివృద్ధి చెందుతుంది. తాము అధికారంలోకి వస్తే ప్రపంచ స్థాయి విద్యా విధానాన్ని అమలు పరుస్తామని దానిని కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య ద్వారా అమలు చేస్తామని ఊదరగొట్టిన ప్రభుత్వం తాము అమలు చేసే విధానమే కేజీ టూ పీజీ నే అంటుంది. కాని ఎన్నికల మానిఫెస్టోలో చెప్పిన విధానం అమలు పరిచే విధానానికి పొంతనలేదు. కామన్ స్కూల్ విధానమే నా కల అన్న ప్రభుత్వం అన్ని మేనేజ్‌మెంట్లను ఒకే గొడుగు కిందిసి తీసుకువచ్చి కుల, మత రహిత విద్యా విధానాన్ని ఉచితంగా అందించాలి. కాని నేడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విద్యారంగాన్ని కులాలుగా, మతాలుగా విడగొట్టి ప్రాథమిక విద్యాభ్యాసం నుండే అంతరాలను పెంచే దిశగా మరింత వేగంగా అడుగులు వేయడం విచారకరం.

2014–15 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం మొత్తం బడ్జెట్‌లో రు. 1,00,637 కోట్లలో విద్యారంగానికి రు. 10,956.34 కోట్లుగా 10.88 శాతం కేటాయించింది. ఆ తర్వాత నుంచి విద్యారంగానికి నిధులు తగ్గుతూ వస్తున్నాయి. 2015–16లో రు. 1,15,669 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రు. 11,216 కోట్లు (9.69 శాతం), ఆ తర్వాత 2016–17లో మొత్తం రు. 1,30,415 కోట్ల బడ్జెట్‌లో విద్యా రంగానికి రు. 10,738 కోట్లు (8.29 శాతం) ప్రతిపాదించింది. ఇక 2017–18లో మొత్తం రు. 1,49,646 కోట్ల బడ్జెట్‌లో విద్యారంగానికి రు. 12,705 కోట్లు (8.49 శాతం) నిధులు కేటాయించింది. ప్రస్తుతం ప్రవేశపెట్టిన 2018–19 బడ్జెట్‌లో రు. 1,74,453 కోట్లకు గాను రు. 13,275 కోట్లు మాత్రమే ఉంది. ఇది కేవలం 7.61 శాతం మాత్రమే. గత బడ్జెట్ కన్నా ప్రస్తుత బడ్జెట్‌లో ఈ రంగం నిధులు 0.88 శాతం తగ్గాయి. 1964 కొఠారీ కమిషన్ పేర్కొన్నట్లు రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి. కాని ఆ కేటాయింపులు కనీసం సగానికి నోచుకోక పోవడం విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

ప్రాథమిక విద్య

పాఠశాల విద్యారంగానికి 2018–19 బడ్జెట్‌లో ప్రభుత్వం అరకొర నిధులనే కేటాయించింది. పాఠశాల విద్యకు రు. 10,830 కోట్లు ప్రతిపాదించింది. అంటే మొత్తం బడ్జెట్‌లో 6.21 శాతం నిధులనే ప్రతిపాదించింది. దీనిలో నిర్వహణ పద్దు రు. 8,685.79 కోట్లు కాగా ప్రగతి పద్దు కింది రు. 2,144.50 కోట్లు మాత్రమే. అయితే గత ఏడాది కంటే స్వల్పంగా పెరిగినట్లు కనిపించినా మొత్తం బడ్జెట్‌తో పోలిస్తే తులనాత్మకంగా కాస్త తగ్గాయి. ప్రగతి పద్దులో గత ఏడాది కంటే రు. 144 కోట్లు మాత్రమే పెరిగాయి. అయితే సర్వశిక్షా అభియాన్‌కు మాత్రం 2017–18లో రు. 1,175 కోట్లు కేటాయిస్తే ఈ సంవత్సరం రు. 117 కోట్లు తగ్గించారు. ఈ బడ్జెట్‌లో పాఠ్య పుస్తకాలు, ముద్రణాలయానికి రు. 22.64 కోట్లు, గురుకుల సొసైటీకి రు. 47.72 కోట్లు, వయోజన విద్యకు రు. 1135 కోట్లు, పాఠశాల కంప్యూటరీకరణకు రు. 10 కోట్లు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు రు. 4.79 కోట్లు ప్రతిపాదించారు. కాని నాలుగు సంవత్సరాలుగా చెపుతున్న కేజీ టు పీజీకి ప్రభుత్వం నిధులు కేటాయించలేదు.

సాంకేతిక విద్యారంగం

సాంకేతిక విద్యారంగాన్ని మరింతగా నిర్లక్ష్యం చేస్తూ కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీలకు గానీ, యూనివర్సిటీలకు గానీ ప్రగతి పద్దు కింద నయా పైసా కేటాయించలేదు. సాంకేతిక విద్యారంగ నిర్వహణ అభివృద్ధికి రు. 907 కోట్లు కావాలని అడిగితే అందులో దాదాపు సగం అంటే రు. 422 కోట్లు మాత్రమే కేటాయించడం చూస్తే ఈ ప్రభుత్వం శాస్త్ర, సాంకేతిక రంగానికి ఎంత ప్రాధాన్యతనిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఇంజనీరింగ్ కాలేజీలో, యూనివర్సిటీల్లో భవన నిర్మాణాలు, ల్యాబ్‌ల అభివృద్ధి కోసం రు. 400 కోట్లు కావాలని నివేదిక ఇస్తే ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. కాని వేదిక దొరికినప్పుడల్లా ప్రభుత్వ పెద్దలు సాంకేతిక విద్యారంగాన్ని బలంగా ముందుకు తీసుకుపోతున్నామని ఉచిత ప్రగల్భాలు పలుకుతున్నారు.

గురుకుల విద్యాలయాలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎస్‌సిల కోసం 104, ఎస్‌టిల కోసం 53, మైనారిటీల కోసం 192, బిసిల కోసం 142 మొత్తం 491 కొత్త గురుకుల పాఠశాలలను నెలకొల్పింది. ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన పాఠశాలలన్నీ అద్దె భవనాల్లోనే, పార్ట్‌టైమ్ టీచర్లతో నెట్టుకొస్తున్నారు. శాశ్వత భవనాలు, నియామకాల గురించి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. బలహీన వర్గాల విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధిలోకి రావాలనే సత్సంకల్పంతో పాటు నిధుల కేటాయింపులుంటేనే లక్ష్యం నెరవేరుతుంది.

ఉన్నత విద్యారంగం

తెలంగాణ ఉద్యమానికి విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఊపిరి పోశారు. విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఆత్మతర్పణ చేశారు. విశ్వవిద్యాలయాలే నాయకత్వానికి వెన్నుదన్నుగా నిలిచాయి. రాష్ట్ర అవతరణకు మూల కేంద్రాలైన విశ్వవిద్యాలయాల పురోభివృద్ధిపై స్వరాష్ట్రంలో కూడా ఈ ప్రభుత్వం శీతకన్ను వేయడం అత్యంత విషాదం. ఈ ప్రభుత్వం ఏర్పాటు నుండి ఉన్నత విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఉన్నత విద్యారంగంలో అనేకానేక సంస్కరణలు రావాలి. లోతైన పరిశోధనలకు విశ్వవిద్యాలయాలు వేదికలు కావాలి. ఆధునిక

సమాజానికి గల అవరోధాలను అరికట్టి సమాజానికి దశ దిశను ఈ రంగమే నిర్ధారిస్తుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకొని విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలి. మారుతున్న అవసరాలకు అనుగుణంగా సిలబస్‌లు మార్పు చేయాలి, కోర్సులను ప్రవేశపెట్టాలి. అందుకు అవసరమైన సిబ్బందిని పూర్తిస్థాయిలో శాశ్వత ప్రాతిపదికంగా నియమించాలి. పరిశోధనకు అవసరమైన ప్రయోగశాలలను, ల్యాబ్‌లను ఏర్పాటుకు బడ్జెట్ కేటాయించాలి. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య బాధ్యత నుంచి తప్పించుకోవడానికి ప్రైవేట్ విశ్వవిద్యాలయాల బిల్లు కోసం ఆరాట పడుతోంది. ఈ రంగానికి 2017-18 సంవత్సరంలో రు. 420 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈసారి సగానికి తగ్గించి రు. 210 కోట్లు మాత్రమే కేటాయించడం చూస్తుంటే మరో ఉద్యమం విశ్వవిద్యాలయాల్లో మొగ్గతొడిగే సూచనలు లేకపోలేదన్నది నిర్వివాదాంశం.

ఆర్థిక రంగం

రాష్ట్రభివృద్ధికి కీలక ఆర్థిక ప్రాతిపదిక తలసరి ఆదాయం. ఇది మన రాష్ట్రంలో ఏడాదికేడాది పెరుగుతుంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రు. 1,75,534 మోదలయింది. 2016-17తో పోలిస్తే ఇది 13.4 శాతం అధికం. గత ఏడాది తలసరి ఆదాయం రు. 1,54,734 మాత్రమే. జాతీయ తలసరి ఆదాయం కన్నా రాష్ట్ర తలసరి ఆదాయం ఎక్కువ ఉండడం గమనార్హం. జాతీయ తలసరి ఆదాయం రు. 1,12,764 మాత్రమే. రాష్ట్ర తలసరి ఆదాయం జాతీయ తలసరి ఆదాయం కన్నా రు. 62,770 ఎక్కువ. కాని ఇందులో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా తలసరి ఆదాయం ప్రభావం మిగిలిన తెలంగాణ రాష్ట్ర జిల్లాల సగటు తలసరి ఆదాయాన్ని రెట్టింపు చూపిస్తుంది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అత్యధికంగా రు. 3,68,742 ఉంటే అత్యల్పం నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల తలసరి ఆదాయం రు. 82,694గా నమోదైంది. కాబట్టి రాష్ట్రం తలసరి ఆదాయాన్ని హేతుబద్ధంగా గుర్తుంచుకోవాలి.

జిడిపి

రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిడిపి) గత ఏడాది కన్నా 10.4 శాతం పెరిగింది. 2016-17లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రు. 4,97,513 కోట్లు కాగా 2017-18లో ఇది రూ. 5,49,479 కోట్లకు పెరిగింది. జాతీయ స్థూల ఉత్పత్తితో పోల్చిన మన స్థూల ఉత్పత్తి సగటు ఎక్కువగానే నమోదు అవుతుందని గణాంకాలే చెబుతున్నాయి. జాతీయ స్థూల ఉత్పత్తి ఈ ఏడాది రు. 1,30,389 కోట్లు ఉంటుందని అంచనా. ఇది గత ఏడాది కన్నా 6.6 శాతమే ఎక్కువ. కాని రాష్ట్ర స్థూల ఉత్పత్తి మాత్రం 10.4 శాతం పెరిగింది. మన జాతీయ స్థూల ఉత్పత్తిలో మన రాష్ట్రం గత ఏడాది 4.02 శాతం వాటా నమోదు చేయగా ఈ ఏడాది ఇది 4.37 శాతానికి పెరిగింది.

ఆర్థికరంగ అభివృద్ధి రాష్ట్రంలో 9 శాతం వృద్ధి నమోదు అయినట్లు సామాజిక సర్వే చెబుతుంది. పెద్ద నోట్ల రద్దు, వస్తుసేవల పన్ను (జిఎస్‌టి) అమలు లాంటి కారణాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో వృద్ధిరేటు మందగించినా రాష్ట్రంలో ఉన్న భౌగోళిక, సహజ వనరుల అనుకూల పరిస్థితుల దృష్ట్యా భిన్నంగా రాష్ట్ర వృద్ధిరేటు నిలకడగా ఉంది. గత రెండేళ్లలోనూ రాష్ట్రం రెండంకెల వృద్ధిరేటు నమోదు చేయడం విశేషంగా పేర్కొనవచ్చు. రాష్ట్ర స్థూల విలువ 2017-18 ఆర్థిక సంవత్సరంలో రు. 6,61,052 కోట్లు. అందులో వ్యవసాయ రంగం వాటా రు. 97,885 కోట్లతో 14.8 శాతం కాగా, సేవారంగం వాటా రు. 4,32,520 కోట్లతో 65.4 శాతం ఉంది. పారిశ్రామిక రంగం వాటా రు. 1,30,647 కోట్లతో 19.8 శాతంగా నమోదైంది.

ఉమ్మడి పాలనలో ఆరున్నర దశాబ్దాల తెలంగాణలో రాష్ట్రం ఏర్పడే నాటికి ఉమ్మడి రాష్ట్రం నుంచి పంచుకున్న అప్పు రు. 70 వేల కోట్లు మాత్రమే. కేవలం గడిచిన నాలుగు సంవత్సరాలలో ఈ అప్పు మరో డెబ్బై వేల కోట్లకు పెరిగింది. చేసిన అప్పులు తిరిగి చెల్లించడానికి రాష్ట్ర ఖజానాకు భారంగా మారనుంది. 2016-17 రాష్ట్ర ప్రభుత్వం రు. 8,609 కోట్ల వడ్డీ చెల్లించింది. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పొందుపరిచింది. 2017-18లో వడ్డీ చెల్లింపులకు గాను ఇవే గణాంకాలున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం ఈ వడ్డీ భారం రు. 1.169 కోట్లకు చేరుతుంది. దాదాపు రు. 29 వేల కోట్ల అప్పులను అంచనా వేసిన ప్రభుత్వం వడ్డీల లెక్కలను మాత్రం దాచింది. అప్పులు గొప్పల కోసం కాదు, మెప్పుల కోసం కాకూడదు. ప్రజల జీవన ప్రమాణాల పెంపుదల కోసం అయి ఉండాలి.

డబుల్ బెడ్‌రూం ఇండ్లు

నిరుపేదలు కూడా సౌకర్యవంతమైన, విశాలవంతమైన ఇండ్లలో జీవించాలని, పేదలపై ఒక్క రూపాయి భారం పడకుండా ప్రభుత్వమే భరించి దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2,72,763 డబుల్ బెడ్‌రూం ఇండ్లను మంజూరు చేసింది. ఇందులో లక్ష గృహాలు జీఎచ్ఎంసి పరిధిలోనే ఉన్నాయి. నేటికి ప్రభుత్వ లెక్కల ప్రకారమే 8,331 గృహాలు మాత్రమే నిర్మాణం పూర్తి అయినాయి. ఈ భారీ పథకానికి 2014-15లో రు. 118.86 కోట్లు, 2015-16లో రు. 170.59 కోట్లు కేటాయించి గుత్తేదారులు ముందుకు రావడం లేదని ప్రభుత్వ స్థలాలు అందుబాటులో లేవనే సాకుతో ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. ప్రభుత్వం మీద స్థానిక ప్రజలు తీవ్రమైన విమర్శలు గుప్పించడంతో 2016-17లో రు. 177 కోట్లు, 2017-18లో రు. 1100 కోట్లు అంటే నేటికి రు. 1277 కోట్లను మాత్రమే ఖర్చు చేసింది. కాని ఈ నిర్మాణాలకు ప్రభుత్వం అంచనా వేసింది రు. 18 వేల కోట్లు. అంటే ఈ ఐదు సంవత్సరాలలో డబుల్ బెడ్ రూం ఇండ్లకు ఖర్చు చేసింది కేవలం 6.6 శాతం మాత్రమే. 2018-19 సంవత్సరానికి గాను రు. 2,643 కోట్లు అంటే మరొక 12 శాతం నిధులను కేటాయించారు. ప్రకటించిన ఇండ్లు పూర్తి కావడానికి ఈ కేటాయింపులు నామమాత్రమే. ఈ చాలీచాలని కేటాయింపులతో మొత్తం ఇండ్లు ఎన్ని సంవత్సరాలలో పూర్తి అవుతాయో, ఎంత మంది డబుల్ బెడ్‌రూం కలలు నిజమౌతాయో అంచనాకందడం లేదు. ఒక ప్రకటన ప్రకటించే ముందు వనరులను, సాధ్యాసాధ్యాలను అంచనా వేయకుండా ప్రకటిస్తే ఇలాంటి సంఘటనలే పునరావృతం అవుతాయి.

శాంతిభద్రతలు

ఆరున్నర దశాబ్దాలుగా నిత్యం అలజడి, అశాంతులతో తెలంగాణ సమాజం అట్టుడికింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజల్లో భవిష్యత్తు పట్ల భరోసా ఏర్పడింది. సంక్షేమ రాజ్యంగా మంచి పాలనను అందుకుంటారనుకున్న తెలంగాణ ప్రజలకు పోలీసు రాజ్యాన్ని బహూకరిస్తున్నారు. పాలకులు నియంతలుగా పోలీసు శాఖను పూర్తిగా ఆధునీకరించారు. అవసరానికి మించి సిబ్బందిని నియమించారు. కావాల్సిన వాహనాలు, ఆధునిక సాంకేతిక పరికరాలను అందించారు. కొత్తగా 7 పోలీసు కమిషనరేట్లను 27 కొత్త పోలీసు సబ్ డివిజన్లను, 29 సర్కిళ్లను, 103 పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసి, శాంతి భద్రతల పరిరక్షణకే పెద్ద పీట వేసింది. తెలంగాణ రాష్ట్రం సాధన ఉద్యమంలో కంటే స్వరాష్ట్రంలో పోలీసు పాత్ర పెరిగింది. నిజానికి పోలీసు నీడన పాలన కొనసాగించాల్సిన పరిస్థితి గాని దుస్థితి గాని లేవు. అయినప్పటికీ పాలకులు 2017-18లో రు. 3,852.21 కోట్లు కేటాయిస్తే, 2018-19లో రు. 5,790.34 కోట్లు కేటాయించింది. పోలీసు వ్యవస్థ రాజకీయ వ్యవస్థను ప్రభావవంతంగా ముందుకు తీసుకుపోతుందన్న విశ్వాసంతోనే ఈ ప్రభుత్వం కూడా కొనసాగుతున్నది. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో వాహనాల మార్పిడి మొదలుకొని ప్రభుత్వ నిరంకుశ విధానాలపై గళమెత్తే ప్రజాస్వామ్య శక్తులపై ప్రయోగానికి, హక్కుల కోసం పోరాడే నిరసన గొంతు గళమెత్తే ప్రజాస్వామ్య శక్తులపై ప్రయోగానికి, హక్కుల కోసం పోరాడే నిరసన గొంతులపై, విద్యార్థి ఉద్యమాలపై ఉక్కుపాదం మోపడానికి, విమర్శలను ఏ మాత్రం స్వీకరించ డానికి ఇష్టం లేక నిర్బంధ అణచివేత అపార పోలీసు బలగాల నియామకా నికి పోలీసువ్యవస్థ పటిష్టతకు ఈ బడ్జెట్ ఎర్రతివాచి పరిచింది.

ముగింపు

బడ్జెట్ అంటే జీవంలేని అంకెలు, సారంలేని గణాంకాలు కాదు. చిట్టా పద్దుల పట్టిక కాదు. బడ్జెట్ అంటే తెలంగాణ ప్రజల ఆకాంక్ష. వారి కళ్లల్లో తొణికిసలాడుతున్న కలలు, వారి ఆశలను, ఆకాంక్షలను నిజం చేసే నిర్మాణాత్మకమైన ప్రణాళిక ప్రజా ధనాన్ని ప్రజల నిజమైన అభివృద్ధి కోసం వెచ్చించే గంభీరమైన బాధ్యతాయుతమైన ప్రక్రియ బడ్జెట్. తెలంగాణ నెలకొల్పిన సామాజిక విలువల ఆధారంగా రూపొందించిన సజీవమైన ఆర్థిక ప్రణాళికలు అని మొదటి బడ్జెట్ ప్రవేశిక సందర్భంలో పేర్కొన్నారు.

నాలుగేళ్లు గడిచిన తర్వాత ప్రజల ఆకాంక్షలు ఎంతమేరకు నెరవేరాయి? ప్రజా ధనాన్ని ప్రజల నిజమైన అభివృద్ధి కోసం వెచ్చించే గంభీరమైన బాధ్యతాయుతమైన ఏ ప్రక్రియ మొదలయింది? ఏ సామాజిక విలువలలో రూపొందించిన సజీవమైన ఆర్థిక ప్రణాళికనో ఇప్పటికి సమీక్షించిన దాఖలా లేదు. తెలంగాణలో రాష్ట్ర అవతరణ నాటికి మిగిలిన ప్రాజెక్టుల పరిస్థితుల పట్లగాని, ప్రజల ఆదాయ వనరుల పెంపు పట్ల గాని శాశ్వత ప్రాతిపదికన చేపట్టిన ప్రణాళికలేమిటో నేటికి అంతుపట్టని పరిస్థితి జనాకర్షక పథకాలను సర్వజనామోద పథకాలుగా ప్రచారార్భాటా లకు లక్షల కోట్లు కేటాయిస్తూ నిర్మాణాత్మక ప్రజాభివృద్ధికి పథక రచన కనీసం ఈ బడ్జెట్‌లో కూడా లేకపోవడం విచారకరం. ఒకటి రెండు రంగాల్లో ప్రగతి పైకి కనబడుతున్నా సార్వత్రిక అభివృద్ధిగా భ్రమింప చేయడానికి చేసిన ప్రయత్నమే ఈ బడ్జెట్.

రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి కోటి ఎకరాలకు కాళేశ్వరమే శరణ్యమన్నట్లు ప్రభుత్వం భావించడం చిన్న మధ్య తరహా ప్రాజెక్టుల సత్ఫలితాలపై గల దృష్టి లోపాన్ని ఈ బడ్జెట్ స్పష్టం చేసింది. ప్రజలు ఆశించిన రీతిలో ప్రజాకాంక్షలకు ప్రతిరూపంగా బడ్జెట్‌లు రూపొందించడం ఈ ప్రభుత్వాలకు ఇంకా ఎన్ని దశాబ్దాలు అవసరమో! విచారకరం ఏమంటే వర్తమానంలో ప్రభుత్వం సాధిస్తున్నామని వల్లె వేసే విజయాలతో తెలంగాణ సమాజం సంతృప్తిగా లేదు. రాష్ట్ర ప్రజల సమగ్రాభివృద్ధి కోసం బడ్జెట్ రూపొందించాలి గాని చమత్కారమైన మాటలతో ఆచరణ సాధ్యం కాని హామీలతో ఓట్ల కోసం పాట్లు పడడమే బడ్జెట్ ప్రధాన లక్ష్యంగా మారింది.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, అర్థశాస్త్ర విభాగం, తెలంగాణ విశ్వవిద్యాలయం)

వీ

తెలంగాణ బడ్జెట్ వాగాడంబరాలు - వాస్తవాలు

తెలంగాణ రాష్ట్రపు 2018-19 బడ్జెట్‌లో ప్రకటనలకూ వాస్తవ కేటాయింపులకూ తీవ్రమైన అంతరం ఉందని అంటున్నారు **రాజవరం పార్థసారథి**

తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం రానున్న ఆర్థిక సంవత్సరానికి (2018–2019) సమర్పించిన బడ్జెట్ ఎన్నికలకు ముందు ఆ ప్రభుత్వం సమర్పించగలిగిన చివరి బడ్జెట్ గనుక, నాలుగు సంవత్సరాల తమ పాలనకు చివరి పరీక్ష గనుక కాస్త జాగ్రత్తగా, ప్రజలను ఆకర్షించేలా, ఎన్నికల వాగ్దానాలతో నిండి ఉంటుందని ఎవరైనా ఊహిస్తారు. కాని ఈ బడ్జెట్ లో కూడ గత నాలుగు బడ్జెట్లలో లాగనే అబద్ధాలు, అర్ధసత్యాలు, వాగాడంబరం, ఒకటి చేయదలచుకుని అందుకు భిన్నమైనది చెప్పడం వంటి తెలంగాణ రాష్ట్ర సమితి సహజ లక్షణాలు వ్యక్తమయ్యాయి. నిజానికి ఈ బడ్జెట్ పూర్తి స్వరూపాన్ని వివరించాలంటే, విశ్లేషించాలంటే ఎన్నో వివరాలు చెప్పవలసి ఉంది గాని స్థూలంగా ఈ బడ్జెట్ ను అర్థం చేసుకోవడానికి అవసరమైన పరికరాలను మాత్రం ఇవ్వడానికి ఈ వ్యాసం పరిమితమవుతుంది.

ఒక పాలకవర్గ రాజకీయపక్షంగా తెలంగాణ రాష్ట్ర సమితికి అలవాటయిన వంచనాశిల్పం ఒక పక్కన ఉండగా, అసలు భారతదేశంలో రాష్ట్రాలలో బడ్జెట్ తయారీలో ఉండే లొసుగులు కూడ ఎన్నో ఉన్నాయి. ఒక ప్రజా ఉద్యమం నుంచి తలెత్తిన ప్రభుత్వాన్నని, కొత్త సంప్రదాయాలు ప్రవేశపెడతానని, రాష్ట్రంలో మాత్రమే కాదు, దేశం మొత్తం మీద ప్రజానుకూల పాలన కోసం అవతారం ఎత్తబోతున్నానని ప్రగల్భాలు పలుకుతున్న తెరాస పాలకులు గత డెబ్బై సంవత్సరాలలో, మరీ ముఖ్యంగా గత ఇరవై ఐదు సంవత్సరాలలో అన్ని రంగుల పాలకులూ రాష్ట్రాల లోనూ, కేంద్ర ప్రభుత్వం లోనూ అనుసరించిన తప్పుడు విధానాలతోనే ఈ బడ్జెట్ ను కూడ తయారు చేశారు. పాలకవర్గాలన్నిటికీ ఉమ్మడిగా ఉన్న ఆ సాంప్రదాయిక వంచనలకు తోడుగా తెరాస కొత్తగా తనవైన వంచనలను కూడ కలిపింది.

పాత వంచనలలో మొదటిది, దాదాపు 1980ల వరకూ అంతగా ఉండేది కాదు. రానున్న ఏడాది పొడుగునా తీసుకోబోయే రాజకీయార్థిక నిర్ణయాలన్నిటినీ బడ్జెట్ లోనే ప్రకటించాలని, అనుకోకుండా వచ్చే ఖర్చుకు ప్రత్యేక అవకాశం ఉంచుకోవాలని, అది కూడ ఆ తర్వాతి బడ్జెట్ లో ఆమోదం పొందాలని, బడ్జెటేతరంగా ఏ ఆదాయమూ వ్యయమూ ఉండగూడదని 1980ల దాకా పాలకవర్గాలు తమకు తామే ఒక నియమం పెట్టుకున్నాయి. అందుకే బడ్జెట్ ప్రవేశపెట్టే దాకా సన్నాహక ప్రక్రియలన్నీ రహస్యంగా సాగేవి. సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థల జోక్యం, వారి ఆదేశాల మేరకే రాజకీయార్థిక నిర్ణయాలు జరగడం మొదలైన తర్వాత, మరీ ముఖ్యంగా నూతన ఆర్థిక విధానాల ప్రకటన జరిగిన తర్వాత పాలకవర్గాలు ఈ నియమాన్ని ఉల్లంఘించడం ప్రారంభించాయి. బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు రోజు, ఆ తర్వాత సంవత్సరమంతా కూడ బడ్జెట్ లో లేని రాజకీయార్థిక నిర్ణయాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం మాత్రమే ప్రకటించడం మొదలయింది. బడ్జెట్ తో సంబంధం లేకుండా ఇష్టారాజ్యంగా రాజకీయ లబ్ధి కోసం కార్యక్రమాలు, నిధులు ప్రకటించడం మొదలయింది. అంటే బడ్జెట్ ప్రాధాన్యత తగ్గిపోతూ, అది కేవలం ఏడాదికొకసారి జరిగే మొక్కుబడి తంతులాగ మారిపోయింది. అందువల్లనే అది కేవలం ప్రచారసాధనాలకు, విశ్లేషకులకు తప్ప మిగిలినవారికి సంబంధం లేని వ్యవహారం అయిపోయింది.

బడ్జెట్ తయారీలో ఉన్న మరొక ప్రధానమైన సమస్య బడ్జెట్ తయారీ నాటికి ప్రభుత్వం దగ్గర కచ్చితమైన గణాంకాలు అందుబాటులో లేకపోవడం. ఈ వాస్తవమైన సమస్యను పాలకవర్గాలు తమ ప్రయోజనాలకు అనువుగా, ఇష్టారాజ్యంగా అబద్ధాలు ఆడడానికి, అంకెల గారడీ చేయడానికి వాడుకుంటున్నాయి. సాంప్రదాయికంగా భారతదేశంలో ఏప్రిల్ 1 నుంచి మొదలయ్యే ఆర్థిక సంవత్సరానికి గాను బడ్జెట్ ను ఫిబ్రవరి చివరి రోజున (లేదా రాష్ట్రాలలోనైతే మార్చ్ 15కు ముందు) ప్రవేశపెట్టి, ఆ తర్వాత పార్లమెంటుకూ, అసెంబ్లీకీ చర్చించడానికి తగిన సమయం ఇచ్చి, ఆ చర్చ ఫలితంగా చేయవలసిన మార్పులు చేర్పులు చేసి, ఏప్రిల్ 1 నుంచి ఆ బడ్జెట్ అమలులోకి తేవాలనేది పాత నియమం. ఇప్పుడు ఆ చర్చా లేదు, చర్చించడానికి తగిన పరిజ్ఞానం శాసన సభ్యులకూ పార్లమెంటు సభ్యులకూ లేదు, చర్చించాలని ప్రభుత్వానికి కోరికా లేదు. తూతూ మంత్రంగా చర్చ జరిగిందనిపించి ప్రవేశపెట్టిన బడ్జెట్ నే యథాతథంగా అమలులోకి తెస్తున్నారు.

ఏ బడ్జెట్ అయినా రానున్న ఆర్థిక సంవత్సరంలో ఎక్కడెక్కడి నుంచి ఎంతెంత ఆదాయం వస్తుంది. ఆ రాబడిని ఎక్కడెక్కడ ఏయే అవసరాల కోసం ఎంతెంత ఖర్చు పెట్టాలి అని ప్రతిపాదనలు చేస్తుంది. అయితే వచ్చే సంవత్సరం రానున్న ఆదాయం అని అంచనా వేసినది అక్షరాలా నిజం కాకపోవచ్చు. వచ్చే సంవత్సరం ఫలాని పని మీద ఫలాని నిధులు ఖర్చు పెడతాను అని వేసిన అంచనా అనేక కారణాల వల్ల జరగకపోవచ్చు. అంటే రానున్న సంవత్సరానికి ఇప్పుడు ప్రతిపాదిస్తున్న అంకెలన్నీ వాస్తవమవునా కాదా ఇప్పుడు చెప్పగల స్థితి లేదు. ఆ స్థితి ఏడాది తిరిగిన తర్వాత కూడ రాదు. ఫిబ్రవరి చివరికే బడ్జెట్ తయారు కావాలంటే గడిచిన సంవత్సరం (సంవత్సరం కూడ కాదు పదకొండు నెలల్లో) ఏమి ఉత్పత్తి అయిందో, పన్ను ఆదాయం ఎంత ఉందో, ఖర్చు ఎంత అయిందో చెప్పగల వాస్తవ స్థితి ఉండదు. అందువల్ల అప్పటికప్పుడు చెప్పగలిగినదల్లా రానున్న సంవత్సరపు అంచనాలు,

గడిచిన సంవత్సరపు అంచనాలకు సవరించిన అంచనాలు మాత్రమే. ఆ తర్వాతి సంవత్సరం బడ్జెట్ నాటికి గాని ఆ సవరించిన అంచనాల వాస్తవరూపం గ్రహింపుకు రాదు. అందువల్ల ప్రతి బడ్జెట్ లోను రానున్న సంవత్సరపు అంచనాలు (వీటిని బడ్జెట్ ఎస్టిమేట్స్ – బి ఇ అంటారు), గడిచిన సంవత్సరపు సవరించిన అంచనాలు (వీటిని రివైజ్డ్ ఎస్టిమేట్స్ – ఆర్ఇ అంటారు), అంతకు ముందు సంవత్సరానికి కచ్చితంగా తేలిన అంకెలు (వీటిని ఆక్చువల్స్ లేదా అకౌంట్స్ అంటారు) మూడు అంకెలు ఉంటాయి. అంటే ప్రభుత్వ ఈ సంవత్సరం ఎంత ఆర్భాటంగా, ఎంత వాగాడంబరంతో, ఎంత మాయ చేస్తూ ఒక భారీ అంకె ప్రకటించినా ఆ అంకె వచ్చే సంవత్సరానికి మారిపోతుంది. ఆ తర్వాత సంవత్సరానికి అసలు రంగు బైటపడుతుంది. అప్పటిదాకా ఓపికగా ఎదురుచూసి, మూడు అంకెలనూ పోల్చిచూసి తమ మోసాన్ని పసిగట్టే వాళ్లెవరూ ఉండరులే అని పాలకవర్గాలన్నిటికీ చాల భరోసా ఉంటుంది. ఆ భరోసానే వాళ్లు ఎన్ని అబద్ధాలాడడానికైనా వీలు కల్పిస్తుంది.

సాంప్రదాయికంగా బడ్జెట్లలో మరొక లోపం కొన్ని రంగాలకు కేటాయించినంత ఖర్చు పెట్టకపోవడం, కొన్ని రంగాలకు కేటాయించిన దానికన్న ఎక్కువ ఖర్చుపెట్టడం. ప్రజలను మోసగించడానికి, అప్పటికప్పుడు బుజ్జగించడానికి ఈసారి బడ్జెట్ లో ఏదో ఒక భారీ అంకె కేటాయింపు ప్రకటించవచ్చు. ఆ భారీ నిధులు ఎలాగూ ఖర్చుపెట్టబోవడం లేదు అనే గట్టి నమ్మకంతోనే ఆ అంకె ప్రకటిస్తారు. తర్వాత ఆ అంకెను చేరకుండా ఉండేలా వాస్తవ కేటాయింపులు, నిధుల విడుదల చేస్తారు. అంతిమంగా రెండు సంవత్సరాలు గడిచిన తర్వాతనే ఆ ప్రజా సమూహానికి తమకు వాగ్దానం చేసినన్ని నిధులు రాలేదని తెలిసి వస్తుంది. ఈ లోగా ఆ కేటాయింపు ప్రతిపాదనల రాజకీయ ప్రయోజనం నెరవేరి ఉంటుంది గనుక అప్పుడు బాధితులకు వాస్తవం తెలిసినా పాలకులకు నష్టమేమీ ఉండదు.

బడ్జెట్లలో మరొక ముఖ్యమైన అంశం సాధారణ ప్రజలకు, చివరికి విద్యావంతులకు కూడ అర్థం కాని అర్థ శాస్త్ర పదజాలం వినియోగం, అంకెల, శాతాల గారడీ, నిర్వహణ పద్దు ? ప్రగతి పద్దు, కాపిటల్ పద్దు – రెవెన్యూ పద్దు, వేరువేరు ఖాతాలు వంటి గందరగోళం. అదంతా సాధారణ పరిశీలకులకు పద్మవ్యూహం లాగ, చిక్కుముడి లాగ ఉంటుంది. అవన్నీ తెలుసుకుని ఆ కీకారణ్యంలోకి వెళ్లి సత్యం కనిపెట్టాలనే కోరికా తీరికా చాలమందికి ఉండవు అని పాలకులకు గట్టి నమ్మకం.

బడ్జెట్లలో మరొక అంశం వాటి పరిమాణం. సాధారణంగా ఏ బడ్జెట్ అయినా కొన్ని వేల పేజీలు ఉంటుంది. ప్రధానమైన పద్దులే కొన్ని వందల పేజీలు ఉంటాయి. బడ్జెట్ ను పూర్తిగా విశ్లేషించి, దాని ప్రజావ్యతిరేక స్వభావాన్ని నిర్ధారించాలంటే అర్థశాస్త్ర, గణాంకశాస్త్ర పదజాలపు మాయ తెలిసిన నిపుణులు కనీసం కొన్ని గంటలపాటు కృషి చేయవలసి ఉంటుంది. సాదారణంగా బడ్జెట్ ను ప్రవేశపెడుతూ ఆర్థిక మంత్రి లోక సభలోనో, శాసనసభలోనో చదివే బడ్జెట్ ప్రసంగాన్నీ, బడ్జెట్ ఇన్ బ్రీఫ్ అనీ, బడ్జెట్ అట్ ఎ గ్లాన్స్ అనీ బడ్జెట్ పత్రాలతో పాటు ఇచ్చే పుస్తకాన్నీ మాత్రం చూసి, లేదా ప్రభుత్వం విడుదల చేసే ప్రెస్ రిలీజ్ ను బట్టి పత్రికలు, టివి ఛానళ్లు బడ్జెట్ వార్తలు తయారు చేస్తాయి. అంటే ఒకరకంగా ప్రజలకు బడ్జెట్ గురించి అందే సమాచారమంతా ప్రభుత్వం చెప్పదలచుకున్న సమాచారమే తప్ప మరొకటి కాదు. ప్రతిపక్ష నాయకులు మొక్కుబడిగా చేసే విమర్శలను కూడ ప్రచారసాధనాలు ఇస్తాయి గాని అవి ప్రధాన వార్తలుగా మారవు, ప్రజలకు అవసరమైన సమాచారం, వివరణ, విశ్లేషణ ఇవ్వజాలవు. బడ్జెట్ ను విశ్లేషిస్తూ ప్రజాపక్ష పరిశీలకులు రాసే వ్యాసాలో, చేసే విశ్లేషణలో కొన్ని గంటల తర్వాతో రోజుల తర్వాతో వస్తాయి గనుక అవి ప్రజల దృష్టికి రాకుండానే పోతాయి. అలా బడ్జెట్ గురించి ప్రభుత్వం ప్రచారం చేసుకోదలచుకున్న అబద్ధాలే, వాగాడంబరమే, అతిశయోక్తులే ప్రచారంలోకి వస్తాయి. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగంలో సాధారణంగా చాల ఉదాత్తమైన అంశాలు, వాగ్దానాలు, తాము చేసిన, చేయనున్న పనుల గొప్పలూ చెప్పుకుంటారు. అవే పత్రికల్లో, ఛానళ్లలో పునరుక్త మవుతాయి. ప్రచార సాధనాలు కొంత అజ్ఞానంతోనూ, కొంత పాలకవర్గ భావజాలంతో ఉద్దేశపూర్వకంగానూ ఆర్థిక మంత్రి ఉపన్యాసం సంపూర్ణ వాస్తవమన్నట్టు ప్రచారం చేస్తాయి. ఆ ఉదాత్త అంశాలు, వాగ్దానాలు, గొప్పలు వాస్తవమా కాదా తెలుసుకోవడానికి బడ్జెట్ పత్రాల నిశిత పరిశీలన కొంత అవకాశం ఇస్తుంది గాని ఆ పత్రాలు పరిమాణంలో వేల పేజీలు ఉండడం వల్ల, ఆ నిశిత పరిశీలనకు కొంత అధ్యయనం, సాధన అవసరం కావడం వల్ల తక్షణమే అవి చదివి విశ్లేషించే పని చాల మంది చేయరు. ఇక బడ్జెట్ గురించి ప్రచార సాధనాలు చెప్పే అబద్ధాలే నిజాలుగా ప్రచారంలోకి వస్తాయి.

ఈ నేపథ్యంలో తెలంగాణ బడ్జెట్ 2018-19ని చూస్తే పది సంపుటాలలో, 31 పుస్తకాలుగా ఉన్న ఆ అంకెల కొండను తవ్వడానికి ఎవరూ సాహసించలేరు. అంత కొండను తవ్వినా ఈ ప్రభుత్వం అబద్ధాలకోరు ప్రభుత్వం అనే సత్యాన్ని, ఎలుకను పట్టడం తప్ప మరేమీ సాధించలేరు గనుక ఎందుకులే అనుకుంటారు. అలా ప్రభుత్వ అబద్ధాలూ, ప్రచారసాధనాల అబద్ధాలూ చలామణీలోకి వస్తాయి. ఉదాహరణకు బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజు ఈనాడు దినపత్రిక బడ్జెట్‌కు ఆరు పేజీలు కేటాయించి ఒక్కొక్క పేజీ ఒక్కొక్క భజన విశేషణంతో – కృషీవలుడు, పారిశ్రామికుడు, భగీరథుడు, పురపాలకుడు, సంక్షేమవంతుడు, ఆరోగ్యవంతుడు – అని నింపింది. సంక్షేమవంతుడు అంటే అర్థమేమిటో, ఆ పదం ఎలా సృష్టించారో వారికే తెలియాలి! ఇక సాక్షి దినపత్రిక బడ్జెట్ కు ఏడు పేజీలు కేటాయించి అన్నదాతా సుఖీభవ, పల్లెకు పట్టం, సాగు బాగుబాగు, ఆరోగ్యమే మహాభాగ్యం, చదువుకు చదివింపులు, పోలీస్ పవర్ ఫుల్ అనే భజన సాగించి, వాస్తవం చెప్పకపోతే బాగుండదని మొహమాటపడ్డారో ఏమో గాని, లెక్కల్లో చిక్కులు అని ఒక వార్త కూడ రాశారు. మిగిలిన పత్రికలన్నీ కూడ సంక్షేమానికి పెద్ద పీట అని, అభివృద్ధినీ, సంక్షేమాన్నీ మేళవించిన బడ్జెట్ అనీ పాలకులు చెప్పుకుంటున్న మాటలు యథాతథంగా రాసి ప్రశంసలు కురిపించాయి.

వాస్తవానికి ఈ బడ్జెట్ మేడిపండును విప్పిచూస్తే అందులో అభివృద్ధీ లేదు, సంక్షేమమూ లేదు. బడ్జెట్ల గురించిన పాత అవకతవకలన్నీ యథాతథంగా, అంతకన్న ఎక్కువ కూడ ఉండడంతో పాటు, కొత్త వంచనలు కూడ కలిపి, తమది ప్రజాసంక్షేమ బడ్జెట్ అని ప్రగల్భాలు పలకడం ఉంది. ఆర్థిక మంత్రి ప్రసంగంలో ఉన్న అంకెలకూ బడ్జెట్ పత్రాలలో ఉన్న అంకెలకూ పొంతన లేదు. అనేక పద్దుల్లో గత సంవత్సరపు బడ్జెట్ అంచనాలకూ సవరించిన అంచనాలకూ మధ్య పది శాతమో, ఇరవై శాతమో కాదు, తొంబై శాతం తేడా కూడ ఉంది. అంటే వంద కోట్లు కేటాయించిన దగ్గర పది కోట్లు కూడ

వెచ్చించకపోవడం ఉంది. తామే పెట్టుకున్న లక్ష్యాలను కూడ తాము నెరవేర్చక పోవడం ఉంది. తాము గప్పాలు కొట్టుకుంటున్న పథకాలకు, కార్యక్రమాలకు కూడ కేటాయింపులు లేవు. చాల రంగాలకు కేటాయింపుల పెంపుదల ద్రవ్యోల్బణానికి సరిపోయినట్టుగా కూడ లేదు. అంటే గత సంవత్సరం వంద కోట్లు కేటాయించి ఉంటే, ఈ సంవత్సరం నూట ఆరు కోట్లు కేటాయిస్తే కూడ ధరల పెరుగుదల వల్ల వాస్తవికంగా ఏమీ పెరిగినట్టు కాదు. విద్యా, వైద్య, ఆరోగ్య రంగాలకు, దళిత, ఆదివాసి, వెనుకబడిన కులాలు, మైనారిటీలు, మహిళా శిశు సంక్షేమ శాఖ వంటి పద్దులకు కేటాయింపులు నామమాత్రంగానో, కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికో మాత్రమే పెరిగాయి. మరొకవైపు పన్నుల ఆదాయం, పోలీస్ శాఖకు కేటాయింపులు వంటివి మాత్రం విపరీతంగా పెరిగాయి.

ఈ స్థూలమైన నిర్ధారణలకు రావడానికి కారణమైన కొన్ని నిర్దిష్ట ఉదాహరణలు చూద్దాం: వైద్య, ఆరోగ్య రంగాలకు 2017-18 బడ్జెట్ ప్రతిపాదనల్లో రు. 5920 కోట్లు కేటాయించారు. నిజానికి రాష్ట్ర ప్రజల వైద్య, ఆరోగ్య అవసరాల కోసం ఇంత తక్కువ మొత్తాన్ని వెచ్చించడమే అన్యాయం. దీన్ని తలసరి వైద్య, ఆరోగ్య వ్యయంగా చూసినప్పుడు రు. 1500 అవుతుంది. అది జాతీయ తలసరి ఆరోగ్య వ్యయానికి అటూ ఇటూగా, కేరళ వంటి రాష్ట్రాలకన్న చాల తక్కువగా ఉంది. జాతీయ తలసరి ఆరోగ్య వ్యయం సూచికలో ప్రపంచ దేశాల్లో భారతదేశమే అట్టడుగున ఉన్నదంటే తెలంగాణ అందులో కూడ కిందిస్థాయిలో ఉంది. ఈ స్థితిలో వైద్య, ఆరోగ్య రంగాల కేటాయింపులను రెట్టింపు, లేదా అంతకన్న ఎక్కువ చేయవలసి ఉండగా, కేటయించిన మొత్తాన్ని కూడ ఖర్చుపెట్టని ఘనత తెలంగాణ ప్రభుత్వానిది. గత సంవత్సరం పేరుకు రు. 5920 కోట్లు కేటాయించి, సవరించిన అంచనాల ప్రకారం ఆ అంకెను రు. 5821 కోట్లకు తగ్గించారు. ఈ సంవత్సరం బడ్జెట్ లో రు. 6422 కోట్లు కేటాయించారు గాని ఇది పూర్తిగా ఖర్చు పెట్టినా ద్రవ్యోల్బణానికి అటూ ఇటూగానే ఉంది గనుక ఏడాది తిరిగేసరికి వైద్య ఆరోగ్య సేవల మెరుగుదల, ఆరోగ్య సేవల మౌలిక సాధన సంపత్తి మెరుగుదల ఏమీ ఆశించలేము.

పైగా ఈ వైద్య, ఆరోగ్య సేవల మీద ప్రభుత్వ వ్యయంలో మరొక అంశం కూడ ఉంది. ఈ వ్యయంలో ఎక్కువ భాగం ఆరోగ్యశ్రీ వంటి వ్యక్తిగత వైద్య ఆరోగ్య సహాయంగా ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు చేరుతున్నది గాని ప్రభుత్వ ఆస్పత్రుల మెరుగుదలకు ఉపయోగపడడం లేదు. సామాజిక, సామూహిక సేవలను అభివృద్ధి చేయవలసి చోట వ్యక్తిగత లబ్ధి చేకూర్చి సమాజాన్ని వ్యక్తులుగా విడదీసే భావజాల ప్రయోజనం, కార్పొరేట్ ఆస్పత్రులకు లాభాలు చేకూర్చి పెట్టే స్వార్థ ప్రయోజనం ఇందులో ఉన్నాయి.

ఇక విద్యా రంగం విషయానికి వస్తే, 2017-18లో రు. 12,423 కోట్లు కేటాయించి, సవరించిన అంచనాలలో దాన్ని రు. 12,343 కోట్లకు తగ్గించగా, 2018-19 లో రు. 13,278 (రు. 10710 నిర్వహణ పద్దు, రు. 2567 కోట్లు ప్రగతి పద్దు) కేటాయించారు. అయితే ఆర్థిక మంత్రి బడ్జెట్ ఉపన్యాసంలో ఈ అంకె ఉంది గాని, వార్షిక ఆర్థిక వివరణ అనే పత్రంలో ఈ అంకె రు. 13,073 కోట్లుగా (నిర్వహణ వ్యయం రు. 12,529 కోట్లు, మూలధన వ్యయం రు. 544 కోట్లుగా ఉంది!). ఆర్థిక మంత్రి ఉపన్యాసంలోని అంకెనే ప్రామాణికంగా తీసుకున్నా, పెరుగుదల రు. 573 కోట్లు లేదా 4.5 శాతం మాత్రమే. అంటే ద్రవ్యోల్బణాన్ని లెక్కవేస్తే పెరిగినది లేకపోగా వాస్తవ కేటాయింపులు తగ్గాయన్నమాట.

కెజి నుంచి పిజి దాకా ఉచిత విద్య అని గత నాలుగు సంవత్సరాలుగా ఊదర కొడుతున్నప్పటికీ ఈ బడ్జెట్ లో ఆ ప్రస్తావనా లేదు, ఆ కార్యక్రమానికి నిధుల కేటాయింపూ లేదు. ఇక ఉన్నత విద్యకు, ప్రత్యేకించి విశ్వవిద్యాలయాలకు కేటాయింపులు చూస్తే ప్రభుత్వ రంగంలోని యూనివర్సిటీలను చంపివేసి, ప్రైవేటు యూనివర్సిటీలకు మార్గం సుగమం చేయడానికి ఈ ప్రభుత్వం కంకణం కట్టుకున్నదని స్పష్టంగా అర్థమవుతుంది. అన్ని యూనివర్సిటీల నిర్వహణ పద్దులో స్వల్పమైన పెరుగుదల, అది కూడ ద్రవ్యోల్బణానికి సరిపోని పెరుగుదల ఉంది. అంతమాత్రమే కాదు, ఈ సంవత్సరం నిర్వహణ వ్యయంలో పెద్ద ఎత్తున పెరుగుదల లేదంటే దాని అర్థం యూనివర్సిటీలలో పేరుకుపోతున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఖాళీలను పూరించబోవడం లేదని. గత సంవత్సరం కేటాయింపులూ సవరించిన అంచనాలూ రు. 422 కోట్లు కాగా, ఈ సంవత్సరం కేటాయింపులు రు. 485 కోట్లు. ఇక ప్రగతి పద్దులో, అంటే మూలధన వ్యయంలో నిధుల కేటాయింపు తగ్గిన ఉదాహరణలే ఉన్నాయి. కాకతీయ యూనివర్సిటీకి గత సంవత్సరం రు. 50 కోట్లు కేటాయించి, సవరించిన అంచనాలలో దాన్ని రు. 30 కోట్లు చేసి, ఈ సంవత్సరం బడ్జెట్ లో రు. 25 కోట్లు కేటాయించారు. తెలంగాణ యూనివర్సిటీకి గత సంవత్సరం రు. 30 కోట్లు కేటాయించి, దాన్ని రు. 20 కోట్లుగా సవరించి, ఈ సంవత్సరం రు. 20 కోట్లు కేటాయించారు. మహాత్మా గాంధీ యూనివర్సిటీకి గత సంవత్సరం రు. 40 కోట్లు కేటాయించి, దాన్ని రు. 35 కోట్లుగా సవరించి, ఈ సంవత్సరం రు. 25 కోట్లు కేటాయించారు. పాలమూరు యూనివర్సిటీకి గత సంవత్సరం రు. 40 కోట్లు కేటాయించి, దాన్ని రు. 30 కోట్లుగా సవరించి, ఈ సంవత్సరం రు. 20 కోట్లు కేటాయించారు. మొత్తంగా ఉన్నత విద్యలో యూనివర్సిటీలకు గత సంవత్సరం రు. 420 కోట్లు కేటాయించి దాన్ని రు. 375 కోట్లుగా సవరించి, ఈ సంవత్సరం దానిలో మరింత కోత విధించి రు. 210 కోట్లు కేటాయించారు.

ఈ ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పుకున్న మరొక రెండు కార్యక్రమాల గురించి, వాటికి నిధుల కేటాయింపు గురించి కూడ పరిశీలించాలి. తెలంగాణకు హరిత హారం పేరుతో 230 కోట్ల మొక్కలు నాటి తెలంగాణలో పచ్చదనం నింపుతామని, తద్వారా పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడతామని పాలకులు చాల ప్రగల్భాలు పలికారు. ఈ కార్యక్రమం ప్రారంభమైన నాలుగు సంవత్సరాలలో ఇప్పటికి ఈ 230 కోట్ల మొక్కల లక్ష్యంలో సాధించింది 81 కోట్ల మొక్కలు నాటడం మాత్రమే. నాటిన మొక్కల్లో రక్షణ లేక, నిర్వహణ లేక ఎన్ని చనిపోయాయి అనే లెక్కలు కూడ అక్కర లేదు. ఈ కార్యక్రమం ఈ వేగంతో నడిస్తే, మరొక పన్నెండు సంవత్సరాలు వారే అధికారంలో ఉన్నా ఆ ప్రకటిత లక్ష్యాన్ని చేరడం సాధ్యం కాదు. గతంలో నాటిన 81 కోట్ల మొక్కలకు గాను ప్రభుత్వం వెచ్చించిన ఖర్చు రు. 1166 కోట్లు. అంటే పూర్తి లక్ష్యాన్ని చేరడానికి ఇంకా కనీసం రు. 3400 కోట్ల నిధులు కేటాయించవలసి ఉంటుంది. కాని 2018-19 బడ్జెట్ లో హరిత హారం కు కేటాయించింది శూన్యం.

ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్న మరొక పథకం డబుల్ బెడ్ రూమ్ గృహ కల్పన. ఈ పథకం కింద 2,72,763 ఇళ్లు కట్టి ఇల్లులేని

ఆంధ్రప్రదేశ్ 2018-19 బడ్జెట్

***ఈ ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు కేటాయింపులు పెంచినట్లు చెబుతున్నా వాటికి అవసరమైన నిధుల సమీకరణపై ప్రభుత్వం స్పష్టంగా లేదని అంటున్నారు* చిమ్మె జాన్ బర్నబాస్**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు మార్చ్ 8న వెలగపూడిలోని రాష్ట్ర శాసనసభలో 2018–19 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ప్రవేశ పెట్టిన పూర్తి స్థాయి చివరి బడ్జెట్ ఇది ఎన్నికలు సమీపిస్తున్నందున వ్యవసాయం, సాగునీరు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమం, తదితర రంగాలకు కేటాయింపులు పెంచినట్లు పైకి కనబడుతున్నా, అవసరమైన నిధుల సమీకరణపై అస్పష్టత అలాగే కొనసాగింది.

2018–19 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి రు.1.91 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రు. 1.50 లక్షల కోట్లు, మూలధన వ్యయం రు. 28,000 కోట్లకు పైబడేనంటూ పేర్కొన్నారు. మొత్తం మీద ప్రస్తుత ఏడాది కంటే 21 శాతం అంచనాలు పెరిగాయని చెప్పారు. ఇదేదో తాము సాధించిన ఘనతగా చెప్పుకొచ్చారు. ఇక్కడ ఆర్థిక మంత్రి అంకెల్లోని డొల్లతనం బయటపడింది. కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏకంగా రు. 50 వేల కోట్ల గ్రాంట్లను, సహాయాన్ని ఆశించారు. కేంద్ర పన్నుల్లో వాటాను రు. 34 వేల కోట్లుగా అంచనా వేశారు. ప్రత్యేక హోదాపై జరుగుతున్న పోరులో కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రంపై కత్తిగట్టినట్లుగా వ్యవహరిస్తున్నది. అటువంటి పరిస్థితులలో కేంద్రం నుంచి నిధులు సక్రమంగా అందుతాయని ఏ విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆశిస్తుందో అర్థం కావడం లేదు. అంచనాలకనుగుణంగా నిధులు అందకపోతే బడ్జెట్‌లో పేర్కొన్న అనేక లక్ష్యాలను ఏ విధంగా చేరుకో గలుగుతారో యనమల సమాధానం చెప్పాలి.

రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్‌ను కోల్పోయాక పెద్ద మొత్తంలో ఆదాయ వనరులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కోల్పోయిన మాట వాస్తవం. రెవెన్యూ లోటు ఉందంటూనే బడ్జెట్‌లో రు. 5 వేల కోట్లకు పైన ఆదాయ వనరును (మిగులు) అంచనా వేశారు. ద్రవ్యలోటు రు.24 వేల కోట్లను, జిఎస్‌డిపిలో 2.78 శాతమని అన్నారు. రాష్ట్రం అధోగతిలో ఉందంటూనే జిఎస్‌డిపిని రు. 7.68 లక్షల కోట్ల నుంచి ఒకేసారి రు.8.70 లక్షల కోట్లకు పెంచి ఎఫ్ఆర్‌బిఎం నిబంధనలకు లోబడి ద్రవ్యలోటు ఉందంటున్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు రాకుండా, వ్యవసాయ రంగం అభివృద్ధి చెందకుండా ప్రజల ఆదాయాలు ఎలా పెరుగుతాయో ప్రభుత్వమే చెప్పాలి, ఆలోచించాలి.

ఒకవైపు సర్కారు అప్పులు పెరిగిపోతున్నాయి. ప్రతి ఏడాదీ సగటున 20–30 వేల కోట్ల రూపాయల అప్పు ప్రజలపైన భారమవుతూ ఉంది. వచ్చే ఏడాది ప్రభుత్వ అప్పులు రు. 2.49 లక్షల కోట్లకు చేరుతుందని ప్రభుత్వమే అంచనా వేస్తున్నది. పోయిన సంవత్సరం ఒక్కో వ్యక్తికి రు. 48 వేల అప్పు తేలగా, ఇప్పుడది రు. 54 వేలకు చేరింది. ఈ అప్పులంటినీ ప్రచారార్భాటాలకు, సంక్రాంతి కానుకలకు ఖర్చు పెడుతున్నారు. అంతేతప్ప శాశ్వత ఆస్తుల సృష్టికి కాదు. రాష్ట్ర స్వంత పన్ను రాబడి ఎక్కడా తగ్గలేదు. అంతేకాకుండా పెరుగుతోంది. రు. 53 వేల కోట్ల నుంచి రు. 65 వేల కోట్లకు అంచనాలు పెంచారు.

సేల్స్‌టాక్స్, ఎక్సైజ్, ఎంవి టాక్స్, స్టాంపు, రిజిస్ట్రేషన్ నుంచి అదనపు ఆదాయం రాబడుతామన్నారు. అనగా ప్రజలపై అదనపు పన్నులేసి వారి నుంచి వసూలు చేస్తామని అర్థం. ఇదంతా ఒకవైపైతే మరోవైపు ప్రాథమిక రంగాలకు, సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచారా అంటే అదీ లేదు. వ్యవసాయ బడ్జెట్ గతం కంటే 1.62 శాతం తగ్గింది. దాని విలువ రు. 3 వేల కోట్లకు పైబడే ఉంటుంది.

చివరి బడ్జెట్‌లో రుణమాఫీకి అరకొర నిధులు కేటాయించారు. నాల్గవ విడతకు ఇప్పుడిస్తే, ఐదవ విడతకు వచ్చే ప్రభుత్వం చెల్లించాల్సిన పరిస్థితి వస్తుంది. రైతులకు వడ్డీలేని రుణాలు, పావలా వడ్డీకి కేటాయింపులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. వ్యవసాయ వృద్ధి రెండంకెలంటూ కార్పొరేట్ శక్తులకు ఊతం ఇస్తున్నది ఈ ప్రభుత్వం.

వ్యవసాయ కూలీలకు పనులు చూపే ఉపాధి హామీ నిధులు నిరుపేదలకు ఇస్తానని ప్రభుత్వం తానే వాగ్దానం చేసింది. కాని నాలుగు సంవత్సరాల పాలనలో పూర్తయి, లబ్ధిదారులు చేరడానికి అవకాశం వచ్చిన ఇళ్ల సంఖ్య 5,824. అంటే ప్రకటిత లక్ష్యంలో మూడు శాతం కన్న తక్కువ.

ఈ సంవత్సరం బడ్జెట్‌లో రు. 2643 కోట్లు కేటాయించి, ఆ నిధులతో లక్ష్యం నెరవేరబోతున్నట్టు కొత్త ప్రగల్భాలు పలుకుతున్నారు. ప్రభుత్వం వేసిన లెక్కల ప్రకారమే ఆ నిధులతో నలభై వేల లోపు ఇళ్లు మాత్రమే నిర్మాణమవుతాయి. అవన్నీ ఈ సంవత్సరంలో అవుతాయనుకున్నా, గతంలో ప్రారంభించి ఇంకా నిర్మాణం పూర్తి కాకుండా ఉన్న ఇళ్లన్నీ ఈ సంవత్సరంలోనే వాసయోగ్యం అవుతాయనుకున్నా, ఎంత ఉదారంగా ఆలోచించినా మొత్తంగా ఈ ప్రభుత్వం తన ఐదు సంవత్సరాల పాలనా కాలంలో నిర్మించి ఇచ్చిన ఇళ్లు అరవై డెబ్బై వేలకు మించవు.

ఈ అంచనాలన్నీ విఫలమవుతాయని చెప్పడానికే ఉదాహరణలెన్నో ఉన్నాయి. అంటే ఈ ప్రభుత్వం వాగాడంబరంతో ప్రకటిస్తున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల కార్యక్రమంలో పావు వంతు కూడ సాకారం కాలేదు.

ఈ ప్రభుత్వం నిజంగా సాధించినదేమన్నా ఉన్నదంటే అది డెబ్బై వేల కోట్ల రూపాయల అప్పుతో ప్రారంభమైన రాష్ట్రాన్ని నాలుగు సంవత్సరాల్లో రు. 2.21 లక్షల కోట్ల అప్పు రాష్ట్రంగా మార్చి వేయడం మాత్రమే. ఎంత అభివృద్ధి! 300 శాతం పెరుగుదల!!

(రచయిత జర్నలిస్టు) వీ

రు. 6,040 కోట్ల నుంచి రు. 4,730 కోట్లకు తగ్గాయి. కరువు మండలాలను ప్రకటించి నిధులెలా తగ్గిస్తారో ప్రభుత్వానికి తెలియాలి. సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం సంక్షేమానికి రు. 651 కోట్ల మేర కోత విధించారు. వచ్చే ఏడాది నాటికి పది లక్షల ఇళ్లు కడతామని రోజూ ఢంకా బజాయిస్తున్న ప్రభుత్వం, బడ్జెట్‌లో అరకొర నిధులు ప్రతిపాదించింది. గ్రామీణాభివృద్ధికి రు. 700 కోట్ల వరకూ నిధులు తగ్గించింది ఈ ప్రభుత్వం. డ్వాక్రా మహిళల రుణమాఫీ, వడ్డీ రాయితీకి చేసిన కేటాయింపులు విచారకరంగా ఉన్నాయి. ఇరిగేషన్ (నీటి పారుదల) రంగానికి 9.7 శాతం నుంచి 8.89 శాతం తగ్గించారు. పోలవరం ప్రాజెక్టుకు 9 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఆ ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం గురించి విస్మరించడం దారుణం. విద్య, వైద్యం, ఆరోగ్యం సమస్త రంగాలదీ దాదాపుగా ఇదే పరిస్థితి. ఒక్క మాటలో చెప్పాలంటే యనమల రామకృష్ణుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రపంచ బ్యాంక్ ఆదేశించిన సంస్కరణలను మరింత వేగవంతం చేసే దిశగా పయనిస్తున్నది.

2014 నుండి దళితులకు ఉప ప్రణాళిక కింద రు. 40,356 కోట్లు, బడ్జెట్ కింద రు. 28,245 కోట్లు, మొత్తం రు. 68,601 కోట్లు కేటాయించారు. ఇందులో 2018-19 ఆర్థిక సంవత్సరానికి రు. 11,228 కోట్లు ఉప ప్రణాళిక కింద, రు. 4,278 కోట్లు బడ్జెట్ కింద చూపారు. అదే విధంగా ఆదివాసులకు (గిరిజనులకు) రు. 27,566 కోట్లు బడ్జెట్ ఉప ప్రణాళిక కింద చూపారు. ఇందులో 2018-19 సంవత్సరానికి బడ్జెట్ కింద రు. 2,129 కోట్లు, ఉప ప్రణాళిక కింద రు. 4,176 కోట్లు చూపారు. ఈ రెండు రంగాలకు కేటాయించిన నిధులలో కనీసం 70 శాతం ఖర్చు చేసినా ఈ రోజు సమాజంలో వారి స్థితికి గుర్తింపు వచ్చేది. ఈ రెండు రంగాలకు కలిపి ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రు. 96,167 కోట్ల కేటాయింపులు చూపారు. ఆచరణకు సాధ్యం కాని కేటాయింపులు అవసరం లేదు. తలసరి ఆదాయం పెరుగుతున్నా, పేదల సంఖ్య ఎందుకు పెరుగుతున్నది? 52 శాతంగా ఉన్న వెనుకబడిన తరగతుల వారికి కేటాయించింది రు. 6,213 కోట్లు మాత్రమే. మైనారిటీలకు రు. 1102 కోట్లు. 50 శాతంగా ఉన్న స్త్రీ, శిశు, వికలాంగులకు రు. 3,008 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ కేటాయింపులతో ఈ వర్గాలకు ఏమాత్రం లబ్ధి చేకూరుతుందో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. కనీసం ఈ కేటాయింపులన్నా ఖర్చు చేస్తున్నారా అంటే అదీ లేదు.

బడ్జెట్‌లో మొదటి ప్రాధాన్యత ఉత్పత్తి రంగాలైన వ్యవసాయం, పారిశ్రామిక రంగానికివ్వాలి. ఆ తర్వాత విద్య, వైద్యానికి కేటాయింపులు జరపాలి. బడ్జెట్‌లో చేసే వ్యయం ప్రభుత్వానికి ఆదాయం సంపాదించేదై ఉండాలి. కేంద్రం నుంచి గాని ఇతర ప్రాంతాల నుంచి గాని వచ్చే గ్రాంట్లను సద్వినియోగ పరుచుకోవాలి. ప్రజల జీవన ఆదాయాన్ని పెంచే దిశగా పాలకవర్గ విధానాలుండాలి. ప్రచారార్భాటాలకు ఎక్కువ ఖర్చు చేయకూడదు.

2018-19 ఆర్థిక బడ్జెట్ మొత్తం రు. 1.91 లక్షల కోట్లతో ప్రవేశ పెట్టగా, అందులో వ్యవసాయానికి 'ప్రత్యేక బడ్జెట్' అంటూ మరో ఉప బడ్జెట్‌ను వ్యవసాయ శాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి ప్రవేశపెట్టారు.

సహజంగా ఉత్పత్తి రంగమైన వ్యవసాయం, ఆ తర్వాత పరిశ్రమల పెరుగుదల అంతంత మాత్రంగానే ఉంది. ఈ రెండు రంగాలలో ఉత్పత్తి పెరిగితే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుంది. రాష్ట్ర ఆర్థిక స్థూల ఉత్పత్తి పెరుగుదల రేటును 2018-19కి 11.07 శాతానికి అంచనా వేశారు. 2015-16లో మత్స్య శాఖ ఉత్పత్తిని కలిపి 13.01 శాతంగా వృద్ధిరేటు చూపారు. వ్యవసాయ శాఖను మాత్రం నిర్లక్ష్యం చేశారు. వ్యవసాయ రుణ మాఫీకి రు. 4100 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రత్యేక బడ్జెట్ పేరుతో 18 శాఖల బడ్జెట్‌లను కలిపి రు. 19,000 కోట్లు ప్రకటించారు. ప్రచారం మాత్రం భారతదేశంలో మొట్ట మొదటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ప్రచారం చేసుకుంటున్నారు.

2017-18 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలో 166.70 లక్షల ఎకరాల సాగును లక్ష్యంగా పెట్టుకున్నారు. ఖరీఫ్, రబీ కలిపి 176.64 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి లక్ష్యంగా చేసుకున్నారు. 16 లక్షల ఎకరాలలో పంటలు వేయలేదు. 140 లక్షల టన్నులకు మించి ఆహార ధాన్యాల ఉత్పత్తి వస్తుందన్న నమ్మకం లేదు. కోటి ఎకరాలలో పండ్ల తోటలను పెంచి ఎగుమతులు చేసి, రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని ముఖ్యమంత్రి అధికారికంగా ప్రకటించారు. పత్తి, కందులు, మిరప, సుబాబుల్, జామాయిల్, ఇతర కూరగాయలు వేసిన రైతులు పెట్టుబడులు రాక దివాళా తీస్తున్నారు. వ్యవసాయాన్ని ఆదాయంగా సుస్థిరం చేయడం ఈ ప్రభుత్వాల లక్ష్యం కాదు. అస్థిరంగా ఉంచుతూనే రైతులు తమ భూములు కోల్పోయే విధంగా ధరలు అమలు చేస్తున్నారు.

పారిశ్రామిక రంగాన్ని పరిశీలిస్తే ఈ మధ్య అవగాహనా సదస్సుల పేరుతో విశాఖపట్నంలో వరుసగా విదేశీ కంపెనీలను రాబట్టడానికి పెద్ద ఎత్తున ఖర్చు చేశారు. కానీ అదే సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లో 105 యూనిట్ల పరిశ్రమలు మూతపడ్డాయి. 38 వేల మంది కార్మికులు తొలగించబడ్డారు. మరో 6 వేల మందికి ఉద్వాసన జరుగబోతున్నది. వ్యవసాయ రంగానికి రు. 9,889 కోట్లు, పరిశ్రమలకు రు. 3,075 కోట్లు మాత్రమే కేటాయించారు. కేటాయించిన పద్దులలో కూడా వ్యవసాయ రంగానికి సంబంధించినవి ఉన్నవి. ఇప్పటికే ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకుంటున్నాం. పంచదార, పత్తి, వంట నూనెలు, పప్పు ధాన్యాలు, బట్టలు కూడా దిగుమతి అవుతున్నాయి. ఇంత జరుగుతున్నా రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లి పోతుందని ముఖ్యమంత్రి ప్రకటించడం విచారకరం.

మద్యంపై రు. 7,357 కోట్ల ఆదాయం వస్తున్నది. అందులో సగం కూడా వ్యవసాయానికి ఖర్చు కావడం లేదు. రాష్ట్రంలోని పరిశోధనా కేంద్రాలన్నీ మూతపడ్డాయి. విదేశీ టెక్నాలజీని దిగుమతి చేసుకుంటున్నాం. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పశు సంవర్థకం, పౌల్ట్రీ పరిశ్రమ, రొయ్యలు పెంచడం ద్వారా ప్రజలకు ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ముఖ్యమంత్రి గతంలో ప్రకటించారు. 'ఏరువాక పూర్ణిమ పథ'కానికి ఎక్కువ మొత్తంలో డబ్బు వృథా చేశారు. అదంతా ప్రజల సొమ్మే. ప్రకృతి వైపరీత్యాల పరిహారాలు, బీమా సౌకర్యం, ప్రభుత్వ రాయితీలు అందిస్తామన్నదంతా కేవలం ప్రచారానికే పరిమితమయింది.

గ్రామ స్థాయిల్లో రైతుల, రైతు కూలీల కమిటీలు ఏర్పాటు చేసి వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదలకు కృషి చేయాలి. వ్యవసాయ పరిశోధనలు నిరంతరంగా కొనసాగాలి. వ్యవసాయ రంగంలోనికి ప్రభుత్వ పెట్టుబడులు పెంచాలి. వ్యవసాయోత్పత్తుల ధరలను రాష్ట్ర ప్రభుత్వమే పెట్టుబడి - వ్యయం ఆధారంగా నిర్ణయించి ప్రజల అవసరాల మేరకు కొనుగోలు చేయాలి. ఉత్పత్తి రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే ఏం జరుగుతుందో సోమాలియా అనుభవం మన ముందున్నది.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

భాగస్వామ్య సదస్సుల ప్రహసనం

విశాఖపట్నంలో జరిగిన భాగస్వామ్య సదస్సు రాష్ట్ర అభివృద్ధికి, పెట్టుబడులకు సంబంధించిన విషయాలపై నిర్ణయాత్మకంగా జరగలేదనీ, కేవలం ప్రగల్భాలు, ప్రచారార్భాటాలకే ప్రాధాన్యమిచ్చిందనీ అంటున్నారు సంతోష్

భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర పరిశ్రమల శాఖ సంయుక్తంగా విశాఖలో భారీ హంగులు, ఆర్భాటాల మధ్య ఫిబ్రవరి 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన భాగస్వామ్య సదస్సు మ్యాజిక్ షోను తలపించింది. వందల్లో అవగాహనా ఒప్పందాలు, లక్షల కోట్లలో పెట్టుబడులు, ఇబ్బడి ముబ్బడిగా ఉద్యోగాలంటూ ప్రభుత్వం చేసిన ప్రకటనల హోరు, వాటినే పరమ సత్యాలుగా మీడియాలో మోత మోగించిన తీరు చూస్తే పెట్టుబడులు సునామీలా వచ్చి పడబోతున్నాయని, ఇక నిరుద్యోగ సమస్య అనేదే ఉండదనేంతగా ప్రచారం సాగింది. మరోవైపు వృద్ధిరేటును, తలసరి ఆదాయాన్ని పెంచుతామని గొప్పలు పోతున్నారు. రాష్ట్రాన్ని దేశంలోని రాష్ట్రాలన్నింటిలోకెల్ల అగ్రగామిగా నిలుపుతామని ప్రగల్భాలు పలుకుతున్నారు.

ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత రాష్ట్రం వ్యవసాయ, పారిశ్రామిక, సేవలు తదితర రంగాల్లో ఇతర రాష్ట్రాలతో పోటీపడి అభివృద్ధి చెందాలని, అందరికీ ఉపాధి దొరకాలనేదే అయిదు కోట్ల మంది ఆంధ్ర ప్రజల ప్రగాఢ ఆకాంక్ష. ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తే ఎవరూ ఆక్షేపించాల్సిన పని లేదు. కానీ విశాఖ భాగస్వామ్య సదస్సులో గతంలో మాదిరిగానే పాత ప్రతిపాదనలకే కొత్త ఎంఒయు ముసుగులేయడం, రాని పెట్టుబడులను వచ్చినట్లు, లేని ఉద్యోగాలు కల్పించేసినట్లు భ్రమలు కల్పించడమే ఆశ్చర్యకరం, విచారకరం. నిజానికి రాష్ట్రం స్వయం పోషకం కావాలంటే, ప్రజలు స్వావలంబన చెందాలంటే అతి తక్కువ పెట్టుబడులతో భారీ ఎత్తున ఉపాధి, ఉత్పాదకతతో అభివృద్ధికి తలమానికంగా నిలిచే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఇ) పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలి. వనరులు సమకూర్చాలి. ఆ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి. కాని ఆ దిశలో చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేయడం లేదు. వ్యవసాయ రంగంలో అగ్రగామిగా ఉన్న రాష్ట్రంలో వ్యవసాయరంగ అనుబంధ పరిశ్రమల ఊసే ఎత్తడం లేదు. చంద్రబాబు మొదటి నుంచి వ్యవసాయం దండుగ అంటున్నారు.

విశాఖ భాగస్వామ్య సదస్సుకు పెట్టుబడిదారులను ఆహ్వానించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు వివిధ దేశాలు పర్యటించారు. విశాఖ సదస్సులో పాల్గొని రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకోవాలని కోరుతూ, పెట్టుబడులకు ఇచ్చే రాయితీలను గురించి ప్రచారం చేస్తూ 2017 డిసెంబర్ 10 నుంచి 13 వరకు ముఖ్యమంత్రి నాయకత్వంలో మంత్రులు గంటా శ్రీనివాసరావు, నారాయణ, యనమల రామకృష్ణుడు, ఉన్నతాధికారులు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, దుబాయ్, కువైట్‌లలో పర్యటించారు. యనమల రామకృష్ణుడు నాయకత్వంలో మరో బృందం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో పర్యటించింది. మరికొన్ని దేశాల్లో కూడా పర్యటిస్తూ ఆయా దేశాల పెట్టుబడిదారులను రాష్ట్రానికి రమ్మని ఆహ్వానించారు. పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్నదని, పెద్ద మొత్తంలో పెట్టుబడులు రావడం వల్ల ఇతర రాష్ట్రాలను అధిగమించి అభివృద్ధిని సాధించటంలో రాష్ట్రం మొదటి స్థానంలోకి వస్తుందని ప్రచారం చేశారు.

ఈసారి సదస్సు 'నవభారతాన్ని ప్రపంచశ్రేణి సంస్థలతో అనుసంధానించే వ్యూహరచన' అన్న అంశంపై జరిగింది. అంటే, బహుళజాతి సంస్థలతో, అంతర్జాతీయ ద్రవ్య సంస్థలతో సంలీనమై, రాష్ట్ర వనరులను, చౌక శ్రమను దోచుకోవడానికి మార్గాన్ని సుగమం చేయడమేనని అర్థం చేసుకోవాలి. 'సన్‌రైజ ఆంధ్రప్రదేశ్' అంశంపై జరిగిన ప్లీనరీ సదస్సులో రాష్ట్రంలో పెట్టుబడులు మదుపు చేసే అవకాశాలపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 2016, 2017లలో విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సుల అనుభవాలను, ఇతర రాష్ట్రాలలో జరుగుతున్న భాగస్వామ్య సదస్సుల అనుభవాలను చూస్తే ప్రభుత్వం చెబుతున్న దానికి, వాస్తవాలకు పొంతన లేదని స్పష్టమౌతున్నది. లక్షల కోట్లలో ఒప్పందాలుంటే వేల కోట్లలో మాత్రం పెట్టుబడులు వచ్చి ప్రాథమిక పనులు మాత్రమే జరుగుతున్నాయి.

భాగస్వామ్య పారిశ్రామిక సదస్సులు జరిగిన తీరు గమనిస్తే, సాధారణంగా గ్రామాల్లో జరిగే సంతల్లో వస్తువులు, సరుకుల మార్పిడిలో ఎలాంటి దాపరికాల్లేని వ్యవహారాలను మనం చూస్తాం. కానీ విశాఖ సదస్సుల్లో కుదిరిన అవగాహన ఒప్పందాల (మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్స్)లో ఛూ మంత్రకాళీ అన్నట్లుగా మాయా లోకంలో విహరించేలా ఆహూతులకు భ్రమలు గొల్పాయని రూఢి అయ్యింది. ఎవరేం తెస్తారు? ఏ ప్రాంతాలకు ఏం ఇస్తారు? నిజంగా ప్రజలకు ఒనగూడే ప్రయోజనాలేంటి? ప్రభుత్వానికి జరిగే మేలేంటి? వంటివి వరుసగా మూడు సంవత్సరాల నుంచి సమాధానాలు దొరకని ప్రశ్నలుగానే మిగిలాయి. భాగస్వామ్య సమావేశాల నిర్వహణ వల్ల ప్రజాధనం దుర్వినియోగమవుతుంది తప్ప ప్రజలకు ఒనగూరినదేమి లేదు.

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ఏటా జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్) తరహాలో సిఐఐతో కలిసి మన రాష్ట్రంలో ప్రతి ఏటా ఇటువంటి సదస్సులు నిర్వహించి పెట్టుబడులను పెద్దయెత్తున ఆకర్షిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఘోషిస్తున్నారు. ఇందుకోసం విశాఖలో ఓ బ్రహ్మాండమైన అంతర్జాతీయ సమావేశ కేంద్రం, అయిదు

నక్షత్రాల హోటల్, షాపింగ్ మాల్స్ ఏర్పాటుకు దుబాయికి చెందిన లూలూ గ్రూపు సంస్థతో ఒక అవగాహన ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. విలాసవంతమైన సమావేశ మందిరాలు, ఖరీదైన హోటళ్లు, భారీ షాపింగ్ మాల్స్ కడితే పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్‌కు క్యూ కడతారనేది ఆయన చూపుతున్న రంగులకల. ప్రభుత్వం నిర్వహిస్తున్న భాగస్వామ్య సదస్సులు పెట్టుబడిదారులకు విహార యాత్రా కేంద్రాలుగా ఉపయోగపడుతున్నాయి.

సిఐఐ భాగస్వామ్య సదస్సులు ఒక్క ఆంధ్ర రాష్ట్రంలోనే కాదు, చాలా రాష్ట్రాల్లోనూ జరుగుతున్నాయి. వారు అన్ని రాష్ట్రాలు నిర్వహించే సదస్సులకు వెళ్ళటం, అన్ని చోట్లా ఒప్పందాలు చేసుకోవడం, తమకు ఎక్కడ ఎక్కువ లాభం వస్తుందనుకుంటే అక్కడ పెట్టుబడులు పెట్టడం చేస్తున్నారు. ఇందుకోసం జరిగే బేరసారాలలో ప్రభుత్వంలోని ముఖ్యులు, పెట్టుబడిదారులు ఎవరి వాటాలను వారు పంచుకొంటున్నారు. పెట్టుబడిదారులు, ప్రభుత్వం కలిసి ఆడుతున్న ఆటలో రాష్ట్రాభివృద్ధి, ప్రజల ప్రయోజనాలకు స్థానం లేకుండా పోతున్నది. ఇది నిత్యం జరుగుతున్న తంతు. విశాఖలోనూ అదే పునరావృతం అయింది. మరోవైపు రాని పరిశ్రమలను సాకుగా చూపి ప్రభుత్వం రైతుల నుంచి భూములను బలవంతంగా లాక్కొని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోంది. ఏళ్లు గడిచినా పరిశ్రమ రాదు. భూములు, రాయితీలు, బ్యాంకు రుణాలు మాత్రం కార్పొరేట్ సంస్థలకు దక్కుతున్నాయి.

విశాఖలో గత మూడేళ్లలో ఈ భాగస్వామ్య సదస్సుల కోసం ప్రభుత్వం కొన్ని పదుల కోట్లు వెచ్చించి అనేక హంగులు, ఆర్భాటాలు చేసినా, ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మంత్రులు, ఉన్నతాధికారుల బృందం విదేశీ యాత్రలు, రోడ్ షోలు ఎన్ని నిర్వహించినా పెట్టుబడులు వచ్చింది చాలా తక్కువ. పెట్టుబడికి కావాల్సింది లాభం. ఎక్కడ ఎక్కువ లాభం వస్తుందనుకుంటే అక్కడికి అది పరుగులు తీస్తుంది. పెట్టుబడి స్వభావమే అంత. అంతేకాదు పెట్టుబడులు రావడంతోనే ఉపాధి దానంతటది పెరుగుతుందనుకోవడం కూడా పొరపాటు. ఆ పెట్టుబడులు ఏ రంగంలో వస్తున్నాయన్నది కూడా ముఖ్యం. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చాక భారీ పెట్టుబడులు, ఉన్నత సాంకేతికతతో నెలకొల్పుతున్న పరిశ్రమల వలన ఉపాధి రహిత అభివృద్ధి అనేది ఒక పెద్ద సమస్యగా ముందుకొస్తున్నది. ఆధునిక టెక్నాలజీతో వస్తున్న పెట్టుబడులు ఉపాధి కల్పించేది చాలా తక్కువ. కానీ స్థానిక ప్రజల జీవనోపాధిని పెద్ద ఎత్తున దెబ్బ తీస్తున్నాయి. దాంతో మొత్తంగా ఈ పెట్టుబడుల వల్ల నిరుద్యోగం పెరుగుతున్నదే గానీ తగ్గడం లేదు. మరోవైపు కాలుష్యం పెరిగి పర్యావరణం నాశనమవుతున్నది.

చంద్రబాబు చెబుతున్న ప్రకారమే భాగస్వామ్య సదస్సుల సందర్భంగా జరిగిన ఎంఓయులు ప్రపంచంలో ఎక్కడైనా 10 నుంచి 15 శాతం లోపే సాకారమవుతున్నాయి. మన దేశంలోనైతే 6 శాతం మించి సాకారం కాలేదు. ఏపిలో గత రెండు దఫాల్లో కుదిరిన ఒప్పందాల్లో పెట్టుబడులు 15 శాతం, 10 శాతం మందికే ఉద్యోగాలు వచ్చాయని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయి. విశాఖ కేంద్రంగా జరిగిన మూడు రోజుల సదస్సుల్లో రు.లక్షల కోట్ల విలువైన ఎంఓయుల ప్రచారం అంతా ఒక బూస్టప్‌గానే ఉంది తప్ప సాకారం అయ్యే సూచనలు కనిపించడం లేదు. గత సదస్సుల్లో ఇండస్ట్రీ, ఎనర్జీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, ఐటి స్కిల్ డెవలప్‌మెంట్‌ల్లో రు.లక్షల కోట్ల ఎంఓయులు జరిగినా వందల కోట్లు కూడా సాకారం కాలేదన్నది స్పష్టంగా రూఢి అయింది. 'గత రెండు (2016, 2017) సదస్సుల లక్ష్యాలు, అమలు చూస్తే ... 1033 ఎంఓయులు జరిగితే, రు.15 లక్షల కోట్ల పెట్టుబడులు, 31 లక్షల ఉద్యోగాలు రావాలి. లెక్కలు వేస్తే కేవలం రు.4 లక్షల 20 వేల కోట్ల పెట్టుబడులు, 2.6 లక్షల ఉద్యోగాలు వచ్చాయి...' అని విశాఖలో ఫిబ్రవరి 26న సిఐఐ ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబే స్వయంగా ప్రకటించడం గమనార్హం.

ఈసారి ఎంఓయులు కుదుర్చుకున్న అక్రమ వ్యాపారాల దిగ్గజాలుగా పేరు తెచ్చుకున్న దేశీయ పెద్ద కంపెనీలు ఆదానీ గ్రూప్, రిలయన్స్, టెక్ మహీంద్ర, వేదాంతలది అగ్రస్థానం. తాజాగా ఈ జాబితాలో చేరిన కేరళకు చెందిన లూలూ గ్రూపు మాత్రమే చెప్పుకోదగినవి. వీటికి ఇప్పటికే ప్రభుత్వం ఎరలు వేసింది. లూలూకు ఇటీవలే విశాఖ నగరం నడిబొడ్డున గల రు. 600 కోట్ల విలువైన 19 ఎకరాలను ధారాదత్తం చేసింది. ఈ నేపథ్యంలో మిగతా బడా కంపెనీలు, వ్యక్తులతో కుదుర్చుకున్న ఎంఓయులకు పరిహారంగా విశాఖ సాగర తీరాన్ని, కొండలను, మైనింగ్ స్థలాలను, ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెడతాడన్న కథనాలు వెలువడుతున్నాయి. విశాఖ ప్రతిష్టను ఇనుమడింపజేసే డిసిఐని కేంద్ర కేబినెట్ అమ్మివేయాలని నిర్ణయించినా, స్టీల్‌ప్లాంట్‌లో 10 శాతం డిజిన్వెస్ట్ చేయాలని బిజెపి భావించినా బాబు మాట్లాడకపోవడం పట్ల విశాఖ కార్మికవర్గం తీవ్ర ఆవేదనకు గురౌతోంది. ఇలా కార్పొరేట్లకు బాటలేస్తూ, వారికి ఊడిగం చేసిన లక్ష్యాలే బాబు విధానాల్లో కనిపిస్తున్నాయి తప్ప ప్రజాప్రయోజనాలు మచ్చుకైనా కానరావు.

ఈసారి సదస్సు నిర్వహణ కోసం సిఐఐ డైరెక్టర్ ఎస్ జయకుమార్ ఈ ఏడాది జనవరి 29న రు.16.46 కోట్లు అంచనాలతో కూడిన నివేదికను పరిశ్రమలు, వాణిజ్యశాఖకు అందచేశారు. దీనికి అదనంగా 18 శాతం వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)గా రు.2.97 కోట్లను చేర్చాల్సి ఉంది. అంటే దాదాపు రు. 20 కోట్ల వ్యయం కానున్నట్లు పేర్కొన్నారు. ఈ మొత్తంతో ప్రధాన వేదికతోపాటు ఇతర వేదికల వద్ద మౌలిక సదుపాయాలు, హేంగర్స్ సెట్టింగ్, ఆహార పానీయాలకు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఇక వేదిక వద్ద హేంగర్ స్ట్రక్చర్స్, బ్యాక్‌డ్రాప్, సిసిటివి, టెలిఫోన్ తదితర సదుపాయాల కోసం రు.12.31 కోట్లతో మరొక ప్రతిపాదనను ఫిబ్రవరి 14న పరిశ్రమల శాఖకు సమర్పించారు. అంటే సదస్సు మొత్తం వ్యయం దాదాపు 33 కోట్లు. ఇంకా ప్రతినిధులకు ఇచ్చే సదస్సు కిట్లు, ఎంఓయు ఫోల్డర్లు, ముఖ్యమంత్రి ఇచ్చే బహుమతులకు నిర్దేశించిన మరో రు.1.74 కోట్లను మంజూరు చేసారు. సదస్సులో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి విచ్చేసిన 117 మంది ప్రతినిధులకు ఆయా స్టార్ హోటళ్లలో బస మొదలుకొని వారికి నోరూరించే విభిన్న రుచుల్లో భోజనాలు, రవాణా, ముఖ్యమంత్రి అతిథులకు ఇచ్చే విందు, నగర సుందరీకరణ, విద్యుద్దీపాలతో అలంకరణ తదితరాల కోసం మరికొంత ఖర్చు చేశారు. ఈ విధంగా కోట్లాది రూపాయలను దుర్వినియోగం చేయడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. సదస్సుకైన ఖర్చుతో ఒక పరిశ్రమనే నెలకొల్పవచ్చనే అభిప్రాయాలు నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. ఈ సదస్సు వల్ల కాంట్రాక్టర్లు, స్టార్ హోటళ్లకు మేలు జరగడం తప్ప నిరుద్యోగులకు ప్రత్యేకంగా ఒరిగేదేమీలేదనేది స్పష్టం.

అణు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, బాక్సైట్–కాల్సైట్ – లేటరైట్ –

మాంగనీస్ – బొగ్గు – ఇనుము – ఇసుక నుండి ఖనిజాలను విచ్చల విడిగా వెలికి తీయడానికి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నది. సారాంశంలో గతం నుండి ప్రతిపాదిస్తూ వస్తున్న కోస్టల్ కారిడార్ అమలుకు పెట్టుబడులు కోరుతున్నది. తీరప్రాంతాన్ని, మడ అడవులను నాశనం చేసి టూరిజం, పరిశ్రమల పేరుతో కోస్టల్ రెగ్యులేటరీ జోన్‌ని అతిక్రమించి పక్కా నిర్మాణాలను ప్రోత్సహించి మత్స్యకారుల జీవితాలను ధ్వంసం చేస్తున్నది. తీరప్రాంతంలో అనేక ఓడరేవుల నిర్మాణానికి, ఫార్మా కంపెనీల ఏర్పాటుకు, పెట్రో, పెట్రోకెమికల్ హబ్‌ల నిర్మాణానికి పెట్టుబడులు ఆహ్వానిస్తున్నది. పెట్టుబడిదారులు తమ రాకపోకలు సులువుగా సాగించడానికి విమానాశ్రయాల ఏర్పాటు, భారీ హైవేలు–ఫ్లై ఓవర్‌ల నిర్మాణం సాగించడానికి పెట్టుబడులు ఆహ్వానిస్తున్నది. ఇప్పుడు విశాఖ నుంచి చెన్నై కారిడార్, చెన్నై నుంచి బెంగులూర్ కారిడార్ నిర్మాణం చేపడుతున్నారు.

ఎంఒయులు చేసిన సంస్థలు చేస్తున్న డిమాండ్లు హిరణ్యాక్ష వరాలను తలపిస్తుండగా, వాటిని ఆమోదించటానికి రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం సందేహించడం లేదు. 2016లో జరిగిన భాగస్వామ్య సదస్సులో అనిల్ అంబానీ ఆధ్వర్యంలోని రిలయన్స్ సంస్థ విశాఖపట్టణం పరిసరాలలో అణుశక్తితో నడిచే నౌకలు, జలాంతర్గాముల నిర్మాణం కోసం పోర్టును ఏర్పాటు చేయటానికి రు.5,000 కోట్ల పెట్టుబడులు పెడతానని ఎంఒయు చేసుకున్నది. ఇప్పుడు ఆ పరిశ్రమను ఏర్పాటు చేయడానికి సంవత్సరానికి ఎకరానికి రూపాయి చొప్పున 2,000 ఎకరాల భూమిని 99 సంవత్సరాలకు లీజుకివ్వాలని, 25 సంవత్సరాల పాటు నీటిని ఉచితంగా సరఫరా చేయాలని, వివిధ రకాల పన్నులలో రాయితీలు ఇవ్వాలని, తమ సంస్థలో పనిచేయటానికి తీసుకున్న ఉద్యోగులకు శిక్షణనిచ్చే రెండు మాసాల కాలానికి ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని, మరికొన్ని ఇతర డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది. ఈ డిమాండ్లను ప్రభుత్వం తిరస్కరించకుండా వాటిని పరిశీలించటానికి ఒక కమిటీని నియమించింది. రిలయన్స్ భూమిని డిమాండ్ చేస్తున్న చోట ఎకరం ఖరీదు రు.25 లక్షలు ఉన్నది. ఈ రేటు ప్రకారం 2,000 ఎకరాల ఖరీదు రు.5,000 కోట్లు. ఇతర డిమాండ్లు మరో రు.5,000 కోట్లకు పైగా విలువ చేస్తాయి. రు.5,000 కోట్ల పెట్టుబడులు పెట్టే రిలయన్స్ సంస్థ రు.10,000 కోట్లకు పైగా రాయితీలను కోరుతున్నది. వారు పెట్టే పెట్టుబడిని కూడా స్వంత వనరుల నుంచి పెట్టరు. బ్యాంకుల నుంచి, ఇతర పారిశ్రామిక పెట్టుబడులు సమకూర్చే సంస్థల నుంచి రుణాలు తీసుకుంటారు. ప్రాజెక్టు ఖర్చును ఎక్కువ చూపి, రుణాలిచ్చే సంస్థల నుంచి ఎక్కువ రుణం తీసుకుని మొదటే లాభాలు తమ ఖాతాలో వేసుకుంటారు. ఎంత చౌకబేరం! రూపాయి పెట్టుబడి లేకుండా వేల కోట్ల రూపాయల రాయితీలే రాయితీలు! లాభాలే లాభాలు!

ప్రభుత్వం ఇదే తరహాలో అబూదబీ కేంద్రంగా పనిచేస్తున్న న్యూ మెడికల్ సెంటర్‌కు రాజధాని అమరావతిలో వంద ఎకరాల భూమిని ఎకరం రు.50 లక్షల ధరకు కేటాయించింది. ప్రభుత్వ సంస్థలకు ఎకరం రు.4 కోట్ల చొప్పున కేటాయిస్తూ విదేశీ సంస్థకు తక్కువ ధరకు కేటాయించడం ద్వారా రు.350 కోట్ల లాభాన్ని ఆ సంస్థకు ముట్టజెప్పింది. మెడికల్ కాలేజీ, వైద్యశాల ఏర్పాటుకు అనుమతులివ్వడంతో ప్రభుత్వం నిబంధనలన్నింటినీ తుంగలో తొక్కింది. మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలంటే కాలేజీకి అనుబంధంగా మూడు సంవత్సరాల ముందు నుంచి పనిచేస్తున్న వైద్యశాల ఉండాలి. కానీ అబూదబీ సంస్థ 2018లో వైద్యశాలను, 2019లో మెడికల్ కాలేజీని ప్రారంభిస్తుంది. మరికొన్ని ఇతర ప్రయివేటు సంస్థలకు కూడా ఇదే ధరకు వందలాది ఎకరాల భూములను కేటాయించింది. ఆస్ట్రేలియాకు చెందిన కంపెనీ రు.30,000 కోట్లతో థర్మల్ పవర్ ప్లాంటును ఏర్పాటు చేయటానికి ఎంఒయు చేసుకున్నది. రాష్ట్రంలో ఇప్పటికే మిగులు విద్యుత్ ఉండగా, అదనంగా మరో ప్లాంటు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఉపయోగం ఏమిటి? ఏ మాత్రం ఉపయోగం లేకపోగా ఆ సంస్థ ఉత్పత్తి చేసే విద్యుత్‌కు మార్కెట్ చూపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై పడుతుంది. మార్కెట్ చూపలేకపోతే పరిహారం చెల్లించాల్సి ఉండటంతో ఆ భారం రాష్ట్ర ప్రజలపై పడుతుంది. బొగ్గు వినియోగించే ఈ ప్లాంటు వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతుంది.

రాని పరిశ్రమల కోసం బలవంతంగా భూసేకరణ చేయటాన్ని వ్యతిరేకిస్తున్న వారిని అభివృద్ధి నిరోధకులని ప్రభుత్వం ముద్రవేస్తున్నది. నిజానికి అభివృద్ధి నిరోధకులు పెట్టుబడిదారులా, వారిని వ్యతిరేకిస్తున్నవారా? రాష్ట్రంలోకి పెట్టుబడులు వస్తే అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వం చెబుతున్నది. రాష్ట్రంలోని అనేకమంది పెట్టుబడిదారులు, ముఖ్యంగా పాలకపార్టీలో ప్రముఖ స్థానాల్లో ఉన్నవారు ఇతర రాష్ట్రాల్లోనూ, విదేశాలలోనూ పెట్టుబడులు పెడుతున్నారు. వారు అభివృద్ధి నిరోధకులని ప్రభుత్వం చెప్పటం లేదు. వారితో చెట్టాపట్టాలు వేసుకొని తిరుగుతున్నది. వారు రాష్ట్రాభివృద్ధిని కోరుతుంటే స్వంత రాష్ట్రాన్ని వదిలేసి ఇతర రాష్ట్రాలు, దేశాలలో ఎందుకు పెట్టుబడులు పెడుతున్నారు? ఆంధ్ర రాష్ట్రంలోనే పెట్టుబడులు పెడితే రాష్ట్రంలో పెట్టుబడుల కొరత ఉండేది కాదు గదా! పై అంశాలను పరిశీలిస్తే పెట్టుబడిదారులు రాష్ట్రాభివృద్ధి కోసం ఏమాత్రం ఆందోళన చెందడం లేదని, వారిచేత పెట్టుబడులు పెట్టించటానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రయత్నం చేయడం లేదని స్పష్టమౌతున్నది. అయినా వారు అభివృద్ధి నిరోధకులు కాదు! రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని వారిని ఒత్తిడి చేయని రాష్ట్ర ప్రభుత్వం కూడా అభివృద్ధి నిరోధకమైనది కాదా? రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవటాన్ని వ్యతిరేకించేవారు, రైతులకు చట్ట ప్రకారం పరిహారం చెల్లించాలని ఆందోళన చేస్తున్నవారు మాత్రం అభివృద్ధి నిరోధకులు అనడం ఎంతటి కుతర్కం! రైతులు భూములు పోగొట్టుకొని పెట్టుబడుల లాభాల కోసం త్యాగాలు చేయాలా? పరిశ్రమలు విడుదల చేసే కాలుష్యంతో ప్రజలు ఆరోగ్యం క్షీణిస్తుంది. పెట్టుబడిదారులు ప్రజల ఆరోగ్యాన్ని బలిపెట్టి, పరిసరాలను కలుషితం చేసి, వనరులు లూటీ చేసి, శ్రమను కొల్లగొట్టి లాభాలు దండుకుంటారు.

ఎంత నయవంచన! మన పాలకులు ప్రజల కొనుగోలు శక్తి పెంచేందుకు కృషి చేయకుండా, కొత్తగా పరిశ్రమలు పెట్టేవారికి పూర్తి పన్ను రాయితీ కల్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే కేవలం పెట్టుబడులపై ఆధారపడితే చాలదు. ప్రజల వద్ద కొనుగోలు శక్తిని పెంచే చర్యలు చేపట్టాలి. మరోవైపు రాష్ట్ర విభజన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రత్యేక హోదా లభిస్తే కొంతమేరకైనా పరిశ్రమలు రాష్ట్రంలోకి వస్తాయి. ఈ దిశగా కృషి చేయకుండా ప్రచారార్భాటంతో ప్రజలను వంచించ బూనుకోవడం క్షంతవ్యం కాదు. ఎప్పుడో ఒకప్పుడు నిజాలు నిగ్గు తేలుతాయి. బాబు బండారం బయటపడక తప్పదు. ప్రజల తిరుగబడుతారు.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

నష్టదాయకమైన ప్రాజెక్టు మోనోరైల్

మోనోరైల్ నిర్మాణాన్ని చేపట్టే సంస్థ గత చరిత్రను చూస్తే దాని సామర్థ్యం అంతగా లేదనీ, అసలు ఆ ప్రాంత ప్రజలకు మోనో రైల్ అవసరం కూడా అంతగా లేదనీ అంటున్నారు **సి. రామచంద్రయ్య**

వరంగల్‌లో మోనో రైలు ప్రాజెక్టును త్వరలో నిర్మించబోతున్నట్లు ఇటీవల వార్తలొచ్చాయి. స్విట్జర్లాండ్‌కు చెందిన ఇంటామిన్ ట్రాన్స్‌పోర్టేషన్ సంస్థకు చెందిన ఏడుగురు ప్రతినిధుల బృందం వరంగల్ మేయర్‌ను కలిసి ఈ ప్రకటన చేసినట్లు తెలుస్తున్నది.

ఖాజీపేట నుండి వరంగల్‌లోని వెంకట్రామ థియేటర్ వరకు 12 కి.మీ. పొడవున మోనో రైలు నిర్మిస్తారని ప్రకటించారు. ఈ బృందం నగర మేయరు ఇతర అధికారులతో కలిసి రాంపూర్, ఖాజీపేట్, పోచమ్మ మైదాన్, వెంకట్రామ థియేటర్ ప్రాంతాలను పర్యటించారు. గ్లోబల్ స్పెక్ట్రం అనే ఒక మేనేజ్‌మెంట్ కన్‌సల్టెన్సీ సంస్థ అధ్యక్షుడు కూడా ఇందులో పాల్గొన్నాడు.

ఈ ప్రాజెక్టు అంచనా రు.1300–1400 కోట్లు ఉంటుందని, పనులు మొదలైన రోజు నుండి 18 నెలల్లో దీన్ని పూర్తిచేయవచ్చని, గంటకు అయిదువేల మందిని రవాణా చేయవచ్చని, అన్నీ సవ్యంగా జరిగితే త్వరలో తెలంగాణ ప్రభుత్వం ఇంటామిన్ సంస్థల మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదరవచ్చని గ్లోబల్ స్పెక్ట్రం అధ్యక్షుడు ప్రకటించాడు.

ఇటీవల తన దావోస్ పర్యటనలో తెలంగాణ రాష్ట్ర ఐటి, నగరాభివృద్ధి మంత్రి కె.టి.ఆర్ ఇంటామిన్ ప్రతినిధులతో ఇదే విషయమై చర్చలు జరిపినట్లు, అందులోని ఇద్దరు ఇంటామిన్ ప్రతినిధులు వరంగల్ సందర్శించిన వారిలో ఉన్నట్లు కూడ తెలిసింది. కాబట్టి ఈ ప్రాజెక్టుకు మంత్రిగారి సూత్రప్రాయ అంగీకారం ఉన్నట్లు అనుకోవాలి.

మోనోరైల్ అంటే ఏమిటి?

మోనో అనే పేరులోనే ఉన్నట్లు ఇది ఒకే రైలు పట్టాపై వెళ్లే రైలు. రోడ్డు మధ్యలో స్తంభాలు నిర్మించి వాటి మధ్యన వేసే పట్టాపై రైలు వెళుతుంది. అందుకనుగుణంగానే రైలు బోగీని కూడ రూపకల్పన చేస్తారు. దీని ఖరీదు కూడ ఎక్కువే. నగరాల్లో రైలు ఆధారిత రవాణా మాధ్యమాల్లో ఇది తక్కువ సామర్థ్యం కలిగినది. లైట్‌రైలు, మెట్రో రైలు ఎక్కువ సామర్థ్యం కలిగినవి.

సామర్థ్యం తక్కువ, నిర్మాణ నిర్వహణ వ్యయాలు ఎక్కువగా ఉండడంతో మోనో రైలు ప్రాజెక్టులకు పెద్దగా ఆదరణ లేదు. వీటిపై అనేక నగరాలు ఆసక్తి చూపడంలేదు. అధ్యయనం కొరకు మనకు అందుబాటులో ఉన్న మోనో రైలు ప్రాజెక్టులు – ఒకటి మలేషియా రాజధాని కౌలాలంపూర్, రెండవది మన దేశంలో ముంబైలోను, ఇంకొకటి సిడ్నీలోనిది చూడవచ్చు.

కౌలాలంపూర్లో 11 స్టేషన్లతో 8.6 కి.మీ. మేర మోనోరైల్ 2003లో ప్రారంభమైంది. 1989లో ఆమోదం పొంది, నిర్మాణం పూర్తయ్యేనాటికి దీని వ్యయం విపరీతంగా పెరిగింది. ఒక ప్రైవేటు సంస్థ దీన్ని నిర్వహించేది. ప్రాజెక్టు నష్టాల బాట పట్టి దివాలా తీసింది. చివరకు 2007లో ప్రభుత్వమే దీన్ని తీసేసుకోవలసి వచ్చింది. ప్రయాణికుల సంఖ్య కూడ తగ్గుతూనే ఉంది. ఒక అంచనా ప్రకారం ఈ మోనో రైల్లో ప్రయాణించే వారి సంఖ్య 2014 ఆఖరి త్రైమాసికంలో 71,623గా ఉంటే అది 2017లో రెండవ త్రైమాసికానికి 48,202కి పడిపోయింది. ఆ నగరంలో ఉన్న వివిధ రైలు మాధ్యమాల్లో ఇది పెద్దగా ప్రాచుర్యం పొందలేదు.

ఇండియాలో మొట్టమొదటి మోనో రైలు ప్రాజెక్టు ముంబైలో 2008లో రూపు దిద్దుకొంది. అనేక సమస్యలతో సతమతమవుతూ ఎటు వెళ్లాలో తెలియక అగమ్యగోచరంలో ఉన్నది. రెండు దశల్లో 20 – 21 కి.మీ. మేర నిర్మించ తలబెట్టిన ప్రాజెక్టులో చెంబూర్–వడాల మధ్య 8.8 కి.మీ. మొదటి దశకు ఫిబ్రవరి 2009లో నిర్మాణం మొదలైంది. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో ఎల్అండ్‌టి, మలేషియాకు చెందిన స్కోమి కంపెనీలు అంతకు ముందు ఈ ప్రాజెక్టును దక్కించుకున్నాయి. ప్రాజెక్టు అంచనా రు.2460 కోట్లు. 2029 సంవత్సరం వరకు నిర్వహిస్తూ నడిపే విధంగా ఒప్పందం.

2011 ఏప్రిల్‌లో పూర్తికావలసిన నిర్మాణం 2011 ఆఖరుకు పూర్తయింది. నవంబర్ 2012లోనే పూర్తి 8.8 కి.మీ. అందుబాటులోకి వచ్చింది. కాని ఫిబ్రవరి 2014లోనే ప్రారంభానికి నోచుకొన్నది. రైళ్లు నడిచిన రోజుల్లో కూడ నిత్యం ఏదో ఒక సమస్య ఉండేది. చివరకు నవంబర్ 9, 2017లో ఒక స్టేషన్లో రెండు ఖాళీ బోగీలు కాలి పోవడంతో ఆరోజు నుండి రైళ్ల రాకపోకలు ఆపేశారు.

రెండవ దశ అయిన వాడాల–జాకోబ్ సర్కిల మధ్య 10.6 కి.మీ. నిర్మాణం పూర్తయి అన్ని అనుమతులు వచ్చిన తరువాత కూడ ఇప్పటివరకు ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ప్రధాన కారణం దీన్ని నిర్వహించడానికి ఇప్పటికి నాలుగు సార్లు టెండర్లు పిలిచినప్పటికి ప్రైవేటు సంస్థలు ఆసక్తి చూపడంలేదు.

జూన్ 2017 నుంచి టెండర్లు పిలుస్తూనే ఉన్నారు. మొదటి దశలో జరిగిన అనేక నిర్వహణ లోపాల వలన స్కోమిని రెండవ దశ నిర్వహణకు అనర్హురాలిగా ప్రకటించింది ఎంఎంఆర్‌డిఏ (ముంబై మెట్రోపాలిటన్ రీజినల్ డెవలప్‌మెంట్ అథారిటీ). మార్చ్ 2018లో సర్వీసులు నిర్వహిస్తామని ప్రకటించినప్పటికి కుదరలేదు.

నడిచిన మొదటి దశలో ప్రయాణికుల సంఖ్య చాల తక్కువగా

ఉండేది. సరాసరి రోజుకు 17000 మంది మాత్రమే దీనిలో ప్రయాణించేవారు. మొత్తం పూర్తయితే 2 లక్షల మంది ప్రయాణిస్తారని అంచనా. ఇలాంటి ప్రాజెక్టులు మొదట్లో ఆమోదం పొందడానికి వేసే లెక్కలే ఇవి. ఇపుడు ఈ ప్రాజెక్టు మనుగడే ప్రశ్నార్థకం అయింది. మొదటి దశలో రోజుకు రు. 3 లక్షల నష్టం వచ్చినట్లు అంచనా వేశారు. వేల కోట్లు ప్రజా ధనాన్ని వృధాచేసిన ప్రాజెక్టుగా ఇది మిగిలిపోనున్నదని ఒక అంచనా.

ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో నౌకాశ్రయాన్ని కొన్ని ప్రాంతాలతో కలుపుతూ జూలై 1988లో ప్రారంభమైన 3.6 కి.మీ. మోనో రైల్ ప్రాజెక్టును 25 సంవత్సరాల తరువాత జూన్ 2013లో మూసివేశారు. దాని స్థానంలో కొత్తగా లైట్‌రైల్ ప్రాజెక్టును నిర్మించడం కోసం మోనో రైలు నిర్మాణాలను మొత్తం కూల్చివేశారు. అది నడిచిన రోజుల్లో కూడ పెద్దగా ప్రయాణికుల ఆదరణ పొందలేదని విమర్శలున్నాయి.

వరంగల్లో మోనోరైల్ అవసరమా?

వరంగల్ నగర జనాభా 2011 లెక్కల ప్రకారం దాదాపు 6 లక్షలు. నగరీకరణ పెరుగుతున్న ఈ రోజుల్లో పట్టణ జనాభా పెరుగుతూనే ఉంటుంది. దీనికితోడు వాహనాల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నది. వరంగల్‌లో రవాణా సమస్యలపై ఏదైనా లోతైన అధ్యయనం జరిగిందోలేదో నాకు తెలియదు. ఉంటేదాన్ని అధికారులు బహిర్గతం చేసి పౌరులకు అందుబాటులో ఉంచి చర్చకు అవకాశం కల్పించాలి. ఇపుడు మోనో రైల్ ఎక్కాలనుకుంటున్న మార్గంలో కూడ రవాణా సంబంధిత విషయాలను అధ్యయనం చేయాలి.

ఇపుడున్న పరిస్థితేంటి? 2011 జనాభా లెక్కల ప్రకారం వరంగల్ జిల్లా పట్టణ ప్రాంతాల్లో ఉన్నవారు ఇంటి నుంచి తాము పనిచేసే చోటుకు వెళ్లడానికి వాడే వాహన సదుపాయాలను గమనిస్తే (శాతంలో) :

నడక – 19.1; సైకిల్ – 14.8; మోపెడ్/స్కూటర్/మోటారుసైకిల్ – 18.3; కారు/జీపు/వ్యాన్ – 1.6; టెంపో/ఆటో/టాక్సి – 8.3; బస్సు – 6.8; రైలు – 3.7; నీటిపై – 0.1 ఇతర – 0.4 గా ఉన్నారు. అలాగే ప్రయాణం చేయనివారు – 27 శాతం ఉన్నారు. (ఆధారం: 2011 జనాభా గణాంకాలు)

ప్రయాణం చేయని వారిని మినహాయిస్తే వరంగల్ జిల్లాలోని పట్టణాల్లో ఎక్కువ మంది నడిచి, స్కూటర్లు, మోటారు సైకిళ్లపైన, సైకిళ్లపైన తమ పనులకు పోతున్నారు. నడక, సైకిల్ మాధ్యమాలు కలిసి దాదాపు 35 శాతం. ఏవిధమైన కాలుష్యాన్ని కలుగచేయని మాధ్యమాలు ఇవి. ఆరోగ్యానికి మంచిది కూడ. కాని నగరాల్లో వాహనాలు పెరిగేకొద్దీ నడవడం, సైకిళ్లపై వెళ్లడం రోజు రోజుకూ కష్టమౌతున్నది. కార్లలో వెళ్లేవారు రెండు శాతం లోపే! కాని రోడ్ల వెడల్పు, ఫ్లై ఓవర్లు వగైరాలన్నీ కార్లలో వెళ్లే వారికోసమే జరుగుతున్నాయి.

ఇక్కడ ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. పై గణాంకాలు జిల్లా అర్బన్ మొత్తానికి సంబంధించినవి. అయినా అవి వరంగల్‌కు ప్రధానంగా వర్తిస్తాయి. ఎందుకంటే జిల్లా నగర జనాభాలో వరంగల్ జనాభా దాదాపు 74 శాతం ఉన్నది. తెలంగాణ రాష్ట్రంలోనే హైదరాబాద్ తర్వాత రెండవ పెద్ద నగరం వరంగల్. జిల్లాలో 15 పట్టణాలు ఉన్నప్పటికీ జనగాం, మహబూబాబాద్, నర్సంపేటలు మినహా మిగిలినవి చాలా చిన్నవి.

చివరగా ఈ ఇంటామిన్ కంపెనీ వ్యవహారమేంటి? వారి వెబ్‌సైట్ (https://www.intaminworldwide.com)ను గమనిస్తే మోనో రైలు ప్రాజెక్టులు నిర్మించడంలో దీనికున్న పరిజ్ఞానం అంతంత మాత్రమేనని స్పష్టమౌతుంది. దీని ప్రాజెక్టులన్నీ పెద్దపెద్ద పర్యాటక, వినోద కేంద్రాలలో రోలర్ కోస్టర్ రైళ్లను, తిరిగే పెద్ద చక్రాలను (జాయింట్ వీల్స్) నిర్మించడంలోనే ఉన్నది. ఎక్కడో రెండు మూడు చోట్ల మోనో రైలు ప్రాజెక్టుల ప్రస్తావన ఉన్నప్పటికీ అందులో దీని పరిజ్ఞానం చాలా తక్కువేనని అర్థమౌతుంది.

ఈ నేపథ్యంలో చూసినపుడు ఇంటామిన్ సామర్థ్యాన్ని లెక్కలోకి తీసుకోకుండా కూడ మోనో రైలు ప్రాజెక్టు వరంగల్‌కు వాంఛనీయం కాదని స్పష్టంగా చెప్పవచ్చు.

కాని ఏ ప్రాజెక్టు అవసరం అనే నిర్ణయం ఎవరు తీసుకోవాలి? మొదటగా నగరపాలక సంస్థలోను, పౌర సమాజంలోను చర్చ జరగాలి. సంబంధిత సమాచారాన్ని ప్రభుత్వ సంస్థలు బహిరంగంగా ప్రజల ముందు ఉంచాలి. విభిన్న అభిప్రాయాలు వినే సహనం ప్రభుత్వానికి ఉండాలి. కాని దురదృష్టవశాత్తు ఇపుడు అలా జరగడంలేదు. పార్టీ అధినాయకుడు(లు) (పార్టీ ఏదైనా సరే) ఒక నిర్ణయం తీసుకొంటే పై నుంచి కింది వరకు ఆ పార్టీ శ్రేణులు, ప్రభుత్వ శాఖలు ఆ నిర్ణయాన్నే సమర్థించే సంస్కృతిలో మనమున్నాం.

రాజకీయ పరమైన విషయాలలో కొన్నిసార్లు ఉండవచ్చునేమో కాని ఇలాంటి ప్రాజెక్టుల విషయంలో తొందరపడి ప్రతిష్టకుపోయి వాటిని నగరంపై రుద్దకూడదు.

(రచయిత ప్రొఫెసర్ ఇన్ అర్బన్ స్టడీస్, సెస్, హైదరాబాద్) వీ

వచ్చే సంచికలలో...

- **అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం - కందాల శోభారాణి**
- **అంబేద్కర్ జీవితం - ప్రొ. కె.వై. రత్నం**
- **మూఢ విశ్వాస రాజ్యమే ఆర్ఎస్ఎస్ 'గర్భ సంస్కార్' - వై.ఎచ్.కె. మోహన్‌రావు**
- **జనవరి 26 పూర్వాపరాలు - గోలి కృష్ణ**

జలమే జీవాధారం

***రెండు తెలుగు రాష్ట్రాలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయనీ, ఒకవైపు వర్షాలు లేక కరువుతో అల్లాడుతుంటే మరోవైపు పాలకుల నిర్లక్ష్యం వల్ల అతిసార, డయేరియా వంటి రోగాలతో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారనీ అంటున్నారు* షేక్ కరిముల్లా**

రాష్ట్రంలో వైద్య రంగంలో గుంటూరుకు అంతర్జాతీయ, స్థాయి ఖ్యాతి ఉంది. ఎంతోమంది మంచి నైపుణ్యం కలిగిన వైద్యులను ప్రపంచానికి అందించిన ఖ్యాతి కూడా గుంటూరు వైద్య కళాశాలలకు ఉంది. కాని ఏం లాభం... కేవలం ముందు జాగ్రత్తలతో నివారించగల డయేరియా వ్యాధిని అదుపు చేయలేక పదుల సంఖ్యలో ప్రాణాలు గాలిలో కలిసి పోయాయి, పోతున్నాయి. ఇది నిజంగా పాలకుల, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

మార్చ్ 3న ప్రబలిన డయేరియా నేటికి (18 మార్చ్ 2018) 15 రోజులైనా అదుపులోకి రాలేదు. డయేరియా రోగులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ఒక్క గుంటూరు జిజిఎచ్‌లోనే అధికారిక లెక్కల ప్రకారం 680 మంది చికిత్స పొందగా 8 మంది మృత్యువాత పడ్డారు. ఇక ప్రైవేట్ ఆసుపత్రులలో మరో 1300 వందల మంది చికిత్స పొందారని సమాచారం. ఇప్పటివరకు ఈ వ్యాసం రాస్తున్న సమయానికి 17 మంది మరణించారు. అయితే అధికారులు మాత్రం ఈ సంఖ్య తగ్గించి చెబుతున్నారు. డయేరియాతో మరణించిన పల్లపు రత్తయ్యను గుండె సమస్యతో చనిపోయాడని తప్పుడు సర్టిఫికెట్ ఇవ్వడం సిగ్గుచేటు. దీంతో బంధువులు, ప్రతిపక్ష కార్యకర్తలు శవాన్ని రోడ్డుపై ఉంచి నాలుగు గంటలు మృతదేహంతో ధర్నా చేశారు.

రానురాను బాధితుల సంఖ్య పెరుగుతూ ఉంది. సుమారు 1500 మందికి పైగా ఉన్నారు. కాని వైద్యాధికారులు 962 మందేనని తగ్గించి చెబుతున్నారు.

గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఆనందపేట సంగడిగుంట, బారా ఇమాంపంజా, పొన్నూరు రోడ్డు, పాత గుంటూరు, వినోధానగర్ మొత్తం పది డివిజన్లలో ఒక్కసారిగా డయేరియా విజృంభించడంతో నగర ప్రజలు తీవ్ర భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ నియోజకవర్గంకు కూడా డయేరియా వ్యాపించింది.

గుంటూరు నగరంలో ఏవైపు చూసిన డయేరియా బాధితులే కనిపిస్తున్నారు. గుంటూరు నగర పాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం కారణంగా 17 నిండు ప్రాణాల, వందల మంది తమ ఆరోగ్యాలు దెబ్బతిని ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి దాపురించింది.

గుంటూరు తూర్పు నియోజకవర్గం పరిధిలోని సుమారు 23 కిలోమీటర్ల పరిధిలో తుప్పుపట్టి పాడైపోయిన పైపు లైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సి ఉంది. 2013లో సమగ్ర మంచినీటి పథకం కింద ప్రపంచ బ్యాంకు నిధులతో పనులు ప్రారంభమైనా అధికారులు, కాంట్రాక్టు సంస్థల నిర్లక్ష్యం కారణంగా కొత్త పైపులైన్లు వేయలేదు. ఫలితం పైపులైన్ల లీకేజీతో మురుగు నీరు కలిసిపోయి నీరు కలుషితమై కుళాయిల పరఫరా కాబడింది. ఈ నీరు తాగిన వారికి డయేరియా వ్యాపించింది. కార్పొరేషన్ నీటిని పరీక్షలకు పంపించగా వాటిలో ఈకొలై బ్యాక్టీరియా ఉన్నట్లు నిర్ధారణైంది. చివరకు మినరల్ వాటర్ ప్లాంట్స్ నుంచి సేకరించిన నీటి నమూనాలో కూడా బ్యాక్టీరియా ఉన్నట్లు సమాచారం. ఒకవైపు అతిసారతో మరణాలు... మరోవైపు తాగునీరు లేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇది ప్రస్తుత గుంటూరు నగరంలోని పరిస్థితి.

అతిసారతో గుంటూరు నగరం గత 15 రోజులుగా వణికిపోతుంది. ప్రజలు గుంటురు నగరంలో మంచినీరు తాగాలంటేనే భయపడి పోతున్నారు. పరిస్థితిని సమీక్షించిన గుంటూరు సమగ్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. డి. శౌరిరాజు నాయుడు మెడికల్ ఎమర్జెన్సీ ప్రకటించారు. అంటే ఇప్పటికే పరిస్థితి చేయిదాటి పోయింది.

రాజధాని నగరమైన గుంటూరులో అతిసార వ్యాప్తి మరణాలపై ప్రభుత్వం, అధికారుల తీరుపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొలి దశలో ఫుడ్ పాయిజన్ వల్ల అతిసార వ్యాపించిందని జిల్లా ఉన్నతాధికారులు, నగర పాలక సంస్థ అధికారులు ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇవ్వడం వల్ల కూడా నష్టం ఎక్కువ జరిగింది. దీనివల్ల ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింది. చివరకు నీటి కాలుష్య నివారణ, అతిసారను అదుపుచేయకపోవడంతో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా అనురాధను ప్రభుత్వం బదిలీ చేసింది. వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టాలని అధికారుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ముమ్ముందు ఇలాంటివి జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. లేకుంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. 70 సంవత్సరాల స్వతంత్ర్య భారత్‌లో సురక్షిత మంచినీరు అందించడం ప్రభుత్వాల కనీస బాధ్యత. ఇది జీవించే హక్కులో భాగం.

జలమే జీవాధారం

ప్రకృతిలో జీవమున్న ప్రతి ప్రాణికి జలమే జీవాధారం. మంచినీరే లేకుంటే ప్రాణాంతకమే... జీవుల శరీర కణజాలానికి అవసరమైన ఖనిజ లవణాలు చాలావరకు నీటి ద్వారానే లభిస్తాయి. శరీరంలో జరిగే ప్రతి రసాయనిక చర్యకు జీర్ణక్రియ ఇతర జీవక్రియలకు నీరు తోడ్పడుతుంది. జీర్ణమైన పోషక పదార్థాలను కణజాలాల దగ్గరికి తీసుకెళ్లడానికి, వ్యర్థాల విసర్జనకు నీరు అత్యంత అవసరం. గ్రంధుల్లో హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. ఆ హార్మోన్లు తాము పనిచేసే చోటుకు వెళ్లాలంటే నీరు అవసరమౌతుంది. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాసక్రియ

సరిగా జరగడానికి, కంటి చూపు సరిగా ఉండడానికి, నాడీ మండలం పనిచేయడానికి నీరు కావాల్సిందే. కీళ్లు అరిగిపోకుండా, ఒరిపిడి లేకుండా చేయడానికి నీరు ఉపయుక్త మవుతుంది.

ఆహారం లేకుండా కొద్ది రోజుల వరకు బతకవచ్చు. కాని నీరు లేకుండా 4-9 రోజులకు మించి బతకలేరు. జీవులకు నీటి లభ్యత తక్కువైతే జీర్ణక్రియ, జీర్ణమైన ఆహారం సంగ్రహణ ప్రక్రియ, విసర్జన క్రియలు ఆలస్యంగా జరుగుతాయి. దీని వలన అజీర్తి, మలబద్దకం, చర్మం పొడిబారడంతో పాటు మూత్ర సంబంధమైన సమస్యలు ఏర్పడుతాయి.

నీటి లభ్యత బాగా తగ్గితే రక్తం చిక్కబడుతుంది. శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. జీవులు చనిపోతాయి. మనలాంటి ఉష్ణ మండల దేశాల్లోని జీవులకు ముఖ్యంగా ఎండకాలం నీటి అవసరత మరింత ఎక్కువ. ఇంత ప్రాధాన్యత గల శుభ్రమైన, సురక్షితమైన మంచి నీటిని సకల జీవులకు అందించడం ప్రభుత్వాల కనీస బాధ్యత.

తెలుగు రాష్ట్రాలలో దాహం కేకలు

దక్షిణ గంగ గోదారమ్మ, కృష్ణమ్మలు, ఇతర నదులు తెలుగు రాష్ట్రాలకు జీవం పోస్తున్నాయి. అయినా వేసవి వచ్చిందంటే తెలుగు రాష్ట్రాలలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో తీవ్ర కొరత ఏర్పడుతుంది. దాహంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవి కాలాలు వస్తున్నాయి. పోతున్నాయి. కాని గ్రామీణ ప్రాంతాలలో ప్రజల గొంతెండిపోతుంది. తమ నీటి వెతల్ని తీర్చేవారు ఎవరా అని కనిపించిన ప్రతి ఒక్కరికి ప్రాధేయపడుతూ నిరాశ నిండిన ముఖాలతో కనిపిస్తుంటారు గ్రామీణులు.

ఇది ఒక గ్రామం కథ కాదు, ఒక ఊరి వ్యథకాదు. తరచి చూస్తే, మనసుపెట్టి, దృష్టిపెడితే అన్ని చోట్ల ఇదే పరిస్థితి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో గ్రామీణ ప్రాంతాలలోని పరిస్థితుల్ని పరిశీలిస్తే కడు దయనీయం. వరుసగా నాలుగేళ్ల నుంచి కరువు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్న ఈ జిల్లా ప్రజలు గుక్కెడు మంచినీళ్ల కోసం అల్లాడుతున్నారు. మార్కాపురం నియోజకవర్గంలోని పుచ్చకాయలపల్లే ఫ్లోరైడ్ పీడిత గ్రామం. ఈ ఊరిలోని వారికి ఒక్కొక్క కుటుంబానికి రోజుకు మూడు బిందెల నీరు దొరికితే పెద్ద పండుగే. బిందెలు పట్టుకొని బారులు తీరి చెలమలవంక, చెరువలవంక, గ్రామంలోకి వచ్చే నీటి ట్యాంకర్ల వైపు పరుగులు తీస్తూ కనిపిస్తారు.

ఈ గ్రామ జనాభా సుమారు 2 వేలు. గ్రామంలో 700 నుంచి 800 అడుగుల లోతుకు తవ్వినా నీరు పడని పరిస్థితి. నీరు పడిన ఫ్లోరైడ్ ప్రభావిత నీటిని వాడుకోవడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదు. జిల్లాలోని 56 మండలాలలోను ఇదే పరిస్థితి.

జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటి చెరువులు, కుంటలు, బావులు వట్టిపోవడం ఇందుకు కారణం. ఇక్కడ దోనకొండ గ్రామంలోని పరిస్థితి మరీ దారుణం. కృష్ణా నుండి ఒక కుండ నీళ్లు తెచ్చుకోవాలంటే గజ్జలకొండకు 45 నిమిషాల ప్రయాణం చేయాలి. వేసవి వస్తుందంటేనే ఈ గ్రామస్తుల గుండెలు దడదడ లాడుతాయి. కూలీ పనులు కూడా మానుకొని నీటికోసం మైళ్ల దూరం పరుగులు పెట్టాల్సిన దుస్థితి. ఇటు నీళ్లులేక, అటు పనులకు పోలేక వచ్చే కాస్త ఆదాయం కోల్పోయి అష్ట కష్టాలు పడుతున్నారు.

ఇక మార్కాపురం మండలం జమ్మనపల్లే గ్రామస్తులకు స్నానం విలాసవంతంగా మారిందని గ్రామస్తులన్నారు. ఈ ప్రాంత వాసుల ఆశాకిరణమైన వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పూర్తికావడానికి ఇంకా ఎన్ని సంవత్సరాలు వేచి చూడాలి? అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమ నీటి అవసరాలు తీరుతాయని ఆ ప్రాంత వాసులు ఆశపడుతున్నారు. సుంకేశుల ప్రాజెక్టు గురించి చెప్పనవసరం లేదు. ఈ ప్రాజెక్టుకు 1996లో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 15.25 లక్షల మందికి తాగునీరు, 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు లభిస్తుంది. కాని దురదృష్టం ఏమిటంటే గత 21 ఏళ్లుగా ఈ ప్రాజెక్టు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. మంచినీటి ఎద్దడి దాదాపు ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా ఇలాగే ఉంది. ఇక తెలంగాణ రాష్ట్రంలో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు.

ఆదిలాబాద్ జిల్లాలోని గడిగూడ, నార్నూర్ మండలాలలోని పిప్రీ, కుండీ, సుంగపూర్ గ్రామాలలో నీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మూడు గ్రామాలలోని 2000 మందికి వేసవి కాలం ఒక పరీక్ష కాలం. ఆదిమ గోండులు, కోలం, అంధులు ఈ గ్రామాల్లో నివశిస్తుంటారు. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ గిరిజన జాతుల జీవితాల్లో ఎటువంటి మార్పు లేదు. బంగారు తెలంగాణ అంటూ ఊదరగొట్టిన తెరాస ప్రభుత్వం కూడా తెలంగాణలోని గిరిజన జాతులకు చేసిందేమీ లేదు.

నల్గొండ జిల్లాలోని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల ప్రజల విషాదం అంతా ఇంతా కాదు. దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు ఫ్లోరైడ్ బాధిత పీడితులే. కృష్ణా నది ఈ జిల్లా గుండా పారుతున్నా ఈ ప్రాంత ప్రజలకు కృష్ణా నది నీరు అందడం లేదు. దశాబ్దాలుగా ఫ్లోరైడ్ భారీన పడుతున్న ప్రజలు అంగవైకల్యంతో బాధపడుతున్నారు, చిన్న వయస్సులోనే ముసలివారై పోతున్నారు.

ఉత్తరాంధ్రలోని ఉద్దానం ప్రాంత ప్రజలకు సురక్షిత మంచినీరు లేక కిడ్నీ వ్యాధులు ప్రబలి వేల మంది మృత్యువాత పడుతున్నారు. ఈ ప్రజలకు శుద్ధ జలాలు ఉచితంగా అందించడంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది.

దేశంలో 7 కోట్ల మందికి తాగునీరే లేదు

స్వాతంత్ర్యం సిద్ధించి దశాబ్దాలు గడుస్తున్నా దేశంలో కోట్లాది మంది ప్రజలకు తాగునీరు లభించడం లేదు. దేశ జనాభాలో 67 శాతం మంది ప్రజలు గ్రామీణులు. సాధారణంగా జల వనరులు ఎక్కువగా ఉండేది గ్రామీణ ప్రాంతాలలోనే. కానీ గ్రామీణ ప్రజలకు శుద్ధి చేసిన తాగునీరు దొరకడం లేదు. దేశ వ్యాప్తంగా 7 కోట్ల పైచిలుకు మందికి సరైన తాగునీరు లభించడంలేదు. ఫలితంగా కలుషిత నీటినే తాగాల్సిన దుస్థితి కారణంగా ప్రజలకు కలరా, అతిసార, టైఫాయిడ్, అమీబియాసిస్ వంటి ప్రమాదకర వ్యాధుల బారిన పడుతున్నారు. చాలా హామీల మాదిరిగానే ప్రభుత్వాలు ఇస్తున్న నీటి హామీలు నీటి మీద రాతలుగానే మిగిలిపోతున్నాయి. ప్రజలకు మాత్రం నీటి కష్టాలు తీరకపోగా మరింత ఎక్కువై పోతున్నాయి. ఇది మనం సాధించిన 'అభివృద్ధి'. వీ

(రచయిత సామాజిక విశ్లేషకులు)

ప్రత్యేకహోదాతో మభ్యపెడుతున్న రాజకీయపార్టీలు

ప్రత్యేక హోదా పేరుతో అధికార, ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆందోళన అంతా ప్రజలను మభ్యపెట్టడానికే తప్ప అసలు సమస్యను పరిష్కరించడానికి కాదనీ, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ఏ పార్టీకి చిత్తశుద్ధి లేదనీ అంటున్నారు **ఎం.కె.కుమార్**

ప్రత్యేక హోదా ఫక్తు ఎన్నికల నినాదం. ప్రత్యేక హోదా వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని మెజారిటీ ప్రజానీకానికి ఒరిగేదేమి లేదు. అధికారం కోసం రాజకీయ పార్టీలు తాపత్రయ పడుతున్నాయి. రాబోయే ఎన్నికల్లో లబ్ది పొందడానికి ప్రతి పార్టీ ప్రత్యేక హోదా పాట పాడుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తుకు ప్రత్యేక హోదా బంగారుబాట వేస్తుందని మేధావులు సైతం ప్రకటిస్తున్నారు. కుల రాజకీయాలను పోషించడానికి వచ్చిన పవన్‌కళ్యాణ్ ప్రత్యేక హోదా నినాదంతో లబ్ధిపొందాలని భావిస్తున్నాడు. విశాఖ ఉక్కు- ఆంధ్రుల హక్కు ఉద్యమంలాగా ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు ఉద్యమాన్ని మలచాలని ప్రయత్నిస్తున్నారు. కాని ప్రజల మద్దతు ప్రత్యేక హోదాకు లేదు. అసలు ఉద్యమస్థాయిని ఈ నినాదం అందుకోలేకపోతోంది. మీడియా పాయింట్‌లే ప్రత్యేక హోదా ఉద్యమానికి పోరాట వేదికల్లా మారిపోయాయి. టివీల్లోని చర్చావేదికల్లో ఊకదంపుడు ఉపన్యాసాలకు ఈ నినాదం పరిమితమయింది. రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని ప్రత్యేక హోదా చుట్టూ తిప్పడంలో వైస్‌ఆర్‌పార్టీ విజయం సాధించింది. అనుకున్నట్టుగా తెదేపాను మానసికంగా బిజెపి నుండి విడదీసింది. మార్చి 31న పార్లమెంట్‌లో అవిశ్వాసం పెడతామని వైఎస్‌ఆర్‌సిపి చెపుతోంది. పార్లమెంట్ సమావేశం ముగిసేనాటికి ఏప్రెల్ 5వ తేదీ వైఎస్‌ఆర్ పార్టీ ఎంపీలు పార్లమెంట్ స్థానాలకే రాజీనామా చేస్తారని జగన్ చెపుతున్నాడు. ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రానికి ప్రయోజనం లేదని చంద్రబాబు మొదటలో ప్రకటించాడు. ఇప్పుడు ప్రత్యేక హోదాకి సమానంగా బిజెపి ప్యాకేజీ ఇస్తానన్నదని, ఇప్పుడు అదీ ఇవ్వడం లేదని ప్రకటిస్తున్నాడు. ఏపీకి చెందిన 25 మంది ఏంపీలను ప్రత్యేక హోదా కోసం పార్లమెంట్ స్థానాలకు రాజీనామా చేయాలని జగన్ చెపుతున్నాడు.

మార్చి 8వ తేదీ వామపక్ష పార్టీలు, ప్రతిపక్ష పార్టీతో కలసి రాష్ట్ర బంద్‌ను నిర్వహించాయి. 2014లో పవన్ కళ్యాణ్‌ను తెదేపా ఉపయోగించుకుంది. ప్రజా ఉద్యమాలతోనే ప్రత్యేక హోదా వస్తుందని, రాజకీయ పరిష్కారం వల్ల రాదని వామపక్షాలు తేల్చిచెపుతున్నాయి. రాష్ట్రం విడిపోయి 4 సంవత్సరాలు అయిన తర్వాత రాజకీయ పార్టీలకు ప్రత్యేక హోదా రాష్ట్రానికి అవసరమని మాట్లాడుతున్నాయి.

ఈ పార్టీలు చెప్పే వాటిని నమ్మి కొంతమంది ప్రజలు నిజాయితీగా ఉద్యమాల్లో పాల్గొంటున్నారు. వారి స్ఫూర్తిని అవమానిస్తూ, ఉద్యమాల వల్ల ఎక్కువ నిధులు రావని అరుణ్ జైట్లీ పేర్కొన్నాడు.

ప్రత్యేక హోదా వల్ల పోలవరం ప్రాజెక్టు పూర్తి అవుతుందని మేధావులు మాట్లాడుతున్నారు. అసలు పోలవరం ప్రాజెక్టును స్థానికులు వ్యతిరేకిస్తు న్నారనే విషయం దాచిపెడుతున్నారు. 2019కి పోలవరాన్ని పూర్తి చేస్తామని తెదేపా చెప్పుకుంది. 50 శాతం ప్రాజెక్టు దాదాపుగా పూర్తయిందని చెపుతున్నారు. కుడి కాలువ 91 శాతం, ఎడమ కాలువ 50 శాతం, రిజర్వాయర్ పనులు 34 శాతం పూర్తయిందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఇప్పటివరకు రు. 12,335.99 కోట్లు ఖర్చు చేశామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. 2005లో మొదలు పెట్టిన ప్రాజెక్టు ఇప్పటికీ కేవలం 50శాతం మాత్రమే పూర్తయింది. ఇటు వంటప్పుడు 2 సంవత్సరాలలో మిగిలిన 50 శాతం ఎలా పూర్తవుతుంది?

జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తర్వాత, ఇప్పటికే ఛత్తీస్‌గడ్, తెలంగాణ, ఒరిస్సా రాష్ట్రాలు పోలవరంపై తమ అభ్యంతరాలను తెలిపాయి. సుప్రీంకోర్టులో ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేసులున్నాయి. జాతీయ హరిత ట్రిబ్యునల్ కొన్ని నివేదికలను రాష్ట్రాన్ని కోరింది. ఎపి పునర్విభజన చట్టం 2014 ప్రకారం సెక్షన్ 90లో కేంద్ర ప్రభుత్వమే పునరావాస చర్యలు చేపడతానని అనింది. పర్యావరణ, అటవీశాఖ అనుమతులను కేంద్రమే ఇస్తానని చెప్పింది. 2014 నాటికి ఉన్న పోలవరం వ్యయం రు.16,010.45 కోట్లు. పెరిగిన వ్యయాన్ని కేంద్రమే చెల్లించాలి. పోలవరానికి రు.23,814.70 కోట్లను నాబార్డు ద్వారా విడుదల చేస్తామని కేంద్రం చెప్పింది. ఇందులో ఇప్పటికీ 4,329 కోట్లను కేంద్రం ఇచ్చిందని రాష్ట్రప్రభుత్వం చెపుతోంది. ప్రాజెక్టు వ్యయం ప్రక్కన పెడితే పునరావాసానికి, భూసేకరణకు రు.34,000 కోట్లు ఖర్చు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం చెపుతోంది. పునరావాససమస్యను తీర్చినతర్వాత ప్రాజెక్టులు కట్టాలని సుప్రీంకోర్టు గతంలో తీర్పు చెప్పింది. ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఈ అంశాన్ని రాజకీయపార్టీలు ప్రజలకు చెప్పడం లేదు.

చంద్రబాబు యూ టర్న్ తీసుకోవడానికి కారణం ఉంది. తెదేపా నేతలు భూ బకాసురుల మాదిరి ప్రభుత్వ భూముల్ని నొక్కేస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన 600 హామీలలో తెదేపా 60 హామీలను సైతం తీర్చలేదు. ప్రజలకు తెదేపాపై ఉన్న భ్రమలు తొలిగిపోయాయి. ప్రత్యేక హోదాకు సమానంగా ప్యాకేజీ సైతం బిజెపి ఇవ్వలేదు. 2017 మార్చ్ 16న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మోడీకి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేసింది. దానికి కారణం 14వ ఆర్థిక సంఘం సిఫార్సుల్లో ప్రత్యేక హోదా ప్రతిపత్తి ఉన్న రాష్ట్రాలు, ప్రతిపత్తి లేని రాష్ట్రాలకు మధ్య వ్యత్యాసాన్ని చూపలేదు. ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం ప్రత్యేక హోదా ఉనికి లేకుండా పోయింది. ఆంధ్రప్రదేశ్‌కు 5 సంవత్సరాల పాటు ప్రత్యేక హోదాకు సమానమైన ఆర్థికసాయం చేయడానికి కేంద్రం అంగీకరించింది. ఈ సహాయం ప్రత్యేక హోదా ప్రతిపత్తి ఇచ్చిన రాష్ట్రానికి సమానంగా ఉంటుంది.

తెదేపా, బిజెపితో పొత్తు తెగతెంపులు చేసుకుంటే, ఇవ్వాల్సిన నిధులు కేంద్రం ఇవ్వదేమోనని సోకాల్డ్ మేధావులు భావిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్రం నమ్మకం కోల్పోయింది.అందుకే ఇచ్చిన నిధులకు కేంద్రం లెక్కలు చెప్పమంటోంది. వెనుకబడిన రాలయలసీమ, ఉత్తరాంధ్రలోని 7 జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ కోసం కేంద్రం 4 సంవత్సరాల క్రితం నిధులను కేటాయించింది. ఏడాదికి 50 కోట్లు మాత్రమే కేటాయించింది. మొత్తం 7 జిల్లాలకు కలిపి ఏటా 350

కోట్లు కేంద్రం విడుదల చేస్తూ వస్తోంది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి 1050 కోట్ల నిధులను విడుదల చేసినట్టే చేసి, తిరిగి వెనక్కి తీసుకుంది. ఇది తెదేపాను ఇరుకున పడేసింది. అంతేగాకుండా ఇప్పటివరకు ఇచ్చిన నిధులకు లెక్కలు చెప్పాలని కేంద్రం హుకుం జారీచేసింది. నీతి ఆయోగ్ బృందాలను జిల్లాలకు పంపించింది.

దేశంలో ఏ రాష్ట్రానికి ఇవ్వనంత నిధులు కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిందని బిజెపి నాయకులు అంటున్నారు. 3.75 లక్షల కోట్లు కేంద్రం ఇచ్చిందని అన్నారు. ఇప్పటికీ చంద్రబాబు కేంద్రం ఎంత ఇచ్చిందని లెక్కలు చెప్పటం లేదు. విభజన చట్టం లోని సెక్షను 83 ప్రకారం సదరు సంస్థలను 10 ఏళ్లలో ఏర్పాటు చేయవచ్చు. కేంద్రం మూడున్నర సంవత్సరాలలో 85 శాతం ప్రాజెక్టులను రాష్ట్రంలో పూర్తి చేసిందని వారన్నారు. ఇన్ని మాట్లాడినా కేంద్రం ప్రవేశపెట్టిన 21.57 లక్షల కోట్ల బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఒక్క రూపాయి కేటాయించ లేదు. అమరావతి, పోలవరం నిర్మాణాల గురించి మాట్లాడలేదు. గతంలో బిజెపి 10 ఏళ్లపాటు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పింది.

తెదేపాకు ఆత్మగౌరవం ఉందని, అందుకే కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నానని చంద్రబాబు అసెంబ్లీలో తన రెండున్నర గంటల ప్రసంగంలో చెప్పారు. సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం నడుచుకుంటుందని తెదేపా అంటోంది. విభజన సమయంలో మోడీ పురుడు పోసి, తల్లిని చంపేశారని వ్యాఖ్యానించాడు. బిజెపి అధికారంలో ఉంటే తల్లి, బిడ్డను బ్రతికించుకునే వారమన్నారు. కాంగ్రెస్ 5 ఏళ్లు ప్రత్యేక హోదా ఇస్తానంది. మోడీ తిరుపతి ఎన్నికల సభలో 10 ఏళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తానన్నాడు. ఢిల్లీని తలదన్నే విధంగా అమరావతిని నిర్మిస్తానన్నాడు. అలాగే బిజెపి తన మేనిఫెస్టోలోను పరిశ్రమలను ప్రోత్సహించేందుకు పన్ను రాయితీలు, బుందేల్‌ఖండ్ తరహాలో రాయలసీమ, ఉత్తరాంధ్రలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇస్తామని రాసుకున్నారు. పోలవరం ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తే, అనుకున్న సమయానికి పూర్తవుతుందని తెదేపా భావించింది. అలాగే కాంట్రాక్టు పైరవీలు చేసుకోవచ్చని అనుకుంది. ఇదే అంశాన్ని నీతిఆయోగ్ ద్వారా చెప్పించారు. తెదేపా నాయకుడు రాయపాటి సాంబశివరావు కంపెనీకి పోలవరం ప్రాజెక్టు ఇచ్చారు.

పవన్ కళ్యాణ్ జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని (జెఎఫ్ఎఫ్‌సి) వేసి, కేంద్రం రాష్ట్రానికి ఎంత నిధులు ఇచ్చిందో తెలుపమన్నాడు. ఈ కమిటీ కేంద్రం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేవలం రు.14వేల కోట్ల రూపాయలు మాత్రమే ఇచ్చిందని పేర్కొన్నారు. అయితే ఈ సమాచారాన్ని కేంద్రాన్ని సంప్రదించకుండా చేశారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గణాంకాల మీదే ఆధారపడ్డారు. 2014-15 లోని రెవెన్యూ లోటు రు. 16,078 కోట్లు కాకుండా కేంద్రం ప్రకటించిన పథకాలకు, విదేశీ రుణాలతో చేపట్టిన పథకాలకు, పన్నుల రాయితీలకు సంబంధించి రు.16,447 కోట్లు కేంద్రం నుంచి రావాలన్నారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధుల క్రింద రు.24,350 కోట్లు కేంద్రం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. నిజానికి కేంద్రం 1750 కోట్లు మాత్రమే ఇస్తానంది. విశాఖ-చెన్నై కారిడార్‌కు రు.6,020 కోట్లు, పెట్రో కారిడార్‌కు రు.5000 కోట్లు, జాతీయ సంస్థలకు రు.1500 కోట్లు కేంద్రం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. జెఎఫ్ఎఫ్‌సి నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వం రెవెన్యూలోటు క్రింద రు.4118 కోట్లు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కింద రు.2,110 కోట్లు, జాతీయ సంస్థల అభివృద్ధి కోసం రు.853 కోట్లు, రాజధాని నిర్మాణం కోసం రు.1,050 కోట్లు, పోలవరం కోసం రు.4,932 కోట్లు మాత్రమే ఇచ్చింది. షెడ్యూలు జాబితాలోని పది ప్రధాన సంస్థలు హైదరాబాద్ లోనే ఉన్నాయి. వాటిని ఆంధ్రప్రదేశ్ లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రాజధానికి అన్ని ప్రాంతాల నుండి రోడ్ కనెక్టివిటీ కోసం కూడా కేంద్రం నిధులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. చాలా వరకు అంశాలు డిపీఆర్ దశలోనే ఉన్నాయి. ఏపీ పునర్ విభజన చట్టం ప్రకారం కేంద్రం రు.74,542 కోట్లు ఇవ్వాల్సి ఉందని కమిటీ అభిప్రాయపడింది.

కేంద్రం, రాష్ట్రం, వైఎస్ఆర్‌సిపి, జనసేన జెఎఫ్ఎఫ్‌సి నివేదికల ప్రకారం తీవ్ర గణాంకాల గందరగోళం ఉంది. ఎవ్వరూ కేంద్రం ఇప్పటివరకు ఎన్ని నిధులు ఇచ్చిందో, రాష్ట్రం ఎంత ఖర్చు పెడుతుందో, ప్రత్యేక హోదా వల్ల ఏమీ ఒరుగుతుందో, ప్రత్యేక ప్యాకేజీ వల్ల ఏమీ ఆదాయం వస్తుందో చెప్పడం లేదు. లెక్కల గందరగోళాన్ని ప్రజల ముందుంచారు. ఇప్పుడు రాష్ట్రంలోని అన్ని పార్టీలు ప్రత్యేక హోదా వస్తే రాష్ట్ర భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. బిజెపి కేంద్రం 12,500 వేల కోట్లు ఇచ్చిందని చెపుతోంది. జనసేన రు.14వేల కోట్లు ఇచ్చిందని చెపుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఎన్ని నిధులిచ్చిందో చెప్పాల్సిన పనిలేదు అంటోంది. వాటికి ఖర్చు వివరాలు చెప్పాల్సిన పనిలేదని అంటోంది. ప్రజలకు దేనికోసం, ఎంత నిధుల కోసం ప్రత్యేక హోదా ఉద్యమం చెయ్యాలో తెలీడం లేదు. అందుకే ఉద్యమం నీరుగారిపోయింది. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజకీయ పార్టీలు వ్యూహాలను అమలుపరుస్తున్నాయి.

ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలకు పన్ను రాయితీలు ఉండవని కేంద్రం చెపుతోంది. జీఎస్టీ విధించిన తర్వాత నుండి పన్ను మినహాయింపులు ఏ రాష్ట్రానికి ఉండవని కేంద్రం చెప్పింది. ప్రత్యేక హోదా ఇప్పటికే ఇచ్చిన రాష్ట్రాలు సైతం ఇతర రాష్ట్రాలతో సమానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర పన్నులు చెల్లించాలి. దీన్ని బట్టి ప్రత్యేక హోదాకు కాలం చెల్లిందని, పన్ను రాయితీల మధ్య రాష్ట్రాలకు తేడా ఉండదని కేంద్రం స్పష్టంగా పేర్కొంది. 16.8.2016న ప్రధాని మోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) సమావేశం జరిగింది. జీఎస్టీలో భాగంగా అర్హత ఉన్న రాష్ట్రాలకు బడ్జెట్‌లో మద్దతు ఇవ్వాలని ఒక పథకాన్ని రూపొందించారు. ఇది పదేళ్లపాటు మార్చి 31, 2027 వరకు కొనసాగుతుంది. దానికోసం రు.27,413 కోట్లు సహాయం చేయాలని తీర్మానం చేశారు. కేంద్ర పరిశ్రమల ప్రోత్సాహక, విధానాల శాఖ (డీఐపీపీ) అక్టోబర్ 5, 2017న నోటిఫికేషన్ జారీ చేసింది. జీఎస్టీ మండలితో సంబంధంలేకుండా 10 రాష్ట్రాలకు జీఎస్టీ మినహాయింపు కల్పించాలని ఏకపక్షంగా కేంద్రం నిర్ణయించింది. పన్ను రాయితీ అనే పదం బదులు బడ్జెటరీ మద్దతు అనే పదాన్ని వాడారు. ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలు సీజీఎస్టీ, ఐజీఎస్టీలలో కేవలం ఎస్‌జీఎస్టీ చెల్లిస్తే సరిపోతుంది. దీన్నిబట్టి ఆ రాష్ట్రాల్లోని పరిశ్రమలు జీఎస్టీ క్రింద చెల్లించే ప్రతి 100 రూపాయల్లో 58 రూపాయలు తిరిగివస్తాయి. ఆ రాష్ట్రాల్లో పరిశ్రమలకు లబ్ది చేకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం కేంద్రం ఇవ్వన్నీ అబద్ధం అని చెపుతోంది.

ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టం అమలుపై బిజెపికి చిత్తశుద్ధి లేదు. రాష్ట్ర అసెంబ్లీలో 35 అంశాలతో తెదేపా చర్చకు తెరలేపింది. ఇందులో 19 అంశాలు కేంద్రం చేయాల్సిందేనని ప్రభుత్వం పట్టుపడుతోంది. కేంద్రం మేం చెయ్యమని చెప్పకుండా, నిధుల ఖర్చు వివరాలు తెలపమని చెపుతోంది. పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో అవగాహన చేసుకున్న ఒప్పందాలు-పెట్టుబడులు, కరువు మండలాలకు నిధుల కేటాయింపు, ఎపిలోని నదుల అనుసంధానం, పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం, పట్టణ, గ్రామీణ ఇళ్ల నిర్మాణం, ఆకర్ష నగరాల ప్రాజెక్టు, అమృత్ పురోగతి లాంటి అంశాలను అసెంబ్లీలో చర్చకు పెట్టింది. దీనికి కేంద్రం నిధులు

ఇవ్వాలని తెదేపా అంటోంది. ఎపి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని షెడ్యూలు 10,11,12,13లలో పొందుపరిచిన వాటిని కేంద్రం అమలు చేయడం లేదని సుప్రీంకోర్టులో కేసు వేయడం జరిగింది. ఇప్పటికే విభజన చట్టం అమలు విషయంలో 20కి పైగా కేసులు హైకోర్టు, సుప్రీంకోర్టులలో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వాలు చేయాల్సిన పనిని, న్యాయస్థానం చేయమనే చెపుతుందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది.

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి అంతా పర్యావరణ కాలుష్యాన్ని పెంచేది. పెద్ద ఎత్తున స్థానిక ప్రజలను నిర్వాసితులను చేసేది. రాజధాని ఒకే చోట నిర్మాణం, పోవలవరం ప్రాజెక్టు, భావనపాండు పోర్టు, దక్షిణ కొరియా కియా మోటార్స్ స్థాపన, బీఈఎల్, జాతీయ విమానాశ్రయాలు, కోస్టల్ కారిడార్లు, మెట్రోరైలు ప్రాజెక్టులు లాంటివి పునరావాస సమస్యను పెంచేవి. పునరావస పరిష్కారాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఈ విధ్వంసకర అభివృద్ధి కోసమే రాజకీయపార్టీలు ప్రత్యేక హెూదాను, ప్యాకేజీలను అడుగుతున్నారు. దానివల్ల 5 కోట్లమంది రాష్ట్ర ప్రజలకు ఏదో ఒరుగుతుందని చెపుతున్నారు.

ప్రత్యేక హోదా డిమాండ్ కేవలం కేంద్రం ఇస్తానన్న హామీలు ఇవ్వకపోవడం వల్లే వచ్చింది. పారిశ్రామిక ప్రోత్సహకాలు, చట్టబద్ధంగా రావాల్సిన ప్రయోజనాలను కేంద్రం ఇవ్వలేదు. ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్నారు. అదీ ఇవ్వలేదు. కేవలం రు.125 కోట్లు మాత్రమే అదనంగా ఇచ్చారు. ఈ డబ్బును రాష్ట్ర ప్రభుత్వం పోలవరానికి, రాజధానికి, పరిశ్రమలకు ప్రోత్సాహకాలుగా ఇచ్చింది. అది ప్రజలకు ఉపయోగపడలేదు. కనీసం రాష్ట్ర ప్రభుత్వం భౌతికపరమైన అభివృద్ధిని ప్రజలకు చూపలేకపోయింది.

రాష్ట్రం 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ రు.2.16 లక్షల కోట్ల అప్పులు చేసింది. ఏటా 11 శాతం రుణభారం పెరుగుతూ పోతోంది. జిఎస్‌డిపిలో రాష్ట్ర ప్రభుత్వ రుణ నిష్పత్తి 24 శాతంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయరంగ వాటా 31.77 శాతం ఉంది. ఇది తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల కన్నా ఎక్కువ. అయినా ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఎక్కువ బడ్జెట్ కేటాయించడం లేదు. రేపు ప్రత్యేక హోదా వచ్చిన ఈ రంగానికి ఒరిగేదేమి లేదు. దీనిపై ఆధారపడ్డ 2.50 కోట్ల జనాభాకు ఏమి ఒరగదు.

ప్రత్యేక హోదా అనే పదాన్ని ఒక అర్థంగాని విషయంగా మార్చేశారు. దాని గురించి విపులంగా, వివరంగా ప్రజలకు చెప్పడం మానేశారు. కాంగ్రెస్, బిజెపి 5, 10 సంవత్సరాలు ప్రత్యేక హోదా ఆంధ్రప్రదేశ్‌కు కల్పిస్తామని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా కల్పిస్తారా లేదా అనే విషయంపైనే రాష్ట్ర రాజకీయాలంతా తిరుగుతున్నాయి. ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రం స్వర్ణమయం అవుతుందని, అందరికీ ఉపాధి దొరుకుతుందని, పొలాలు పచ్చగా ఉంటాయనే భ్రమల్లో ప్రజలనుంచుతున్నారు. రాష్ట్రంలోని అన్ని సమస్యలకు ప్రత్యేక హోదా ఏకైక పరిష్కారమని ప్రజలని మభ్యపెడుతున్నారు.

ప్రత్యేక హోదా రావడం వల్ల ఏపీకి కొంత ఉపశమనం జరుగుతుందనే విషయం నిజమే కాని, రాష్ట్రం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ఇది పరిష్కరించదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే తమ వాగ్దానాల నుండి వైదొలగాయి. అవినీతి, ఆశ్రిత పక్షపాతంతో జనకంతక పాలనను అందిస్తున్నాయి. ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించడంలో వైఫల్యం చెందాయి.

ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రానికి కలిగే ప్రయోజనాలను ప్రజలకు చెప్పడంలో పాలకవర్గాలు, ప్రతిపక్షాలు విఫలమవుతున్నాయి. రాష్ట్రంలో 8కి పైగా జిల్లాలు వెనుకుబాటుకు గురై ఉన్నాయి. అక్షరాస్యత 67 శాతం మాత్రమే నమోదై ఉంది. మహిళల్లో అక్షరాస్యత 60 శాతానికి మించిలేదు. ప్రతి వెయ్యిమందికి పిల్లల మరణాలు రేటు 39గా ఉంది. వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉంది.

సీమ, ఉత్తరాంధ్ర జిల్లాలలో వర్షాధార పంటలనే పండిస్తున్నారు. కృష్ణా డెల్టా ప్రాంతంలోనే రైతులు రెండు సార్లు పంటలను పండించలేక పోతున్నారు. పారిశ్రామిక ప్రగతికి పన్ను రాయితీలు కల్పించే అధికారం కేంద్రానికే ఉంటుంది. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి, వెనుకబడిన ప్రాంతాల, ప్రజల అభివృద్ధికి ప్రత్యేక కమీటీలను వేసి శాస్త్రీయమైన పద్ధతిలో పరిష్కారాలను కనుగొనాల్సి ఉంది.

ప్రత్యేక హోదా ఇచ్చినంత మాత్రాన రాష్ట్రంలోని అన్ని ఖర్చుల్లో 90 శాతం కేంద్రం భరిస్తుందని అనుకోవడం వట్టి భ్రమ మాత్రమే. సాధారణంగా రాష్ట్రాలకు కేంద్రం 30 శాతం నిధులనిస్తుంది. ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్రాలకు 30 శాతంతో పాటు మరో 60 శాతం అదనంగా నిధులనిస్తుంది. సంవత్సర కేంద్ర రెవెన్యూను బట్టి ఈ నిధుల విడుదల ఉంటుంది. ప్రత్యేక హోదా కలిగిన రాష్ట్ర ప్రణాళిక, ప్రణాళికేతర ఖర్చులు, సంక్షేమ పథకాలు మిగిలిన అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకునే ఈ నిధుల కేటాయింపు ఉంటుంది.

ప్రత్యేక హోదాతో సంబంధం లేకుండా ఆదాయపన్ను, ఎక్సైజ్ పన్నులను వందశాతం కేంద్ర ప్రభుత్వం ఏ రాష్ట్రానికైనా మినహాయింపునివ్వచ్చు. కేంద్రం ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసింది. నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేసింది. ప్రత్యేక హోదా రాష్ట్రాలకు నిధులు ఇక కేటాయించడం ఉండదని కేంద్రం చెపుతోంది. 14వ ఆర్థికసంఘం కేంద్రం నిధులను రాష్ట్రాలకు పంచుతుంది. ఇందులో 42శాతాన్ని రాష్ట్రాలకు పంచుతుంది.

70వేల ఎకరాలను రాజధాని కోసం తీసుకోవడం, రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల ఎకరాల భూములను చంద్రబాబు సేకరించాడు. ఈ భూముల విలువ 100 లక్షల కోట్లకు పైగా ఉంటుంది. వీటన్నిటిని విదేశీ, స్వదేశీ పెట్టుబడిదారులకు పారిశ్రామిక ప్రోత్సాహం పేరిట కేవలం 100 కోట్లకే ఇస్తున్నాడు.

ఈ లెక్కన రాష్ట్రానికి 90 శాతం కేంద్రం గ్రాంటుగా ఇస్తే ఆంధ్రప్రదేశ్‌కి వచ్చేది రు.25,000 కోట్లు మాత్రమే. ఇందులో రు.13,000 కోట్లు కేంద్రం ఇప్పటికే ఇచ్చింది. ప్రజల భావోద్వేగాలను రెచ్చగొడుతూ వారిని ఆత్మహత్యలవైపు నెడుతున్నాయి. అందుకే చంద్రబాబు ప్రభుత్వం విదేశీ బ్యాంకుల వైపే ఎక్కువుగా మొగ్గు చూపుతోంది. కేంద్రం ఇచ్చే నిధుల కన్నా, ఈ బ్యాంకుల నుండే ఎక్కువుగా నిధుల వచ్చే అవకాశముంది.

విదేశీ ప్రాజెక్టులకు సైతం కేంద్రమే ఆమోదం తెలపాలి. నీతి అయోగ్ కింద షార్ట్‌టర్మ్ ప్రాజెక్టులకు కేంద్రం నుండి నిధులొచ్చే అవకాశం ఉంది. ఏపీ రాజధాని అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఏ)కు ముఖ్యంగా పన్నురాయితీని కేంద్రం ఇవ్వాలి. హిమాచల్‌ప్రదేశ్, బుందేల్‌ఖండ్‌లకు ఈ తరహా రాయితీ ఇచ్చారనే విషయాన్ని ఆర్థికనిపుణులు పేర్కొంటున్నారు. ప్రత్యేక హోదాతో నిమిత్తం లేకుండా పారిశ్రామిక రాయితీలివ్వాలనే వాదన రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. ఈ ప్రత్యేక హోదా కేవలం ఏపీకి ఐదేళ్ల వరకే ఉంటుంది.

గతంలో బిజెపి పదేళ్ల పాటు ప్రత్యేక హోదా కావాలనడిగి, ఇప్పుడు ప్రత్యేక హోదానే ఇవ్వనంటోంది. ప్రత్యేక హోదా జాప్యానికే రాష్ట్ర ప్రజలు భరించలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ప్రత్యేక హోదా ఇస్తుందనే బిజెపికి మద్దతుగా రాష్ట్ర ప్రజలు ఓటు వేశారనే విషయాన్ని వారు విస్మరిస్తున్నారు. ప్రత్యేక హోదాకు 14వ ఆర్థికసంఘం అభ్యంతరాలు తెల్పిందని ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రత్యేక హోదా ఎవ్వరికీ ఇవ్వడం

చెదిరిన కుటుంబాల చెలిమి సిసిసి

పాలకుల నిర్లక్ష్యంతో, పండిన పంటకు గిట్టుబాటు ధర రాక అప్పులతో రైతాంగం ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనీ, ఈ సమస్యకు పరిష్కారం నష్టపరిహారం కాదనీ, మౌలిక పరిష్కారం వెతకాలనీ అంటున్నారు **డా. మచ్చ శ్రద్ధానందం**

ప్రణాళికబద్ధ భారతదేశ చరిత్రలో 2 దశాబ్దాల (1995–2015)ను విషాద ఘట్టంగానే భావించాలి. సమున్నత ఆశయంలో భాగంగా సాధించుకున్న స్వాతంత్ర్యం మనది. ముఖ్యంగా వ్యసాయ రంగాన్ని అందలం ఎక్కించాలనే తపన మొదటి ప్రణాళిక చెప్పకనే చెబుతున్నది. రెండవ ప్రణాళిక కాలంలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టులు నేటికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

1980లో సరళీకృత విధానాలు, 1990లో నూతన ఆర్థిక విధానాలు, 1995లో డబ్ల్యు.టి.ఓ. ఏర్పాటు వంటివి వ్యవసాయ రంగ తిరోగమనానికి బీజాలు పడేలా చేశాయి. ముఖ్యంగా భూమిని నమ్ముకున్న రైతుల జీవితాలు తలకిందులయ్యేట్లు చేసినవి అమలైన పాలక వర్గ పక్షపాత వ్యవసాయ విధానాలు.

ఇరవయ్యేండ్లలో భారతదేశ ఆర్థిక వ్యవస్థకు జీవనాడిగా ఉన్న వ్యవసాయం, దాన్ని నమ్ముకున్న రైతాంగం తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనయ్యారు. ఈ కాలంలో 3 లక్షలకు పైగా రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారని ప్రభుత్వ సంస్థ అయిన ఎన్‌సిఆర్‌బి (నేషనల్ క్రైం రికార్డు భ్యూరో) నే చెబుతోంది. యావత్తు మానవ జాతికి అన్నం పెడుతూ, అహర్నిశలు కృషి చేస్తున్న రైతుల జీవితాల్లో వెలుగులు నింపాల్సింది పోయి చీకట్లు పడేట్లు చేసినవి ఇప్పటి వరకు అమలైన వ్యవసాయ విధానాలు.

రైతుల బలవన్మరణం అనంతరం అనేక కుటుంబాలు చెల్లాచెదురవుతున్నాయి. మరణించిన వారిలో 20 శాతం మాత్రమే అసలైనవి అని ప్రభుత్వాలు లెక్కలు తేల్చి పరిహారాన్ని అందిస్తున్నది. కాని మిగతా 80 శాతం కుటుంబాలు పరిహారం అందుకోలేక అనేక అవస్థలు పడుతున్నాయి. రైతు ఆత్మహత్య కింద, పరిహారం కింద 13 పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. వీటిలో సంబంధం లేనివి కూడా అనేకం ఉన్నాయి. పరిహారాన్ని పొందడానికి వివిధ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ఆ అమాయక, నిరక్షరాస్యుల వెతలు అంతా ఇంతాకావు.

మరణానంతరం కుటుంబ భారం అంతా స్త్రీలపైననే పడుతోంది. అదే విధంగా సాగుభారం కూడా. పిల్లలు చదువుకు దూరం అవుతున్నారు. కొన్ని చోట్ల బాల కార్మికులుగా మారుతున్నారు. విద్య, వైద్య, పోషణ తదితర ఖర్చులను భరించలేని పరిస్థితులలో ఈ కుటుంబాలున్నాయి. కుటుంబ పెద్దదిక్కు పోయి, సమాజంలో గౌరవం పోయి ఆ కుటుంబాలు బిక్కుబిక్కుమని ఎదురుచూస్తున్నాయి.

బాధిత కుటుంబాలను బాధ్యతగా ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఇటువంటి విపత్కర పరిస్థితులలో ప్రభుత్వేతర సంస్థల (ఎన్‌జిఓస్) పాత్రను గుర్తు చేసుకోవాల్సి ఉన్నది. ఆ క్రమంలో సిసిసి (కేరింగ్ సిటిజన్స్ కలెక్టివ్) అనే స్వచ్ఛంద సంస్థ 2008లో సామాజికోద్యమ కారిణి రమామెల్కొటే, ప్రముఖ రచయిత్రి కె. సజయల నేతృత్వంలో పురుడుపోసుకుంది.

రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలను సామాజికంగా, ఆర్థికంగా, నైతికంగా ఆదుకోవాలనే దృఢ సంకల్పంలో భాగంగా ఇది ఏర్పాటయింది. గత పదిసంవత్సరాలుగా బాధిత కుటుంబాలకు వెన్నుదన్నుగా ఉండి మానవీయ బాధ్యతను తన పరిధిలో మోస్తూ వస్తున్నది. వాటిలో కొన్ని.

1. రైతు ఆత్మహత్య అనంతరం ఆ కుటుంబాలను సందర్శించి పరామర్శించి పరిహారం కోసం వారి తరపున సంబంధిత పదమూడు పత్రాలను సేకరించి దరఖాస్తు చేయడం.

2. ఆ కుటుంబాల్లోని పిల్లలు ఎవరైనా చదువు మానేసిన వారుంటే తిరిగి వారిని బడుల్లో, కాలేజీల్లో చేర్పించి వారి చదువును కొనసాగించి వారు స్థిరపడేటట్లు చేయడం. దానికి సంబంధించిన ఖర్చులను కూడా భరించడం.

3. ముఖ్యంగా కుటుంబ భారమంతా స్త్రీలపై పడడంతో వారు భరించలేని అయోమయ స్థితిలో ఉంటున్నారు. కాబట్టి అటువంటి వారికి మనో ధైర్యాన్ని కల్పించి బతుకు తీరును, బతుకు దెరువును చూపించడం. సమాజంలో నిలబడేట్లు చేయడం.

కుదరదని కేంద్రనాయకత్వం సెలవిస్తోంది.

కొండ ప్రాంతాలు, రాతి ప్రదేశాలు, ఆర్థికంగా, సరైన వసతుల లేని రాష్ట్రాలకు, జనాభా తక్కువుగా ఉండటం, దేశ సరిహద్దుల వెంబడి ఉంటే రాష్ట్రాలకే ప్రత్యేక హోదా ఇప్పటివరకు అమలవుతోందని కేంద్రం మరోవైపు వాదిస్తోంది. ప్రత్యేక హోదా ప్రజల్లో బలమైన సెంటిమెంటును సృష్టించింది. దానికి తోడు సెలబ్రటీలు, రాజకీయ పార్టీలు ప్రత్యేక హోదా అనే తావీదు వల్లే రాష్ట్రం సమస్యల నుండి దూరమవుతుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల నమ్మకాలను వమ్ము చేస్తూ, విశ్వసనీయతను కోల్పోతున్నాయి. ప్రతిపక్షాలు కేవలం పేక్షక పాత్రకే పరిమితమయ్యాయి. సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొన్న ఉద్యోగులు, వివిధ సామాజిక బృందాలు తమకేం పట్టనట్టు మసలుకుంటున్నాయి. హోదాలు, ప్యాకేజీలు సామాన్యుడి బతుకును ఏ మాత్రం మెరుగుపర్చలేవు. కేంద్రం ఇచ్చే నిధులను మొదటగా విద్య, వైద్య, ఉపాధి రంగాలను అభివృద్ధి చేసే విధంగా ఖర్చు చేయాలి.

సమాజపు అంచులకు నెట్టివేయబడ్డ 70 శాతం ప్రజలకు మౌలిక సౌకర్యాలను కల్పించకుండా రాజధాని అభివృద్ధి పేరిట లక్షల కోట్ల రూపాయలను వృధా చేయడం సరికాదు. కార్యనిర్వాహక భవనాలకు 500 కోట్లు మించి కావు. అభివృద్ధి వికేంద్రీకరణ జరపకుండా, మెజారిటీ ప్రజానీకం జీవన ప్రమాణాలు మెరుగుపడకుండా ఏర్పడే రాజధాని వల్ల ధనికవర్గానికి, అధికారపార్టీకి తప్ప ఎవ్వరికీ ప్రయోజనం లేదు.

(రచయిత పౌరహక్కుల సంఘం కార్యకర్త) వీ

4. సేంద్రియ వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహించే క్రమంలో ఆ కుటుంబాలను భాగస్వాములుగా చేసి ఫలితాలను నిరపేక్షంగా చూపించి ఆదర్శంగా నిలబడేట్లు చేయడం.

5. వ్యవసాయ సంక్షోభాన్ని, రైతుల ఆత్మహత్యలు – కారణాలు – పర్యవసానాలు మొదలగు వాటి పట్ల వ్యాసాలు రాస్తూ, నిరంతరం ప్రజల్ని, పాలకులను, అధికారులను ఆలోచింపచేసేటట్లు చేయడం.

6. 'రైతు ఆత్మహ్యతలు – మనం!?' అనే పుస్తకాన్ని రచయిత్రి కె. సజయ గారు రాశారు. ఇది వ్యాసాల పంపుటి. ఈ పుస్తకం ఎంతో మందిని ఆలోచింపచేస్తుంది.

అద్భుత ఆవిష్కరణ

అది ఫిబ్రవరి 25 2018న సిసిసి ఏర్పడి దశాబ్ద కాలం పూర్తయిన సందర్భంగా రైతు ఆత్మహత్య కుటుంబాలతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించింది. ఎంతో మంది మేధావులను, బాధిత కుటుంబాలను, మానవతా వాదులను ఒక చోట చేర్చిన సందర్భం అది. అన్నదాతల అకాల మరణాల ఆర్ద్రత – తీవ్రతలను తలపించిన నేపథ్యమది. రెండు దశాబ్దాల ఘోరవిషాద ఘటనను మరోమారు మననం చేసుకున్న వేదికది. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుండి 130 వరకు బాధిత కుటుంబాలు, 25 వివిధ సంఘాలు (స్వచ్ఛంద సంస్థలు) భాగస్వామ్యం వహించాయి. చాలా మంది ప్రముఖులు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఝాన్సీ గారు సమన్వయ పరిచారు.

సిసిసి అధ్యక్షులు ప్రొ. రమామెల్కొటే మాట్లాడుతూ వ్యవసాయ సంక్షోభాన్ని నివారించడంలో ప్రజలు, పౌర సమాజం కంటే ప్రభుత్వాల బాధ్యత అత్యంత ఎక్కువగా ఉన్నదని, వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకున్నప్పుడే రైతాంగం బాగుపడుతుందని, ముఖ్యంగా మహిళా రైతులు న్యాయం కోసం సంఘటితంగా ఉండాలని అభిప్రాయపడినారు.

రామన్ మెగసెసే అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్ మాట్లాడుతూ రైతు ఆత్మహత్యలకు ప్రభుత్వం, సమాజం కారణాలుగా నిలుస్తున్నాయని, సమాజానికి అన్నం అందిస్తున్న వాళ్లు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత అవమానకరం అని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు చనిపోతే ఆరు లక్షలే ఇవ్వడం హాస్యాస్పదం అని అన్నారు. ప్రజాస్వామ్యంలో ఏ పౌరుడూ చనిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదన్నారు.

తెలంగాణ విద్యావంతుల వేదిక కార్యదర్శి గురిజాల రవీందర్ మాట్లాడుతూ కార్లు, బైకులు, ఫోన్ల కొరకు బ్యాంకులు పిలిచి మరీ రుణాలనిస్తున్నాయి. నీరవ్ మోదీ రు. 14,000 కోట్లు బ్యాంకును కొల్లగొట్టి దేశం విడిచి పారిపోతే పట్టించుకునే వారేలేరన్నారు. రైతుకు రుణాల విషయానికొచ్చేసరికి ఎన్నో అడ్డంకులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

ఢిల్లీ రచయిత్రి పాషా సింగ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా దక్షిణాది రాష్ట్రాలలోనే రైతు ఆత్మహత్యలు అత్యధికంగా జరుగుతున్నాయని, ఫలితంగా లక్షలాది కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ముఖ్యంగా మహిళలు – పిల్లలు పీడితులుగా మారుతున్నారని అభిప్రాయ పడినారు. యువ రైతుల మరణం తీరని లోటని, బాధిత కుటుంబాలకు భరోసా ఇవ్వాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉన్నదన్నారు.

కె.ఆర్. వేణుగోపాల్ రిటైర్డ్ ఐఎఎస్ మాట్లాడుతూ తాను 1998 నుండి రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాల తరపున పనిచేస్తున్నానని, పౌర సమాజం నుండి వచ్చిన తీవ్ర ఒత్తిడి, నాడు మానవ హక్కుల కమిషన్‌కు తాను పంపిన ప్రతిపాదనల వల్ల అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం జయతి ఘోష్ కమిటీని వేసిందని, ఆ కమిటీ సిఫారసుల మేరకు జి.ఓ. నంబర్ 42 కింద రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాలకు పరిహారాన్ని ప్రభుత్వాలు అందిస్తున్నాయని గుర్తుచేశారు. కాని ఈ పరిహారాన్ని ఇవ్వడంలో ప్రభుత్వాలు అనేక రకాల నిబంధనలు పెడుతున్నాయని, దీనితో బాధిత కుటుంబాలు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురౌతున్నారు. వనరుల కేటాయింపులో జరుగుతున్న జాప్యాన్ని విమర్శించారు.

ఇక చివరగా సీనియర్ పాత్రికేయులు పొత్తూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతు ఆత్మహత్య బాధిత కుటుంబాల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుందన్నారు. ముఖ్యంగా తెలంగాణ ఏర్పాటు అనంతరం పెరుగుతూ ఉండడం విచారకరమని అన్నారు. విధానాల వైఫల్యాలను పరిగణలోకి తీసుకొని ప్రణాళికలు రూపొందించాల్సి ఉందని సూచించారు.

రైతు స్వరాజ్య వేదిక తరపున క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కొండల్ గారు మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత 3,400 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారని, అందులో 800 మందికి మాత్రమే పరిహారం అందిందని, రెండు తెలుగు రాష్ట్రాలలో కౌలు రైతుల సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. తెలంగాణలో 70 శాతం, ఆంధ్రలో 90 శాతం వరకు కౌలు రైతులు ఉన్నారన్నారు. బాధిత కుటుంబాలకు అంత్యోదయ కార్డులు, పెన్షన్లు పూర్తిగా అందడం లేదని విచారం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోనైతే బాధిత కుటుంబాలకు జరిగే న్యాయం విషయంలో కులం అడ్డుగోడగా నిలుస్తుందన్నారు. సభలో రెండు రాష్ట్రాల నుండి బాధిత కుటుంబాల్లోంచి కొంతమంది తమ దీనగాథలను వెలిబుచ్చారు. అదే విధంగా సిసిసి ఇచ్చిన చేయూత మూలంగా కొందరు ఏ విధంగా సమాజంలో నిలదొక్కుకుంటూ ధైర్యంగా బతుకుతున్న విషయాన్ని ప్రకటించారు.

సిద్దిపేట జిల్లా నుండి సుజాత, మహబూబ్‌నగర్ జిల్లా నుండి వెంకటమ్మ, అనంతపూర్ జిల్లా నుండి క్రిష్ణమ్మ, పశ్చిమగోదావరి జిల్లా నుండి హేమలత, శ్రీకాకుళం జిల్లా నుండి వెంకటలక్ష్మి మొదలైన వారు తమ స్పందనను ఎంతో ఆవేదనతో తెలియజేశారు.

రైతు స్వరాజ్య వేదిక తరపున కిరణ్ విస్సా, ఆశాలత, నేలమ్మ రైతు సంఘం, ఐ ఫర్ ఫార్మర్స్ తరపున శ్రీనివాస్, రెడ్స్, రెయిన్‌బో హోం వంటి సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావి వర్గం దీనిలో పాల్గొన్నాయి.

ఈ కార్యక్రమానికి హాజరైన 130 కుటుంబాలకు తలా పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో సిసిసి తరపున పంపిణీ చేశారు. బాధిత కుటుంబాల తరపున నిలబడి, వారి కుటుంబాల్లో వెలుగు నింపే ప్రయత్నంలో భాగంగా చేసిన ఆర్థిక సహాయం ఎన్నో హృదయాలను ఆకర్షించింది. ఎన్నో మెదళ్లను ఆలోచింప చేసింది.

ఒకవైపు ప్రపంచ వ్యాప్తంగా మానవీయ సంక్షోభం జరుగుతోంది. సిరియా లాంటి దేశం మానవత్వం ఇంచుకైనా కనిపించని పరిస్థితులు, అణు బాంబులు విసురుకొని అహంకారాన్ని చల్లార్చుకునే ఘోర మానవ సంక్షోభం, మనిషిని మనిషిగా చూడకుండా కాస్తంత సహాయాన్ని అందించని అత్యంత మానవ సంక్షోభం కనబడుతున్న నేపథ్యంలో సిసిసి చేపట్టిన కార్యక్రమం ఒక దశ–దిశను చూపించిందనే చెప్పవచ్చు. చెదిరిన కుటుంబాలను చేరదీసిన సిసిసిని శ్లాఘించవల్సి ఉన్నది. అసంఘటిత రైతు కుటుంబాల నుంచి బలమైన గళం వినిపించాలని, దీనికి మేధావి వర్గం మరింత ఆసరాగా ఉండాలని సమావేశం భావించింది.

ఇక నుంచైనా ప్రభుత్వాలు మరింతగా ఆలోచించి, బాధిత కుటుంబాల తరపున నిలబడాల్సిన అవసరం ఉంది. పరిహారం పెంపు ఏమాత్రం పరిష్కారం కాదు. అసలు రైతు ఆత్మహత్యలు అనేవే జరగకుండా చూడాల్సిన బాధ్యత వర్తమాన ప్రభుత్వాలపై ఉన్నది.

(రచయిత అర్థశాస్త్ర అధ్యాపకులు) వీ

జిగ్నేష్ మేవాని - కొత్త దళిత రాజకీయాలు

భారత దళిత రాజకీయాలలో కొత్త తారగా ఆవిర్భవించిన జిగ్నేష్ మేవాని ప్రవేశపెట్టిన కొత్త ధోరణులను వాటి పూర్వరంగంలో చర్చించి ప్రగతిశీల శక్తులు గ్రహించవలసిన అంశాలను సూచిస్తున్నారు **ఎన్. వేణుగోపాల్**

సంఘ్ పరివార్ అధికారం చేపట్టిన నాటి నుంచీ దాని విద్వేష రాజకీయాల అనివార్య ప్రతిఫలనంగా ముస్లింల మీద, దళితుల మీద దాడులు పెరిగాయి. మను ధర్మాన్ని, కుల వివక్షను, అంతరాల వ్యవస్థను మరింత బలోపేతం చేసే ప్రయత్నాలు వేగవంతమయ్యాయి. దేశవ్యాప్తంగా విద్యా సంస్థలలో భిన్నాభిప్రాయాల అణచివేత, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో రోహిత్ వేముల వ్యవస్థాగత హత్య, గోరక్షణ పేరుతో దళితుల మీద, ముస్లింల మీద హంతక దాడులు, ప్రజల ఆహార అలవాట్ల మీద, వినోదాల మీద, పండుగల మీద దాడులు వంటి ఎన్నో ఘటనలు ఈ నాలుగు సంవత్సరాలలో పెద్దఎత్తున నమోదయ్యాయి. ఇలా పెచ్చరిల్లుతున్న దాడుల మధ్యనే దళితుల ప్రతిఘటన కూడ విస్తరించడం మొదలయింది. ఈ ప్రతిఘటనకు ఒక ప్రధాన చిహ్నంగా గుజరాత్ లో యువ న్యాయవాది జిగ్నేష్ మేవాని ముందుకు వచ్చాడు. గత రెండు సంవత్సరాలుగా జిగ్నేష్ మేవాని ఒక ముఖ్యమైన ప్రతీకగా కొత్త దళిత రాజకీయాల గురించి చర్చ జరుగుతున్నది.

ఈ నేపథ్యంలో ఈ కొత్త దళిత రాజకీయాల గురించి, అసలు మొత్తంగా దళిత రాజకీయాల గురించి, సమాజ పరివర్తనలో దళితుల పాత్ర ప్రాధాన్యత గురించి లోతుగా చర్చించవలసి ఉంది. ప్రత్యేకించి సమాజ పరివర్తన గురించి ఆలోచిస్తున్న, పరివర్తన కోసం వివిధ మార్గాలలో ఆలోచనలూ ఆచరణలూ చేస్తున్న విప్లవ, ప్రగతిశీల శక్తులు చర్చించవలసి ఉంది.

ఈ దేశంలో వ్యవస్థ పరివర్తన వంటి దీర్ఘకాలిక మార్పుకు మాత్రమే కాదు, ఏ చిన్న స్థాయి, తాత్కాలిక ప్రగతిశీల మార్పుకైనా దళితుల భాగస్వామ్యం, నాయకత్వం అత్యవసరమైనవి గనుక దళిత రాజకీయాల గురించి, వాటిలో వస్తున్న ధోరణుల గురించి పట్టించుకోవడం విప్లవ, ప్రగతిశీల శక్తులకు అతి కీలకమైన అంశం. ప్రపంచంలో ఇంకెక్కడా లేనటువంటి అస్పృశ్యత, గ్రామానికి బైట వెలి జీవితం, నీచమైనవిగా భావించే వృత్తులకు పరిమితం చేసిన నిర్బంధం అనే దుర్మార్గమైన సామాజిక పీడనతో, కనీసం రెండు వేల సంవత్సరాలుగా వేదనకు గురవుతున్న ఒక విశాల ప్రజా సమూహంగా దళిత సమూహానికి ఈ వ్యవస్థ పరివర్తన అత్యవసరమైన అంశం. ఆ పరివర్తనా కృషిలో ఆ సమూహానికి కీలక భాగస్వామ్యం, నాయకత్వం ఉండాలి. ఆ సామాజిక పీడననుంచి తమను తాము విముక్తి చేసుకుంటూ మొత్తం సమాజాన్నే విముక్తి చేసే విప్లవ శక్తి ఉన్న సమూహం అది.

అయితే అనేక చారిత్రక, సామాజిక, రాజకీయార్థిక కారణాలు ఆ సమూహానికి ఆ పరివర్తనా చైతన్యం కూడ అందకుండా చేశాయి, చేస్తున్నాయి. కార్మిక వర్గానికి కూడ తన సామాజిక చారిత్రక బాధ్యత గురించి సహజమైన విప్లవ చైతన్యం ఏమీ ఉండదని, అది మొదట తనలో తానైన వర్గంగానే ఉంటుందని, క్రమంగా తనకోసం తానైన వర్గంగా మారి విప్లవ కర్తవ్యాలను చేపడుతుందని, చివరికి తనను తాను మాత్రమే కాక తన ప్రత్యర్థి వర్గాన్ని కూడ రద్దు చేసి వర్గ రహిత సమాజాన్ని నిర్మిస్తుందని మార్క్స్ చేసిన విశ్లేషణ భారత దళిత సమూహానికి కూడ వర్తిస్తుంది. తాము అనుభవించిన, అనుభవిస్తున్న పీడన, వేదనల వల్ల అత్యంత విప్లవకరంగా మారి, వ్యవస్థను కూలదోసే బాధ్యత చేపట్టవలసిన భారత దళిత సమూహం కూడ తనలో తానైన కులం స్థాయి నుంచి తనకోసం తానైన కులం స్థాయికి ఎదిగి, అక్కడి నుంచి అసలు మొత్తంగా కుల నిర్మూలన సాధించవలసి ఉంది. ఈ చారిత్రక దృష్టితో చూసినప్పుడు దళిత సమూహాలలో వస్తున్న ప్రతి కదలికా, ప్రతి చైతన్యమూ, ప్రతి ఆచరణా మొత్తంగా భారత సమాజ పరివర్తనా ప్రయాణం మీద తీవ్రమైన ప్రభావాన్ని కలగజేస్తాయని గుర్తించి ఆ పరివర్తన గురించి ఆలోచించేవారందరూ వాటిని పట్టించుకోవలసి ఉంది.

వారి మీద అమలయ్యే దోపిడీ పీడనల రీత్యా మాత్రమే కాక వారి జనసంఖ్య రీత్యా కూడ దళితుల రాజకీయాలు మిగతా సమాజమంతా, ప్రత్యేకించి ప్రగతిశీల శక్తులు లోతుగా పట్టించుకోవలసినవి. భారత సమాజపు నిచ్చెనమెట్ల వ్యవస్థలో అట్టడుగున్న ఉన్న దళితులు పదిహేడు శాతం. వారి ప్రయోజనాలకు ఈ వ్యవస్థ ఉనికి, కొనసాగింపు హానికరం. అలాగే వారి కన్న కూడ కింద, లేదా సమాంతరంగా, అసలు సమాజానికే బైట, అడవుల్లో ఉన్న ఆదివాసులు తొమ్మిది శాతం. ఈ రెండు వర్గాలూ కలిస్తే పావు వంతు జనాభా. ఈ పావు వంతు జనాభా ప్రయోజనాలకు ఈ వ్యవస్థ యథాతథ కొనసాగింపు అభ్యంతరకరంగా, హానికరంగా ఉంది. అందువల్ల వ్యవస్థ పరివర్తన గురించి తీవ్రంగా ఆలోచించే వారెవరైనా ఇప్పటికే సిద్ధంగా ఉన్న ఈ సువిశాల వ్యవస్థా వ్యతిరేక, యథాతథ స్థితి వ్యతిరేక సైన్యం గురించి ఆలోచించక తప్పదు.

నిజానికి ఏ సమాజంలోనైనా అత్యంత దుర్భరమైన దోపిడీ పీడనలు అనుభవిస్తున్న సమూహాలకే ఆ దోపిడీ పీడనలు రద్దయ్యే విప్లవం అవసరం ఎక్కువగా ఉంటుంది. అంటే భారత సమాజంలో విప్లవ అవసరం, వ్యవస్థా పరివర్తన అవసరం అన్ని వర్గాల కన్న ఎక్కువ దళిత, ఆదివాసి సమూహాలదే. (భారత సమాజంలోని కుల అంతరాల నిచ్చెన మెట్ల వ్యవస్థ వల్ల మధ్యంతర కులాలుగా, ఉత్పత్తి కులాలుగా, చేతివృత్తుల కులాలుగా పిలవబడుతున్న యాభై-అరవై శాతంలో అత్యధిక భాగం ఈ రెండు సమూహాలతో కలవవలసిన స్థితిలోనే ఉన్నాయి).

దళిత, ఆదివాసి సమూహాలు రెండూ కూడ తరతరాలుగా సమాజానికి బైట ఉంటున్నందువల్ల వారిలో సమరశీలత, తెగింపు, ఆంక్షలను లెక్కచేయని సాహసం కూడ ఎక్కువే. అందువల్ల వీరు 'తమలో తాము' గా ఉన్న స్థితి నుంచి 'తమ కోసం తాము' గా మారినా, మొత్తంగా అంతరాలనే రద్దు చేసే దిశగా మారినా సమాజం తలకిందులైపోతుంది. యథాస్థితి దెబ్బతింటుంది.

దళిత, ఆదివాసి సమూహాలలోని ఈ మహత్తర శక్తిని ప్రగతిశీల శక్తుల కన్న ముందే పాలకవర్గ శక్తులు గుర్తించాయి. అందువల్లనే ఆ సమూహాలను వ్యవస్థను కూలదోసే పోరాటాల వైపు, విప్లవం వైపు వెళ్లకుండా నిరోధించడానికి, తమకోసం తాముగా మారే పరిణామాన్ని పక్కదారి పట్టించడానికి ప్రయత్నాలు ప్రారంభించాయి. వలసవాద పాలకవర్గాలు రెండు, రెండున్నర శతాబ్దాల కింద ప్రారంభించిన ఆ ప్రయత్నాలు ఇవాళ్టికి కూడ వేరు వేరు రూపాల్లో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఆ ప్రయత్నాలలో భిన్నమైన పాలకవర్గ ప్రయోజనాలకు, ప్రాంతాలకు, పెరుగుతున్న దళిత చైతన్యానికి అనుగుణంగా భిన్నమైన ధోరణులు ఉన్నప్పటికీ వాటన్నిటినీ స్థూలంగా పాత దళిత రాజకీయాలు అని నిర్వచించవచ్చు. జిగ్నేష్ మేవాని ప్రాతినిధ్యం వహిస్తున్న కొత్త దళిత రాజకీయాలను అర్థం చేసుకోవడానికి ఆ పాత దళిత రాజకీయాల నేపథ్యాన్ని అర్థం చేసుకోవాలి.

పాత దళిత రాజకీయాలు కనీసం పద్దెనిమిదో శతాబ్ది నుంచీ సాగుతున్నాయి. 1947 అధికార మార్పిడి తర్వాత పార్లమెంటరీ ఎన్నికల రాజకీయాలతో అవి మరింతగా విస్తరించాయి. తొలిదశలో విదేశీయులు, దేశంలోని ఇతర సమూహాల వారు ప్రోత్సహించగా, వారి మద్దతుతో అప్పుడప్పుడే తలెత్తుతున్న దళిత చైతన్యం ఈ రాజకీయాలను నిర్వహించింది. అలా ఏడెనిమిది తరాలుగా పాలకవర్గ భావజాలాన్ని ఎంతో కొంత స్వీకరించిన దళిత నాయకత్వమే ఇవాళ్టికీ ఈ పాత దళిత రాజకీయాలను నిర్వహిస్తున్నది. మొత్తం రెండు మూడు శతాబ్దాల చరిత్రను చూసినా, గత ఏడు దశాబ్దాల చరిత్రను చూసినా పాత దళిత రాజకీయాలు పాలకవర్గ రాజకీయాల ప్రభావంలోనే సాగాయి. అంటే దళిత సమస్యను మౌలికంగా అర్థం చేసుకుని పరిష్కార ప్రయత్నాలు చేయడం కాకుండా అపసవ్యంగా చూసి పైపై అతుకులు, మాట్లు వేయడం, వ్యవస్థ పరివర్తన గురించి ఆలోచించకుండా పక్కదారి పట్టించడం, విప్లవం స్థానంలో సంస్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడం ఈ రాజకీయాల ప్రధాన లక్ష్యంగా ఉంది.

తొలిదశలో ఈ పాత దళిత రాజకీయాలు వలసవాదం ప్రోత్సహించిన మతాంతరీకరణ చుట్టూ తిరిగాయి. వలసవాదమూ, సంఘ సంస్కరణ ఉద్యమమూ, జాతీయోద్యమమూ ప్రోత్సహించిన సంస్కరణవాదం చుట్టూ తిరిగాయి. తమలో భాగంగా గుర్తించని, వివక్షనూ అస్పృశ్యతనూ పాటించే హిందూ మతాన్ని వదిలి క్రైస్తవంలో చేరితే దళితుల స్థితి మెరుగుపడుతుందని, వారు సమానత్వం సాధించగలరని మతాంతరీకరణ వాదం భావించింది. పేర్లు మార్చుకుంటే, శుభ్రత పాటిస్తే, భోజన, వివాహాలలో కుల ఆంక్షలను మానిస్తే, సహపంక్తి భోజనాలు, కులాంతర వివాహాలు జరిగితే దళితుల స్థితి ఇతరులతో సమానం అవుతుందని సంస్కరణవాదం భావించింది.

నిజానికి ఈ రెండు ఆలోచనల వెనుకా దళితులకు మేలు చేయాలనే కోరిక కూడ ఉండవచ్చు గాని పరిష్కారాలు మాత్రం అమాయకమైనవి. అసమగ్రమైనవి. అవి దళితులలో కొందరి ఆర్థిక, సామాజిక స్థితిని మార్చగలవేమో గాని మొత్తంగా దళితుల మౌలిక స్థితిని, వ్యవస్థను మార్చగల శక్తి ఉన్నవి కావు. ఈ పరిష్కారాలలో కొన్ని రెండు వందల ఏళ్లుగా సాగుతున్నప్పటికీ సమాజ పరివర్తన గాని, దళితుల పట్ల సమానత్వం గాని, దళితుల ప్రధాన సమస్యల పరిష్కారం గాని జరగలేదంటే సమస్య మూలాలు, పరిష్కారాలు మరెక్కడో ఉన్నాయని, ఈ పరిష్కారాలు పూర్తి పరిష్కారాలు కావని గుర్తించక తప్పదు. కాని మొత్తంగా దళిత సమూహంలో మౌలిక, సంపూర్ణ పరిష్కారాల ఆలోచన రాకుండా చూడడంలో పాత దళిత రాజకీయాలు ప్రధాన పాత్ర వహించాయి, వహిస్తున్నాయి.

ఈ ధోరణులకు సమాంతరంగా మొదలై, తర్వాత కాలంలో విస్తరించిన మరో రెండు ప్రయత్నాలు విద్యలో, ఉద్యోగాలలో దళితులకు అంతకంతకూ ఎక్కువ స్థానం కల్పిస్తే దళితులమీద పీడన తగ్గిపోతుందని భావించాయి. అంతకు ముందరి హిందూ బ్రాహ్మణీయ సమాజం శూద్రులకూ దళితులకూ విద్య నిరాకరించిన నేపథ్యంలో ఇది చాల అవసరమైన, ప్రగతిశీల చర్యే.

భూస్వామ్య, రాచరిక యుగంలో ఉద్యోగాలు పెద్ద ఎత్తున ఎట్లాగూ లేవు, అవి ప్రభువర్గానికీ, ప్రభువు నమ్మిన బంట్లకూ మాత్రమే పరిమితమయ్యేవి గనుక అప్పుడు ఉద్యోగాల గురించి ఆలోచించే అవకాశమే లేదు. వలసవాద ప్రభుత్వంలో, సైన్యంలో, విద్యా రంగంలో, అప్పుడప్పుడే విస్తరిస్తున్న పరిశ్రమల్లో ఉద్యోగ కల్పన పెరిగింది. ఆ ఉద్యోగాలలోకి తక్కువ వేతనాల పనివారు కావాలంటే తప్పనిసరిగా దళితులవైపు చూడవలసిందే. వారికి అందుకు తగిన విద్య బోధించవలసిందే. అలా దళితులకు విద్యా, ఉద్యోగాలు కల్పించడమనే ఉదాత్తమైన పని చేస్తూనే తమ ప్రయోజనాలు నెరవేర్చుకునే అవకాశం వలసవాద, సంస్కరణ వాద పాలకవర్గాలకు కలిగింది. దానికి ఒక భావజాల సమర్థనగా విద్య, ఉద్యోగాలలో దళితుల ప్రవేశం వారి స్థితిని మెరుగు పరుస్తుందనీ, వారి మీద పీడన నుంచి విముక్తి ఇస్తుందనీ చెప్పుకునే అవకాశం ఎలాగూ ఉండింది.

ఈ విద్యా ఉద్యోగాలలో ప్రవేశం ఒక శతాబ్ది పైగానే అమలు జరుగుతున్నప్పటికీ ఇది సమాజంలో దళితులు ఎదుర్కొంటున్న పీడనను మౌలికంగా మార్చలేకపోయింది. ఎంత ఉన్నత విద్య చదివినా, ఎంత ఉన్నతోద్యోగం సాధించినా అవమానాన్ని, వివక్షను, పీడనను, అస్పృశ్యతను భరిస్తూ ఉండవలసిన స్థితి పెద్దగా మారలేదు.

అలా మతాంతరీకరణ, సంస్కరణ వాద చర్యలు, విద్య, ఉద్యోగం వంటి అన్ని ప్రయత్నాలు కూడ దళితుల స్థితిని గణనీయంగా మార్చలేదని, వారి పట్ల వివక్షను, అస్పృశ్యతను, అసమానతను తొలగించలేదని, ఆ వైఫల్యమే దళితులను మౌలిక సమస్య వైపు చూసేలా చేస్తుందని గుర్తించిన పాలకవర్గాలు కొత్త ఎత్తుగడగా దళితుల విముక్తి మార్గంగా పార్లమెంటరీ రాజకీయాలను ముందుకు తెచ్చాయి.

దళితులు సమాజంలో ఒక గణనీయమైన భాగం గనుక ప్రాతినిధ్య రాజకీయాలలో వారికి తప్పనిసరిగా పాత్ర ఉండవలసిందే. కాని ఆ

సహజమైన, అనివార్యమైన పని చేస్తూ, అదేదో వారికి చేసిన మెహర్బానీగా అందుకు వారు తమకు కృతజ్ఞులై ఉండాలన్నట్టుగా భారత పాలకవర్గాల పార్లమెంటరీ రాజకీయాలు ఒక వల పన్నాయి.

ఈ పార్లమెంటరీ రాజకీయాలలో భాగంగా పుట్టి పెరిగిన పాత దళిత రాజకీయాలు వాస్తవంగా దళిత విముక్తికి చేసిన కృషి ఎంత మాత్రమూ లేకపోగా పీడితులలో నుంచే ఒక చిన్న దళారీ వర్గం సృష్టి అయి పీడకులకు మద్దతుగా నిలిచే స్థితి మొదలయింది. తమకు ఎప్పటికో ఏదో ఒరగబోతుందని అత్యధిక సంఖ్యాక పీడిత దళిత సమూహాలకు భ్రమలు కలిగించడానికి ఈ పాత దళిత రాజకీయాలు వీలు కల్పించాయి. ఒక పీడిత సమూహానికి మొత్తంగా మేలు కల్పించవలసిన చోట ఒక వ్యక్తికో, ఒక కుటుంబానికో, పిడికెడు మంది ఆశ్రితులకో మేలు కల్పించి, వారిని పీడక, పాలకవర్గాలలో భాగం చేసుకుని, మధ్యవర్తులుగా, దళారీలుగా, ప్రదర్శన వస్తువులుగా, ఉదాహరణప్రాయంగా మార్చి వేశాయి.

పార్లమెంటరీ రాజకీయాలలో వాటానే రాజ్యాధికారంలో, సమాజంలో వాటాగా సంకుచిత నిర్వచనం ఇస్తూ అసలు రాజ్యాధికారం గురించిన, సమానత్వం గురించిన, కుల నిర్మూలన గురించిన అవగాహన నుంచి దళితులను దూరం చేయడానికి పాత దళిత రాజకీయాలు ప్రయత్నించాయి.

అలా పాత దళిత రాజకీయాలలో జరిగిన ప్రయత్నాలూ ప్రయోగాలూ అన్నీ కూడ వ్యవస్థను యథాతథంగా ఉంచడానికే, బలోపేతం చేయడానికే, వ్యవస్థను సమర్థించడానికే తోడ్పడ్డాయి. ఏ ఒక్క ప్రయత్నమూ వ్యవస్థను మార్చవలసిన అవసరాన్ని ప్రచారం చేయలేదు సరిగదా, వ్యవస్థ మార్పు వైపు సాగే ఆలోచనలను అడ్డుకోవడానికి ప్రయత్నించాయి.

అసలు భారత సమాజంలో దళితుల సమస్యకు మూలాలు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, చారిత్రక, భావజాల స్థాయిలన్నిటిలోనూ ఉన్నాయి. ఆ అన్ని స్థాయిలలోను మౌలికంగా ఆ సమస్యను చేపట్టి పరిష్కార మార్గాలు అన్వేషించడం, ఆ దిశలో నిరంతర ఆలోచన, ఆచరణ అవసరం. అయితే వాటా అనే రాజకీయ పరిష్కారం, ఆత్మగౌరవం అనే సామాజిక సాంస్కృతిక పరిష్కారం, భావజాలంలో పరివర్తన అనే సాంస్కృతిక, చారిత్రక పరిష్కారం విజయం సాధించాలంటే అవన్నీ జమిలిగా జరగడం మాత్రమే కాదు, వాటన్నిటికీ పునాదిని కల్పించే ఆర్థిక పరిష్కారం కూడ జరగాలి. అది కేవలం ఈ తరంలో, ఒకటి రెండు తరాలలో ఆదాయ వనరు కల్పించడంతో కూడ నెరవేరదు.

మొత్తంగా దళిత సమూహాలకు ఉత్పత్తి సాధనాల మీద అధికారం రావడం అనే దీర్ఘకాలిక, సుస్థిర పరిష్కారంగా ఉండాలి. భారత సమాజంలో ఇవాల్టికీ ప్రధాన ఉత్పత్తి సాధనం భూమే గనుక భూమి మీద దళితుల అధికారాన్ని స్థిరపరచాలి. వారే దున్నేవారు గనుక, వారు భూమిలేని నిరుపేదలు గనుక వారికి భూమి పంపిణీ అనేది వారి ఉపాధికీ, జీవికకూ, ఆత్మగౌరవానికీ హామీ ఇస్తుంది. భూమితో, ఇతర ఉత్పత్తి సాధనాలతో సంబంధం లేకుండా దళిత సమస్య పరిష్కారానికి ఎన్ని సూచనలు, ప్రయత్నాలు, ప్రయోగాలు చేసినా అంతిమ ఫలితం గుణాత్మకమైనదిగా, సముచితమైనదిగా ఉండదు.

పాలకవర్గ ప్రోత్సాహంతో ప్రారంభమై, విస్తరిస్తున్న పాత దళిత రాజకీయాల పరిణామాలను, పర్యవసానాలను బైటి నుంచీ లోపలి నుంచీ చూసిన దళితులు, దళితేతర ప్రగతిశీలవాదులు కూడ ఆ రాజకీయాలు సరిపోవని గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించడం ప్రారంభించారు. మౌలికంగా దళిత సమస్యను పరిష్కరించడం ఎలా అనీ, ఆ అంతిమ పరిష్కారం సాధించే లోపు, పాత దళిత రాజకీయాలలోకి దిగజారిపోకుండా దళిత ఆత్మగౌరవ ఆకాంక్షలు సాధించడం ఎలా అనీ అన్వేషించారు.

ఈ ప్రత్యామ్నాయాల అన్వేషణ చరిత్ర కూడ సుదీర్ఘమైనదే. చెప్పాలంటే వలస పాలనా కాలంలోనే, వలసవాదులతో పాటు కలిసి వచ్చిన మిషనరీల ద్వారానే ఈ చరిత్ర మొదలయిందనాలి. మద్రాస్ ప్రెసిడెన్సీలో 1890లలో పనిచేస్తుండిన వెస్లియన్ క్రైస్తవ మిషనరీలు, ప్రత్యేకంగా రెవరెండ్ ఫాదర్ విలియం గౌడీ పంచముల జీవనం మీద ఒక నివేదిక తయారు చేసి బ్రిటిష్ ప్రభుత్వానికి సమర్పించాడు. అప్పటికి అమలులో ఉన్న ప్రభుత్వ విధానాలు దళితుల జీవితాలలో ఏ మార్పూ తేలేదని, వారు అత్యంత దుర్భరమైన పీడనకు గురవుతూ అమానుషమైన పరిస్థితులలో బతుకునీడుస్తున్నారని, వారి స్థితి మెరుగుపడాలంటే వారికి భూమి పంపిణీ చేయడం ఒక్కటే మార్గమని ఆయన సిఫారసు చేశాడు. ఆ నివేదిక కొనసాగింపుగా వచ్చిన పత్రికావార్తలను చూసి అప్పటి చెంగల్పట్టు జిల్లా కలెక్టర్ జె.ఎచ్.ఎ. ట్రెమెన్‌హీర్ దళితులకు భూపంపిణీ గురించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాడు. ఆ ప్రతిపాదన బ్రిటిష్ పార్లమెంటులో చట్టమై, మద్రాసు ప్రభుత్వం 1892 సెప్టెంబర్‌లో దళితులకు భూపంపిణీ చేపట్టింది. అయితే దళితులు దేశవ్యాప్తంగా దుర్భర ఆర్థిక దోపిడీనీ సామాజిక పీడననూ అనుభవిస్తుండగా ఏదో ఒకటి రెండు జిల్లాలలో ప్రభుత్వం వైపు నుంచి జరిగిన ఈ ప్రయత్నం నిజమైన ఫలితాన్ని సాధించలేకపోయింది. వలసవాద ప్రభుత్వం కూడ ఆ ప్రయత్నాన్ని విస్తరించడానికి, కొనసాగించడానికి ప్రయత్నించలేదు.

ఆ తర్వాత విభిన్న రాజకీయ పక్షాలూ, దళిత ప్రజా సంఘాలూ ఈ ఆకాంక్షను ఎత్తిపట్టాయి గాని జాతీయోద్యమంలో ఇది ప్రధాన నినాదం కాలేకపోయింది. ఘదర్ పార్టీ నాయకుడు బాబా మంగూరామ్ పంజాబ్‌లో దళితులకు భూమి ఇవ్వాలనే ఉద్యమాన్ని నడిపారు. డా. బి ఆర్ అంబేద్కర్ మార్గదర్శకత్వంలో మరాఠ్వాడలో, కొంకణ్‌లో 1950లలో భూపోరాటాలు జరిగాయి. రిపబ్లికన్ పార్టీ నాయకత్వంలో దళితులకు భూమి నినాదంపై 1964 డిసెంబర్ నుంచి 1965 ఫిబ్రవరి వరకు జరిగిన ఆందోళనలో ముప్పై లక్షల మంది దళితులు జైళ్లకు వెళ్లారు.

దళితుల సమస్యల ప్రత్యేకతను ఈ దేశంలో కమ్యూనిస్టులు గుర్తించలేదని ఎన్ని విమర్శలు ఉన్నప్పటికీ, వాస్తవంగా దళితుల, పీడితుల దోపిడీ పీడనల పరిష్కారానికి మూలం భూమి సమస్యలో ఉన్నదనే మౌలిక అవగాహనతోనే కమ్యూనిస్టులు పనిచేశారు. ప్రధానంగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నాటి నుంచీ ఈ దేశ పీడితుల సమస్య వారికి ఉత్పత్తి సాధనాల మీద యాజమాన్యం లేకపోవడంలోనే ఉన్నదని కమ్యూనిస్టులు భావించారు. దానితోపాటు సామాజిక పీడన అంశానికి ఇవ్వవలసిన ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించవచ్చు గాని మౌలికంగా దున్నేవారికే భూమి నినాదం దళితుల మనుగడ సమస్యనూ ఆత్మగౌరవ సమస్యనూ తన పరిధిలోకి తీసుకుంది. ఆ అవగాహనను

నక్సల్బరీ మరింత పదునెక్కించడం మాత్రమే కాక, తీవ్రతరమవుతున్న వర్గపోరాట సందర్భంలో సామాజిక పీడన అంశం మీద కూడ కేంద్రీకరణను పెంచుతూ వచ్చింది.

ఈ నేపథ్యంలో దళిత చైతన్యాన్ని భూమి సమస్య నుంచి, మౌలిక సమస్య నుంచి పక్కకు తప్పించడానికి, దళితులు పార్లమెంటరీ భ్రమల్లో కూరుకుపోయి, వ్యవస్థ పరివర్తన కర్తవ్యం నుంచి విముఖులు కావడానికి పాత దళిత రాజకీయాలు తమ ప్రయత్నాలను ఇనుమడింపజేశాయి. పార్లమెంటరీ భ్రమలను, విద్యా, ఉద్యోగ భ్రమలను ఎంతగా పెంచాయంటే అవి డా బి ఆర్ అంబేద్కర్ చెప్పిన బోధన- సమీకరణ -పోరాటం సాగించినప్పుడు కూడ మౌలిక సమస్యల ప్రస్తావన లేకుండానే, కులనిర్మూలన ఆశయం లేకుండానే సంస్కరణలనే పరిష్కారాలుగా చూపించాయి. నిజానికి డా. బి ఆర్ అంబేద్కర్ రాజ్యాంగపు పరిమితుల గురించీ, రిజర్వేషన్ల వల్ల లబ్ధి పొందినవారు తమ సమూహానికి చేయవలసిన దోహదం గురించీ చెప్పిన మాటలను కూడ ఈ పాత దళిత రాజకీయాలు పెడచెవిన పెట్టాయి. అన్ని పాలకవర్గ పార్టీలలో దళిత నాయకులు ఆ పాలకవర్గ పార్టీలకు ప్రజల్లో, దళితుల్లో మద్దతు సంపాదించి పెట్టడానికి, వ్యవస్థ యథాతథంగా నిలవడానికీ ఉపయోగపడడం ప్రారంభమయింది.

మరొకవైపు దళితుల్లో ఆ మాత్రం పెరుగుతున్న చైతన్యాన్ని, విద్యను, ఉద్యోగావకాశాలను కూడ సహించలేని ఆధిపత్య కులాలు, వర్గాలు దళితులను అణచి ఉంచడానికి పెద్ద ఎత్తున దాడులు ప్రారంభించాయి. 1968 కీలవేన్మణి నుంచి ప్రారంభించి బెల్చీ, పదిరికుప్పం, కారంచేడు, చుండూరు, బథానీ టోలా, మేళవలవు, లక్ష్మణ్ పూర్ బాథే, వేంపెంట, ఖైర్లాంజి, లక్షింపేట, గరగపర్రు దాకా దళితుల మీద జరిగిన వేలాది దాడుల్లో ప్రధానమైన అంశం దళితుల్లో వ్యక్తమవుతున్న ఆత్మగౌరవాన్ని, తమ వాటా తమకు దక్కాలనే ఆకాంక్షను ఉక్కుపాదంతో కాలరాయడమే. ఈ దాడుల నేపథ్యంలో దళితులను మరింత చైతన్యీకరించి, సమీకరించి, పోరాటానికి సిద్ధం చేసి, సమరశీల పోరాటాలకూ, వ్యవస్థ పరివర్తనకూ నాయకత్వం వహించాలనే కర్తవ్యం తమ తలుపు తడుతున్నప్పుడు పాత దళిత రాజకీయ నాయకత్వం మళ్లీ మళ్లీ పార్లమెంటరీ, చట్టబద్ధ, వ్యవస్థాంతర్గత భ్రమలు పెంచి పోషించడానికీ, తమ వెనుక ఉన్న దళిత సమూహాలను పక్కదారి పట్టించడానికి ప్రయత్నించింది. పాలకవర్గ ముఠా తగాదాలలో ఒక్కో సమయంలో ఒక ముఠాకు మద్దతు ఇస్తూ, మొత్తంగా పాలకవర్గ దోపిడీ పీడనలను యథాతథంగా కాపాడుతూ, తమ స్థానాలు పదిలంగా కాపాడుకుంటూ వచ్చింది.

ఈ పరిణామాలకు వ్యక్తుల స్థాయిలో, పార్టీల స్థాయిలో, వేరువేరు రాష్ట్రాలలో, దేశవ్యాప్తంగా ఎన్నో ఉదాహరణలు ఇవ్వవచ్చు గాని మొత్తం మీద గత ఒకటిన్నర శతాబ్దాల, ముఖ్యంగా గత ఏడు దశాబ్దాల పాత దళిత రాజకీయాల సారాంశాన్ని చెప్పాలంటే, అవి ప్రధానంగా ఐదు అంశాలుగా గుర్తించవచ్చు:

1. దళితుల విద్య, ఉద్యోగాలు, ఆత్మగౌరవం వంటి దళితుల నిజమైన సమస్యల మీద పోరాడినప్పటికీ, ఎంతో కొంత విజయం సాధించినప్పటికీ ఆ సమస్యలకు మూలమైన మౌలిక పరిష్కారం వైపు, ఉత్పత్తి సాధనాల యాజమాన్యం వైపు వెళ్లలేదు. ఉద్దేశపూర్వకంగా చేసినా, అమాయకంగా చేసినా పార్లమెంటరీ భ్రమలు, విద్యా, ఉద్యోగ భ్రమలు కల్పించడం ద్వారా దళితులను మౌలిక పరిష్కారం వైపు వెళ్లకుండా ఆపిన అంతిమ ఫలితమే మిగిలింది.
2. దళితులకు, పీడితులకు దక్కవలసిన రాజ్యాధికారాన్ని, సమాజంలో సమాన అధికారాన్ని పాత దళిత రాజకీయాలు కేవలం ప్రభుత్వాధికారంలో వాటాగా కుదించి చూశాయి, చూపాయి. తద్వారా పాలకవర్గాల కనుసన్నలలో పనిచేసే ఒక చిన్న దళారీ వర్గాన్ని తయారు చేయడానికీ, అంటే మౌలికంగా అసంఖ్యాక దళిత ప్రజానీకాన్ని యథాస్థితిలో ఉంచడానికీ ఈ పాత దళిత రాజకీయాలు ఉపయోగపడ్డాయి.
3. బోధించు, సమీకరించు, పోరాడు అని డా. బి ఆర్ అంబేద్కర్ ఇచ్చిన అద్భుతమైన, శక్తిమంతమైన నినాదానికి పాత దళిత రాజకీయాలు తప్పుడు, సంకుచిత అర్థం ఇచ్చి ఆ నినాదపు శక్తిని పోగొట్టాయి. దళితులకు అవసరమైన బోధనను, చైతన్యాన్ని ఇవ్వలేదు. దళితులను సమీకరించాయి గాని ఎక్కువసార్లు దళిత ప్రయోజనాలకు భిన్నమైన పాలకవర్గ, ఆధిపత్య కుల రాజకీయాల అవసరాల కోసమే ఆ సమీకరణలు సాగాయి. దళితులు నిజంగా సాగించవలసిన కులనిర్మూలన, వ్యవస్థ పరివర్తన మౌలిక పోరాటాల వైపు కాకుండా తాత్కాలిక, సంస్కరణవాద ప్రయోజనాల పరిమితుల్లోనే పోరాటాలు సాగించాయి.
4. కుల అస్తిత్వాన్ని ప్రధానం చేయడం ద్వారా ఈ పాత దళిత రాజకీయాలు అంబేద్కర్ ఆకాంక్షించిన కుల నిర్మూలన ఆశయానికే తూట్లు పొడిచాయి. అంతకన్న ముఖ్యంగా దళితులను మిగిలిన పీడితులతో కలవకుండా ఒంటరులను చేశాయి. పుట్టుకే అవకాశాలనూ పరిమితులనూ నిర్ణయిస్తుందన్న మనుస్మృతిని కూలదోయవలసిన దళితులను ఈ పాత దళిత రాజకీయాలు పుట్టుకను ఏకైకంగా చూసే తప్పుడు భావజాలంలో ముంచివేశాయి. పుట్టుక ప్రాధాన్యతను గుర్తిస్తూనే ఒక మనిషి ప్రవర్తనలో, సమాజీకరణ, అధ్యయనం, ఆచరణ, విలువలు, భావజాలం కూడ ప్రధాన పాత్ర వహిస్తాయనే అంశాన్ని దళితుల అవగాహన నుంచి దూరం చేయడానికి ప్రయత్నించాయి. తద్వారా తాము ఎంతగా పాలకవర్గ, అగ్రవర్ణ బానిసత్వం, దళారీతనం చేస్తున్నా, తమ పుట్టుక వల్ల దళిత నాయకులుగా ఉండే అవకాశాన్ని పదిలం చేసుకునే ప్రయత్నం చేశాయి.
5. ఎప్పటికప్పుడు దళితుల మీద దాడులు పెరుగుతుంటే, తత్ఫలితంగా దళితులలో చైతన్యం, సమరశీలత, ప్రతిఘటనా వాంఛ పెరుగుతుంటే, పాత దళిత రాజకీయాలు ఆ చైతన్యాన్ని, సమరశీలతను పక్కదారి పట్టించడానికి, ఆ ప్రతిఘటనా వాంఛను మొద్దుబార్చడానికి ప్రయత్నించాయి. తద్వారా సమాజ పరివర్తనకు ఉపయోగపడవలసిన దళిత చైతన్యాన్ని పక్కదారి పట్టించి యథాస్థితి కొనసాగడానికి, వ్యవస్థ మార్పు లేకుండా పదిలంగా ఉండడానికి తమవంత కృషి చేశాయి.

పాత దళిత రాజకీయాలు వ్యవస్థను పరిరక్షించడానికి వేరువేరు

రూపాల్లో, వేరు వేరు ఆకర్షణీయ, తప్పుడు నినాదాలతో ఎంతగా ప్రయత్నిస్తున్నప్పటికీ, నానాటికీ మారుతున్న భౌతిక పరిస్థితులే, పెరిగిపోతున్న ఆధిపత్య కుల, మత ఉన్మాదమే, మనుస్మృతిని మనసా వాచా కర్మణా నమ్మే సంఘ్ పరివార్ పాలనే, దళితుల మీద పెచ్చరిల్లుతున్న దాడులే కొత్త దళిత రాజకీయాలు పుట్టుకురావడానికి కారణమయ్యాయి. పరిమాణాత్మక మార్పులు గుణాత్మక మార్పులకు కారణమవుతాయనే గతితార్కిక సూత్రానికి నిదర్శనంగా కొత్త దళిత రాజకీయ ధోరణులు పెల్లుబికాయి. అయితే ఎటువంటి గుణాత్మక మార్పుకైనా ప్రోద్బలమైన ఘటనో పరిణామమో ఉంటుంది. కొత్త దళిత రాజకీయాల పుట్టుకకు ఊనా ఘటన అటువంటి ప్రోద్బలం చేసింది.

గుజరాత్‌లోని సౌరాష్ట్రలో గిర్ సోమనాథ్ జిల్లాలో చిన్న పట్టణమైన ఊనాలో 2016 జూలై 11న గోరక్షకులమని చెప్పుకునే సంఘ్ పరివార్ గూండాలు దళిత యువకులను నలుగురిని కారుకు కట్టేసి కొరడాలతో కొడుతూ హింసించారు. చచ్చిన పశు కళేబరాలను శుభ్రం చేసే "నీచమైన" పని దళితులది మాత్రమేనని నిర్దేశించిన హిందూ ధర్మ పరిరక్షకులే, ఆ పనే చేస్తున్న దళితుల మీద బతికి ఉన్న "గోమాత"ను చంపి తోలు ఒలుస్తున్నారనే అబద్ధపు ఆరోపణతో ఈ హింసకు ఒడిగట్టారు. అసమానత మీద, అణచివేత మీద, అబద్ధాల మీద ఆధారపడిన ఇటువంటి అవమానాలు, అత్యాచారాలు, దౌర్జన్యాలు తరతరాలుగా దళితులు అనుభవిస్తున్నవే. ఈసారి మాత్రం ఈ ఘటనను చిత్రించిన వీడియో విపరీతంగా ప్రచారం కావడంతో దళితుల్లో, దళితులపై అణచివేతను వ్యతిరేకించేవారిలో పేరుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

ఎంతోకాలపు పరిమాణాత్మక మార్పులే ఒక చిన్న కారణంతో గుణాత్మక మార్పులుగా మారుతాయి. ఎప్పటినుంచో పొందుతున్న అనుభవమే అయినా, ఈ సారి అనుభవం విస్ఫోటనానికి కారణమైంది. చచ్చిపోయిన ఆవు తోలు ఒలిచే వృత్తిని తమకు అంటగట్టినవారే, ఆ పని చేస్తున్నందుకే వేధించినప్పుడు, ఆ వేధింపుల వెనుక ఉన్న హిందుత్వ భావజాలం మీద కసి ఉవ్వెత్తున ఎగసిపడింది.

తర్వాత మూడు వారాలు గుజరాత్ దళితవాడలన్నీ అట్టుడికి పోయాయి. పశువుల కళేబరాలను శుభ్రం చేయడం, పారిశుధ్యం పేరుతో సాగే నీచమైన, అమానుషమైన పనులు, వేల ఏళ్లుగా హిందూ బ్రాహ్మణీయ సమాజం దళితులకు మాత్రమే "రిజర్వ్" చేసిన పనులు ఇంకెంత మాత్రమూ తాము చేయబోమని దళితులు ప్రకటించడం మొదలుపెట్టారు. మృత పశువులను తీసుకువెళ్లి ప్రభుత్వ కార్యాలయాల్లో పడేశారు. మనువాద ఆదేశాలను తిరస్కరించడం ఆచరణాత్మకంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా దళిత, ప్రగతిశీల శిబిరాల నుంచీ, బుద్ధిజీవుల నుంచీ గుజరాత్ దళితులకు మద్దతు అందింది. గుజరాతీ దళిత కథా రచయిత అమృత్ లాల్ మక్వానా తనకు అంతకు ముందు అందిన దాసీ జీవన్ ఉత్తమ రచయిత అవార్డును ఊనా దురంతానికి నిరసనగా వెనక్కి ఇచ్చేశారు. ఊనా దళిత్ అత్యాచార్ లడాయి సమితి అనే రాజకీయేతర సామాజిక ఉద్యమ సంస్థ పుట్టుకొచ్చింది.

ఊనా దురంతానికి నిరసనగా న్యాయవాది, సామాజిక కార్యకర్త జిగ్నేష్ మేవానీ నాయకత్వాన ఆగస్ట్ 5న అహ్మదాబాద్ నుంచి 'చలో ఊనా' అంటూ దళిత అస్మితా యాత్ర ప్రారంభమయింది. దారి పొడవునా ప్రతి గ్రామం నుంచీ దళితులు, ముస్లింలు ఆ యాత్రలో భాగమయ్యారు. దేశం నలుమూలల నుంచీ వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు, అంబేద్కర్ వాదులు, దళిత్ పాంథర్లు, కబీర్ కళా మంచ్ కళాకారులు, గాంధేయవాదులు, ప్రగతిశీల శక్తులు పాల్గొన్నారు. ఈ యాత్ర ప్రవేశించిన ప్రతి గ్రామంలోను దళితులు ఇక ముందు తాము చచ్చిన పశువుల కళేబరాలను ముట్టుకోబోమని ప్రతిజ్ఞ చేశారు.

ఆగస్ట్ 15న పాలకవర్గాలు "స్వాతంత్ర్య దినం" జరుపుకుంటు న్నప్పుడు, ఊనాలో బహిరంగ సభ జరిగింది. అహ్మదాబాద్ లో 70 మందితో ప్రారంభమైన యాత్ర ఊనా బహిరంగ సభ నాటికి పదిహేను వేల మందికి చేరింది. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో వ్యవస్థీకృత హత్యకు బలి అయిన రోహిత్ వేముల తల్లి రాధిక వేముల ఆ ప్రదర్శనలో పాల్గొన్నారు. "గోమాత మీ తల్లి అంటున్నారు గదా, ఆమె చచ్చిపోయి నప్పుడు మీరే చివరి పనులు చేయండి" అంటూ ఇకముందు మృత పశు కళేబరాలు తాము ముట్టుకోబోమని, వాటి తోలు ఒలవడం, చర్మం శుభ్రం చేయడం, పాదరక్షలు కుట్టడం వంటి పనులేవీ చేయబోమని ప్రదర్శకులు ప్రకటించారు.

మనుషుల మలమూత్రాలు ఎత్తిపోసే పని, మురికి కాలువలు శుభ్రం చేసే పని కూడ ఇకముందు చేయబోమని ప్రకటించారు. "గాయ్ ని పుఛ్ఛా తామీ రఖో, అమ్నె అమారీ జమీన్ ఆపో" (గోమాత తోక మీరే ఉంచుకోండి, మా భూమి మాకివ్వండి) అని మౌలిక భూసమస్యను ఎత్తిపట్టారు.

ఈ ఉద్యమం వల్ల ముఖ్యమంత్రి దిగిపోవలసి వచ్చింది. స్వయంగా ప్రధాని నరేంద్ర మోడీ గోరక్షకులు చేస్తున్న దౌర్జన్యాలను ఖండించి, దళితుల మీద దాడి చేసేవారు మొట్టమొదట తన మీద దాడి చేయాలని అబద్ధపు హెచ్చరికలు వినిపించవలసి వచ్చింది. ఈ పోరాటం నష్ట పరిహారం కోసం కాదనీ, రాజకీయ పార్టీల చేతుల్లో పెట్టడానికి కాదనీ, దళితులకు సామాజిక న్యాయం కోసమేననీ మేవానీ అన్నాడు. సామాజిక న్యాయం చిట్టచివరికి వీథుల్లో పోరాటంతోనే సాధ్యమవుతుందనీ, అంతిమంగా దళితులకు భూమి దక్కడమే పరిష్కారమనీ అన్నాడు. ఆ రకంగా ఈ ఉద్యమం మనువాదం నిర్దేశించిన వర్ణధర్మాన్ని ధిక్కరించింది. వీథుల్లో పోరాట అవసరాన్ని ఎత్తిపట్టింది. మౌలికమైన భూసమస్యను గుర్తించింది.

జిగ్నేష్ మేవానీ చమార్ కులంలో పుట్టి, ఇంగ్లిష్ సాహిత్యం, జర్నలిజం, న్యాయశాస్త్రం చదువుకుని, కొంతకాలం ఒక పత్రికా విలేఖరిగా కూడ పనిచేసి నాలుగు సంవత్సరాలుగా న్యాయవాదిగా పనిచేస్తున్న యువ దళిత నాయకుడు. ఆయన నాయకత్వంలో జరిగిన ఊనా దళిత పోరాటం కచ్చితంగా పాత దళిత రాజకీయాల నుంచి కనీసం మూడు విషయాల్లో తనను తాను వేరు చేసుకున్నది. ఒకటి, ఇది మనుస్మృతినీ, వర్ణాశ్రమ ధర్మాన్నీ, సమాజంలో నిర్బంధ పూరితంగా, కుల మత కట్టుబాట్లతో అమలవుతున్న శ్రమ విభజననూ ఆచరణాత్మకంగా ప్రతిఘటించింది. బాబాసాహెబ్ అంబేద్కర్ 1927 డిసెంబర్ 25 చేసిన మనుస్మృతి దహనం మనుధర్మం మీద ఒక ప్రతీకాత్మక సవాల్ కాగా, పశు కళేబరాలు శుభ్రం చేయబోమని ఈ ఉద్యమం చేసిన ప్రకటన

మనుస్మృతి దహనానికి కొనసాగింపూ, ఆచరణాత్మక అన్వయమూ కూడ. మనుస్మృతికి వ్యతిరేకంగా మాట్లాడుతూనే మనుధర్మపు పాలకవర్గాలకు ఊడిగం చేస్తూ వచ్చిన పాత దళిత రాజకీయాల చరిత్రకు ఇది భిన్నమైనది. రెండు, పాత దళిత రాజకీయాలు దళిత సమస్య పరిష్కారాన్ని విద్యకు, ఉద్యోగాలకు, పార్లమెంటరీ స్థానాలకు, ఆత్మగౌరవ ప్రకటనకు కుదించగా, ఈ కొత్త దళిత రాజకీయాలు అవి సాధించాలన్నా, అంతకు మించినవి సాధించాలన్నా వీధుల్లో పోరాటానికి సిద్ధపడాలని ప్రకటించి, ఆచరణలో చూపాయి. మూడు, దళిత సమస్యకు అంతిమ పరిష్కారం మౌలిక భూసమస్య పరిష్కారంలో ఉన్నదని ఈ కొత్త దళిత రాజకీయాలు బలంగా ప్రకటించాయి.

ఇవి కేవలం ప్రకటనలుగానే మిగిలిపోతే పాత దళిత రాజకీయాలే కొత్త రూపంలో వస్తున్నాయని అనుమానించే ఆస్కారం ఉండేది. కాని నాలుగు వారాలు తిరగకుండానే అహ్మదాబాద్ జిల్లా సరోదా గ్రామంలో భూమి పోరాటం సాగించి జిగ్నేష్ మేవాని ఇవి నిజంగా కొత్త దళిత రాజకీయాలేనని రుజువు చేశాడు. ఎప్పుడో 2006లో దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూమి, తొంభై రోజుల లోపల లబ్ధిదారులకు అప్పగించాలని చట్టం నిర్దేశిస్తున్నప్పటికీ, ఇప్పటి దాకా దళితులకు దక్కలేదు. కాగితం మీద దళితులకు దక్కిన ఆ భూమి ఆధిపత్య కులాల చేతుల్లోనే ఉండిపోయింది. ఈ కాగితం మీది భూసంస్కరణలను సవాల్ చేయాలనీ, దున్నేవారికే భూమి ఆదర్శంతో ప్రతి దళిత కుటుంబానికీ ఐదు ఎకరాల భూమి ఇవ్వాలనీ, కార్పొరేట్ శక్తులకు భూమి కట్టబెట్టడాన్ని మానుకుని దున్నేవారికే భూమి ఇవ్వాలనీ జిగ్నేష్ మేవానీ డిమాండ్ చేశాడు. పది సంవత్సరాల కింద సరోదా లో 115 దళిత కుటుంబాలకు కాగితాల మీద అందిన 220 బీగాల భూమి ఈ ఉద్యమం వల్ల వాస్తవంగా అందింది.

ఆ సందర్భంగానే ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో జిగ్నేష్ మేవానీ కొత్త దళిత రాజకీయాల విశిష్టతను స్పష్టం చేశాడు. జరగవలసిన పని కుల వ్యతిరేక నినాదాలు మాత్రం ఇస్తూ, అస్తిత్వవాదంలో కూరుకుపోవడం కాదని ఆయన అన్నాడు. అస్తిత్వ వాదంలో అనుకూల అంశాలు ఉన్నట్టే ప్రతికూల అంశాలు కూడ ఉన్నాయని గుర్తు చేశాడు. అస్తిత్వ పోరాటాన్నీ భౌతిక పునాదినీ సమ్మేళనం చేయకుండా ఏమీ సాధించలేమని, అప్పటిదాకా సాగుతున్న అస్తిత్వవాదం భౌతిక పునాదితో సంబంధం లేని శుష్కచర్చ చేస్తున్నదని అన్నాడు. భౌతిక సమస్యలు దళిత రాజకీయాలకు హృదయ స్థానంలో ఉండాలన్నాడు. ఇంతకాలం దళితులూ వామపక్షాలూ కూడ తప్పులు చేశారని, కాని దళితులు వామపక్షాలను మిత్రులుగా గుర్తించాలని అన్నాడు. ఈ మాటకు దళితులు వామపక్షాల వైపు వెళ్లడమో, వామపక్షాలు దళితుల వైపు వెళ్లడమో అనే అర్థం చెప్పగూడదని, దళితులే వామపక్షాలు, వామపక్షాలే దళితులు అనే స్థితి రావాలని అన్నాడు. ప్రస్తుత స్థితిలో కాషాయ రాజకీయాల ప్రతిఘటన ప్రధాన లక్ష్యం కావాలన్నాడు. కాషాయీకరణను వ్యతిరేకించడం దళితులకు ప్రధానమైన కర్తవ్యం కావాలన్నాడు. విశాల పీడిత ఐక్యత కావాలన్నాడు. పేదల, భూమిహీనుల పోరాటం ఎప్పుడూ వ్యక్తిగతం కాదని, అందువల్ల అటువంటి పోరాటాలు ఎప్పుడూ ఒకే వ్యక్తి చుట్టూ తిరగగూడదని, సమష్టి రాజకీయాలు కావాలని అన్నాడు. ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా కోసమే ఈ పోరాటం అన్నాడు.

ఒక సంవత్సరం గడిచేసరికి ఈ ఆలోచనల్లో కొంత మార్పు వచ్చినప్పటికీ 2017 ఇంటర్వ్యూలో కూడ ఫాసిజాన్ని ఓడించడం తక్షణ కర్తవ్యమనీ, అది ఎన్నికల ద్వారా జరగదనీ, అది దీర్ఘకాలిక పోరాటమనీ అన్నాడు. అదే సమయంలో ఒక మధ్యంతర పరిష్కారంగా, ఉపశమనంగా భారతీయ జనతా పార్టీని ఓడించడం మొదటి లక్ష్యంగా గ్రహించాలన్నాడు. 2017 డిసెంబర్ వచ్చే నాటికి పార్లమెంటరీ ఎన్నికల్లో కూడ పాల్గొని కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల మద్దతుతో శాసన సభ్యుడుగా ఎన్నికయ్యాడు. అప్పటికి రెండు సంవత్సరాలుగా ప్రకటిస్తున్న కొత్త దళిత రాజకీయాలను కూడ మళ్లీ పార్లమెంటరీ భ్రమల్లో ముంచివేస్తాడా అనే అనుమానం కలిగించాడు. ఈ సందర్భంలోనే ఇటు పార్లమెంటరీ కమ్యూనిస్టు పార్టీలు ఇస్తున్న లాల్ నీల్ ఐక్యత అనే నినాదంతో కూడ ఏకమయ్యాడు. నిజానికి ఈ లాల్ నీల్ ఐక్యత అనేది పార్లమెంటరీ పార్టీల అవకాశవాద నినాదమే తప్ప నిజమైన దళితుల విముక్తి మార్గమేమీ కాదు. ఈ నినాదంలోని లాల్ ఇంకెంతమాత్రమూ శ్రామికవర్గాల ఆశాజ్యోతి అయిన ఎరుపు కాదు. అది ఎప్పుడో పార్లమెంటరీ రాజకీయాలలో వెలిసిపోయింది. ఈ దేశంలో దోపిడీ పాలకవర్గాలతో కలిసిపోయింది. నీల్ దళిత బహుజనుల పక్షాన ఉన్నామని చెప్పుకుంటున్న పార్లమెంటరీ పార్టీల జెండా రంగే తప్ప అది మొత్తంగా దళిత సమూహాలకు ప్రతీక ఏమీ కాదు. ప్రజాశక్తులకు ప్రతీక కాని లాల్, దళితులకు ప్రతీక కాని నీల్, కేవలం తమను తాము లాల్ అనీ నీల్ అనీ పిలుచుకుంటున్న పార్లమెంటరీ అవకాశవాద రాజకీయ శక్తుల అధికార వెంపరలాట నినాదమే తప్ప లాల్ నీల్ అనే మాటకూ ఈ దేశంలో జరగవలసిన సమాజ పరివర్తనకూ ఏమీ సంబంధం లేదు. జరగవలసింది సకల పీడితశక్తుల ఐక్యత. అందులో తప్పనిసరిగా విప్లవశక్తులు ఉండాలి, దళిత ప్రజానీకం ఉండాలి. ఆ సంఘటిత శక్తి మౌలిక సమస్యల మీద పోరాటాన్నీ, తక్షణ సమస్యల మీద పోరాటాన్నీ కలగలపాలి.

ప్రభావంలో జిగ్నేష్ మేవాని అంత శక్తిమంతంగా లేకపోయినా, జిగ్నేష్ మేవాని లాగ భూమి సమస్యను ప్రధానాంశంగా తీసుకు రాకపోయినా, కొత్త దళిత రాజకీయాలకు మరొక వ్యక్తీకరణ ఉత్తరప్రదేశ్ లో చంద్రశేఖర్ ఆజాద్ రావణ్. జాతవ్ కులంలో పుట్టిన చంద్రశేఖర్ ఆజాద్ దళిత రాజకీయాలకు, ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో అలవాటైన అధికార లాలసనూ, అవకాశవాదాన్నీ, వ్యవస్థ లోపలి పరిష్కారాలనూ, పార్లమెంటరీ వ్యవస్థల పట్ల భ్రమలనూ ప్రశ్నిస్తున్నాడు. భీం సేన ఏర్పాటు చేసి దళితులలో సమరశీల చైతన్యానికీ, వీధుల్లో పోరాటానికీ దారి తీస్తున్నాడు. ఈ సమరశీలత పాత సంస్కరణవాద, రాజీవాద దళిత రాజకీయాలకు సవాల్ గనుకనే ఆయన మీద, ఆయన ఉద్యమం మీద తీవ్రమైన నిర్బంధం కూడ అమలవుతున్నది.

వ్యక్తులుగా జిగ్నేష్ మేవాని, చంద్రశేఖర్ ఆజాద్ రావణ్, సామాజిక సంచలనాలుగా ఊనా అనంతర దళిత చైతన్యం, భీం సేన తీసుకువచ్చిన కొత్త దళిత రాజకీయాలు ముందుకు సాగుతాయా, నడుమ తడబడి మునిగిపోతాయా కాలమే తేలుస్తుంది. అయితే ఈ కొత్త దళిత రాజకీయాలు తడబడి పడిపోకుండా కాపాడవలసిన, వాటికి బలం

ఇవ్వవలసిన బాధ్యత విప్లవ ప్రగతిశీల ప్రజా శక్తులపైనే ఉంది. కొత్త దళిత రాజకీయాలు ఏ మార్పులు తీసుకువచ్చాయో, ఏ మార్పులను ముందుకు తీసుకుపోవాలో గుర్తించి బలపరచవలసింది విప్లవ ప్రగతిశీల శక్తులే. కొత్త దళిత రాజకీయాలు ఎక్కడ తడబడుతున్నాయో గుర్తించి స్నేహపూర్వక సవరణలతో ఆ ధోరణిని బలోపేతం చేయవలసింది విప్లవ ప్రగతిశీల శక్తులే. ఆ పని చేయాలంటే కొత్త దళిత రాజకీయాల ప్రత్యేకతలేమిటో అర్థం చేసుకోవాలి.

పైన చూసిన పాత దళిత రాజకీయాల సారాంశమైన ఐదు అంశాలలోను కొత్త దళిత రాజకీయాలు మార్పు తీసుకు వచ్చాయి. ఈ మార్పు కొన్ని అంశాల్లో గుణాత్మకంగా మౌలికమైనది, కొన్ని అంశాలలో కేవలం పరిమాణాత్మకంగా భిన్నమైనది. కొన్ని అంశాల్లో పాతనే కొనసాగించినది.

1. ఊనా ఘటన తర్వాత ఉధృతమైన కొత్త దళిత రాజకీయాలలో దళిత ఆత్మగౌరవం, వివక్ష పట్ల వ్యతిరేకతతో పాటుగా, ప్రధాన ఉత్పత్తి సాధనమైన భూమి మీద దళితులకు అధికారం అనే మౌలిక అంశం చర్చలోకి వచ్చింది. ఇది తప్పనిసరిగా ముందుకు తీసుకుపోవలసినది. ఇది దళితుల సమస్యకు, మొత్తంగా భారత సమాజ సమస్యలకు అంతిమ పరిష్కారం అనే అంశాన్ని ప్రచారం చేయవలసి ఉంది.
2. కనీసం ఏడాది, ఏడాదిన్నర పాటు కొత్త దళిత రాజకీయాలు కొనసాగుతున్న పార్లమెంటరీ వ్యవస్థలో తమ వాటా అనే కుదింపువాదానికి పరిమితం కాలేదు. ఆ తర్వాత స్వయంగా జిగ్నేష్ మేవానియే ఎన్నికల్లో పోటీ చేసి శాసనసభ్యుడు కూడ అయ్యాడు. మన దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అనే పేరుమీద నడుస్తున్న అవకాశవాద పొత్తులు, కలయికలు అన్నీ కూడ ఆయన ఎన్నికలోనూ పనిచేశాయి. శాసనసభ్యుడు అయిన తర్వాత కూడ బైట వేదికల మీద మౌలిక ఆలోచనలు ప్రకటిస్తున్నాడు గాని శాసనసభ కేవలం బాతాఖానీ క్లబ్బు అనీ, అక్కడ నిజమైన ప్రజల విషయాలు చర్చించడానికి కనీస అవకాశం కూడ దొరకదని గుర్తించినట్టు కనబడడం లేదు. ఈ అంశంలో కొత్త దళిత రాజకీయాలలో అనుకూల, ప్రతికూల అంశాలు రెండూ ఉన్నాయి.
3. బోధించు, సమీకరించు, పోరాడు అనేది భారత సమాజంలో అత్యవసరమైన నినాదం. ఇక్కడ ఒక బూర్జువా ప్రజాస్వామిక విప్లవం కూడ జరగలేదు గనుక, వ్యక్తి రూపొందడమే జరగలేదు గనుక ఇక్కడ సమాజానికి బోధించవలసిన అవసరం చాల ఉంది. ఆ బోధన మౌలిక విషయాల మీద జరగకపోయినా, బోధన పేరుతో తప్పుడు చైతన్యం అందించడం జరిగినా, బోధకుల వ్యక్తి ఆరాధన పెరిగినా ఉన్న భూస్వామిక విలువల వల్ల సమీకరణ జరగవచ్చు గాని అది భజన బృందం వంటి సమీకరణే అవుతుంది. అటువంటి సమీకరణ తప్పుడు పోరాటాలు చేయడానికి పనికి వస్తుంది గాని కులనిర్మూలన కోసం, వ్యవస్థ పరివర్తన కోసం పోరాటానికి దారి తీయదు. కనుక బోధన (చైతన్యీకరణ), సమీకరణ, పోరాటం అనే మూడు అత్యంత కీలకమైన కర్తవ్యాలను చాల జాగ్రత్తగా, విశాలంగా, లోతుగా, నిశితంగా అర్థం చేసుకొని ఆచరించవలసి ఉంది. కొత్త దళిత రాజకీయాలలో చాల అవసరమైన, సముచితమైన బోధన, చైతన్యీకరణ, పోరాటం జరిగాయని ఇప్పటివరకూ సూచనలు ఉన్నాయి. ఈ అంశాలను మరింత బలోపేతం చేయాలి.
4. పాత దళిత రాజకీయాలు కుల అస్తిత్వాన్ని, ఉప కుల అస్తిత్వాన్ని ప్రధానం చేసి దళిత ఐక్యతకు, పీడిత ఐక్యతకు అవరోధాలు కల్పించాయి. తప్పనిసరిగా అంతరాల వ్యవస్థలో ప్రతి కులమూ ఏ వివక్షకు, అసమానతకు, నిరాదరణకు గురయిందో, ఏమి కోల్పోయిందో, సమాన హక్కులను ఎలా సాధించుకోవాలో ఆలోచించవలసిందే. ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా సంఘటితం కావలసిందే, ప్రత్యేక కార్యక్రమాలతో, ప్రత్యేక నినాదాలతో పోరాడవలసిందే. భారతదేశంలో కుల సమస్య పరిష్కారానికి అనివార్యమైన నిర్దిష్ట కర్తవ్యం ఇది. మరీ ముఖ్యంగా దోపిడీ పీడనలకు గురైన కులాలన్నిటికీ ఈ కర్తవ్యం ఉంటుంది. కాని అదే సమయంలో ఏ ఒక్క పీడిత కులమైనా సంఖ్య రీత్యా బలమైనది కాదు గనుక, ఈ సమాజంలో తరతమ భేదాలతో మరెన్నో కులాలు అటువంటి పీడననే అనుభవిస్తున్నాయి గనుక ఇతర పీడిత కులాల సంఘీభావాన్ని కూడగట్టడం అత్యవసరం. ఈ క్రమంలో అంతిమ లక్ష్యమైన కులనిర్మూలనను మరచిపోకుండా ఉండడం అత్యవసరం. కమ్యూనిస్టులు కులాన్ని విస్మరించి వర్గ ఐక్యత కోరారని విమర్శించిన పాత దళిత రాజకీయాలు కూడ పార్లమెంటరీ ఎన్నికల ఎత్తుగడగా ఆదివాసి దళిత బహుజన మైనారిటీ ఐక్యత అనే నినాదాన్ని ఎన్నోసార్లు ఇచ్చాయి. అంటే మళ్లీ వర్గ ఐక్యతనే ప్రతిపాదించాయి. ఆ అవకాశవాదాన్ని, పార్లమెంటరీ ఎత్తుగడలను అధిగమించి, ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనా కోసం, ఫాసిజాన్ని ఓడించడం కోసం విశాల పీడిత ఐక్యత కావాలని నినదించడం కొత్త దళిత రాజకీయాలు ముందుకు తెచ్చిన ఆహ్వానించదగిన నినాదం. దీన్ని బలోపేతం చేయవలసి ఉంది.
5. కొత్త దళిత రాజకీయాలు గత రెండు సంవత్సరాలలో జరిపిన పోరాటాలు, ప్రదర్శించిన సమరశీలత పరిమాణంలో తక్కువే కావచ్చు గాని అవి భిన్నమైనవి, కొత్త రకమైనవి, దళిత రాజకీయాలలో ఇంతవరకూ లేనివి. పాత దళిత రాజకీయ నాయకత్వం ఉద్దేశపూర్వకంగా విస్మరించినవి. ఆ నేపథ్యంలో కొత్త దళిత రాజకీయాలు దేశవ్యాప్తంగా విప్లవ ప్రగతిశీల శక్తులలో కొత్త ఆశలు నింపాయి. దళిత శక్తులలో, మొత్తంగా పోరాటశక్తులలో భవిష్యత్తు పట్ల ఆశను రేకెత్తించాయి. మౌలిక పరిష్కారాన్నీ, తక్షణ, తాత్కాలిక పరిష్కారాలనూ మేళవించడం ద్వారా అవి కొత్త వ్యూహాలకూ, ఎత్తుగడలకూ, పోరాటాలకూ వాగ్దానం చేస్తున్నాయి. ఈ అంశాన్ని బలపరచడం, సంఘటిత పరచడం విప్లవ ప్రగతిశీల శక్తుల కర్తవ్యం.

(ఈ వ్యాసానికి తొలిరూపం ఫిబ్రవరి 11న డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జనగామ జిల్లా సదస్సులో చేసిన ప్రసంగం)

(రచయిత వీక్షణం సంపాదకుడు) వీ

రైతులకు ఎగనామం పెట్టే ఈ-నామ్

రైతులకు ఎగనామాలు పెట్టే ఈ-నామ్ లాంటి కంటి తుడుపు చర్యలు మానుకొని వారిని ఆత్మహత్యల నుండి కాపాడే దీర్ఘ కాలిక ప్రణాళికలు రూపొందించాలనీ, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా రైతులు పోరుబాట పడతారనీ హెచ్చరిస్తున్నారు **డా. లక్ష్మణ్ గడ్డం**

ఆరుగాలం శ్రమించి దేశ ప్రజలకు అన్నం పెడుతున్న రైతులు ఆత్మహత్యలకు పాల్పడడం భారత దేశంలో అత్యంత విషాదకరం. ఏ దేశంలోనూ ఇంతటి విపత్కర పరిస్థితులుండవు. ఏడు దశాబ్దాల కాలంలో ఎందరో నాయకులు వచ్చారు పోయారు కాని వాయువులో కలిసి పోయే రైతుల ప్రాణాలను అపలేక పోయారు. కష్టాల ఊబిలో కూరుకుపోయిన వ్యవసాయ రంగాన్ని గట్టెక్కించలేక పోయారు. ఊక దంపుడు ఉపన్యాసాలకు, శుష్క హామీలకు మాత్రమే పరిమితమయ్యారు. ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం వ్యవసాయ రంగం లాభసాటిగా కొనసాగించే విధంగా ప్రణాళికల రూపకల్పన చేయలేక పోయారు. వ్యవసాయేతర రంగానికి లభించిన ప్రణాళికాబద్ధమైన విధాన రూపకల్పన వ్యవసాయ రంగానికి ఒనగూర్చలేకపోయారు. అరకొర చర్యలు, కడుపు నింపని వాగ్దానాలు రైతులను ఆత్మహత్యల పరంపర నుండి నిలవరింపలేక పోయాయి. రైతాంగ సంక్షోభ నివారణకు ప్రభుత్వం చేపడుతున్న నిర్దిష్టమైన చర్య రుణమాఫీ ఒక్కటి మాత్రం గానే కనబడుతున్నది.

వ్యవసాయోత్పత్తుల మార్కెటు నియంత్రణ నిమిత్తం వ్యవసాయోత్పత్తుల విపణి చట్టాన్ని (ఎపిఎంసిఎ) దేశవ్యాప్తంగా అమలు పరచబడింది. కాని అవసరమైన ఫలితాలను ఇవ్వలేకపోయింది. మధ్యవర్తులతో నిండి పోయిన వ్యవసాయ మార్కెటులో రైతులు మరింత దగా పడ్డారు. ఇప్పటి వరకు అమలు పరచబడ్డ సంస్కరణలు కాని, నియమించబడ్డ కమిటీల సిఫారసుల అమలుకాని రైతులను రక్షించలేక పోయాయి. అయితే దేశంలోని అన్ని రాష్ట్రాలకు వర్తించేలా కేంద్రం ఒక నమూనా వ్యవసాయోత్పత్తుల మార్కెటు కమిటి (ఎపిఎంసి) చట్టాన్ని రూపొందించింది.

దేశంలోని అన్ని రాష్ట్రాల కంటె ముందు కర్నాటక రాష్ట్రం చొరవ తీసుకుని మాడల్ వ్యవసాయోత్పత్తుల మార్కెటు కమిటి చట్టాన్ని అమలు పరిచింది. ఇందుకు గాను అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలనే సంకల్పంతో ఎన్‌సిడిఇఎక్స్ (నేషనల్ కమాడిటి అండ్ డెరవేటివ్సు ఎక్స్చేంజి) సహాయంతో వ్యవసాయోత్పత్తుల మార్కెటు విధివిధానాల పథకాన్ని 2012-13లో రూపొందించింది. ఈ పథకాన్ని కర్నాటక ప్రభుత్వం 22 ఫిబ్రవరి 2014లో లాంఛనప్రాయంగా ప్రారంభించింది. ఈ పథకం ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రాథమిక మార్కెట్లు కలిపి ఏకీకృత మార్కెటుగా ఆవిర్భవించబడ్డాయి. దీని ప్రకారం రైతు తాను పండించిన పంటను దేశంలోని వ్యాపారస్తులకు ఆన్‌లైన్ విధానంలో ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు వీలుంటుంది. ఈ పద్ధతిని కర్ణాటక ప్రభుత్వం రాష్ట్రీయ ఈ-మార్కెటు సేవలు ప్రైవేటు లిమిటెడ్ (ఆర్ఇఎంఎస్) ద్వారా అమలు పర్చింది. ఈ సంస్థ మార్కెటుకు వచ్చిన ప్రతి రైతుకు ఒక గుర్తింపు సంఖ్యను యిచ్చి రైతు పంట నాణ్యతను బట్టి గ్రేడింగు చేసి ఆర్ఇఎంఎస్ పోర్టల్‌లో బహిరంగ పరుస్తారు. కొనుగోలుదారులు కూడా అలాంటి గుర్తింపు నంబరు పొందిన తర్వాత ఉత్పత్తుల ధర ఆన్‌లైన్‌లోనే ప్రకటిస్తారు. ఈ ధర రైతుకు సమ్మతమైతే టివి తెరపై అంతిమంగా ప్రదర్శించబడుతుంది. ఈ పద్ధతి వల్ల మధ్యవర్తుల తొలగింపు జరగడమే కాక చెల్లింపులు కూడా ఆన్‌లైన్ ద్వారా అదే రోజు జరుగుతాయి. ఈ విధానం కర్ణాటకలో విజయవంతైందని చెప్పవచ్చు.

కర్ణాటక రాష్ట్రం సాధించిన విజయంతో ఉత్తేజం పొందిన కేంద్ర ప్రభుత్వం ఈ-నామ్ మాడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేయాలని నిశ్చయించింది. జాతీయ విపణిలో రైతులకు, వినియోగదారులకు లబ్ది చేకూరుతుంది. ఇందుకు గాను ఆర్థిక అంశాల కాబినేటు కమిటి జులై 1, 2015న రు. 200 కోట్లు కేటాయించింది. దేశంలో మార్చి 2018 నాటికి 585 మండీలలో ఇ-ప్లాటుఫాంను ఏర్పాటు చేయడానికి నిశ్చయించింది. మండీలలో అవస్థాపన సౌకర్యాల నిమిత్తం రు. 30 లక్షల కేటాయింపుతో బాటు సంబంధిత సాఫ్ట్‌వేర్‌ను ఉచితంగా అందజేస్తుంది.

ఈ మార్కెటు జాతీయ విధానాన్ని ప్రధాన మంత్రి నరేందర మోడి దేశంలో 14 ఏప్రిల్ 2016న ప్రారంభించారు. మొదటి దశలో గుజరాత్, తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లోని 21 మండలాలలో ప్రవేశ పెట్టబడింది. ప్రస్తుత బడ్జెట్‌లో ఈ-నామ్ పథకం కింద ప్రతి మండికి రు. 75 లక్షలు కేటాయించారు. ఇందులో నిర్వహణ ఖర్చుల కింద రు. 30 లక్షలు వెచ్చించాలి. మిగిలిన మొత్తాన్ని వసతుల మెరుగుదలకు ఖర్చు చేయాలి.

అయితే ఈ గ్రాంటు పొందదలచిన ఎపి ఎంసిలు కొన్ని సంస్కరణలు ఆవశ్యకంగా చేపట్టాలి అవి వ్యాపారులకు రాష్ట్ర వ్యాప్తంగా అమలయ్యే లైసెన్సు అందించడం, మార్కెటు రుసుములను ఒకే చోట విధించి వసూలు చేయడం, వ్యవసాయ ఉత్పత్తులకు ఇ-వేలం వేదికను ఏర్పాటు చేయాలి. ఈ-నామ్ విధానం వల్ల వ్యవసాయ మార్కెటులో పోటీతత్వం బలపడి, పాదర్శకత పెరుగుతుంది. దళారుల ప్రమేయం కనుమరుగవుతుంది. కనుక నష్టాలను నివారించవచ్చు. వినియోగదారునికి ధరలు తగ్గడం వల్ల మరింత ప్రయోజనం కలుగుతుంది. మొత్తంగా ఈ పరిణామం దేశంలో వ్యవసాయోత్పత్తులు గణనీయంగా పెరిగే అవకాశాలు ఏర్పడుతాయి.

కావున వ్యవసాయ రంగంలో ఈ మార్కెటింగు వ్యవస్థ దేశంలోని

అన్ని రాష్ట్రాలకు విస్తరిస్తున్నది. కేంద్ర వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం ఈ-నామ్ అమలులో ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ రాష్ట్రం రెండవ స్థానంలో నిలబడింది.

క్ర. సం.	ఈ-నామ్ అమలుపర్చిన రాష్ట్రం	మార్కెట్ల సంఖ్య	ఈ-నామ్ ద్వారా అమ్మిన పంట (టన్నులలో)	ఈ-నామ్ ద్వారా అమ్మిన పంట విలువ (రు. కోట్లలో)
1.	హర్యానా	54	7441.70	14117.05
2.	తెలంగాణ	44	1480.26	10777.14
3.	గుజరాత్	40	907.05	3393.16
4.	ఉత్తరప్రదేశ్	100	935.21	1301.98
5.	ఆంధ్రప్రదేశ్	22	293.10	563.02
6.	మధ్యప్రదేశ్	58	8541.00	365.31
7.	రాజస్తాన్	25	69.38	237.73
8.	చత్తీస్‌ఘడ్	14	94.58	195.40
9.	హిమాచల్‌ప్రదేశ్	19	35.52	128.14
10.	ఉత్తరాఖండ్	5	25.34	34.68
11.	ఒడిశ్శా	10	1.95	5.01
12.	మహారాష్ట్ర	45	1.55	4.32
13.	జార్ఖండ్	19	0.63	1.11

తెలంగాణ రాష్ట్రంలో మొదట వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్, నిజామాబాదు, హైదరాబాదు జిల్లా మార్కెట్లలో ఈనామ్‌ను ప్రవేశ పెట్టారు. హైదరాబాదు మలక్‌పేట మార్కెట్‌లో మాత్రమే దీనిని ప్రవేశ పెట్టారు. ఆ తర్వాత అది 44 మార్కెట్లకు విస్తరించింది. త్వరలో మరో 16 మార్కెట్లకు విస్తరించనున్నారు.

ఈ-నామ్ సమర్థవంతంగా అమలు పరచడంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచినందుకుగాను నిజామాబాదు మార్కెటుకు ప్రధానమంత్రి స్వయంగా అవార్డు అందజేశారు. అయితే మధ్య దళారులు లేకుండా కొనుగోలుదారులకు, బడా సంస్థాగత కొనుగోలుదారులకు కూడా రైతులు నేరుగా తమ పంటని ఆన్‌లైన్ విధానంలో అమ్మి అదే రోజు ఆన్‌లైన్ ద్వారా తమఖాతాలో నగదు పొందే విధానం వినడానికి ఇంపుగానే ఉండవచ్చు. అద్భుతంగా అనిపించవచ్చు కాని ఆ కార్యాచరణలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.

2014లో అధికారంలోకి వచ్చిన నరేంద్రమోడీ 2022 కల్లా రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని గంభీరంగా ప్రకటించారు. అయితే అందుకవసరమైన ఏ చర్యలు తీసుకోలేదు. ఆ లెక్కను పరిగణనలోకి తీసుకుంటే ఈ పాటికి రెట్టింపులో సగం ఆదాయం పెరిగి ఉండాలి. కాని అలాంటి గణాంకాలు వివరించే ఆధారాలేవి లేవు. అటు దిశగా అడుగులే పడలేదు. మరొక వైపు నిత్యం ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి.

భారత రైతాంగం ఇప్పటికీ ప్రైవేటు వ్యక్తుల రుణాల కబంద హస్తాల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నారు. రైతులు తమకు కావల్సిన పంట రుణాలు, ఇతరత్రా అవసరాల రుణాలు బ్యాంకులు తీర్చలేకపోతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి పెట్టుబడి సమకూర్చుకుంటున్నారు. ఇందుకు గాను రైతు పండించిన పంటను వడ్డీ వ్యాపారులే అతి తక్కువ ధరకు కొని తను ఇచ్చిన అప్పుకింద జమ చేసుకుంటున్నాడు. అలా కొన్న సరుకుని ఎక్కువ దరకు మార్కెట్‌లో అమ్ముకుంటున్నాడు. రైతు మాత్రం అప్పుల ఊబి నుండి బయట పడలేకపోతున్నాడు. అప్పు తీర్చే దారి కనబడక, దిక్కు తోచని స్థితిలో గత్యంతరం లేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నాడు. పరిస్థితులకు వెరవక మొండిగా నిలబడ్డ వారు మాత్రం పోరాటబాట పడుతున్నారు.

మహారాష్ట్రలో రైతులు ఇటీవల చేపట్టిన 'మహా పాదయాత్ర' ఈ కోవలోకే వస్తుంది.

రైతులను ఆదుకోవడానికి పాలకులకు కనబడేది 'రుణమాఫీ' అనే పదం ఒక్కటే. ఈ చర్య తాత్కాలిక ఊరట కల్పిస్తుంది తప్ప శాశ్వత పరిష్కార మార్గం కాదు. దీర్ఘకాలిక నూతన సృజనాత్మక ప్రణాళికలు రూపొందించి వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుంచి రక్షించాలి.

భారత రైతాంగం అధిక శాతం నిరక్షరాస్యతతో నిండి ఉంది. నిరక్షరాస్యులైన రైతులకు ఈ-మార్కెట్ మెళకువలు పూర్తి స్థాయిలో అర్థమవుతాయను కోవడం అవివేకం. నిరక్షరాస్యత మూలంగా రైతులు సులభంగా మోసాల బారినపడుతారు.

మధ్య దళారీలు రింగుగా ఏర్పడి చేసే మోసాలను పసిగట్టలేక పోతారు. సరుకు మార్కెట్‌కు రాకుండా దారిలోనే రైతుతో మాట్లాడుకుని సరుకును నేరుగా వారి గోడౌన్లకు తరలిస్తున్నారు. దీంతో మార్కెటుకు రావల్సిన ఆదాయం గణనీయంగా తగ్గుతుంది. పైగా రైతులను బురిడీ కొట్టించి సరుకును తక్కువ ధరకు కొనేసి బహిరంగ మార్కెట్‌లో రెట్టింపు ధరకు అమ్ముకుంటారు.

రైతులకు ఎగనామాలు పెట్టే ఈ-నామ్ లాంటి కంటి తుడుపు చర్యలు మానుకొని రైతులను ఆత్మహత్యల నుండి కాపాడే దీర్ఘ కాలిక ప్రణాళికలు రూపొందించాలి. రైతులకు వ్యవసాయం నష్టంగా తయారయింది.

భూ విభజన పెరిగింది. భూసారం తగ్గిపోయింది. సాగునీటి వసతి లేదు. పరపతి, పనిముట్లు అందుబాటులో లేవు. ఎరువులు, విత్తనాలు భారమయ్యాయి. ఈ పరిస్థితులను తారుమారు చేయగలిగే చిత్తశుద్ధి ఉండాలి.రైతుకు సంబంధించి ప్రతి ఆర్థిక అవసరాన్ని తీర్చే పరపతి బ్యాంకులు ఏర్పాటు చేయాలి.

ప్రతి రైతుకు చెందిన భూకమతాన్ని ఖచ్చితంగా భూమి పరీక్షలు చేపట్టాలి. దిగుబడిని పెంచే సాంకేతిక పరిజ్ఞానాన్ని, నాణ్యమైన వంగడాలను సమకూర్చాలి. సహజ పంటలతో బాటు వానిజ్య పంటలను ప్రోత్సహించాలి.

తాను పండించిన పంటకు తానే ధర నిర్ణయంచి ప్రపంచంలో ఎక్కడైనా అమ్ముకునే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అధిక ఆదాయం అందించేందుకు గాను అగ్రీ ప్రాసెసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను నెలకొల్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రైతు సంక్షేమం పాలకులకు ఓట్ల నినాదంగా మారిపోవడమే పెద్ద విషాదం. మహారాష్ట్ర రైతుల పోరాటబాట దేశవ్యాప్త రైతాంగానికి ఆదర్శం కావాలి.

(అధ్యక్షుడు, పౌరహక్కుల సంఘం) వీ

ఈశాన్య భారత్‌లో ఎన్నికల ప్రాముఖ్యత

ఈశాన్య భారతంలో వామపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు ఒకటొకటిగా బిజెపి చేతుల్లోకి వెళ్తున్నాయనీ, ఈ పరిణామాలు ముమ్ముందు ఏ దుష్పరిణామాలకు దారితీస్తాయో పరిశీలించాలనీ అంటున్నారు ఎం. కృష్ణ ఆదిత్య

ఈశాన్య భారత్‌లోని మూడు రాష్ట్రాల్లో (త్రిపుర, నాగాలాండ్, మేఘాలయ) 2018 మార్చ్ 3న ఎన్నికల ఫలితాలు బిజెపికి లాభించాయి. ముఖ్యంగా త్రిపురలో బిజెపి గెలుపు అపూర్వం, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి గెలుపుని ఎవ్వరూ ఆపలేరన్న అభిప్రాయాన్ని ప్రచారం చేశారు.

అయితే ఆ తర్వాత జరిగిన, మార్చి 14న ఫలితాలు వచ్చిన మూడు లోక్‌సభ సీట్లలోనూ బిజెపి ఓడిపోవడంతో ఆ పార్టీ అంత అజేయమైన దేమీ కాదని తేలిపోయింది. 3 రాష్ట్రాల ఎన్నికలు ఒక ఎత్తయితే, మూడు లోక్‌సభ సీట్లలో ఎన్నికలు మరో ఎత్తు. వేటి రాజకీయ ప్రాముఖ్యత వాటిదే. అయినా లెక్కల పరంగా చూసినా – మూడు లోక్‌సభ సీట్లలోనూ కలిపి సుమారు 56.77 లక్షల ఓటర్లు ఉన్నారు. వాటిల్లో బిజెపికి 11.64 లక్షల ఓట్లు (20.6 శాతం) వచ్చాయి. కాగా అక్కడ గెలిచిన బిజెపియేతర పార్టీలకు (ఎస్‌పి, ఆర్‌జెడీ) 13.08 లక్షల ఓట్లు (23.13 శాతం) వచ్చాయి.

అంతకు ముందు వరుసలోనూ (2018 ఫిబ్రవరిలో) మూడు లోక్‌సభ సీట్లకు ఎన్నికలు జరిగాయి. మొత్తం 52.46 లక్షల ఓట్లు. రాజస్థాన్‌లోని అజ్మీరు, అల్వారు రెండుచోట్లా అధికార పార్టీ బిజెపి ఓడిపోయింది; బెంగాల్ ఉలుబేరియాలోనూ తృణమూల్ కాంగ్రెస్ చేతుల్లో ఓడిపోయింది. ఆ మూడు స్థానాల్లో ఓడిన బిజెపికి మొత్తం 12.66 లక్షల ఓట్లు రాగా, గెలిచిన పార్టీలకు 20.20 లక్షల ఓట్లు వచ్చాయి. నిజానికి 2014 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి/మోదీ గెలుపు తర్వాత 22 లోక్‌సభ స్థానాల్లో ఉప ఎన్నికలు జరుగగా, అందులో మూడు మాత్రమే బిజెపి గెలిచిందని రిపోర్టులు చూపెడుతున్నాయి.

కాగా మూడు ఈశాన్య రాష్ట్రాల్లోనూ కలిపి 51 లక్షల ఓటర్లు ఉన్నారు. అంటే మూడు లోక్‌సభ సీట్లలోని ఓట్లకన్నా కాస్త తక్కువ. అయినా మూడు రాష్ట్రాల్లో గెలుపుకి రాజకీయ ప్రాముఖ్యత ఎక్కువగా ఉంటుంది.

ఈశాన్య రాష్ట్రాల్లోని గెలుపులోనూ బిజెపి పరిమితిని చూడవచ్చు. నాగాలాండ్‌లో మొత్తం పోలయిన ఓట్లు 10 లక్షలు మాత్రం. (ఇతర రాష్ట్రాల్లో ఒక అసెంబ్లీ సీటుతో సమానం); అందులో 15 శాతం బిజెపికి వచ్చాయి. మేఘాలయలో పోలైన 16 లక్షల్లో బిజెపికి 1.51 లక్షలు (10 శాతం లోపు) వచ్చాయి.

ఓట్లు, సీట్లు – త్రిపురలో గెలుపు రాజకీయ ప్రాముఖ్యత

అన్నింటిలోకీ త్రిపురలో బిజెపి గెలుపు రాజకీయ ప్రాముఖ్యత కలది. అక్కడి 25 లక్షల ఓటర్లలో దాదాపు 91 శాతం ఓటింగులో పాల్గొన్నారు. బిజెపి 'బ్రహ్మాండంగా' గెలిచినట్టున్నా, మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, విడిగా చూస్తే బిజెపికి సుమారు 10 లక్షల ఓట్లు (పోలయిన ఓట్లలో 43 శాతం) రాగా, సిపిఎంకి 9.92 లక్షల ఓట్లు (42.7 శాతం) వచ్చాయి; రాష్ట్రంమొత్తంలో రెంటికీ మధ్య ఓట్ల తేడా 6518 మాత్రమే. అయినా సిపిఎంకి 16 సీట్లు, బిజెపికి 36 సీట్లు వచ్చాయి! కాగా గెలిచిన కూటమికి 51.56 శాతం ఓట్లు (బిజెపి మిత్రపక్షమైన గిరిజనపార్టీ, ఐపియఫ్‌టికి వచ్చిన 7.5 శాతం కలిపి)44 సీట్లు; ఓడిన వామపక్ష కూటమికి 44.9 శాతం ఓట్లు,16 సీట్లు వచ్చాయి. (సిపిఐకి 0.8 శాతం, ఫార్వర్డు బ్లాకు 0.6 శాతం ఆర్ఎస్‌పికి 0.8 శాతం). 2013లో 44 శాతం ఓట్లు వచ్చినా 10 సీట్లు మాత్రమేదక్కి కాంగ్రెసు నష్టపోయింది. 2008లో, 2013లో సిపిఎం కూటమికి 51–52 శాతం ఓట్లతో49–50 సీట్లరూపంలో లాభించింది; అదేస్థాయిలో (51.56 శాతం) ఓట్లు వచ్చినా బిజెపి కూటమికి ఈసారి 44 సీట్లే వచ్చాయి. ఈ లెక్కల దృష్టితో చూస్తే అపూర్వమైన గెలుపూ లేదు, ఓటమీ లేదు అని గమనించవచ్చును.

డబ్బు, సారా, కులం, మతం, కండబలం; ప్రభుత్వంలో, మీడియాలో పైచేయి; ఓట్ల జాబితాలో మోసాలు – వీటన్నిటితో మనదేశంలోని ఎన్నికలు మౌలికంగా అప్రజాస్వామికంగా తయారైనాయి. వీటికితోడు ఓట్లతేడా స్వల్పంగా ఉన్నా, సీట్లలో చాలా తేడా రావడం మన దేశంలోని ఎన్నికల వ్యవస్థ ప్రత్యేకత. సీట్లని చూపెట్టి 'విజయం' అంటుంది గెలిచిన పార్టీ. ఓట్లని చూపెట్టి అంత ఓటమేమీ కాదు అంటుంది ఓడిన పార్టీ.

ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రంలో గెలుపుకన్నా, మొత్తం 25 లక్షల ఓట్లే ఉన్న త్రిపురలో గెలుపుకి ప్రాముఖ్యత ఉందని, ఇది బ్రహ్మాండమైన 'సైద్ధాంతిక విజయం' అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. వామపక్ష పార్టీతో బిజెపి ప్రత్యక్షంగా తలపడి, గెలిచిన మొదటి ఎన్నిక అని కొందరు రాజకీయ విశ్లేషకులు అన్నారు. ఓడిపోయినా, సిపిఎంకి దాదాపు 43 శాతం ఓట్లు వచ్చాయన్నది గమనార్హం – అని ధైర్యం చెప్పారు వ్యాఖ్యాత విజయ్‌ప్రసాద్ (లెఫ్ట్ వర్డ్‌బుక్స్ ప్రచురణ సంస్థ సంపాదకులు). వామపక్ష – కాంగ్రెసు మైత్రి అవసరాన్ని ఇది నొక్కి చెపుతున్నదని కొందరు సెక్యులర్ వాదులు వాదించారు.

త్రిపురలో ఫలితాలు వెలువడిన నాటి నుంచి గెలిచినపక్షాలు తమపై దాడులు భారీస్థాయిలో సాగించాయని సిపిఎం ఆరోపించింది. 600 పార్టీ ఆఫీసుల వశం, 1500 మంది తమ అనుచరుల ఇళ్లపై దాడులు, 200 ఇళ్లు, 134 ఆఫీసుల దగ్ధం, 700 మందికి గాయాలు, రెండుచోట్ల లెనిన్ విగ్రహాల విధ్వంసం మొదలైనవి. ప్రధాన కార్యదర్శి ఏచూరి వంటివారు త్రిపుర వెళ్లి సందర్శించారు కూడా.

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ తమ కేంద్ర అధికారాన్ని,

నిధులను, రాజకీయ (కేంద్రమంత్రుల) బలాన్ని, సాయుధ బలగాలను ప్రయోగించి, ఫలితాలను ప్రభావితం చేయడం గమనించాల్సిన అంశం. కేంద్రంలో అధికారంలో ఉన్న బడా బూర్జువా పార్టీగా బిజెపి స్థలం, సందర్భం బట్టి హిందూ మతోన్మాదాన్ని నియంత్రించి వాడుకుంటున్నది. ఈశాన్య భారత్‌లో క్రైస్తవుల జనాభాని దృష్టిలో పెట్టుకొని ఈసారి క్రైస్తవులను జెరూసలెం పంపిస్తామని ఎన్నికల్లో ప్రచారం చేసింది; అలాగే కొన్నిచోట్ల రెచ్చగొడుతున్న గొడ్డుమాంసం సమస్యను ఇక్కడ పక్కన పెట్టింది. నేను గొడ్డుమాంసం తింటాను, ఎవరాపగలరు? అని కేంద్రమంత్రి రిజిజూ (బిజెపి నాయకుడు) బాహాటంగా ప్రకటించాడు.'భారతమాత చిత్రాన్ని ఈశాన్యభారత మహిళ కట్టుబొట్టుతో మార్చి, ప్రచురించి, ప్రచారం చేశారు. త్రిపురలో గెలుపుకి 2000 కోట్ల రూపాయల దాకా – సగటున ఓటుకి 8000 రూపాయలు ఖర్చు పెట్టారని ఆరోపణ.

ఇంతకన్నా గమనించాల్సిందేమిటంటే బిజెపి గిరిజన, ఆదివాసీ తెగల్లోకి క్రమబద్ధంగా ప్రవేశించడం. గతంలో ఒరిస్సాలో, గుజరాత్‌లో అలా ప్రవేశించి, వారిని హిందూమతోన్మాద దాడులకు సైతం వాడుకో గలిగింది. ప్రత్యేక రాష్ట్రవాదాన్ని బలపరిచి, గిరిజనం హెచ్చుగా ఉన్న ఛత్తీస్‌ఘడ్‌లో, జార్ఖండ్‌లో అధికారంలోకి వచ్చింది; ఆదివాసీ ప్రాంతాల్లో స్కూళ్లు, హాస్టళ్లు, సంక్షేమ కార్యక్రమాలు సాగించి బలపడింది. ఇప్పుడు త్రిపురలో హిందుత్వని (బెంగాలీ ముస్లింలకు వ్యతిరేకంగా), మిత్రపక్షం ద్వారా గిరిజన రాష్ట్ర డిమాండుని ఆచితూచి వాడుకుంది. ప్రత్యేక రాష్ట్రాన్ని వ్యతిరేకిస్తున్న బెంగాలీలు దూరం కాకుండా రెండు నాల్కల విధానాన్ని అనుసరించింది. లోగడ కాంగ్రెసు కేంద్రంలోని తన అధికారాన్ని, ప్రత్యేకించి హోంశాఖను, అర్ధసైనిక బలగాలను ఉపయోగించి, గిరిజన గుర్తింపు రాజకీయాలను రెచ్చగొట్టి వాడుకుంది. సాయుధ తిరుగుబాటుదార్లను, హింసను ప్రేరేపించి, సిపిఎంను దెబ్బతీసింది. 1988లో అలాగే అధికారంలోకి వచ్చింది. 2018లో అదేవిధంగా దౌర్జన్యం చేసి బిజెపి అధికారంలోకి వచ్చింది. ఎన్నికలు కాగానే చెలరేగిన దౌర్జన్యకాండ దాని పరాకాష్టే.

1947కి ముందు త్రిపుర రాజ్యంలో ఆదివాసులు మెజారిటీ జనాభాగా ఉండేవారు. దేశవిభజన సమయంలోనూ, బంగ్లాదేశ్ ఏర్పాటుకి ముందూ, తర్వాతా తూర్పు పాకిస్తాన్ నుంచి పెద్ద ఎత్తున బెంగాలీలు వచ్చారు. ఈ వలసలను కేంద్రం రాజకీయ ప్రయోజనాలతో ప్రోత్సహించింది. బంగ్లాదేశ్ ఏర్పాటుకి దారితీసిన విస్తరణవాద యుద్ధానికి సాకుగా ఈ శరణార్థుల సమస్యను వాడుకున్నది. ఒక బెంగాలీ పార్టీలాగా వ్యవహరించి సిపిఎం కూడా అదే పద్ధతిని అనుసరించింది. ఈ క్రమంలో త్రిపురలో ఆదివాసుల జనాభా నిష్పత్తి 1901లో 53 శాతం నుంచి 1981లో 28.44 శాతం కి తగ్గింది (ఇప్పుడు 31 శాతమని చెప్తున్నారు). మెజారిటీని మైనారిటీగా తారుమారుచేసిన ఆధిపత్యవాద రాజకీయాలివి. త్రిపుర ఆదివాసుల్లో నిరసనకు ఒక మూలం ఇదే. దాన్ని కేంద్రం (నాడు కాంగ్రెసు, నేడు బిజెపి) వాడుకున్నది. సిపిఎం అనుసరించిన సంస్కరణవాద రాజకీయాలు దీన్ని పూర్తిగా నిలువరించ లేకపోయాయి. గిరిజనులను 'ఉద్ధరించే' సంస్కరణవాద బెంగాలీ పార్టీగా మాత్రమే ప్రవర్తించింది. దీన్ని వ్యతిరేకించే గిరిజన వర్గాలు దేశం నుంచి విడిపోతామన్న నినాదంతో సాయుధ తిరుగుబాట్లు చేశాయి. లోగడ టిఎన్‌వి పేరిట, ఇప్పుడు ఐపిఎఫ్‌టి పేరిట ఉన్న ఆ శక్తులను కేంద్రం వాడుకున్నది. ప్రస్తుతం విడి రాష్ట్రం డిమాండుతో ఐపిఎఫ్‌టి పనిచేసున్నది.

గిరిజన సమస్య మౌలికంగా భూమిహక్కుల సమస్య

ఈ విషయం దేశమంతటా వర్తించేదే. ఆ సమస్యపై పోరాటాల వల్లనే త్రిపురలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ బలం సంపాదించుకున్నది. కొద్దిపాటి సంస్కరణలతో సిపిఎం ఆ బలాన్ని కొనసాగించింది. నిరక్షరాస్యత నిర్మూలన, గ్రామీణ ఉపాధి కార్యక్రమం అమలు, కనీస వైద్య వసతులు – ఈ రంగాల్లో కొంత ప్రగతి ఉంది. కానీ ఇటీవలి కాలంలో సిపిఎంలో అవినీతి, పక్షపాతం, అధికార దుర్వినియోగం కూడా ప్రబలంగానే తయారైనాయి. త్రిపురలోని భూసంస్కరణల ద్వారా – ఇతర రాష్ట్రాలలో లాగానే – భూమిలేని పేదలకు, ముఖ్యంగా గిరిజనులకు, భూమి లభించలేదు. 'దున్నేవాడికే భూమి నినాదంగానే మిగిలిపోయింది. గుర్తింపు సమస్యకు ఇది తోడయింది. 1988 ఎన్నికల్లో కాంగ్రెసు, ఇప్పుడు బిజెపి గిరిజనుల్లోని అసంతృప్తిని రెచ్చగొట్టి గెలువగలిగాయి.

ఇటీవలి కాలంలో అభివృద్ధి పేరిట, అటవీ సంరక్షణ పేరిట పేదల, ముఖ్యంగా గిరిజనుల భూమి హక్కులు హరించి వేయబడుతున్నాయి. ఈ విషయంలో సిపిఎంతో సహా అన్ని అధికారపార్టీల విధానం మౌలికంగా ఒకే విధంగా ఉంది. బెంగాల్‌లో నందిగ్రాం, సింగూర్‌లలో ఈ సమస్యను వాడుకునే తృణమూల్ కాంగ్రెస్ పైచేయి సాధించింది. కేరళలో ఎ.కె. ఆంటోని (కాంగ్రెసు) గిరిజనుల భూమిసమస్యను వాడుకొని సిపిఎంను దెబ్బతీశారు. కాంగ్రెసు పార్టీ మౌలిక పరిష్కారాలు చూపెట్టక పోవడంవల్ల మళ్లీ సిపిఎం త్రిపురలో, కేరళలో పుంజుకున్నది.

అభివృద్ధి పేరిట భూసంస్కరణ చట్టాలకు సైతం చిల్లులు పొడిచే ప్రక్రియ అన్ని రాష్ట్రాలలోనూ సాగింది. త్రిపురలో కూడా. కేరళలోలాగే త్రిపురలోనూ టీ ప్లాంటేషన్లకు భూమి సీలింగు చట్టం నుంచి మినహాయింపునిచ్చారు. గిరిజనులకు భూమి దక్కకపోవడానికి ఇదొక ముఖ్య కారణమైంది. కేరళలో గిరిజనుల జనాభా నిష్పత్తి చాలా తక్కువ (2 శాతంలోపు). కాగా త్రిపుర జనాభాలో 32 శాతం గిరిజనులే. వారిలో సిపిఎంపట్ల వ్యతిరేకతను బిజెపి రెచ్చగొట్టగలిగింది.

త్రిపురలో 62 శాతం భూమి అడవి భూమే. అక్కడ అటవీ సంరక్షణ పేరిట గిరిజనుల భూమి హక్కులు హరించబడుతున్నాయి. త్రిపురలోని గిరిజనులు సాంప్రదాయకంగా పోడురైతులు. స్థిర వ్యవసాయం వారిలో చాలా ఆలస్యంగా మొదలై, కొద్దిమోతాదులోనే ఉన్నది. అందువల్ల త్రిపురలో ఈ సమస్య తీవ్రరూపం దాల్చి ఉన్నది. అడవి భూమి 62శాతం పోగా, మిగిలిన 38 శాతం భూమిలో మంచిరకం సాగు భూమి తక్కువ గాను, ఎగుడు దిగుళ్లతో సాగుకి అనువుకాని భూమి (దీనిని 'టిల్లా' భూమి అంటారు) ఎక్కువగాను ఉన్నది. ఇటీవలి సవరణల్లో, 7.2 హెక్టార్లను మించరాదన్న సీలింగుతో, ఈ రెంటినీ ఒకేగాటన కట్టారు. పోడు చేసుకొనే గిరిజన రైతాంగాన్ని, కౌలుదార్లను అది దెబ్బతీసింది.

అభివృద్ధి పేరిట భూసంస్కరణల చట్టానికి చిల్లులు పెట్టడంతో భూమిలేని పేదల్లో అభద్రత, బేదఖళ్లు, నిరసన పెరిగిపోయాయి. ఈ

సవరణలు పది లక్షలమంది గిరిజన రైతాంగం భూమి హక్కులను హరించేవిగా ఉన్నాయి. అక్కడి భూచట్టంలో సిపిఎం కాలంలో తెచ్చిన సవరణలపట్ల గిరిజనుల్లో తీవ్రనిరసన చెలరేగింది. అయినా సిపిఎం ప్రభుత్వం స్పందించలేదు.

టీ ప్లాంటేషన్లు పాతబడి, వాటి ఉత్పాదకత, లాభాదాయకత తగ్గిపోతున్నది (ఇతర చోట్లలాగే). ఈ క్రమంలో, ముఖ్యంగా 1990ల తర్వాత, ఆ ప్లాంటేషన్లలోనే రబ్బరు తోటలు వేసుకుంటున్నారు. లక్షలాది గిరిజన రైతాంగం, రైతులుగాను, కౌలుదార్లుగాను రబ్బరు ఉత్పత్తిదారులైనారు. ధనికరైతులు కూడా ఉన్నారు. వారిలో బినామీలుగా గిరిజనేతరులూ ఉన్నారు. త్రిపురలాంటి చిన్న రాష్ట్రంలో ఏటా రు.700 కోట్ల విలువచేసే రబ్బరు పరిశ్రమ ఉన్నదంటే, దాని ప్రాముఖ్యతను అర్థం చేసుకోవచ్చును. టీ ప్లాంటేషను భూముల్లో రబ్బరు పెంచడాన్ని చట్టంలో సవరణలు నిషేధిస్తున్నాయి. అలా పెంచితే అలాంటి భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, అడవిగా ప్రకటిస్తున్నది. ఆ రబ్బరుని అటవీ ఉత్పత్తిగా పరిగణిస్తున్నారు. ఈ సవరణలు రైతులను, ముఖ్యంగా గిరిజనులను దెబ్బతీసేవిగా తయారైనాయి. రబ్బరుచెట్లు హెక్టారుకి 300కి మించి ఉండరాదని సీలింగ్ విధించారు. వెయ్యి చెట్లుంటే గానీ గిట్టుబాటుగా లేదని రైతులు భావిస్తున్నారు. లక్షహెక్టార్లలో రబ్బరు తోటలకి అవకాశం ఉండగా, అటవీ సంరక్షణ పేరిట 60వేల హెక్టారులను మాత్రమే అనుమతిస్తున్నారు.

క్షీణిస్తున్న టీతోటల్లో 28 వేలమంది (అందులో 15 వేలమంది క్యాజువల్సుగా) పనిచేస్తున్నారు. కాగా రబ్బరు తోటల్లో, 40 వేలమంది ప్రత్యక్షంగా, మరో 50 వేలమంది పరోక్షంగా పని చేసున్నారు. టీ తోటల పరిరక్షణ పేరిట రబ్బరుపై ఆంక్షలు గిరిజన రైతాంగాన్ని దెబ్బతీస్తున్నాయి. గ్రామీణ నిరుద్యోగం తీవ్రరూపం దాల్చింది. మరోవైపు త్రిపురలో పరిశ్రమలు, సర్వీసు సెక్టరు కూడా బలహీనంగా ఉన్నాయి. దానివల్ల చదువుకొన్న నిరుద్యోగ సైన్యం పెరిగిపోతున్నది. ఇలాంటిచోట్ల వ్యవసాయ సమస్యకు మరింత ప్రాధాన్యత ఉంటుంది. ఈ సమస్యలకు సిపిఎం ప్రభుత్వం పరిష్కారం చూపెట్టలేకపోయింది.

ఈ భూమి సమస్య ప్రాముఖ్యతను సిపిఎం నాయకులు విస్మరించారు. ఎన్నికల తర్వాతి సమీక్షల్లో కూడా ఆ సమస్య ప్రభావాన్ని గుర్తించడంలేదు. ఇలాంటి ఎన్నికల ఫలితాన్ని 'ఊహించలేదు' అన్నారు సిపిఎం కార్యదర్శి ఏచూరి. ఫలితాలు వచ్చిన కొద్ది వారాల తర్వాత ఈమాట అన్నారు. (హిందూ, 21-3-2018). 'ఏం చెప్పమంటారు? ఇలా ఎందుకు జరిగిందో చెప్పగల స్థితిలో లేమూ' అన్నారు త్రిపుర రాష్ట్ర సిపిఎం కార్యదర్శి బిజన్‌ధర్ (ది వీక్, 18-3-2018) బిజెపికే స్వంతంగా 35 సీట్లు వచ్చాయికదా అని ప్రశ్నించగా, ఈ సీట్ల ఒప్పందమూ, కూటమీ లేకపోతే 'మేము ఓడిపోయే వారిమే' అని స్పష్టంగా చెప్పారు సునీల్ దేవధర్. బిజెపి ఎన్నికల ప్రచారం నిర్వహణకు బయటినుంచి పంపబడిన కీలకనేత ఆయన. (ది వీక్ వారపత్రిక 18-3-2018).

సునీల్ దేవధర్ ఈశాన్య భారత్‌లో పని చేసిన ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు. అతడిని మోదీ గుజరాత్ ఎన్నికల్లో కాంగ్రెసు స్థానాల్లో వినియోగించి లాభపడ్డారు. తర్వాత ఢిల్లీలో ఆప్ పార్టీని నిలువరించ డానికి 2013లో ఉపయోగించారు. 2014 ఎన్నికల్లో మహారాష్ట్రలోని ఏకైక సిపిఎం సీటులో (పాల్ఘర్) ఆ పార్టీని ఓడించడానికి ప్రయోగించారు. అది అటవీ, ఆదివాసీ ప్రాంతం. అలాంటి అనుభవం గల ఆయనను సిపిఎం కేంద్రంగా ఉన్న త్రిపురకి పంపడం చాలా కీలకమైన నిర్ణయం. గత 3-4 సంవత్సరాలుగా ఆయన త్రిపురపై కేంద్రీకరించారు. త్రిపురలో సిపిఎంని తుడిచి పెడతామని మాట ఇచ్చాడు. బిజెపికే కాదు, భారత దళారీ బూర్జువా వర్గానికి కీలకమైన నిర్ణయం ఇది.

ఈశాన్య భారత్‌లో 'అభివృద్ధి వ్యూహం: వ్యూహాత్మక ప్రాధాన్యత'

సామ్రాజ్యవాదుల, భారత దళారీ బూర్జువావర్గం కళ్లు త్రిపురపై పడ్డాయి. ఇక అక్కడ అభివృద్ధి పేరిట జరిగేవన్నీ జరుగుతాయి. సిపిఎం హయాంలో కొత్త రైల్వేలైన్లు వేశారని, ఉన్న ఒకేఒక్క జాతీయ రహదారిని పొడిగించారని; అది త్వరలో బంగ్లా సరిహద్దుకు చేరుతుందని, అవతల ఉన్న చిటగాంగ్ రేవుకి దారి పడుతుందని, గతంలో త్రిపురలో చిన్న విమానాశ్రయం ఉండేదని, వారానికి 20 ఫ్లయిట్స్ మాత్రమే ఉండేవని, ఇప్పుడు 196 ఫ్లయిట్స్‌కు పెరిగిందని సిపిఎం కేంద్ర నాయకురాలు సుభాషిణీ అలీ చెప్పారు (ఎన్నికల ముందు). ఇవన్నీ కేంద్ర ప్రభుత్వం ద్వారా జరిగే అభివృద్ధి పనులని గమనించాలి. ఈ క్రమంలో ఎందరివో పేదలవి భూములు పోయాయి, కొంపలు కూలాయి. వారి అభివృద్ధి నమూనాయే అది! ఇవి ప్రజలకు కూడా కొంత ఉపయోగపడినా, ప్రధానంగా బడా బూర్జువావర్గం ప్రయోజనాల కోసమేనని అర్థం చేసుకోవచ్చును. ఆ నమూనానే ఆమె తమ గొప్పగా చెప్పుకున్నారు! ఈ ప్రాముఖ్యతవల్లనే చిన్న రాష్ట్రమైనా మోదీ రెండుసార్లు వచ్చి, త్రిపురలో కేంద్రీకరించారు. గత కొద్ది ఏళ్లుగా త్రిపుర గిరిజనుల్లో సంఘపరివార్ కృషిని ముమ్మరం చేసింది. 60 సీట్లలోనూ ముఖ్య కార్యకర్తలను బాధ్యులుగా నియమించారు. 2009లో 10 వేల మంది సభ్యులున్న బిజెపి 2015 నాటికి 1,75,000 స్థాయికి పెరిగింది. గత మూడేళ్లలో 52 మంది కేంద్ర మంత్రులు త్రిపురలో పర్యటించి డబ్బుతో, అధికారంతో – అప్పటికే క్షేత్రస్థాయిలో చేసిన కృషిని సంఘటితపరిచి, సొమ్ము చేసుకున్నారు. 2016 పంచాయితీ ఎన్నికల నాటికి బిజెపి ఓటు 18 శాతానికి పెరిగింది; 121 సీట్లు గెలుచుకున్నారు.

ఇది బిజెపిదే కాదు, దళారీ బూర్జువావర్గం నిర్ణయం. వారి పక్షాన చేసిన కృషి ఫలితం. చిన్న రాష్ట్రం, పేద రాష్ట్రం అయిన త్రిపురలో (ఒక అంచనా ప్రకారం) దాదాపు 2000 కోట్ల రూపాయలు ఖర్చుచేసి, నాయకులను, కార్యకర్తలను కొనివేశారు. కాంగ్రెసు గంపగుత్తగా అమ్ముడు పోయింది. 2013లో 36.5 శాతం ఓట్లు ఉండేవి; ఈసారి 1.8 శాతానికి తగ్గిపోయింది. 2013లో గెలిచిన 10మంది కాంగ్రెసు శాసనసభ్యుల్లో ఆరుగురు (బెంగాల్లో కాంగ్రెసు-సిపిఎం ఓటమి తర్వాత) 2017 ఆగస్టులో తృణమూల్ కాంగ్రెసులో చేరారు; వారే తర్వాత బిజెపిలో చేరిపోయారు. అలాంటివారిలో ఒకరైన ఆదివాసీ నాయకుడిని బిజెపి పక్షాన ప్రతిపక్ష నాయకుడిగా చేశారు. ఆ తర్వాత కూడా బిజెపిలో కొందరు చేరారు. కాంగ్రెస్‌లో ఇద్దరే మిగిలారు. ఇది యాదృచ్ఛికంకాదు.

కేంద్రంలో అధికారంలో ఉన్న తమపార్టీ మాత్రమే ఈశాన్య భారత్‌ని అభివృద్ధి చేయగలదని బిజెపి నొక్కి చెప్పింది; కాంగ్రెస్‌ని ఖాళీ చేసింది. త్రిపురలోని బెంగాలీ ముస్లింలను ఆకట్టుకోడానికి బిజెపి మైనారిటీ

(ముస్లిం) విభాగాన్ని ఏర్పాటు చేసింది; దాని నాయకుడైన సిరాజ్‌అలీ గట్టి బృందాన్ని తయారు చేసుకొని, మిలిటెంటుగా, తెగింపుతో ప్రచారం చేశారని 'ది వీక్' రిపోర్టు చేసింది.

బెంగాలీ హిందువులను ఆకట్టుకోడానికి – అస్సాంలో ఆ పని చేసి చూపెట్టిన మంత్రి హిమాంత బిశ్వ శర్మని నియమించారు. ఆరు నెలల ముందే ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. వేలాది కార్యకర్తలను ఇతర రాష్ట్రాల నుంచి దించి 4000 పోలింగ్ బూత్‌లలోనూ కార్యకర్తలను నియమించారు. డబ్బు వెదజల్లారు.

అంతర్జాతీయ సరిహద్దు ప్రాంతంగా ఈశాన్య ప్రాంతానికి వ్యూహాత్మక ప్రాధాన్యత ఉన్నది. గత కొన్ని దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో 5 లక్షల సైనిక, అర్ధసైనిక బలగాలు నియమించబడి ఉన్నాయి. ఇక్కడ అసలు రాజ్యం నడిచేది వీటిద్వారానే. ఎవరెవరు ఎలా దోచుకోవాలో ఏర్పాటు చేసుకోవడానికే ఇక్కడి రాజకీయాలు. బలహీన పడిన కాంగ్రెసు స్థానంలో బిజెపి ఒక బడా, దళారీ బూర్జువా పార్టీగా ఈశాన్య భారత్‌లో కేంద్రీకరించి, విస్తరించింది. కేంద్రంలో అధికారాన్ని ఉపయోగించి అస్సాం, మణిపూర్, అరుణాచల్ రాష్ట్రాల్లో బిజెపి ఇదివరకే అధికారాన్ని కైవసం చేసుకున్నది. ప్రస్తుత వరుసలో త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్‌లను వశం చేసుకున్నది.

2017 డిసెంబరు 16న ప్రధాని మోదీ ఈశాన్య భారత్‌లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు: 14000 కి.మీ. పొడవుగల 14 కొత్త రైల్వేలైన్లను, 4000 కి.మీ. జాతీయ రహదారులను, 47000 కోట్ల రూపాయల నిధులను తమ ప్రభుత్వం ఈశాన్య భారత్ అభివృద్ధి కోసం మంజూరు చేసిందని మోదీ ప్రకటించారు. ప్రతి 15 రోజులకొకసారి కనీసం ఒక కేంద్రమంత్రి ఈ ప్రాంతంలో పర్యటించాలని ఆదేశించినట్టు, కనీసం 150 సార్లు తమ మంత్రులు ఇక్కడ పర్యటించినట్టు చెప్పారు. వెదురు తోటలు, ఉత్పత్తి, రవాణా, అమ్మకాలపై దశాబ్దాలుగా ఉన్న ఆంక్షలను తొలగించామని చెప్పారు.

ఈశాన్య భారత్‌లో ఇది కీలకమైనది. మయన్మార్, బంగ్లాదేశ్‌లకు, వాటి ద్వారా తూర్పు ఆసియా దేశాలకు వెళ్లటాన్ని 'యాక్ట్ ఈస్ట్ పాలసీ' ద్వారా త్వరితం చేస్తున్నామని ప్రకటించారు. ఈ ప్రాంతంలోని 115 వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి భారీగా స్కీములు, నిధులు ఇస్తామని చెప్పారు. విద్యావంతులైన మధ్యతరగతి యువకుల ఉపాధి అవకాశాలను పెంచుతా మన్నారు (100 కోట్ల రూపాయల వెంచర్ ఫండ్). తూరియల్ జల విద్యుత్ పథకాన్ని (మిజోరం) పూర్తిచేస్తున్నాం అన్నారు, ప్రారంభించారు. దీనితో ఈశాన్య భారత్ మిగులు విద్యుత్ ప్రాంతమైందని చెప్పారు. మొరార్జీ, వాజ్‌పేయిల తర్వాత ఒక ప్రధాని ఈ ప్రాంతంపై కేంద్రీకరించడం ఇదే మొదటిసారి అన్నారు (ఫిబ్రవరి 15 ఉపన్యాసం). కాంగ్రెస్ ఈ ప్రాంతాన్ని దశాబ్దాలుగా అశ్రద్ధ చేసిందని అన్నారు. నిజానికి మన్‌మోహన్ కాలంలోనే ప్రారంభమైన 'లుక్ ఈస్ట్ పాలసీ' మోదీహయాం లో 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'గా రూపుదాల్చి ముందుకు సాగింది. తూర్పు ఆసియాలో భారత్ సహాయంతో చైనాను నిలువరించడంలో ఈ పాలసీకి ప్రాధాన్యత ఉన్నదని, అమెరికా, జపాన్ తదితర సామ్రాజ్యవాదులు, భారత్‌లోని వారివారి దళారులు భావిస్తున్నారు.

ఈ వ్యూహానికి అవసరమైన రాజకీయ చర్యలను భారత ప్రభుత్వం చాలాకాలం క్రితమే చేపట్టింది. అందులో భాగంగా 5 లక్షల మిలిటరీ ప్రయోగంతో పాటు రాజకీయ బేరసారాలను దశాబ్దాలుగా నెరపింది. నాగాలు రాజ్యాంగ పరిధికి వెలుపల పెట్టిన డిమాండ్లను సైతం చర్చించడానికి అంగీకరించి, వారితో మూడోదేశంలో రహస్య చర్చలు నిర్వహించింది. ఈ చర్చలు వాజ్‌పేయి, గుజరాల్, మన్‌మోహన్‌లు ప్రధానులుగా ఉన్న కాలమంతటా సాగి మోదీ హయాంలో సంతకాలతో ఒక కొలిక్కి వచ్చాయి. అధికార పార్టీలు వేరైనా భారత రాజ్య వ్యూహం దశాబ్దాలుగా ఒక క్రమపద్ధతిలో సాగిందని గమనించవచ్చును.

భారత రాజ్య వ్యూహానికి ఈశాన్య ప్రాంతంలో కమ్యూనిస్టు పునాదులు, 'వామపక్ష అతివాదం', నాగా తదితర జాతుల వేర్పాటు ఉద్యమాలు దశాబ్దాలుగా అడ్డంకిగా ఉంటూ వచ్చాయి. ఇది కేంద్ర హోంశాఖ నిర్ధారణ. ఈ ప్రాంతంలో నుంచి ఎర్రజెండాను పెకిలించి వేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఇటీవలికాలంలో బెంగాల్‌లో కమ్యూనిస్టు పునాదులను, నిర్మాణాన్ని దెబ్బతీశారు. అనేకచోట్ల సిపిఎం రెండో స్థానంలో కూడా లేకుండా చేశారు; బిజెపి ఆ స్థానంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నది. త్రిపురలో ఇప్పుడాపని చేశారు. నిరంకుశ అణచివేతతో పాటు బేరసారాలు, రాజకీయ ప్రక్రియతో ఈక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. జాతుల వేర్పాటు ఉద్యమాలకు కూడా ఇదే వర్తిస్తుంది.

ప్రస్తుత ఎన్నికల ముగింపు తర్వాత ఈ వ్యూహం అమలుని సమీక్షించారు: త్రిపురలో మా గెలుపు వెనుక ప్రధాని మోదీ చెప్పిన యాక్ట్ ఈస్ట్ పాలసీ 'ప్రధానశక్తిగా' ఉన్నది; ఈశాన్య భారత్ ద్వారా తూర్పు ఆసియా వైపు సాగే ప్రభుత్వ విధానం ఉన్నది – అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరెన్ రిజిజూ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు ('ది వీక్' 18-3-2018). ఈ క్యాంపేన్ అంతటా కమ్యూనిస్టు వ్యతిరేకతనీ, చైనాపట్ల ద్వేషాన్ని ఇంధనంగా వాడారు. లెనిన్ విగ్రహాన్ని కూల్చివేయడం అలాంటి రాజకీయాల పర్యవసానమూ, ప్రతిబింబమే. ఈ కూల్చివేతని త్రిపుర గవర్నరు, కొంతమంది కేంద్రమంత్రులు, బిజెపి నాయకులు, ఆర్.ఎస్.ఎస్. ప్రముఖులు బాహాటంగా బలపరిచారు. కాగా తానే గిల్లి తానే జోల పాడినట్టుగా మోదీ దీనిపట్ల నయవంచనతో స్పందించారు. యు.పి.లో బిజెపి గెలుపుకన్నా త్రిపురలో 'ఈ సైద్ధాంతిక విజయానికీ చాలా ప్రాముఖ్యత ఉన్నదని' మోదీ నొక్కిచెప్పింది ఈ దృష్టితోనే.

ప్రపంచవ్యాప్తంగా మార్క్సిజం తిరస్కరించబడిందనీ, భారత్‌లో చరమాంకంలో ఉన్నదనీ, త్రిపురలో గెలుపు అందువల్ల ప్రాధాన్యత కలిగి ఉందనీ, కేరళ ఒక్కటే మిగిలిందనీ బిజెపి పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మార్చి 6న మోదీ చెప్పినట్టు ప్రకటించారు. భారతదేశంలో కమ్యూనిజానికి స్థానం లేకుండా చేయడానికి బిజెపి నిర్ణయించి, త్రిపురలో నాంది పలికిందని ఆర్ఎస్ఎస్ నాయకుడు రాంమాధవ్ చెప్పారు. కమ్యూనిస్టులు కూడా బిజెపిలో చేరుతున్నారని, త్రిపురలో ఇది రానున్న రోజుల్లో వెల్లువగా సాగుతుందని విప్లవకుమార్ దేవ్ (ఇప్పటి త్రిపుర ముఖ్యమంత్రి) చెప్పారు.

పై పరిణామాలని లోతుగా అర్థం చేసుకొని, స్పందించడం అవసరం. సెక్యులరిజం వల్లింపులతో జరిగేపని కాదిది.

(రచయిత పాత్రికేయులు) వీ

బిజెపి విజయోత్పాతం

కేంద్రంలో అధికారం దక్కించుకున్న బిజెపి క్రమంగా తన హిందూ మతోన్మాద బీజాలను దేశమంతటా విస్తరించాలని చూస్తోందనీ, ఈశాన్య రాష్ట్రాలలో అధికారం చేజిక్కించుకుని విష భావజాలాన్ని చిమ్ముతోందనీ అంటున్నారు అరణ్య

అనుకున్నట్టే అయింది. నాలుగేళ్లుగా అధికారంలో ఉన్నామనే దర్పంతో దేశమంతా దౌర్జన్యాలు చేస్తూ వచ్చిన చెడ్డిగ్యాంగ్‌లు రాష్ట్రాలలో అధికారం చేజిక్కాక మరింత ఎక్కువగా భయోత్పాతాలు సృష్టిస్తారని ఉహించినట్లుగానే ఇటీవల గెలిచిన త్రిపురలో బిజెపి విపరీతమైన విధ్వంసాలకు, హింసాకాండలకు దిగింది.

ఇరవై ఐదు సంవత్సరాల తర్వాత సిపిఎం ఓడిపోయాక త్రిపురలో బిజెపి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అక్కడ వరుసగా దాడులు జరుగుతున్నాయి. 1520 ఇళ్లపై దాడులు జరిగాయి. దాదాపు 200 ఇళ్లను బిజెపి కార్యకర్తలు తగులబెట్టారు. కమ్యూనిస్ట్ సిద్ధాంతకర్త లెనిన్ విగ్రహాన్ని కూల్చేశారు. 130 సిపిఎం కార్యాలయాలపై దాడిచేసి 60 కార్యాలయాలకు నిప్పు పెట్టారు. ఈ ఘర్షణలో వందలాది మంది ప్రజలు గాయపడ్డారు. ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థలో ఒక పార్టీ గెలవడం, మరో పార్టీ ఓడిపోవడం సర్వసాధారణం. ఒకపార్టీ ఓడిపోవడమంటే ఆ పార్టీ నమ్మిన సిద్ధాంతం, ఆచరించే సిద్ధాంతం లేదా ఆ పార్టీ విశ్వాసాలు, తాత్విక పునాదులు ఓడిపోవడం కాదు. ఎన్నికల్లో ఓటమి అనేది ఒక సంఖ్యాత్మకమైన అంటే పరిమాణాత్మకమైన ఫలితం. త్రిపురలో సిపిఎం ఓడడమంటే అనేక తప్పుల తడకలదే అయిన అది ఆచరించే సిద్ధాంతం ఓడడం కాదు. లెఫ్ట్ ఫ్రంట్ అధికారం నుంచి తొలగిపోవడం అంటే త్రిపురలోనో భారతదేశంలోనో కమ్యూనిజమే తుడిచిపెట్టుకు పోవడం కాదు. కానీ బిజెపి అలాగే అనుకుంటున్నది. కనీస అవగాహన లేని ప్రధానమంత్రి 'త్రిపురలో విజయం వామపక్ష భావజాలంపై విజయమంటు'న్నాడు. ఎలాగూ కమ్యూనిస్ట్ పార్టీని ఓడించాం కనుక ఆ పార్టీ ఆనవాళ్లు మొత్తంగా తుడిచేయాలనే ఉన్మాదంతోనే విగ్రహాలను కూల్చుతున్నారు. కార్యకర్తలపై భౌతిక దాడులకు దిగుతున్నారు.

నిజానికి ఈ దాడులకు, దౌర్జన్యాలకు ఎన్నికలకు ముందు నుంచే వ్యూహరచన చేయబడ్డది. ఎన్నికల కోసమంటూ త్రిపురలో గత ఏడాది కాలం నుంచి పాగా వేసిన సునీల్ దేవధర్ (మహారాష్ట్ర), రాం మాధవ్ (ఆంధ్రప్రదేశ్), హిమంత్ బిస్వాస్ శర్మ (అసోం) అనే ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు త్రిపురలో ఒక ద్వేషపూరిత వాతావరణాన్ని తయారు చేశారు. త్రిపురలో సిపిఎం ఏ తప్పులూ చేయలేదని కాదు. మాణిక్ సర్కార్ దేశంలోనే అతి సౌమ్యుడైన, పేదవాడైన, మృధు స్వభావి అయిన ముఖ్యమంత్రిగా పేరుపడ్డా కూడా త్రిపురలో అతని పాలనలోనూ తీవ్రంగా పౌరహక్కుల హననం సాగుతూ వచ్చింది. ప్రజా ఉద్యమాలను సిపిఎం ప్రభుత్వాలు అణచివేస్తూ వచ్చాయి. దేశంలోని అనేక రాష్ట్రాల కంటే కొన్ని సూచికల్లో కాస్తంత మెరుగ్గా ఉన్నా వాస్తవ పరిస్థితుల్లో ప్రజల జీవితాలు అధమస్థితిలోనే ఉన్నాయి. పేదరికం, నిరుద్యోగం, ఆకలి చావుల సంఖ్యా ఎక్కువగానే ఉంది.

సిపిఎం పార్టీలోని బెంగాలీల ఆధిపత్యం వల్ల ఆదివాసులపై పెత్తనం కొనసాగింది. తమ ప్రాంతంలోనే తామే మైనారిటీలమైనామనే భావన వారిలో ఏర్పడింది. అందుకే తిప్రాలాండ్ ప్రత్యేక రాష్ట్రం కోసం ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర ఆధ్వర్యంలో పోరాటం ప్రారంభించారు. సిపిఎంను ఓడించే లక్ష్యంతో ఈ పోరాటానికి బిజెపి మద్దతిచ్చింది. అయితే ఈ పోరాట భావనను అంగీకరించాల్సింది పోయి సిపిఎం దాన్ని వేర్పాటువాద ఉద్యమంగా చూసింది.

త్రిపురలో 31 శాతం మంది గిరిజనులు. వారిలో ఎక్కువ మంది కోక్‌బోరాక్ భాష మాట్లాడుతుండగా అధికార భాషగా, బోధన భాషగా మాత్రం బెంగాలి భాషే చెలామణి అవుతున్నది. రెండున్నర లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వం సిబ్బందికి ఇప్పటికీ ఇంకా నాలుగో వేతన సంఘం సిఫార్సులే అమలులో ఉన్నాయి. రాష్ట్రంలో నిరుద్యోగం తీవ్రంగా ఉంది. 19.7 శాతంతో దేశంలోనే అత్యధిక నిరుద్యోగం త్రిపురలో ఉంది. 2016 జాతీయ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం జాతీయ సగటు కంటే త్రిపురలో ఆత్మహత్యల రేటు కూడా అధికమే.

ఇవన్నీ స్పష్టంగా పాతికేళ్ల సిపిఎం పరిపాలనా వైఫల్యాలే. కొందరు భావిస్తున్నట్లుగా, ఆ పార్టీ చెప్పుకుంటున్నట్లుగా సిపిఎం ఎంత మాత్రమూ కమ్యూనిజాన్ని ఆచరిస్తున్న పార్టీ కాదు. అదొక ఫక్తు బూర్జువా పార్టీ. అయినా సరే బహుళ పార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగంగా ఈ దేశంలో ఒకానొక రాజకీయ పార్టీగా కార్యకలాపాలు సాగించే హక్కు దానికుంటుంది. విగ్రహ సంస్కృతి పూర్తిగా తప్పుడు పద్ధతే అయినా ఆ పద్ధతి పోయేదాకా విగ్రహాలను పెట్టుకునే హక్కు ఆ పార్టీకి ఉంటుంది. కూల్చే హక్కు ఎవరికీ ఉండదు.

కానీ త్రిపురలో బిజెపి ఆ హక్కులను దౌర్జన్యంగా బుల్‌డోజర్ల సహాయంతో పొందింది. బెలోనియాలో లెనిన్ విగ్రహాన్ని నేలమట్టం చేసింది. విగ్రహం తలతో ఫుట్‌బాల్ ఆడింది. పైగా బిజెపి నాయకులు, కేంద్ర మంత్రులు చేసిన వ్యాఖ్యలు చాలా ఆందోళనకరంగా ఉన్నాయి. 'లెనిన్ విదేశీయుడు, ఒక రకంగా ఉగ్రవాది కూడా. అలాంటి వ్యక్తి విగ్రహం మనదేశంలో ఉండకూడదు' అని సుబ్రమణ్య స్వామి అన్నాడు. 'విదేశీ నేతల విగ్రహాలకు ఇక్కడ చోటు లేద'ని కేంద్ర మంత్రి హన్స్‌రాజ్ గంగారాం అహిర్ అన్నాడు. 'ప్రజలు విగ్రహాలు తొలగించింది రష్యాలో కాదు త్రిపురలోనే' అంటూ 'చలో పాల్టాయ్ (మార్చేద్దాం రండి)' అన్నాడు. మార్క్సిజం దేశీయం కాదని, లెనిన్ విదేశీయుడని అంటున్నవారు ఇంగ్లండ్ మొదలు ఆఫ్రికా, అమెరికా దాకా ప్రపంచంలోని చాలా దేశాలు గాంధీ, అంబేద్కర్ తదితర జాతీయ నేతలను సమున్నతంగా గౌరవిస్తున్న తీరును ప్రశ్నిస్తే ఏం సమాధానం చెప్తారు?

లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో గాంధీ మొదల్కొని కత్రినా కైఫ్ వరకు భారతీయ విగ్రహాలు ఉన్నాయి. అందులో ప్రధాన మంత్రి మోడీ విగ్రహం కూడా ఉంది. ఆస్ట్రియా, స్విడ్జర్‌ల్యాండ్, లండన్, కాలిఫోర్నియా, అర్జెంటినా, దక్షిణాఫ్రికా, ఉగాండా, సోమాలియా, ఆస్ట్రేలియా, లిథువేనియాల్లో గాంధీ విగ్రహాలున్నాయి. అనేక దేశాలలో రోడ్లకు, కూడళ్లకు భారతీయ ప్రముఖుల పేర్లున్నాయి. నెదర్లాండ్స్‌లో గాంధీ రోడ్, చికాగోలో వివేకానంద వే, కెనడాలో ఎంఆర్. రెహమాన్

అంబేద్కర్ ప్రత్యామ్నాయ భావజాల విస్తృతి

ప్రత్యామ్నాయ జీవన వ్యవస్థల, రాజ్య నిర్మాణాలకు అంబేద్కర్ భావజాలం స్ఫూర్తిగా నిలవాలని అంటున్నారు

డా. కత్తి పద్మారావు

డా. బి.ఆర్. అంబేద్కర్ భారతదేశంలో ప్రత్యామ్నాయాన్ని రూపొందించడానికి ఎంతో కృషి చేశారు. ప్రత్యామ్నాయ వాఙ్మయాన్ని ఆయన పరిశోధనలతో విస్తృతి చేశారు. ఆయనది లోతైన అధ్యయనం. ఆయన తత్వశాస్త్రం హిందూ భావజాలానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని నిర్దేశించింది. ఆయన తర్కం, హేతువాదం, గవేషణ, పరిశీలానా దృష్టి, శాస్త్రీయ దృక్పథంతో వేదవాఙ్మయాన్ని చిలికి అందులోని హింసాత్మక భావజాలాన్ని బయటకు తీసుకురాగలిగింది. ఆయన కులం మూలాల మీద గొడ్డలివేటు వేశారు. ఆయనది నిశిత దృష్టి. సత్య శోదన, సముజ్వల సామాజిక విప్లవ భావన.

కులనిర్మూలన గురించి జరిగిన చర్చలో గాంధీ అంబేద్కర్‌కి సమాధానం వ్రాస్తూ అంబేద్కర్ విమర్శించిన గ్రంథాలన్ని మహోన్నత మైనవని ఇలా వాదిస్తారు. హిందూ ధర్మశాస్త్రాలంటే వేదాలు, ఉపనిషత్తులు, స్మృతులు, పురాణాలు. రామాయణం, మహాభారతం కూడ వీటిలో కలుస్తాయి. అయితే, ఈ శాస్త్రాల విషయంలో ఇదే తుది జాబితా కాదు. ప్రతి యుగం-ప్రతితరం కూడా-ఈ జాబితాను పెంచుతూ వచ్చింది. ఈ చారిత్రక సత్యాన్ని బట్టి చూస్తే-ముద్రించబడిన ప్రతీదీ, వ్రాత ప్రతిగా కనిపించే ప్రతీదీ కూడ హిందూ ధర్మశాస్త్రమే అనడానికి వీలులేదు. ఉదాహరణకు-దైవసూక్తిగా అంగీకరించ వీలులేని దెంతో స్మృతులలో మనకు కనిపిస్తుంది. అందువల్ల, స్మృతుల నుంచి డా. అంబేద్కర్ ఉదాహరించిన ఎన్నో విషయాలు అధికారికమైనట్టివిగా అంగీకరించ డానికి వీలులేదు. ధర్మశాస్త్రాలనేవి-అవి నిజమైన మత ధర్మశాస్త్రాలే అయినప్పుడు-కేవలం అధ్యాత్మిక విషయాలను మాత్రమే ఉద్బోధించేవిగా నిర్మలమైన హృదయాలకు హత్తుకునేవిగా అంతరాత్మకు విశదమైనవిగా ఉంటాయి.

దగ్గరదగ్గర భారత జాతీయోద్యమంలో పనిచేసిన బాలగంగాధర్ తిలక్, సర్దార్ వల్లభాయ్ పటేల్ వీరందరి భావజాలం ఇదే. అందుకే అంబేద్కర్ వీరందరికీ కలిపి ఈ విధమైన సమాధానం ఇచ్చారు.

కుల వ్యవస్థ హిందువుల్ని నాశనం చేసింది. చాతుర్వర్ణ్య ప్రాతిపదిక మీద హిందూ సమాజాన్ని పునర్నిర్మించడం అనేది అసాధ్యం. ఎందుకంటే వర్ణ వ్యవస్థ ఒక చిల్లికుండవంటిది. తనను తాను నిలుపుకొనేశక్తి, గుణం

స్ట్రీట్, టాంజానియాలో ఇందిరాగాంధీ స్ట్రీట్, బెర్లిన్‌లో రాగోర్ స్ట్రీట్, పొరుగుదేశం పాకిస్తాన్‌లో భగత్‌సింగ్ చౌక్‌లు ఉన్నాయి. చైనాలో ద్వారకనాథ్ కొట్నిస్ విగ్రహముంది. నూజిల్యాండ్‌లో గవాస్కర్ ప్యాలెస్ ఉంది.

వ్యక్తులు ఎవరైనా, ఏ దేశం వారైనా తమదైన జీవితాచరణతో మానవాళికి చేసిన సేవలు బోధలపై ఆధారపడేవారిని ప్రపంచం గౌరవిస్తుందన్న విషయం వాళ్లకెప్పటికి అర్థమవుతుంది?

త్రిపుర గవర్నర్ తథాగత్‌రాయ్ అయితే స్వయంగా లెనిన్ విగ్రహాన్ని కూల్చడం పట్ల ఆనందాన్ని బాహాటంగానే ప్రకటించాడు. తానొక రాష్ట్ర గవర్నర్‌నన్న విషయాన్ని కూడా మర్చిపోయి, గవర్నర్ పదవి హుందాతనాన్ని కూడా మర్చిపోయి 'ప్రజాస్వామ్యంగా ఎన్నికైన ఒక ప్రభుత్వం చేసిన పనిని, ప్రజాస్మామికంగా ఎన్నికైన మరో ప్రభుత్వం తిరగబెడుతుంద'ని అన్నాడు. సాక్ష్యాత్తు గవర్నరే 'న్యూ ఢిల్లీలోని ఇండియా గేట్ నుంచి కింగ్‌జార్జ్ విగ్రహాన్ని తొలగించాం. కోల్‌కతాలోని విక్టోరియా రాణి ప్రతిమను ఆమె స్మారక కేంద్రం నుండి తీసివేశాం. ఔరంగజేబ్ రోడ్డు పేరు మార్చాం. అలాగే ప్రభుత్వం లెనిన్ విగ్రహాన్ని తొలగించి, ఆ ప్రాంతం పేరు మారిస్తే ఏమౌతుంది? సమాధానం ఉందా?' అంటూ ఈ ఉదంతాన్ని సమర్థించాడంటే ఎంత దారుణ పరిస్థితిలో ఈ దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగుతున్నదో అర్థం చేసుకోవచ్చు.

త్రిపురలో విగ్రహాల కూల్చివేతలను చూసి ఉత్సాహంతో తమిళనాడు బిజెపి నాయకుడు ఎచ్. రాజా 'కులోన్మాది పెరియార్, ఇ.వి. రామస్వామి విగ్రహానికి ఇదే గతి పడుతుంద'ని ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసిన తర్వాత కొద్దిసేపటికి వెల్యూర్‌లోని పెరియార్ విగ్రహాన్ని బిజెపి ధ్వంసం చేసింది.

చెన్నైలో తిరువోట్రియూర్‌లో అంబేద్కర్ విగ్రహాన్ని పగులగొట్టారు. తలను తీసుకెళ్లి ఎక్కడో పడేశారు. విగ్రహంపై రంగులు చల్లారు. అలాగే కేరళలో కన్నూర్ జిల్లాలోని తాలిపరంబ పట్టణంలో గాంధీ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. స్థానిక తాలూకా ఆఫీసు దగ్గరనే ఈ ఘటన జరిగింది.

ఇలా దేశవ్యాప్తంగా విగ్రహాలా విధ్వంసం కొనసాగింది. మూడు ఈశాన్య రాష్ట్రాలలో బిజెపి విజయం సాధించడం ప్రస్తుత కారణమైంది. అందుకే అధికారం ఉన్న, లేని అన్ని రాష్ట్రాలలో విగ్రహ విధ్వంసాలకు, దాడులకు, హింసలకు, దౌర్జన్యాలకు బిజెపి పూనుకున్నది.

కానీ ఎన్నికల్లో గెలుపు ఓటములు సాధారణం. వాటినిబట్టే ఒక పార్టీ బలాలను, బలహీనతలను లెక్కించలేం. ఎన్నికలే పార్టీలను ప్రజలు ఆదరించే సూచికలు కావు. ఎన్నికలలో గెలవడమే సర్వస్వం అనుకోవడం, విలువలను పాతరేసి వీరంగాలు వేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. గెలవడం, అధికారాన్ని పొందడం అనేవి పార్టీలకు గొప్ప సందర్భాలే కావచ్చు కానీ, ఆయా రాష్ట్రాల ప్రజలకు అవి ఐదేళ్లకోసారి ఏర్పడే ఒకానొక సందర్భం మాత్రమే. ఈ విషయాన్ని గుర్తించినా వారు ఇలాంటి దుడుకు చర్యలకు పాల్పడరు. గెలిచిన పక్షం ఓడినవారి కార్యాలయాలను, విగ్రహాలను ధ్వంసం చేసే పనులకు పాల్పడితే అది అంతిమంగా అరాచకానికి దారి తీస్తుంది. ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతుంది. బిజెపి లాంటి ఫాసిస్ట్ పార్టీలు తమ అంతిమ లక్ష్యమైన అధికారం కోసం పదేపదే ఇలాంటి దుర్మార్గాలకు పూనుకుంటాయి. దేశ వ్యాప్తంగా ఇప్పుడు జరుగుతున్నదదే. అందుకే అలాంటి పార్టీలకు ప్రజాగ్రహమే సమాధానం కావాలి.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

దానికి లేవు. వర్ణాన్ని అతిక్రమించే ప్రతి వ్యక్తినీ కఠినంగా శిక్షించడానికి ఒక గట్టి శిక్షాస్మృతిని అమలు పరిస్తేనే తప్ప వర్ణవ్యవస్థ కులవ్యవస్థగా పతనమై పోక తప్పదు. అలా పతనమైపోయే బలహీనత సహజంగానే వర్ణ వ్యవస్థ నిర్మాణంలో ఉంది.

హిందూ సమాజాన్ని చాతుర్వర్ణ్య ప్రాతిపదికపై పునర్నిర్మాణం చేయడం చాల హానికరం. ఎందుకంటే, అది ప్రజానీకానికి విద్యావకాశాలను నిరాకరించడం ద్వారా వారిని అజ్ఞాన కూపంలో త్రోసివేస్తుంది. ఆయుధ ధారణ హక్కును నిరాకరించడం ద్వారా వారిని నిర్వీర్యులను చేస్తుంది. స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాత్రత– ఈ మూడు ముఖ్య సూత్రాలను పవిత్ర సూత్రాలుగా ఆమోదించగల మతాన్ని ప్రాతిపదికగా తీసుకొని హిందూ సమాజాన్ని పునర్నిర్మించాలి.

ఈ విధంగా హిందూ సమాజ పునర్నిర్మాణం జరగాలంటే అందుకు ముందుగా కులానికీ, వర్ణానికీ, ప్రస్తుతం ఉన్న మతైక పవిత్రతా భావనను తొలగించాలి. ఆ విధంగా కుల వర్ణాలకు గల మత పవిత్రతను నాశనం చేయాలంటే ముందుగా శాస్త్రాల దైవీయ అధికారాన్ని నిరాకరించాలి. ఇవీ నా ఉపన్యాసంలోని ప్రధానాంశాలు. వీటినీ, మహాత్ముడు చేసిన విమర్శనూ పరిశీలించిన వారు మహాత్ముడు అసలు విషయాల్ని వదలిపెట్టి పక్కదారి పట్టినట్టు గ్రహించగలరు. నా ఉపన్యాసంలోని ప్రధానాంశం మహాత్ముని పట్ల పూర్తిగా నిష్ప్రయోజనం అయిపోయింది.

అంబేద్కర్ చెప్పిన ఈ సమాధానం హిందూ రాజకీయ వేత్తలు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. భావజాల రంగం మీద యుద్ధం చేయడం చాలా కష్టం. అంబేద్కర్ ఈ పనిని సమర్థవంతంగా రుజువు చేశారు. ఏదీ రుజువు లేకుండా మాట్లాడలేదు. అన్ని సత్యప్రమాణాలతోనే ఆయన రుజువు చేసుకెళ్లాడు. అందుకే ఆయనకు మళ్లీ సమాధానం ఇవ్వడం ఎవ్వరివల్లా సాధ్యం కాలేదు.

అంబేద్కర్ స్మృతివన నిర్లక్ష్యం

ఇకపోతే అంబేద్కర్ స్మృతివనానికి డిజైన్ల పేరుతో కాలయాపన చేసి వెయ్యి కోట్ల ప్రాజెక్ట్‌కు వంద కోట్లు మాత్రమే కెటాయించారు. ఆ నిర్మాణం ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారు. రాజ్యాంగ కర్తకే ద్రోహం తలపెట్టడం చంద్రబాబు మనోవైకల్యానికి నిదర్శనం. అంతేకాదు తెలుగు అకాడమీలో ఆంధ్రప్రదేశ్ విభాగాన్ని ఇక్కడకు తరలించలేదు. ఫ్రండ్స్ కేటాయించలేదు. అంబేద్కర్ రచనలు తెలుగు చేసే ప్రాజెక్టును ఆయన ఇంత వరకు ప్రారంభింపచేయలేదు.

అంబేద్కర్ రచనల మీద చంద్రబాబుకు ద్వేషం ఎందుకు, కొలంబియా విశ్వవిద్యాలయంలోను, హార్డ్‌వార్డ్ విశ్వవిద్యాలయంలోను ఆయన రచనల మీద పరిశోధనలు జరుగుతున్నాయి. అంబేద్కర్‌ను అర్థం చేసుకోని ఏ రాజకీయనేతకు అయినా రాజ్యాంగేతరంగా జీవించే పరిస్థితి వస్తుంది. ఓట్లు కొనడం అనే రాజకీయ తంత్రంలోనే చంద్రబాబు వ్యక్తగత ఆస్తిని పెంచుకోవడంతో పాటు పార్టీ ఆస్తిని అవినీతితో పెంచుతున్నాడు.

అవినీతి అనేది ఒక ఊబి వంటిది. మనిషి వ్యక్తిత్వాన్ని అది ధ్వంసం చేస్తుంది. నిజాయితీగా మాట్లాడే హక్కును తునుమాడుతుంది. మనిషికి నిజాయితీ లేకపోతే మాట్లాడే మాటలన్నీ వ్యర్థమైపోతున్నాయి. ఇప్పుడు చంద్రబాబు మాట్లాడుతున్న మాటలు ప్రజల చెవులకు గులకరాళ్లు అవుతున్నాయి. ప్రజలకు ఆశలు కల్పించడం కంటో కూడా ఆశయాలు కల్పించడంలోనే నాయకుని విజ్ఞత ఆధారపడి ఉంటుంది. మనం వ్యక్తిత్వాన్ని ధ్వంసం చేసుకొని మన కొడుకులకు ప్రపంచాన్ని అంతా తవ్వి వారి చేతుల్లో పోయాలనే దురాశ మనిషిని అంధుణ్ణి చేస్తుంది.

చంద్రబాబుకు కార్పొరేట్ భూతం పట్టింది. మీ కళ్లముందున్న మానవ వనరులు పట్టించుకోకుండా కార్పొరేట్లకు దేశ సంపద దారపోయాలనే భావం దేశాన్ని తాకట్టు పెట్టడమే. ఈ రోజు చంద్రబాబు రాష్ట్రాన్ని తాకట్టుపెట్టడంలో ముందున్నాడు. రాష్ట్ర సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక, ప్రగతి మీద చంద్రబాబుకు దృష్టిలేదు. ఆయన అసెంబ్లీలో మాట్లాడుతున్న మాటలు చూస్తే మనం కూలిపోతున్న వ్యవస్థల్ని అభ్యుదయంగా ప్రకటించడం చేస్తున్నాడు.

ప్రతిపాటి పుల్లారావు నియోజక వర్గం, కోడెల శివప్రసాద్ నియోజక వర్గాల్లో రేషన్ షాపుల్లో పేదలకు పంచవలసిన బియ్యం నల్లబజారులో అమ్ముతున్న విషయం బహిరంగంగా బయటకు వస్తే దానిమీద విచారణ జరపాల్సింది పోయి రాష్ట్రంలో పేదలందరు ఆకలిగా ఉండకుండా చూస్తున్నాను అని ప్రకటిచడం ఆశ్చర్యం కలిగిస్తుంది. చంద్రబాబు అవినీతి పరుల్ని అందలాన్ని ఎక్కిస్తారు. పోలవరంలో పట్టిసీమలో అవినీతి జరిగిందని, కేంద్రమే ఘోషిస్తుంటే నా కంటే మోడీ కూడా అవినీతిపరుడని చంద్రబాబు దూషిస్తున్నాడు. రోజు మీరు అసెంబ్లీలో చెప్పే కాకిలెక్కలు బొక్కసానికి కన్నాలు వేసే మీ దినచర్యలు ప్రజలకు అహస్యం కలిగించడం లేదా? దళితులకు నాలుగేళ్లలో స్మశాన భూములు ఇవ్వకపోగా దళిత వాడల్లో మంచినీరు కరువై మైళ్లకు మైళ్లు వెళ్లి నీరుతెచ్చుకుంటే గ్రామాలన్నీంటిలో మంచినీరు ఉన్నాయని ప్రకటించడం అసత్యం తీవ్రతను తెలపడం లేదా.

దళితవాడల దుస్థితి

దళితవాడల్లో నీరు లేదు. స్మశానాలు లేవు. దళితవాడలకు ఇండ్ల స్థలాలు ఇచ్చింది 1979లో, ఆ తరువాత ఇండ్ల స్థలం లేదు. అందువల్ల ఒక్కొక్క ఇంట్లో 5,6 కుటుంబాలు నివసిస్తున్నారు. దానివల్ల సామాజిక సమతుల్యత లోపిస్తుంది. కుటుంబ వైరుధ్యాలు పెరుగుతున్నాయి. వచ్చిన కోడలికి పడక ఇవ్వలేని స్థితిలో దళితులు అవస్థలు పడుతున్నారు.

చంద్రబాబు దళిత ద్వేషి కాదు. దళిత సామాజిక వ్యవస్థల్ని కూల్చాలనే ఒక నిబద్ధ కార్యాచరణ శీలిగా ముందుకు వెళ్తున్నాడు. అందుకే అంబేద్కర్ జయంతి మన ముందుకు వస్తున్న సందర్భంగా ఆయనలో ఉన్న రాజనీతిజ్ఞత, వ్యక్తిత్వ నిర్మాణ దక్షత, మానవీయ విలువల పూర్ణత, రాజ్యాంగ నిర్మాణ నిష్ణాతత, సామాజిక పునర్నిర్మాణ కర్తృత్వ పరివ్యాప్తత, నీతి, నిజాయితీ, మానవీయ విలువ పోషకత ఈనాటి రాజకీయ నాయకులు అలవర్చుకో గలిగితే రాష్ట్రమే కాదు దేశపునర్నిర్మాణం కూడా అనతికాలంలో జరుగుతుంది. ఎందుకంటే దేశాన్ని పాలించేవాడికి పుత్రవ్యామోహం ఉండకూడదు. ఆస్తి వ్యామోహం ఉండకూడదు, కీర్తి వ్యామోహం ఉండకూడదు ఈ మూడు గుణాలు మనిషిని అంతర్గతంగా విధ్వంసం చేస్తాయి. గుణాలు అంటే ప్రజ్ఞ, కరుణ, ఆత్మీయత, అనునయత, ఆంతరంగిత వంటివి. గుణం అంటే ఇతరులకు మేలు చేసేది. తనను తాను నుత్తించుకోవడంలో చంద్రబాబు లోయల్లోకి దిగబడుతున్నాడు. నుతి, స్తుతి, కీర్తన అనేవి విగ్రహాలకే మనుషులకు కాదు. అందుకే అంబేద్కర్ జీవితంలో తనను తాను పొగుడుకున్న వ్యాక్యం ఒక్కటీ లేదు. ఆయన ప్రపంచమంతా విస్తరించాడు. మనిషి ఒక నిర్మాత తనను నిర్మించుకో గలిగినవాడే ఇతరులను నిర్మించగలడు.

అంబేద్కర్ ముందు తనను తాను నిర్మించుకున్నాడు. మస్తకాన్ని పరిపూత చేశాడు. మేధస్సుకు పరిపూత పెట్టాడు. ఆయన జీవితంలో కామ, వ్యామోహాలకు లొంగలేదు. పదవీ వ్యామోహాలకు లొంగలేదు. అందుకే ఆయన చనిపోయి 127 సంవత్సరాలు అవుతున్నా ఆయన సజీవ ఉదాహరణంగా వ్యక్తిత్వ నిర్మాణానికి మన ముందు నిల్చున్నాడు. తాను చనిపోయేనాటికి 80 వేల పుస్తకాలు ఆయన సంపాదించుకున్నాడు. లండన్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాల నుంచి ఇంగ్లీషు, ఫ్రెంచ్, జర్మనీ మూల గ్రంథాలను సంపాదించాడు. భారతదేశం లో ఉన్న అనంత వాఙ్మయంలో వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు, అరణ్యకాలు, బ్రాహ్మణాలు అష్టాదశ పురణాలు, పాణినీవ్యాకరణం,

కౌటిల్యుని అర్థశాస్త్రం ముఖ్యంగా అశ్వఘోషుని గ్రంథాలు ఆయన లైబ్రరీలో ఉన్నట్టు పరిశోధకులు వెలువరించారు. మరీ ముఖ్యంగా ఆయన జాన్‌డ్యూయి, సోక్రటీస్, ప్లాటో, అరిస్టాటిల్ వంటి గ్రీకు ఫిలాసఫర్స్‌నే కాక జర్మనీ నుండి ఆవిర్భవించిన హిమాలియన్ కాంట్, హెగెల్, కారల్‌మార్క్స్‌లను క్షుణ్ణంగా అధ్యయనం చేసినట్లు ఆయన గ్రంథాలయం తెలుపుతుంది. ఆయన కొలంబియా యూనివర్సిటీలో చదివే కాలంలో ప్రపంచ విప్లవానికి సంబంధించిన అన్ని గ్రంథాలు ఆయన సంపాదించాడు. ముఖ్యంగా ఫ్రెంచ్ రివల్యూషన్ ఆయన్ను ప్రభావితం చేశాయి. ఆయన ప్రపంచ జ్ఞానాన్ని అధ్యయనం చేసిన మేధావిగా ముందుకు వచ్చాడు. అందుకే కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఒకేఒక విగ్రహం ఉందంటే అది అంబేద్కర్‌దే.

అంబేద్కర్‌లో మరో గుణం కులనిర్మూలనా భావం. ముఖ్యంగా ఆయనకు మానవులు మానవులకు జన్మిస్తారనేది ఆయన భావం. ఆ విషయంగా వేల పేజీలు వ్రాశారు. ఈనాడు రాజకీయ వేత్తలే కాదు మొత్తం సమాజమే ఆయన గురించి నేర్చుకోవాల్సి ఉంది. తాత్కాలికమైన అంశాలకు సంపదను వెచ్చించకుండా దీర్ఘకాలికమైన అంశాల పట్ల ఆయన అప్రమత్తం అయ్యారు. నలంద విశ్వవిద్యాలయానికి ఆయన ఆస్తిని సింహభాగం దానం చేశారు. తన సంతానానికి తన సంపదలో దశమ భాగమే ఇచ్చాడు. చాలామంది కొడుకుల కోసం ఆరాటపడతారు. వారిని సోమరులను చేస్తారు. దీనికంతటికి కారణం అంబేద్కర్‌ని సరిగా అర్థం చేసుకోకపోవడమే.

మౌఖిక దశలో బుద్ధుడు చేసినంత పనిని లిఖిత దశలో అంబేద్కర్ చేశాడు. అంబేద్కర్ రచన కీర్తి కోసం చేశాడు. సామాజిక శ్రేయస్సు కోసం చేశాడు. సమకాలీనంలో ఆయన రచనలను అందరూ విబేధించారు. ఆయన రచనలను నిరాకరించారు. ఆయన రచనలను తగలబెట్టారు. అంబేద్కర్ గమనించింది ఒక్కటే రాసింది ఏదైనా నక్షత్రంగా మిగిలిపోతుంది. రాయనిది ఏదైనా గాలిలో కలిసిపోతుంది. అందుకే లిఖిత సాంప్రదాయాన్ని అనుసరించి ఆయన అప్పటికి వచ్చిన ఋగ్వేదం మీద లోతైన చర్చ చేశాడు.

ముఖ్యంగా వేదాలు అపౌరుషేయం కాదని నిరూపించడం భారత తాత్విక చరిత్రలో మైలురాయి. వేదాలు మనుషులే రాశారని ఆయన నిరూపించాడు. అంతకు ముందు వేదాలు ఈశ్వరుణ్ని దక్కా నుంచి ఋషుల చెవుల్లోనుంచి రాయబడ్డాయని చెప్పారు. అయితే ఆ మొత్తాన్ని తిరగరాశాడు. ముఖ్యంగా వశిష్ఠుడు, భరద్వాజుడు, విశ్వామిత్ర రుషుల జీవన వర్తనను బయటపెట్టారు. ఇది చాలా పెద్ద పని. సమాజం మొత్తం ఒకటి విశ్వసిస్తున్నప్పుడు దాని హేతు దృక్పథంతో వెళ్లడానికి సాధ్యం కాదు. ఎందుకంటే హిందూమతం కఠినమైంది, కర్కషమైంది, పాశవికమైంది, అహేతుకమైంది. లక్ష ఉదాహరణలు చూపిన వారు నమ్మిన అంశాల పట్ల తొణకరు. పైగా రుగ్వేదం అంటే వైదిక సంస్కృతి మొత్తానికి పునాది. ఆయన గొప్ప విషయాన్ని ఇందులో కనుగొన్నాడు. అసలు పుత్రుడు అనే వాడి సృష్టే రుగ్వేదం. అంతకు ముందు స్త్రీ స్వామ్య దేశం భారతదేశం. సంపద అనేది మళ్లీ సమాజానికే చేరాలి. అది ఏ సంపద అయినా. శరీరం అనేది దేనితో రూపొందించబడిందో దానిలోకే చేరుతుంది. అయితే సంపదను పుత్రుడికి ఇవ్వాలనే భావనే హిందూమతానికి పునాది. అందుకే పుత్రకామేష్ఠి యాగాన్ని సృష్టించారు ఋషులు. పుత్రికా కామేష్ఠియాగం లేదు.

అంబేద్కర్ ప్రత్యామ్నాయానికి బాట

అందుకే అంబేద్కర్ అధ్యయనం లోతు సముద్రం కంటే ఇంకా నిడివి కలది. అంబేద్కర్ తన ప్రతిభా సంపత్తితో అస్పృశ్యుల గురించి అనేక కమిషన్స్‌కు వివరాలు అందించి అనేక హక్కులు సాధించాడు. ఏ పాఠశాల అయితే తనకు ప్రవేశాన్ని నిరాకరించిందో, తనను తరగతి గదిలో బైటకూర్చోబెట్టి బైట పాఠాలు చెప్పిందో, అదే భారతంలో తన ప్రజలను విద్యావంతులను చేయడానికి, అన్ని ప్రభుత్వ పాఠశాలల ద్వారాలు తెరిపించగలిగాడు. ఆయన ఒక్కడుగా ఒక సైన్యంగా పనిచేశాడు. ఆయన విస్తృతమైన అధ్యయన శక్తి, ఆయన పరిశోధనా దృష్టి భారతదేశ గమనాన్నే మార్చి వేసింది. మనిషిని ప్రేమించి మనిషి ప్రతిభను గుర్తించలేని దేశంలో ఆయన ఎన్నో అవమానాలు అనుభవించి ఈ అవమానాలు నా వారసులు అనుభవించకూడదని నిర్ధారించుకొని పోరాటం గావించాడు. అంబేద్కర్‌ది మొక్కవోని దీక్ష. ఆయన అనేక శాస్త్రాలు అధ్యయనం చేశాడు. ఆర్థిక, సామాజిక, మానవ పరిణామ, వ్యాపార, రాజకీయ తాత్విక శాస్త్రాలను చాలా క్షుణ్ణంగా చదివాడు. ప్రపంచ దేశాలలో పేరెన్నిక గన్న విశ్వవిద్యాలయాల నుండి ఆయన డిగ్రీలు పొంది తన ప్రయాణ నిబద్ధతను ప్రతిభను నిరూపించుకొన్నారు. ఆయన పరిశోధనా పద్ధతిలో ఆయన ఏ విషయం చెప్పదలచు కొన్నాడో ఆ అంశాలకు సంబంధించిన అనేక ప్రమాణాలను మన ముందుకు తెచ్చాడు. ప్రత్యర్థిని కూడా ఆయన విద్యా సామర్థ్యంతో ఒప్పిస్తాడు. అందుకే బ్రిటీషు వాళ్లు తమపాలనలో నిర్లక్ష్యం చేసిన అస్పృశ్యుల గురించి, ఆదివాసుల గురించి అంబేద్కర్ చెపితేనే ఎక్కువ విషయాలు తెలుసుకొన్నారు.

అంబేద్కర్‌కు అధ్యయనంతో పాటు లోతైన అవగాహన, అనుభవం ఆచరణ ఉన్నాయి అందుకే ఆయన మాటలు సత్య నిష్ఠం అయ్యాయి. బుద్ధుని ధార్మిక సూత్రాలను, నీతి సూత్రాలను అంబేద్కర్ తన రాజ్యాంగంతో అవసరం అయిన చోటంతా పొదుగుతూ వెళ్లాడు. అంబేద్కర్‌ది నిశితదృష్టి, సత్యవాక్కు, నిజాయితీతో కూడిన జీవన, సైనిక క్రమ శిక్షణ, ప్రపంచ మానవీయ చూపు అందుకే ప్రపంచ వ్యాప్తంగా ఆయన సృష్టించిన వాఙ్మయం మీద, ఆయన నిర్మించిన సిద్ధాంతాల మీద, ఆయన జీవితంలోని నడవడిక మీద విస్తృతమైన పరిశోధనలు జరుగుతున్నాయి. ఏ బ్రాహ్మణులైతే అంబేద్కర్‌ను నిరాకరించారో, ఏ బ్రాహ్మణులు అంబేద్కర్ రచనలు దుయ్యబట్టారో వారంతా ఇప్పుడు అంబేద్కర్‌ను అనుసరించవలసిన పరిస్థితులకు నెట్టబడ్డాడు. వారెవరు కళ్లు ఎత్తి చూడలేనంత ఎత్తుకు ఆయన ఎదిగిపోయాడు.

అంబేద్కర్ మరువలేని స్మృతి

అన్ని రాష్ట్రాల్లో ఈనాడు ఆయన లైబ్రరీలు, స్మృతివనాలు నిర్మించుకోవడం చారిత్రక సందర్భం. చనిపోయిన సంవత్సరానికి పెద్ద పెద్ద రాజకీయ నాయకుల్ని మరచిపోతున్న ఈ సందర్భంలో 126 యేండ్ల జయంతిని మొత్తం ప్రపంచ వ్యాప్తంగా చేసుకొంటున్నారంటే ఆయనకు అవినీతిలేకపోవడం, ఆదర్శమైన జీవితం జీవించడం వల్లే సాధ్యమైంది. బుద్ధుడు ప్రపంచంలో ఎన్ని దేశాలకు తెలుసో అంబేద్కర్ కూడా అన్ని దేశాలకు తెలుసు. చంద్రబాబు గానీ, మోడీ గానీ తమ అవినీతి ఊబి నుండి బయట పడాలంటే అంబేద్కర్‌ని అధ్యయనం చేయడం అవసరం. లేకపోతే వారు నేరస్థులుగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది. భారతదేశంలో వున్న దళిత బహుజన మైనార్టీలు, స్త్రీలు ఐక్యమై అవినీతి అగ్రకుల రాజ్యాధికారానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన కర్తవ్యన్ని అంబేద్కర్ దీక్షలో ముందుకు తీసుకెళ్తామని శపథం చేద్దాం. మన ఇండ్లకు అంబేద్కర్ పేరు పెట్టుకుందాం, అంబేద్కర్ గ్రంథాలయాన్ని రూపొందించుకొందాం, అంబేద్కర్ చిత్రపటాన్ని రూపొందించుకొందాం. ప్రత్యామ్నాయ సంస్కృతిని రూపొందించుకోవడం ద్వారా మన పిల్లల్ని ముందుకు తీసుకెళ్దాం. ప్రత్యామ్నాయ జీవన వ్యవస్థల, రాజ్య నిర్మాణాలను అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు వెళ్లాద్దాం...

(రచయిత సామాజిక తత్వవేత్త, వ్యవస్థాపక అధ్యక్షుడు, నవ్యాంధ్రపార్టీ) వీ

బొగ్గుపొరలను కబళించనున్న కార్పొరేట్ సంస్థలు

ప్రజలకు ఉపాధి, జీవిక అందిస్తున్న ప్రభుత్వ సంస్థలను, సహజ వనరులను విదేశీ బహుళజాతి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడంలో భాగంగా ముందుకు తెచ్చిందే కోల్ మైన్స్ చట్టం-2015 అంటున్నారు ఎం. శ్రీనివాస్

దేశంలో బొగ్గు గనులను ప్రైవేటీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 2015 మార్చ్‌లో పార్లమెంట్‌లో కోల్ మైన్స్ స్పెషల్ ప్రొవిజనల్ బిల్లును ఆమోదిస్తూ 'కోల్ మైన్స్ చట్టం - 2015'ను తీసుకవచ్చింది. కార్పొరేట్ సంస్థల వాణిజ్య, వర్తక అవసరాల కోసం వేలం పాట ద్వారా బొగ్గు గనులను కట్టబెట్టే అవకాశాన్ని కల్పించడం కోసమే ఈ చట్టం ఉద్దేశించబడింది. కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్‌ను ఇపిఎఫ్‌లో విలీనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమయ్యింది. బొగ్గు గనుల్లో ప్రైవేటీకరణ పేరుతో కార్మిక సంక్షేమానికి కోత విధించే ప్రయత్నాలకు తెరలేపింది. శాశ్వత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేయడానికి గని ఉద్యోగి మరణించినా లేక మెడికల్ అన్‌ఫిట్ అయినా ఆ కుటుంబాలకు ఉద్యోగానికి బదులు డబ్బులతో సెటిల్ చేసే ప్రతిపాదనను ముందుకు తెచ్చింది. ఈ పరిస్థితుల్లో బొగ్గు గనుల ప్రైవేటీకరణ చట్టం దేశ ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీసి, బహుళజాతి సంస్థల వాణిజ్య వర్తక ప్రయోజనాలను నెరవేర్చే ప్రక్రియకు తెరలేపింది.

బొగ్గుగనుల జాతీయకరణ - పూర్వరంగం

దేశంలో కొనసాగిన వలసపాలనా కాలంలో సుమారు రెండు శతాబ్దాలకు పైగా మన బొగ్గు గనులు వలసవాదుల ఆధీనంలో ఉండేవి. 1947 అధికార మార్పిడి అనంతరం 1973 ఏప్రిల్ వరకు ఈ బొగ్గుబావులు ప్రైవేట్ సంస్థల పరిధిలో ఉన్నాయి. 1956లో ఏర్పడిన జాతీయ బొగ్గు అభివృద్ధి సంస్థ దేశ ఇంధన, విద్యుత్ అవసరాలు పెరగడంతో బొగ్గు ఉత్పత్తిని పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. అప్పటికే దేశంలో ప్రైవేట్ సంస్థల ఆధీనంలో బొగ్గు గనులు ఉండి ఉత్పత్తి సాగిస్తున్నాయి. దేశ అవసరాలకు అనుగుణంగా ఉత్పాదకత పెరగక ఉత్పత్తి లక్ష్యాలు సాధించలేని స్థితి కొనసాగుతుంది.

ప్రైవేట్ బొగ్గు గని యాజమాన్యాలు అశాస్త్రీయ పద్ధతులు పాటించడం, కార్మికులకు భద్రత, మౌలిక వసతులు కొరవడి, గని కార్మికుల పరిస్థితి దిగజారడం. సమర్థత, పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం తదితర విషయాలలో ఆనాటికి ఉన్న ఇతర దేశాల ప్రమాణాలను అందుకోలేని పరిస్థితి మన బొగ్గు గనుల్లో ఉండేది. దేశ విద్యుత్ అవసరాలను తీర్చలేని దుస్థితి కొనసాగుతుండేది. కార్మికుల శ్రమ, దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. తగిన రక్షణ ఏర్పాట్లు లేక వందలాది మంది కార్మికులు ప్రమాదాల్లో ప్రాణాలను కోల్పోయారు.

ఈ పరిస్థితుల్లో కార్మికోద్యమాలు పెద్ద ఎత్తున రంగం మీదకు రావడం, మిశ్రమ ఆర్థిక వ్యవస్థ పునాదిగా బాంబే ప్లానులో భాగంగా 1956 పారిశ్రామిక విధానాన్ని నెహ్రూ ప్రభుత్వం రూపొందించడం వంటి పరిస్థితుల పూర్వ రంగంలో 70వ దశకంలో భారత ప్రభుత్వం వాటిని జాతీయం చేసింది. ఈ బొగ్గు గనుల జాతీయకరణ 2 పద్ధతుల్లో జరిగింది. ఈ ప్రక్రియను 1970వ దశకంలో పూర్తి చేసింది. 1971-72లో ఖనిజ బొగ్గు గనులను, థర్మల్ బొగ్గు గనులను 1973లో కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

1971లో కోకింగ్ కోల్ మైన్స్ ఆక్ట్ ద్వారా బొగ్గు గనులను, బొగ్గు ప్లాంట్‌లను భారత ప్రభుత్వం జాతీయం చేసింది. వీటిని భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ పరిధిలోకి తెచ్చింది. అదే విధంగా 1973లో కోల్ మైన్స్ యాక్ట్ ద్వారా 1971లో కేంద్ర ప్రభుత్వం స్వాధీన పరుచుకున్న బొగ్గు గనులతోపాటు దేశంలో 7 రాష్ట్రాలలో ఆనాటికే విస్తరించి ఉన్న ఖనిజ, ఖనిజయేతర బొగ్గు గనులను తన ఆధీనంలోకి తెచ్చుకున్నది. ఈ విధంగా స్వాధీనం చేసుకున్న బొగ్గు గనులను 'కోల్ మైన్స్ యాక్ట్-1973' ద్వారా కేంద్ర ప్రభుత్వం కార్మిక వర్గ పోరాట దిక్సూచి అయిన మే 1న 1973లో జాతీయం చేస్తున్నట్లు ప్రకటించింది.

1973లో జాతీయం చేసిన దేశవ్యాప్త ఖనిజయేతర బొగ్గు గనులను 'భారత బొగ్గు గని ప్రాధికార సంస్థ' ఆధీనంలోకి తీసుకు వచ్చాయి. తర్వాత కాలంలో కోల్ ఇండియాకు అనుబంధంగా 'వెస్టర్న్ కోల్ లిమిటెడ్ (డబ్ల్యు.సి.ఎల్)', 'నార్త్ కోల్ లిమిటెడ్ (ఎన్.సి.ఎల్)', 'ఈస్టర్న్ కోల్ లిమిటెడ్ (ఇ.సి.ఎల్)' ఏర్పడ్డాయి. 1975లో స్థాపించిన 'ఈస్టర్న్ కోల్ ఫీల్డ్స్ లిమిటెడ్ (ఇ.సి.ఎఫ్.ఎల్)' మధ్యప్రదేశ్‌లోని రాణిగంజ్ బొగ్గు క్షేత్రంలోని అన్ని కాలరీలను స్వాధీనం చేసుకుని 29.72 బిలియన్ మెట్రిక్ టన్నుల నిల్వలతో దేశంలోనే 2వ అతిపెద్ద బొగ్గు సంస్థగా ఉన్నది. బొగ్గు గనుల్లో నెలకొని ఉన్న ఈ అస్తవ్యస్థ పరిస్థితులలో జాతీయీకరణ వల్ల కొంత మార్పు వచ్చింది.

కార్మిక వర్గానికి, సమాజానికి ఏ మాత్రం దోహదం చేయని ఈ పరిస్థితులు జాతీయకరణ వల్ల కొంత మారింది. లక్షలాది మంది కార్మికులకు తగిన భద్రత, శ్రమకు తగిన జీతభత్యాలు లభించాయి. కోల్ ఇండియా 50 వేల కోట్లకు పైచిలుకు టర్నోవర్‌తో నవరత్న కంపెనీగా రూపొందింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఆరు మైనింగ్ కంపెనీలలో ఒకటిగా అవతరించింది.

ఇక కోల్ ఇండియాకు అనుబంధంగా వున్న సింగరేణి సంస్థ విషయానికి వస్తే 'బొగ్గు గనులను ప్రైవేట్ పరం కానివ్వం. అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వమే టేకోవర్ చేసుకుని నిర్వహిస్తుంది.' అని 2018 ఫిబ్రవరి 27న కెసిఆర్ వ్యాఖ్యానించారు. ఇదే నిజమైతే జైపూర్ థర్మల్ పవర్

ప్రాజెక్టు నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యం, సహకారం ఏ మేరకు ఉన్నది? తాడిచర్ల మైనింగ్‌ను ప్రైవేట్ సంస్థకు ఎందుకు అప్పగించారు? అండర్ గ్రౌండ్ బావుల తవ్వకానికి బదులు ఓపెన్ కాస్టులకు అనుమతులు ఎందుకు ఇస్తున్నారు? వాటిని కూడా ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలన్న ప్రతిపాదనలు ఎందుకు చేస్తున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు రాష్ట్ర ప్రభుత్వాల వద్ద దొరకవు.

అసలు విషయానికి వస్తే హైదరాబాద్ సంస్థానంలో ఉన్న సింగరేణి సంస్థ 1928 నుండి 1948 వరకు నిజాం ఆధీనంలో ఉండేది. ఇంగ్లాండ్‌లో 1886లో ఏర్పడిన దక్కన్ (హైదరాబాద్) కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ సింగరేణిలో తొలుత బొగ్గు తవ్వకాలను ప్రారంభించింది. ఈ హైదరాబాద్ కంపెనీ ఆక్టు ప్రకారం 1920 డిసెంబర్ 20న పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగా ఏర్పడింది. 1928 నుండి నిజాం ఆధీనంలో ఉన్న ఈ సంస్థ భారత యూనియన్‌లో హైదరాబాద్ సంస్థానాన్ని కలుపుకున్న తరువాత కోల్ ఇండియాకు అనుబంధంగా పూర్తి స్థాయిలో ప్రభుత్వ రంగ సంస్థగా మారింది.

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ వాటా 51 శాతం, కేంద్ర ప్రభుత్వ వాటా 49 శాతం కలిగి ఉండి నిర్వహించబడుతోంది. 1994 వరకు 1,16,000 మంది కార్మికులను కలిగి ఉండి లాభాలతో సింగరేణి నడిచింది. ప్రభుత్వ విధానాల కారణంగా సింగరేణి సంస్థ క్రమంగా నష్టాలలోకి నెట్టబడింది. ప్రభుత్వ పాలసీలో భాగంగా ముందుకు వచ్చిన మెకనైజేషన్, కంప్యూటరైజేషన్ కారణాలతోపాటు సిఆర్ఎస్, విఆర్ఎస్, అనారోగ్యం తదితర కారణాలతో సింగరేణి సంస్థలో కార్మికులు క్రమంగా కుదించబడుతూ, ప్రస్తుతం 52 వేల మందికి పరిమితమయ్యింది.

ప్రస్తుతం సింగరేణి సంస్థలో 34 అండర్ గ్రౌండ్ బావులు, 16 ఓపెన్ కాస్టు మైన్స్‌లలో తవ్వకాలు నిర్వహిస్తున్నది. పర్మినెంట్ ఉద్యోగ నియామకాలను నిలిపివేసి అతి తక్కువ జీతాలతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కింద నియామకాలను చేపట్టింది.

సింగరేణిలో 25 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారు. జెబిసిసిచే నియమించబడిన హైపవర్ కమిటీ నిర్దేశించిన కనీస వేతనాలను అమలు చేయాలన్న ఈ కార్మికుల డిమాండ్ కలగానే మిగిలిపోయింది.

మన భూమి పొరలలోకి బహుళజాతి సంస్థల ప్రవేశం

దేశంలోని బొగ్గు వనరులపై ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా నియంత్రణను పూర్తి స్థాయిలో తొలగించే చర్యలకు కేంద్ర ఎన్‌డిఏ పాలకులు పూనుకున్నారు. కోల్‌మైన్స్ చట్టం 2015 సమగ్రమైన చట్టంగా రూపుదిద్దుకున్న సందర్భంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విధాన పరమైన ఈ చట్ట సవరణలను అత్యంత కీలకమైన, ప్రతిష్టాత్మకమైన సంస్కరణగా, మేలి మలుపుగా కేంద్ర రైల్వే, బొగ్గు గనుల శాఖా మంత్రి పియూష్ గోయెల్ అభివర్ణించారు.

ప్రైవేట్ కంపెనీలతో పాటు విదేశీ కంపెనీలు ఈ సంస్కరణల ద్వారా దేశంలోకి వస్తాయి. దీనివల్ల ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతోంది. దేశ అవసరాలు తక్షణమే నెరవేరుతాయి. విదేశాల నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వస్తుంది. తీవ్ర పోటీవల్ల కోల్ ఇండియా తన సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకుంటుంది. విద్యుత్ చార్జీలు తగ్గుతాయి. బొగ్గు దిగుమతులపై నియంత్రణ క్రమంగా పెరుగుతుంది. విలువైన విదేశీ మారక ద్రవ్యం ఆదా అవుతుంది అంటూ మంత్రి పేర్కొన్నారు.

కానీ ప్రైవేటీకరణ విధానం వల్ల ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా గుత్తాధిపత్యం దెబ్బతిని క్రమంగా జీవచ్ఛవంలా మారుతుందన్న విషయాన్ని ఉద్దేశ్యపూర్వకంగానే పూర్వపక్షం చేస్తున్నాడు.

ఇప్పటికే కేంద్ర పాలకులు కోల్ ఇండియాలో చేపట్టిన విధానపరమైన చర్యల కారణంగా ప్రభుత్వ పెట్టుబడులు ఉపసంహరించబడుతున్నాయి. ప్రభుత్వ వాటాలు విక్రయిస్తున్నారు. వార్షిక బడ్జెట్‌లో ప్రణాళికా కేటాయింపులు గత రెండు దశాబ్దాలుగా పూర్తి స్థాయిలో నిలిచిపోయాయి. ఈ పరిస్థితులు ప్రభుత్వం నూతనంగా చేసిన కోల్‌మైన్ చట్టం మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా కోల్ ఇండియా పరిస్థితి ఉండబోతోంది. అంటే పూర్తి స్థాయిలో కార్పొరేట్ సంస్థల ఆధీనంలోకి వెళ్లడానికి చట్టబద్ధ అవకాశాలు ఏర్పడబోతున్నాయి.

కోల్ ఇండియాను బలహీనపరిచే చర్యలు

గత రెండున్నర దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వాలు (యుపిఎ, ఎన్‌డిఎ) ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియాను బలహీనపరిచే అనేక విధానాలను చేపట్టింది. 90వ దశకంలో నయా ఉదారవాద ఆర్థిక, పారిశ్రామిక విధానాల నేపథ్యంలో కేంద్ర పాలకులు ఈ రంగం అభివృద్ధికి, విస్తరణకు కార్మిక సంక్షేమానికి దోహదం చేసే బడ్జెట్ కేటాయింపులను పూర్తిగా నిలిపివేసింది. బొగ్గు గనుల విస్తరణకు అనుమతులు ఇవ్వకపోవడం, పర్మనెంట్ ఉద్యోగ నియామకాలను చేయకపోగా యాంత్రికీకరణ పేరుతో శాశ్వత ఉద్యోగుల సంఖ్యను క్రమంగా తగ్గిస్తూ వస్తోంది. ఒకనాడు ఆరు లక్షల మంది కార్మికులతో ఉన్న కోల్ ఇండియా సంస్థను నేడు మూడు లక్షల మందికి కుదించబడింది. కార్మికుల సంక్షేమం, భద్రత విషయాలను పట్టించుకోవడంలేదు.

ప్రతియేటా బొగ్గు గని కార్మికుల నుంచి టాక్స్ కింద సుమారు రు. 3500 కోట్లను కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తోంది. బొగ్గు గని కార్మికులకు ఇన్‌కంటాక్స్ మాఫీ చేయాలన్న డిమాండ్‌ను పట్టించుకోకపోగా కనీసం ప్రత్యేక శ్లాబును కూడా నిర్ణయించలేని పరిస్థితి కొనసాగుతోంది. కోల్ ఇండియా దాని అనుబంధ సంస్థల నుంచి పన్నులు, డివిడెండ్ల రూపంలో వేల కోట్ల రూపాయలను దండుకుంటున్నప్పటికీ వారి సంక్షేమాన్ని ఆ సంస్థ అభివృద్ధికి కనీస చర్యల్ని చేపట్టకపోవడం ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణలో భాగమే. ఈస్టర్న్ కోల్ లిమిటెడ్, నార్త్ కోల్ లిమిటెడ్, వెస్టర్న్ కోల్ లిమిటెడ్‌లలో కేంద్ర ప్రభుత్వం తన పెట్టుబడులను ఇప్పటికే 20 శాతం ఉపసంహరించుకున్నది.

గత 20 ఏండ్లుగా కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లలో కనీస కేటాయింపులు లేకుండా పోయాయి. అదే విధంగా 2018-19 వార్షిక బడ్జెట్‌ను గమనిస్తే ఆదాయ వనరుల సమీకరణకు ఉన్న మార్గాలలో ప్రభుత్వ రంగ సంస్థలలో వాటాలను విక్రయించడం వాటిల్లో ఒకటి. ప్రభుత్వం తన వాటాలను అమ్మడం ద్వారా 2015-16లో రు. 48 వేల కోట్లు, 2016-17లో రు. 68.5 వేల కోట్లను సమకూర్చుకుంది.

2018-19 వార్షిక బడ్జెట్‌లో 80 వేల కోట్లు సమీకరించుకోవాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నది. బొగ్గు గనుల విస్తరణకు, అభివృద్ధికి అవసరమైన సహకారం అందించవలసిన ప్రభుత్వాలే బాధ్యతల నుండి వైదొలగడానికి కార్పొరేట్ సంస్థల ఒత్తిడే కారణం.

కోల్ మైన్స్ చట్టం అసలు ఉద్దేశం

అమ్మకాలకు సంబంధించిన విధానాలపైన, రాష్ట్రాల వాటాలపైన మంత్రి గోయెల్ చెప్పేదంతా నిజం కాదు. కార్మికుల భద్రత, సంక్షేమం కార్పొరేట్ సంస్థలకు పెద్దగా పట్టింపు ఉండదు. బొగ్గు తవ్వకాలలో పర్యావరణ రహిత పద్ధతులను అనుసరించాలన్న బాధ్యతను ఈ సంస్థలు గుర్తించవు. కార్పొరేట్ సంస్థలు తొలిత ధరలు తగ్గించి, బొగ్గు ఉత్పత్తులను విక్రయిస్తాయి. తక్కువ జీతాలకు కార్మికులను రిక్రూట్ చేసుకుంటాయి. ప్రభుత్వ రంగంలోని బొగ్గు బావులు ఈ పోటీని తట్టుకోవడానికి కార్మిక వ్యతిరేక చర్యలు చేపట్టే వైపు నెట్టబడతాయి.

ప్రకృతి అందించిన సహజ సిద్ధ ఖనిజ, ఖనిజేతర బొగ్గు వనరులు అత్యంత అరుదైన సరుకు. బొగ్గు నిల్వలు పూర్తయితే మళ్లీ లభ్యం కావు.

ప్రైవేట్ గని సంస్థలు లాభదాయకంగా ఉండే బొగ్గు నిక్షేపాలలోని బొగ్గును తవ్వుకునే స్థితి ఉంటుంది. కఠిన పరిస్థితులు కలిగిన బొగ్గు గనులలోకి అవి వెళ్లవు. అనుమతులు ఉన్న ప్రాంతాలలోనే కాకుండా అనుమతులు లేని ప్రాంతాలలో అక్రమాలకు పాల్పడతాయి. లేబర్ చట్టాలను ఉల్లంఘించే ప్రమాదమూ ఉంటుంది. ప్రభుత్వ కంపెనీలు ప్రైవేట్ సంస్థల నుండి ఎదురయ్యే పోటీ తట్టుకోవడానికి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాలన్న ప్రయత్నంలో కార్మికుల సంఖ్యను తగ్గించుకుంటుంది. నూతన నియామకాలకు అవకాశాలు లేకుండా పోతుంది.

అంతర్జాతీయ ఆర్థిక, వాణిజ్య సంస్థలైన ప్రపంచబ్యాంకు (డబ్ల్యు.బి), ప్రపంచ ద్రవ్య సంస్థ (ఐ.ఎం.ఎఫ్), ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యు.టి.ఓ) ల విధానాలకు అనుగుణంగానే పాలకులు సర్వ రంగాలను ప్రైవేటీకరిస్తున్నట్లుగానే బొగ్గు రంగాన్ని కూడా ప్రైవేటీకరించాలని, విదేశీ పెట్టుబడులతో ఆ రంగాన్ని ముంచెత్తడం మోడీ ప్రభుత్వం అసలు ఉద్దేశంగా ఉన్నది.

స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు మరిన్ని అధికారాలను కట్టబెట్టడానికే ఈ ప్రక్రియ. దీనిలో భాగమే 90వ దశకంలో యుపిఏ కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు 214 బొగ్గు యూనిట్లను కేటాయించింది. కోల్ ఇండియా సంస్థను ప్రైవేటీకరించాలని కేంద్ర క్యాబినెట్ కూడా నిర్ణయించడం దీనిలో భాగమే. కీలకమైన రైల్వే, విమాన, రక్షణ, బొగ్గు వంటి రంగాలలోకి 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం కల్పించడం, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ నేపథ్యంలో కేంద్రమంత్రి గోయెల్ చేసిన వ్యాఖ్యలు చాలా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రత్యేకించి ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియాలో ప్రభుత్వ విధి విధానాలు ఇప్పటికే ప్రమాద ఘంటికలను సూచిస్తున్నాయి.

ఈ క్రమంలో 2014లో తెరమీదికి వచ్చిన 'కోల్‌మైన్స్ స్పెషల్ ప్రొవిజన్ బిల్ – 2015' చట్ట రూపం తీసుకున్నది. భారత పార్లమెంట్ ఆమోదంతో 2015 మార్చ్‌లో సమగ్రమైన చట్టంగా ఇది రాకముందు 1993లో కాంగ్రెస్ ప్రభుత్వం 2014 బొగ్గు గనులను ప్రైవేట్ కంపెనీలకు కేటాయించింది. ఈ కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయని, పారదర్శకత, జవాబుదారీతనం లేకపోవడం, తగిన ప్రమాణాలు పాటించకపోవడం వంటి కారణాలతో దేశ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును ఆధారం చేసుకుని కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆ కేటాయింపులను రద్దు చేసింది.

ఈ క్రమంలో వచ్చిందే 'కోల్ మైన్స్ చట్టం–2015'. ఈ చట్టం వల్ల కోల్ ఇండియా సంస్థకు బొగ్గు గనుల మీద ఉన్న గుత్తాధిపత్యం తొలగుతుంది. బొగ్గు ఉత్పత్తి ప్రైవేట్ సంస్థల చేతుల్లోకి పోతుంది. బొగ్గు ధరలు, థర్మల్ విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరుగుతాయి. ఈ చట్టం ఆధారంగా భారతదేశంలో ప్రైవేట్ సంస్థలు వాణిజ్య బొగ్గు పరిశ్రమలోకి ప్రవేశించడం కోసం 2018 ఫిబ్రవరి 20న కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదించింది. దీనితో దేశంలోని తొమ్మిది రాష్ట్రాలలో కోల్ ఇండియా లిమిటెడ్ ఆధీనంలో ఉన్న మొత్తం గనులు ప్రైవేటీకరించబడతాయి. ప్రస్తుతం మెగా గనులతో పాటు చిన్న, మధ్యతరహా బొగ్గు గనులు ధారాదత్తం చేయబడతాయి.

దేశవ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి ఆధారంగానే 70 శాతానికి పైగా థర్మల్ పవర్ ప్రాజెక్టులు నడుస్తున్నాయి. దేశ అవసరాలకు గాను 2020 నాటికి దేశం మొత్తంలో కనీసం 600 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం కోల్ ఇండియా సంకల్పించింది. విదేశాల నుంచి ప్రతియేటా దిగుమతి చేసుకుంటున్న 200 మిలియన్ టన్నుల బొగ్గును క్రమంగా తగ్గించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దేశంలో థర్మల్ పవర్ ప్రాజెక్టుల అవసరాలు, విద్యుత్ అవసరాలు, ప్రాజెక్టుల నిర్మాణం ఆవశ్యకతను దృష్టిలో పెట్టుకుని బొగ్గు ఉత్పత్తిని మరింత వేగంగా చేయాల్సి ఉన్నది.

నిజానికి ఈ ప్రక్రియను కోల్ ఇండియా దాని అనుబంధ సంస్థలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా వెన్ను దన్నుగా ఉండి ఆ ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించవచ్చును. ఎందుకంటే కేంద్ర, రాష్ట్ర పాలకులు తమ బాధ్యతను విస్మరించడమేకాక, సహాయ నిరాకరణ వైఖరిని కలిగి ఉండి, కోల్ ఇండియా సంస్థను దెబ్బతీసే చర్యలను అనేకం చేపట్టినప్పటికీ కోల్ ఇండియా దాని అనుబంధ సంస్థలు లాభాలలోనే నడుస్తున్నాయి. ఉత్పాదక సామర్థ్యాన్ని పెంపొందించుకుని ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడానికే కృషి చేస్తున్నాయి.

గత 20 ఏండ్లుగా డివిడెండ్ల రూపంలో 20 నుంచి 30 శాతం, పన్నులు, రాయల్టీల పేరుతో 12 నుంచి 15 వేల కోట్ల వరకు కోల్ ఇండియా దాని అనుబంధ సంస్థలు కేంద్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నాయి. క్లీన్ ఎనర్జీ పేరుతో టన్ను బొగ్గుకు రు. 400లు చొప్పున కేంద్రానికి చెల్లిస్తున్నాయి. మూడున్నర లక్షల మంది కార్మికుల, ఉద్యోగుల నుండి ప్రతియేటా ఆదాయపు పన్ను కింద రు. 3500 కోట్లు వసూలు చేస్తుంది. ప్రభుత్వాలు సహకరించకపోయినా కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థలు స్వతహాగానే థర్మల్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లా జైపూర్‌లో రు. 8750 కోట్ల వ్యయంతో 1200 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టిన థర్మల్ పవర్ ప్రాజెక్టు నిర్మాణం దీనిలో భాగమే.

బ్యాంకుల ప్రైవేటీకరణ అవసరమా?

***ప్రభుత్వ బ్యాంకులను దివాలా పేరుతో ప్రైవేటుపరం చేయాలని చూడడం ఆర్థిక సంస్కరణల్లో భాగమేననీ, బ్యాంకులను ప్రైవేట్ చేయడమంటే కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలను నెరవేర్చడమేననీ అంటున్నారు* కేశవ్**

ఈమధ్య పంజాబ్ నేషనల్ బ్యాంకు ఎదుర్కొన్న నీరవ్ మోదీ కేసుని దృష్టిలో ఉంచుకొని అక్కడక్కడా ఒకే చర్చ నడుస్తోంది. భారతీయ పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు ఇలా నడవలేవనీ, వీటిని ప్రైవేటు చెయ్యడమే శరణ్యమనీ, కనీసం వంతుల వారీగా అయినా చేయడం ఔచిత్యమనీ అంటున్నారు. ఈ మధ్య కార్పొరేట్ ఉన్నతవర్గం కూడా ఇలానే ఉచిత సలహాలిస్తోంది.

క్రియాశీల పాత్రను నిర్వహించిన పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు

పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు వ్యాపారం చేసి ఉండొచ్చు. కానీ, మరో వైపు, అత్యంత క్రియాశీల పాత్రను కూడా నిర్వహించాయి. సామాజిక బాధ్యతను కూడా పోషించాయి. 1969లో దాదాపు 14 బ్యాంకుల్నీ, 1980లో మరో 6 బ్యాంకుల్నీ జాతీయం చేశారు. దేశం ఎదుర్కొన్న సమస్యలకు సరయిన దారిని ఈ పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు ఇస్తాయని ఆనాడు అనుకున్నారు. ఇదే ఉద్దేశంతో వాటిని జాతీయం చేశారు. వీటికి సామాజిక బాధ్యతను అప్పగించారు. ఆర్థిక మంత్రిత్వ శాఖకీ, రిజర్వ్ బ్యాంకుకీ కుడి భుజంగా ఇప్పటికీ స్టేట్ బ్యాంకుతో పాటు ఎన్నో పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు పనిచేస్తున్నాయి. నేటికీ, పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల బ్రాంచీలు భారతదేశం మొత్తం మీద దాదాపు 1,16,394 ఉన్నాయి. ఇందులో 33,864 బ్రాంచీలు గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయి. అలానే వ్యవసాయ రంగానికి ఈ బ్యాంకులు 2017- 2018లో దాదాపు రు.6,22,685 కోట్ల రుణాలను మంజూరు చేశాయి. స్వచ్ఛంద మహిళా గ్రూప్‌లకు రు. 61,600 కోట్లు, ఎడ్యుకేషన్ లోన్‌గా రు. 70,400 కోట్లు అందించాయి. ఇలాంటి సామాజిక నిబద్ధత ఉన్న విధుల్ని కేవలం పబ్లిక్ సెక్టార్ బ్యాంకులే నిర్వహిస్తాయి. ప్రైవేటు బ్యాంకుల్లో ఈ సదుపాయం లేదు. పైగా, ఇవి వీటి మీద అంతగా శ్రద్ధ చూపవు. లాభాలు, వ్యాపార విలువలనే నెత్తి మీద వేసుకొని పని చేస్తాయి. పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు ఉన్నప్పటికే వ్యవసాయదారులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కొన్ని వందల కిలోమీటర్లు రోడ్ల మీద నడిచి ముంబై నగరానికి చేరుకుంటున్న దాదాపు ముప్పై వేల మంది రైతుల పాదాల్ని చూస్తుంటే, మరి పూర్తిగా ప్రైవేటు బ్యాంకులే పూర్తిగా రాజ్యమేలితే కాబూలీ వాలా అప్పులతో రైతులు ఇంకెంత సతమతమవుతారో! ఇంకెన్ని ఆత్మహత్యలు జరుగుతాయో!

నోట్ల రద్దు రోజుల్లో దాదాపు నెలా, రెండు నెలలు బ్యాంకులు తమ సాధారణ పనులు పక్కన పెట్టేసి, కొత్త నోట్లు ఇవ్వడం, పాత నోట్లు తీసుకోవడం, వాటి లెక్కలు రాయడం ఫిర్యాదులు వస్తే సి.సి.టి.వి. ఫుటేజీలు పంపించడం ఇదే తంతు దాదాపు రెండు నెలలు సాగింది. అసంఖ్యాకమైన ఫారాలు నింపడం, పాత నోట్లు జాగ్రత్తగా ప్యాక్ చేయడం ఎన్నో రోజులు నడిచింది. మరి కొన్ని సందర్భాలలో, పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన పాపులిస్ట్ కార్యక్రమాలకు చేదోడు వాదోడుగా నిల్చొని వాటిని విజయవంతం చేస్తాయి. ఒక వేళ ప్రైవేటు బ్యాంకులు నిజంగానే తమ పని నిజాయితీగా చేసి ఉంటే, సామాజిక రంగాల్ని పట్టించుకొని ఉండింటే, ఈ రోజు ప్రైవేటు బ్యాంకులే ఉండి ఉండేవి కదా? కటిక పేదరికంలో మగ్గుతున్న రైతాంగానికి ఆ నాడు వ్యవసాయం కోసం కాస్త చేయూత అవసరం. ప్రైవేటు బ్యాంకులు ఈ పని ఎక్కడ చేసాయి? 1969 కి ముందు ప్రైవేటు బ్యాంకులే దేశంలో ఉన్నాయి కదా. ఒక వేళ ఈ బ్యాంకులు నిజంగానే సామాజిక బాధ్యత

ఇప్పటికే కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థల్లో పాక్షికంగానైనా ప్రైవేట్ కంపెనీలకు అవకాశాలు కల్పించడం, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల నియామకాలకు అవకాశం కల్పించి వేగిర పరిచారు.

దేశంలో బొగ్గు నిక్షేపాలు విస్తారంగా ఉన్నాయి. ఈ అపారమైన బొగ్గు నిల్వలను దేశ అవసరాలను దృష్టిలో పెట్టుకుని వెలికి తీయాలన్న బాధ్యతను ప్రభుత్వం విస్మరించింది.

విదేశాల నుండి బొగ్గును దిగుమతి చేసుకుంటున్నారు. కోల్ మైన్ చట్టం – 2015 ప్రకారం నేరుగా స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ సంస్థల ప్రవేశానికి చట్టబద్ధ అవకాశం ఏర్పడింది.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) విచ్చల విడిగా రావడానికి అవకాశం కల్పించబడింది. ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పించుకోవడానికి మార్గం సుగమం అయింది. బొగ్గు గనులను వేలం పాట ద్వారా కేటాయించే అధికారం చట్టం కల్పిస్తోంది. ప్రైవేట్ సంస్థలు తమ సొంత ఉక్కు, సిమెంట్, విద్యుత్ ప్లాంట్ల వినియోగం కోసం బొగ్గు గనులను తవ్వుకోవడానికి కూడా ఈ చట్టం అధికారాన్ని దఖలు పరుస్తోంది.

కనుక సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థల ప్రయోజనాల కోసం దేశంలోనే నవరత్న కంపెనీగా పేరొందిన కోల్ ఇండియా దాని అనుబంధ సంస్థల నిర్వాహణ బాధ్యతల నుండి తప్పుకోవడానికి భారత దళారీ పాలకులు సుదీర్ఘకాలంగా అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ప్రయత్నాలను 'కోల్‌మైన్స్ చట్టం – 2015' సాకారం చేయబోతుంది.

(రచయిత ఇఫ్టూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) వీ

నిర్వర్తించి ఉంటే, ఆ రోజుల్లో బ్యాంకుల్ని జాతీయం చేయాల్సిన అవసరం వచ్చి ఉండేది కాదు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు బ్యాంకులు ఎక్కడున్నాయి? ఇప్పుడైనా సరే, పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్ని పోల్చి చూస్తే, గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు బ్యాంకుల్ని వేళ్ల మీద లెక్క పెట్టొచ్చు.

పీడిస్తున్న మొండి బాకీలు

1990ల తర్వాత భారత పాలక వర్గం ఎక్కువ గ్రోత్ అనీ, ఫారెన్ ఎక్స్చేంజి రెజర్వ్స్ అనీ, అభివృద్ధి అనీ కల్ల బొల్లి మాటలు చెప్పి మన దేశం ద్వారాల్ని ప్రపంచీకరణకు తెరిచి ఉంచాయి. ప్రపంచీకరణ గాలుల్ని ఆహ్వానించి వేగవంతం చేసారు. సంస్కరణలు అంటూ బ్యాంకుల మీద ఒత్తిడి. మౌలిక సదుపాయాలంటూ, బిగ్ ప్రాజెక్ట్ లంటూ పి.పి.పి. మోడల్ అంటూ మన బ్యాంకుల మీద పడ్డారు. పేరుకే పి.పి.పి. మోడల్. ఎక్కువ భాగం మన పబ్లిక్ సెక్టార్ బ్యాంకులే భరించాయి. అలా భరించేలా చేశాయి. ఇలా పనికి రాకుండా లిక్విడిటీని ఉంచకుండా పనికొచ్చే ప్రాజెక్ట్‌లకు రుణాలిస్తే మంచిది కదా అంటూ పెద్ద కార్పొరేట్లకు రుణాలివ్వడం ఆరంభించాయి. చాప కింద నీరులా బ్యాంకుల నియంత్రణ కార్పొరేట్లకు అనుగుణంగా నడిచింది. విజయ్ మాల్యా లాంటి వారు, మేహుల్ చోక్సీ, నీరవ్ మోదీ లాంటి వారు కొన్ని వేల కోట్లు చెల్లించ లేదన్న ఆరోపణలు కేవలం చిన్న ఉద్యోగస్తుల ద్వారానే జరుగుతాయా? ఏవైనా పెద్ద హస్తాలు లేకుండా ఇంత పెద్ద మొత్తాలు ఎలా కనుమరుగు అవుతాయి? పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో బ్యాంకు పని మాత్రమే జరగాలి. ఇన్సురెన్సు కంపెనీల్లో ఇన్సూరెన్స్ అమ్మకాలు జరగాలి. అదే సరైన పద్ధతి. కానీ, బ్యాంకుల్లో బ్యాంకు పని మీదకు వెళ్లిన కస్టమర్‌లకు కమీషన్ కోసమని ఇన్సూరెన్స్ అమ్మకాల వ్యాపారం కొనసాగిస్తే బ్యాంకు అసలైన ఉద్దేశాన్ని దెబ్బ తీసేదిగా తయారవుతుంది. మరో వైపు, సిబాల్ రిపోర్ట్ ప్రకారం అప్పులు తీర్చని ఉద్దేశ పూర్వక అప్పు ఎగవేతదార్లు 2013 లో రు. 25,410 కోట్ల రూపాయలు చెల్లించగలిగే స్థోమత ఉన్నా చెల్లించడం లేదు. సెప్టెంబర్ 2017 సరికి ఇదే మొండి బాకీలు రు. 93,357 కోట్లకు చేరుకున్నాయి. దాదాపు 340 శాతం పెరిగింది. ఒక్క 7564 మంది మాత్రమే చెల్లించగలిగే స్థోమత ఉన్నా చెల్లించడం లేదు. రు. 2,65,908 కోట్లు పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లోకి తిరిగి రావాలి. అందుకే 17,000 మంది రుణగ్రస్తులను సదరు బ్యాంకులు కోర్టుకు ఈడుస్తున్నట్టు తెలుస్తోంది. ఫలితం ఎలా ఉంటుందో తెలీదు గాని, బ్యాంకుల మొండి బాకీలు మరింత పెరిగాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మొండి బాకీలు రు. 74,649 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ మొండి బాకీలు రు. 25,608 కోట్లు, ఐ.డి.బి.ఐ. బ్యాంక్ మొండి బాకీలు రు. 22,635 కోట్లు, కార్పొరేషన్ బ్యాంక్ మొండి బాకీలు రు. 9490 కోట్లు, కెనరా బ్యాంక్ మొండి బాకీలు రు. 9,386 కోట్లు. పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో ఉద్దేశపూర్వక ఋణం ఎగవేతదార్లు చెల్లించాల్సిన మొత్తం రుణం రు. 1,10,050 కోట్లని ఆర్థిక శాఖా మంత్రి శ్రీ శివ్ ప్రతాప్ శుక్లా లోక్ సభలో ఓ ప్రశ్నకి జవాబిస్తూ చెప్పారు. మరో సమాధానంగా, గత 5 సంవత్సరాల్లో రు. 2,30,287 కోట్ల రుణాన్ని రద్దు చేసినట్టు మంత్రి సమాధానమిచ్చారు.

ఇంత తీవ్రమైన ఈ బ్యాంకుల లూటీలను నియంత్రించాల్సింది పోయి, నేరస్తులని శిక్షించాల్సింది పోయి ఏకంగా బ్యాంకులనే ప్రైవేటు చేతుల్లో పెట్టేయ్యాలనే ఆలోచన అనారోగ్యకరమైనది. బ్యాంకులు జాతీయం కావడం వల్లనే బ్యాంకులు అప్పుల పాలయ్యాయని, ప్రైవేటు బ్యాంకులు బాగానే ఉన్నాయని ఉచిత సలహా ఇస్తున్నారు.

బ్యాంకుల మొండి బాకీలు ఎందుకు పెరిగాయి?

బ్యాంకుల ఎన్.పి.ఏ.లు పెరగడానికి మూడు కారణాలు ఉన్నాయని నిపుణులు అంటారు. ఒకటి, బ్యాంకులు సంక్షేమ రాజ్యం సిద్ధాంతాల ప్రకారం రైతులకూ, ఇతర సంక్షేమ కార్యక్రమాలకూ అప్పులివ్వడం, ప్రభుత్వం శాస్త్రీయమైన వ్యవసాయ విధానాన్ని పాటించకపోవడం వల్ల ఆ బాకీలు తిరిగి రాకపోవడం. రెండోది, ప్రపంచీకరణలో భాగంగా పెరిగిన రియల్ ఎస్టేటు వ్యాపారం. ఈ రియల్ ఎస్టేటును ప్రోత్సహించడానికి పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు విపరీతంగా అప్పులివ్వడం. ఆ అప్పుల్లో చాలా భాగం తిరిగి రాకపోవడం. మూడోది, మరింత ముఖ్యమైనది, ప్రపంచీకరణలో భాగంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్ షిప్ నామధేయంతో పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు విపరీతంగా పెద్ద పెద్ద కార్పొరేట్లకు అప్పులిచ్చేలా చేయడం, ఆ అప్పులు పూర్తిగా తిరిగి రాకపోవడం, నామ మాత్రానికే పి.పి.పి మోడల్. ఎక్కువ భాగం పబ్లిక్ పార్ట్‌నర్ షిప్ మాత్రమే. మౌలిక సదుపాయాల కోసం 1999-2000 లో రు. 724 కోట్లు నుండి 2012-13 లో రు. 78,605 కోట్లు దాదాపు పది రెట్లు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు అప్పిచ్చాయి. ధాన్యాన్ని పండించే రైతు అప్పులు చెల్లించలేక ఆత్మహత్య చేసుకుంటాడు. వ్యాపారం కోసం తీసుకున్న అప్పు చెల్లించకుండా అప్పు ఎగవేతదార్లు రకానికో కారు వాడుతూ విదేశాలు తిరుగుతారు. మార్చాల్సింది చట్టాల్ని. బ్యాంకుల్ని కాదు.

ప్రైవేటు బ్యాంకులు ఆదర్శమా?

బ్యాంకుల్ని ఇలా బలహీనం చేసేసి, నువ్వు బలహీనమయిపోయావు. నీకు ప్రైవేటు వైద్యుడి చేతిలో పెట్టాల్సిందే. లేకపోతే నీ మనుగడే కష్టం. నువ్వు ప్రైవేటు వైద్యుడి చేతిలోకి వెళతావో, ఇలానే ఇక్కడే అంతరించిపోతావో, కనుమరుగై పోతావో నువ్వే తెలుసుకో మిత్రమా అంటూ బ్యాంకులకు ముందు నుయ్యి వెనుక గొయ్యి పరిస్థితికి ఎక్కువ కాలం పట్టదు. పైపెచ్చు, ప్రైవేటు బ్యాంకులు కూడా ఆదర్శవంతమైన పాత్రను గతంలో పోషించలేదు. అంతర్జాతీయంగా చూసినా, 2008 ఆర్థిక మాంద్యం పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల నుండి ఏర్పడలేదు. లేహ్మన్ బ్రదర్స్ ఆడిన స్పెక్యులేటివ్ ఆట ఇందుకు కారణం. అలానే అమెరికాలో 1 అక్టోబర్, 2000 నుండి దాదాపు 555 ప్రైవేటు బ్యాంకులు విఫలమయ్యాయి. అమెరికా బెయిల్ అవుట్ చెయ్యాలనుకుంది ప్రభుత్వ బ్యాంకుల్ని కాదు. ప్రైవేటు బ్యాంకుల్ని. అమెరికాలో ఈ బెయిల్ అవుట్ ప్యాకేజీలో జి.డి.పి.లో 4.5 శాతం ఉంది. అదే యునైటెడ్ కింగ్డమ్‌లో 8.8 శాతం ఉంది. భారతదేశంలో ఒకవేళ రు. 7.5 లక్షల కోట్ల బెయిల్ అవుట్‌గా ఉపయోగించినా అది 4.5 శాతం అవుతుంది. 1947 నుండి 1969 వరకు 559 బ్యాంకులు విఫలమయ్యాయి. బ్యాంకుల జాతీయం తర్వాత కూడా ప్రైవేటు బ్యాంకులు ఫెయిల్ అయిన సంఘటనలు

ఉన్నాయి. బ్యాంకుల్ని ప్రైవేటు చెయ్యమని ఉచిత సలహాలను ఇస్తున్న మేధావులకు గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకుకి గతంలో ఏం జరిగిందో తెలిసే ఉండొచ్చు బ్యాంకర్ ఆఫ్ ది ఇయర్‌గా సత్కారాన్ని అందుకున్న గ్లోబల్ ట్రస్ట్ బ్యాంక్ చైర్మన్ రమేష్ జోలీ ఆ మరుసటి సంవత్సరమే తన బ్యాంకులో రు. 1100 కోట్ల నష్టాన్ని చూపించాడు. తర్వాత ఇదే ప్రైవేటు బ్యాంకుని 2003లో ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్‌లో విలీనం చేసారు. 1969 నుండి 2014 వరకు 23 ప్రైవేటు బ్యాంకులు పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో విలీనమయ్యాయి. ప్రైవేటు సెక్టార్ బ్యాంకులే సరైనవనీ, పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్ని ప్రైవేటు చెయ్యమని ఇదే దివ్యౌషధమనీ సలహా ఇస్తున్న వర్గం జవాబు చెప్పాల్సిన అవసరం ఇక్కడే ఉంది.

వ్యవస్థాగత లోపాలు

పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు బలహీనం కావడానికి వ్యవస్తాగత లోపాలు కూడా లేకపోలేదు. బ్యాంకుల్ని నిర్వహించే బోర్డుల్లో వర్క్ మెన్ డైరెక్టర్ లు, ఆఫీసర్ డైరెక్టర్‌లు ఇప్పుడు కనిపించడం లేదు. ప్రభుత్వ నామినీలే ఉన్నారు. రిజర్వ్ బ్యాంకు బ్యాంకింగ్ నియంత్రణ డిపార్టుమెంటు బ్యాంకులు ఎల్లప్పుడూ అందించే రోజువారీ, నెలవారీగా, మూడు నెలలకోసారి, ఏడాదికోసారి అందించే రిపోర్టులను అధ్యయనం చెయ్యాలి. సందేహాలొస్తే ప్రశ్నించాలి. మరిన్ని వివరాలు అడగాలి. అలా చేస్తే పుండు రాచపుండు అవ్వక ముందే జాగ్రత్త పడగలదు. తను జాగ్రత్త పడడమే కాకుండా, నేరస్తులని మొదటే గుర్తించడంలో సహకరించగలదు. అప్పుడు మొండి బాకీలు ఉండవు. ప్రైవేటు మంత్రాలు పాడాల్సిన అవసరం కూడా ఉండదు. కానీ అలా ఎందుకు జరగలేదు? ఇదిలా ఉంటే, గోరుచుట్టు మీద రోకటి పోటులా ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లు మరో కోణం నుండి ఇబ్బంది పెడుతోంది.

ప్రైవేటీకరణకు పరోక్షంగా బీజం వేస్తున్న ఎఫ్.ఆర్.డి.ఐ బిల్లు

ఈ బిల్లులో అత్యంత వివాదాస్పదమైన క్లాజు బెయిల్ ఇన్ క్లాజు. బ్యాంకు దివాళా తీస్తే దివాళా నుండి బయటికి తీయాల్సింది ఖాతాదారులే. 20 దేశాల ప్రెస్క్రిప్షన్ కూడా ఇదే. 2008 ఆర్థిక మాంద్యం అనుభవాల తర్వాత వీరు తెలుసుకున్న చిదంబర రహస్యం ఏమిటంటే ప్రభుత్వాలు బ్యాంకుల్ని బెయిల్ అవుట్ చెయ్యకూడదు. బ్యాంకులే తమ ఖాతాదారుల డబ్బులతో బెయిల్ అవుట్ చేసుకునే ఉపాయాలు నేర్చుకోవాలి. ఖాతాదారులే ముందుకొచ్చి బ్యాంకులు మునిగి పోకుండా రక్షించాలి. మొండి బాకీలు చెల్లించని కార్పొరేట్ల జోలికి పోకూడదు. పరోక్షంగా బ్యాంకుల్ని ప్రైవేటు మయం చెయ్యడమంటే ఇదేనేమో శ్రీ ఎందుకంటే ఖాతాదారుల డిపాజిట్లు బ్యాంకు ఎక్కువ కాలం వరకు ఉంచేస్తుంది. అందుకు బదులుగా అవసరాల్లో పనికి రాని విలువ లేని షేర్లు ఇస్తుంది. ఇలా బ్యాంకు బలహీనం అవుతుంది. 20 దేశాల ఉచిత ఔషదం అయిన ఈ బెయిల్ ఇన్ క్లాజు చాలా విస్తృతంగా చర్చించాల్సిన విషయం. ఇదేదో బ్యాంకు యూనియన్‌లు మాత్రమే చర్చించాల్సిన విషయం కాదు. మొత్తం ఖాతాదారులు, సాధారణ ప్రజలపై దీని ప్రభావం ఉంటుంది. బ్యాంకుల ప్రైవేటీకరణకు ఇది ద్వారం తెరుస్తుంది. 2016-17 బడ్జెట్ ప్రసంగంలో మొదటి సారిగా ఆర్థిక మంత్రి ఈ బిల్లుని ప్రస్తావించారు. కేంద్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి అయిన అజయ్ త్యాగి అధ్యక్షులుగా మార్చి 2016లో ఒక కమిటీ ఏర్పాటు చేసి ముసాయిదా బిల్లు తయారుచేసే బాధ్యత అప్పగించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లు 2017 రూపకల్పన జరిగింది. ఈ బిల్లుని 2017 జూన్ 14న కేంద్ర క్యాబినెట్ కొన్ని సవరణలతో ఆమోదించింది. ఆగస్టు 10న లోక్‌సభలో ప్రవేశ పెట్టిన ఈ బిల్లు ప్రస్తుతం సెలక్ట్ కమిటీ పరిశీలనలో ఉంది.

ఆర్థిక మంత్రి ఇటీవల తమకు అలాంటి ఆలోచన లేదని సెలవిచ్చినా ప్రస్తుత పరిస్థితిలో సందేహాలనేవి ఉండనే ఉన్నాయి. ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లు బ్యాంకుల ప్రైవేటీకరణకు దోహదం చేయడంలో పునాదులు వేస్తుందనడంలో అతిశయోక్తి లేదు. ఈ బిల్లు ఒకవేళ అమలయితే బ్యాంకుల ఆర్థిక పరిస్థితిని బట్టి కొత్తగా ఏర్పాటు కాబోతున్న రిజల్యూషన్ కార్పొరేషన్ బ్యాంకుల రిస్కును దృష్టిలో ఉంచి బ్యాంకుల్ని 5 భాగాలుగా విభజిస్తుంది. అత్యధిక రిస్కులో ఉన్న బ్యాంకుల్ని ఆ పరిస్థితి నుండి బయటకి వచ్చే మార్గాలను ఒక బ్లూ ప్రింటు రాసి సమర్పించమంటుంది. ఈ బ్లూ ప్రింటులో బ్యాంకు ఉద్యోగుల ట్రాన్స్ ఫర్‌లు ఉండొచ్చు. జీతాల్లో కోత ఉండొచ్చు. మరో బ్యాంకుతో విలీనం ఉండొచ్చు. డిపాజిటర్ల పూర్తి డిపాజిట్ హుష్ కాకి కావచ్చు. లేదా కొంత చెల్లించి మిగిలిన భాగం మూడో అయిదో సంవత్సరాల తర్వాత ఇస్తామన్న షేర్లు కావచ్చు. ఏదైనా కావచ్చు. ఈ షేర్లతో కూడా కార్పొరేట్లు వ్యాపారం చేసుకొనే పరిస్తితి ఉండొచ్చు. పరోక్షంగా ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేసుకోవడం అంటే ఇదేనేమో.

చివరిగా, ఈ రోజు పబ్లిక్ సెక్టార్ బ్యాంకులు నిండా అప్పుల్లో మునిగి పోయాయని వాటిని ప్రైవేటు మయం చేసెయ్యాలనే చర్చ వినడానికి ఇప్పటి ఫ్రాడ్ లూ, మొండి బాకీల నేపథ్యంలో బాగానే అనిపిస్తున్నా, బ్యాంకులు కస్టమర్‌లతో సరిగ్గా వ్యవహరించడం లేదనీ, ఇదే సరైన పరిష్కారమనీ ఆర్థిక శాస్త్రాలతో పరిచయం లేని సాధారణ జనాలకు అనిపిస్తున్నా, అలానే చేస్తే ఒక గొయ్యి నుండి బయటికి వొచ్చి మరో పెద్ద గొయ్యిలో పడడమే తప్ప ప్రయోజనం లేదు. ప్రపంచీకరణ మాయలో పడిన వర్ధమాన దేశాలు కల్లబొల్లి మాటలతో సోషల్ మీడియాను కూడా కైవసం చేసుకొని ఎంతగా బ్రెయిన్ వాష్ చేసినా ఆర్థిక సరళీకరణలు ఎట్టి పరిస్థితుల్లోనూ సాధారణ ప్రజలకు ప్రయోజనం కలిగించేవి కావు. ఆర్థిక సరళీకరణల్లో భాగంగా మన పబ్లిక్ సెక్టార్ పరిశ్రమల వినాశనాన్ని చూశాం. అలానే, ఆర్థిక సరళీకరణల్లో భాగంగా ఎఫ్.డి.ఐ.నీ, ఇటీవల జిఎస్‌టిని చూసాం. సాధారణ వ్యాపారస్తులకు ఇవి ఎలాంటి కష్టాల్ని కొనితెచ్చాయో, నల్ల ధనాన్ని రూపుమాపడంలో ఇవి ఎలా విఫల మయ్యాయో చూశాం. బ్యాంకుల ప్రైవేటీకరణ కూడా అలానే ధనిక వర్గానికి ప్రయోజనం కలిగించడమే తప్ప బ్యాంకు ఉద్యోగులకు గానీ, సాధారణ ప్రజలకు గానీ వీటివల్ల ఏ మాత్రం ప్రయోజనం లేదు. బ్యాంకుల్ని ప్రైవేటు చెయ్యడమంటే దేశాభివృద్ధిని సామ్రాజ్య వాదులకు తనఖా పెట్టడమే!

(రచయిత ఉపాధ్యాయులు. పశ్చిమ బెంగాల్ నుండి వెలువడుతోన్న 'జాగృతి సమీక్ష' త్రైమాసిక పత్రిక సహ సంపాదకులు. వ్యాసంలో వ్యక్తపరచిన అభిప్రాయాలు వ్యక్తిగతం.) వీ

ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించే కుట్ర

పాలకుల, అధికారుల అండదండలతో ప్రభుత్వ బ్యాంకులలో వేల, లక్షల కోట్ల రూపాయల కుంభకోణాలు సంభవిస్తున్నాయనీ, ఈ కుంభకోణాల బూచిని చూపుతూ బ్యాంకులను ప్రైవేట్‌పరం చేయడానికి కుట్ర జరుగుతోందనీ అంటున్నారు **బైరెడ్డి సతీష్**

వేలల్లో అప్పు పొందడానికి కాళ్లరిగేలా బ్యాంకుల చుట్టూ తిరిగే సగటు మనిషి దయనీయ పరిస్థితి ఒకవైపు, మరోవైపు వేల కోట్ల అప్పును అనాయాసంగా పొంది సునాయాసంగా దేశ తీరాలను దాటిపోయే పరిస్థితి ఈ దేశంలోనే ఉంది. తీసుకున్న అప్పును తిరిగి చెల్లించకపోతే ఇంటినే జప్తు చేసే కఠినత్వం ఒకవైపు, మా అప్పును తీర్చండి ప్రభో అని బడాబాబుల ఇంటిముందర బ్యాంకోళ్ల పడిగాపులు మరోవైపు. తీసుకునే అప్పుకు తిరకాసులెన్నో పెట్టి ఆస్తినంతా తనఖా పెట్టుకుంటే తప్ప అప్పు పుట్టనివ్వని కట్టుదిట్టమైన బ్యాంకులే ఏ జమానత్ లేకుండానే వేల కోట్ల అప్పును చిటికెలో మంజూరు చేసి కోటీశ్వరుల సేవలో తరిస్తున్నాయి.

భారతదేశంలో చట్టవిరుద్ధంగా సంపాదించిన లేదా పన్నుల పరిధిలోకి రానివ్వకుండా పరాయి దేశంలోకి తరలించిన అక్రమ సంపాదనను స్వదేశానికి రప్పించి ప్రతి పౌరుని ఖాతాలో పదిహేను లక్షలు వేస్తామని ప్రగల్భాలు పలికి అధికారంలోకి వచ్చిన నీతిగల్ల నేతలంతా బ్యాంకులను ఊడ్చుకొని ఉడాయించిన బడాబాబుల్ని వెంటేసుకుని ప్రపంచ పర్యటన చేస్తున్నారు. మరోవైపు రైతులకు రుణాలివ్వాలన్నా, ఇచ్చిన రుణాలను కష్టకాలంలో మాఫీచేయాలన్నా సవాలక్ష షరతులు విధించే ప్రభుత్వాలు కనీసం వారే ఇచ్చిన హామికనుగుణంగా అప్పుల్ని రద్దు చేయమన్నా 'సాంకేతిక' కారణాల సాకు చెప్పటమే కాకుండా, ఆర్‌బిఐ ఒప్పుకోవడం లేదనో మరో కారణంతోనో తప్పించుకు తిరుగుతారు. అదే వేలకోట్ల అప్పును అందించే సందర్భంలో ఆర్‌బిఐ ఏ గాఢనిద్రలోకి జారుకుంటుందో మరి?

అంతర్జాతీయ వజ్రాల వ్యాపారి అయిన నీరవ్ మోడి దేశంలోనే రెండవ అతిపెద్ద ప్రభుత్వ బ్యాంకు అయిన పంజాబ్ నేషనల్ బ్యాంకు నుండి కేవలం ఏడు సంవత్సరాల కాలంలోనే (2011-18) రు. 13,578 కోట్ల అప్పును ఏ లెక్కా పత్రాలు లేకుండా పొంది విదేశాల్లో విహరిస్తున్నాడు. నిజానికి ఆయన పొందిన రుణం నిర్దిష్టంగా ఎంత అనేది తేలడం లేదు. అది రు. 22 వేల కోట్లు కూడా ఉంటుందని ఒక అంచనా! ఆయన పొందిన అప్పంతా కూడా వజ్రాల దిగుమతి కోసం ఇక్కడి పంజాబ్ నేషనల్ బ్యాంకుని గ్యారెంటర్‌గా పెట్టుకొని విదేశాల్లో ఉన్న వివిధ భారతీయ బ్యాంకు బ్రాంచుల నుండి పొందినదే. ఇలా ఇంత పెద్ద మొత్తంలో అప్పును పొందే ప్రక్రియలో విధిగా పాటించాల్సిన ఏ నియమ నిబంధనలను కనీస మాత్రంగానైనా పాటించలేదు.

ముంబైలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకు శాఖ నుండే ఈ లావాదేవీలన్నీ గత 7 సంవత్సరాలుగా నిరాఘాటంగా జరుగుతూ వచ్చాయి. చిన్న రుణానికే సవాలక్ష సందేహాలతో అనేక నిబంధనల బంధనాలను విధించే బ్యాంకులు ఇంత పెద్ద మొత్తంలో అదీ కూడా విదేశాల్లోని వివిధ బ్యాంకుల నుండి లోన్ తీసుకునే విషయంలో నిస్సందేహంగా 'కఠిన' మైన నిబంధనలనే కల్గి ఉంటాయి. ఉన్నాయి కూడా!

వజ్రాల దిగుమతి కోసం నీరవ్ మోడి పంజాబ్ నేషనల్ బ్యాంకు నుండి తన అవసరానికి సరిపడా డబ్బును పోగు చేసే క్రమంలో స్వల్పకాలిక రుణంగా బ్యాంకు గ్యారెంటీ అయిన లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్ఓయు) ను పొందడం జరిగింది. ఎల్.ఓ.యు అనేది విదేశీ వ్యాపారస్తులు విదేశీ కరెన్సీలోనే చెల్లింపు చేయుటకు ఉపకరించే సాధనం. అయితే ఎల్.ఓ.యును జారీ చేయాలంటే సంబంధిత ఖాతాదారుడు ఎంత రుణం తీసుకోగోరుతున్నారో అంత మొత్తానికి సరిపడా డబ్బును ఏ బ్యాంకు నుండైతే ఎల్.ఓ.యును పొందుతారో ఆ బ్యాంకులో జమ చేయాల్సి ఉంటుంది. ఆ తరువాత మాత్రమే స్విఫ్ట్ (సొసైటీ ఫర్ వరల్డ్‌వైడ్ ఇంటర్ బ్యాంక్ ఫైనాన్షియల్ టెలీ కమ్యూనికేషన్) అనే మెసేజింగ్ వ్యవస్థ ద్వారా తన కోర్ బ్యాంకింగ్ వ్యవస్థలో నమోదు అయిన తరువాతనే విదేశీ బ్యాంకుకు సందేశం పంపిస్తుంది ఎల్ఓయును జారీచేసే బ్యాంకు. కానీ నీరవ్ మోడి విషయంలో సెక్యూరిటీగా ఉండాల్సిన నగదు నిల్వలను జమ చేయకుండానే, పై అధికారుల పర్మిషన్ లేకుండానే, కోర్ బ్యాంకింగ్ వ్యవస్థలో నమోదు చేయకుండానే విదేశీ బ్యాంకులకు స్విఫ్ట్ సందేశాలను పంపించడం జరిగింది.

నిజానికి ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం వజ్రాలు, రత్నాలు దిగుమతి నిమిత్తం కొనుగోలుదారునికి ఇచ్చే లోన్, సరుకు రవాణా ప్రక్రియ మొదలైన 90 రోజుల్లోనే తిరిగి చెల్లింపబడాలి. ఇక్కడ మాత్రం అలాంటిదేమీ జరగకపోగా ఎల్ఓయుల మీద ఎల్ఓయులు జారీ చేయబడ్డాయి. పోనీ విదేశీ బ్యాంకులకైనా అనుమానం రావాలి కదా అనే ప్రశ్న ఉదయిస్తుంది. కానీ ఇక్కడ అప్పిచ్చిన బ్యాంకులకు గ్యారెంటర్‌గా నిలబడిన పంజాబ్ నేషనల్ బ్యాంకే రుణగ్రహీత అప్పును చెల్లించడంలో వైఫల్యం చెందితే తిరిగి చెల్లించే బాధ్యతను తీసుకుంటుంది కనుక అటువంటిదేమీ జరగకుండా ఎల్ఓయుల పరంపర కొనసాగుతూ ఒక్క 2017లోనే 151 వరకు జారీ చేయబడ్డాయంటే పంజాబ్ నేషనల్ బ్యాంకు నిర్వాకం ఎంతో తెలిసిపోతుంది.

ఈ వేల కోట్ల అప్పుల పరంపర అంతా ముంబైలోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో సంబంధిత స్విఫ్ట్ మెసేజ్‌లను పంపే అధికారి మారడంతో బట్టబయలయ్యింది. ఈ మోసం అంతా కూడా నీరవ్

మోడితో పాటు ఆయన కుటుంబ సభ్యులంతా భద్రంగా బార్డర్ దాటాకనే బయటపడడం గమనించదగినది.

ఇంత పెద్ద స్కాం బయటపడ్డాక హడావుడిగా సిబిఐ విచారణలు, ఆస్తుల స్వాధీనాలు మొదలవడమే కాకుండా అధికార, ప్రతిపక్షాలు ఈ కుంభకోణానికి మీరంటే మీరే బాధ్యులని దుమ్మెత్తిపోసుకుంటున్నాయి. ఇలాంటి మోసాలకు దారులు పడేలా విధానాలు రూపొందించిన అధికార ప్రతిపక్షాలే మీరంటే మీరంటూ నానా యాగి చేయడం ఎంత విడ్డూరం!

మరోవైపు మీడియా, విచారణ సంస్థలు అసలు ఇదంతా ఎలా జరిగిందనే అంశంపై పుంఖాను పుంఖాలుగా రాస్తున్నాయి, రీళ్లు రీళ్లుగా కుమ్మరిస్తున్నాయి. సదరు బ్యాంకు నిబంధనలు పాటించలేదనో, బ్యాంకు అధికారులు కుమ్మక్కయ్యారనో, బ్యాంకు ఆడిట్ సరిగ్గా జరగలేదనో, ఆర్‌బిఐ నిఘా పర్యవేక్షణ కొరవడిందనో, వృత్తిగత నైపుణ్యాలు లోపించాయనో, పారదర్శకత లేదనో, జవాబుదారీతనం గాలికి వదిలేయ బడిందనో అనేక రకాల విశ్లేషణలు, నేపథ్య కథనాలను అందిస్తున్నాయి. నిజమే! మీడియా పరిశోధనాత్మక కథనాలన్నీ నిజమే. నీరవ్ మోడి జీవన శైలి ఆయన ఆస్తుల స్వాధీనం, పాస్‌పోర్టు రద్దువంటి పైపై చర్యలపై పదే పదే వార్తలు వెలువరిస్తున్నాయి. కానీ ఇంత పెద్ద కుంభకోణానికి మూలాలెక్కడున్నాయో అన్వేషించే ఆసక్తిని ప్రదర్శించకపోగా ఉద్దేశ్యపూర్వకంగా విస్మరిస్తున్నాయి కూడా!

నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో మొత్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను ఉద్దేశ్యపూర్వకంగా, కుట్రపూరితంగా బలహీనపర్చే కార్యాచరణ ఒకటి గత మూడు దశాబ్దాలుగా ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా నిరంతరాయంగా అమలౌతూనే వస్తున్నది. ప్రైవేటీకరణను బలంగా ముందుకు తెచ్చే క్రమంలో ఆ (ప్రభుత్వ) సంస్థల పట్ల ప్రజల్లో చులకన భావం ఏర్పడేలా అన్ని ప్రభుత్వాలు పనిచేస్తున్నాయి. ప్రతిభకు, పనితనానికి ప్రైవేట్ సంస్థలే మారుపేరు అన్నట్టుగా వ్యవహరిస్తూ భారీ పరిశ్రమలతో పాటు ప్రజలకు సేవలిందించే అనేక రంగాలను కూడా కుప్పకూలుస్తు న్నాయి. ఇప్పటికే లాభాల్లో ఉన్న అనేక పరిశ్రమలను ప్రైవేటీకరించడమే కాకుండా ప్రజలకు ఇప్పుడిప్పుడే ఎంతో కొంత చేరువవుతున్న బ్యాంకులను బలహీనపర్చి ప్రైవేట్ రంగానికి అప్పగించే కుట్రనే ఇది. బ్యాంకు నిర్వహణ సరిగ్గా లేదనో, అంతర్గత ఆడిట్, ఆర్‌బిఐ నిఘా పర్యవేక్షణ లోపించినవనో బ్యాంకు అధికారుల చేతివాటం మూలంగా ఇంత భారీ కుంభకోణం జరిగిందని దీనిని సాకుగా చూపెట్టి బ్యాంకింగ్ సంస్కరణల పేరుతో మొత్తంగా ప్రభుత్వ బ్యాంకులను ప్రైవేటీకరించేలా విధానాల మార్పులు చేయాలని పాలక పండితులు సెలవిస్తూనే ఉన్నారు.

నిజానికి గత 1969 బ్యాంకుల జాతీయీకరణ కంటే ముందే సంవత్సరానికి సగటున 35 రకాలైన వైఫల్యాలు ప్రైవేటు బ్యాంకుల్లో కనిపించాయి. జాతీయీకరణ జరిగిన తరువాత మాత్రమే ఈ వైఫల్యాలు తగ్గుముఖం పట్టినవి. సమ్మిళిత ఆర్థిక అభివృద్ధిని సాధించే క్రమంలో బ్యాంకుల సేవలు అత్యంత కీలకమైనవి. జాతీయీకరణ జరిగిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకుల విస్తరణ, ఖాతాదారుల పెరుగుదలతో పాటు అప్పటివరకు నిర్లక్ష్యానికి గురైన వ్యవసాయం, చిన్న పరిశ్రమల వంటి రంగాలకు రుణ సౌకర్యం కొద్దిమేరకు అందుబాటులోకి వచ్చింది. ఇంకా ఆ లక్ష్యం పూర్తిగా నెరవేరకుండానే, అన్ని సామాజిక వర్గాలు బ్యాకింగ్ సేవలను పొందే అవకాశం ఇవ్వకుండానే వాటిని మొత్తంగా ప్రైవేటీకరించి మెజారిటీ ప్రజలకు దూరం చేసే దుర్మార్గానికి తెరలేపారు. ఇవాళ మొత్తం రుణాలను అందించడంలో 70 శాతం వాటా కేవలం ప్రభుత్వ రంగ బ్యాంకులది మాత్రమే.

ఏ ప్రైవేటు బ్యాంకు కూడా రైతాంగానికి లోన్‌లు ఇచ్చినట్టు చరిత్రలో వినలేదు! వారిదంతా పచ్చి వ్యాపార, లాభేచ్ఛతో కూడిన వ్యవహారం మాత్రమే. ప్రైవేట్ బ్యాంకులు పెట్టుబడిదారులకు, పెద్ద పరిశ్రమలకు మాత్రమే అందుబాటులో ఉంటాయి తప్ప సామాజిక రుణవితరణ సంస్థలుగా పేర్కొనబడిన ప్రభుత్వ రంగ బ్యాంకులతో సమానమైన సామాజిక కర్తవ్యాన్ని నిర్వర్తించలేవు.

నూతన ఆర్థిక విధానాల పుణ్యమా అని ప్రభుత్వ రంగ బ్యాంకుల పాత్రను బడా పెట్టుబడిదారులకు మాత్రమే పరిమితం చేసే పని బలవంతంగా చేస్తూనే పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణం లాంటిది తలెత్తినప్పుడల్లా మొత్తం బ్యాంకులను ప్రైవేటీకరించాలని భారీ ఎత్తున కార్పొరేట్ మీడియా ద్వారా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఆ మాటకు వస్తే ఏ ప్రభుత్వ బ్యాంకు కూడా సాధారణ ప్రజలకు అప్పులిచ్చి సంక్షోభంలో పడలేదు. కేవలం పెట్టుబడిదారుల ధనదాహానికి మాత్రమే బలైపోయినవి.

1990ల నాటి నుండి అమలౌతున్న సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో మళ్లీ పురుడుపోసుకున్న ప్రైవేట్ బ్యాంకుల్లో గ్లోబల్ ట్రస్ట్ బ్యాంకు, టైమ్స్, సెంచూరియన్ బ్యాంకులు సంక్షోభంలో చిక్కుకొని కుప్పకూలితే వాటిని ఆదుకున్నది ప్రజలు తమ కష్టార్జితాన్ని దాచుకున్న ప్రభుత్వ బ్యాంకులే అనే సత్యాన్ని మరువరాదు. ఏ ప్రైవేట్ రంగ ధనదాహానికి పంజాబ్ నేషనల్ బ్యాంక్ బలైందో ఆ ప్రైవేటు చేతుల్లోనే జాతి పొదుపు సొమ్మునంతా పెట్టాలని చూస్తున్నారు.

ఇవాళ దేశంలో ముద్దుగా నిరర్థక ఆస్థులుగా (ఎన్‌పిఎ) పిలవబడుతున్న 9.5 లక్షల కోట్ల రూపాయల్లో సింహ భాగం కార్పొరేట్ వాళ్లు తీసుకున్న అప్పులే అన్నది విస్మరించరానిది. వేల కోట్ల అప్పులను ఎగ్గొట్టి దర్జాగా విదేశాల్లో విలాసంగా బతుకుతారు. వేలల్లో ఉన్న అప్పును పంట చేతికి రాక కట్టలేని రైతేమో ఉరివేసుకుంటున్నాడు. పెట్టుబడిదారు లకు భారీగా అప్పులిచ్చే వ్యవహారమంతా ఆశ్రిత పెట్టుబడిదారీ విధానంలో భాగంగానే వ్యవస్థీకృతమయింది.

రాజకీయ వ్యవస్థకు, అభివృద్ధి నమూనాకు, అమలౌతున్న ఆర్థిక విధానాలకు కాక్పొరేట్ వ్యవస్థకు మధ్య ఉన్న బంధమే నీరవ్ మోడీలను, మాల్యాలను తయారు చేస్తున్నది. భారత బ్యాంకింగ్ రంగం పైన కార్పొరేట్‌ల కుట్రపూరిత దాడి జరుగుతున్నది. ప్రజల మొత్తం పొదుపు సొమ్ములో 70 శాతం వరకు ప్రభుత్వ రంగ బ్యాంకుల్లోనే ఉన్నది అంటే రాజ్య భరోసాతోనే అది సాధ్యమవుతున్నది. ఇవాళ ఆ భరోసాను బద్దలు కొట్టే పనిని పాలక వర్గాలతో కలిసి కార్పొరేట్ కార్యాచరణను కొనసాగిస్తున్నది.

ఇంత పెద్ద ఎత్తున పోగుపడిన పొదుపు సొమ్మును అప్పుల రూపంలో పొంది ఎగనామం పెట్టడమే కాకుండా మొత్తంగా ప్రభుత్వ రంగ సంస్థల పట్ల ప్రత్యేకించి బ్యాంకుల పట్ల ప్రజలకున్న విశ్వాసాన్ని చెదరగొట్టి, వాటి నిర్వహణను ప్రభుత్వం చూసుకోలేదని తామే వాటిని స్వాధీనం

సిరియాలో సామ్రాజ్యవాద విధ్వంసం

ఒకవైపు అంతర్యుద్ధాలు, మరోవైపు అమెరికా, రష్యా, వాటి మిత్ర దేశాల దాడులతో సిరియా భయానక యుద్ధ వాతావరణంతో సంక్షోభంలోకి కూరుకుపోయి, పౌర జీవనం పూర్తిగా విధ్వంసానికి గురవుతోందని అంటున్నారు **బి. రామకృష్ణ**

సిరియా పూర్తి పేరు సిరియన్ అరబ్ రిపబ్లిక్. (అరబిక్‌లో అల్ జుమురియా అల్ అరబియా అస్సురియా) విస్తీర్ణంలో తెలంగాణ కంటే 73 వేల చదరపు కిలోమీటర్ల పెద్దది. సిరియా జనాభా (2.3 కోట్లు) తెలంగాణ (3,51,93,978) కంటే దాదాపుగా 1.22 కోట్లు తక్కువ. 1946లో ఫ్రాన్స్ నుండి స్వాతంత్ర్యం పొందిన సిరియాలో తరువాత అమెరికా అనుకూల ప్రభుత్వం ఏర్పటయింది. ఆ తరువాత మిలిటరీ అధికారుల పాలనలోకి వెళ్లింది. మిలిటరీ పాలనకు వ్యతిరేకంగా తిగరుగుబాట్లు జరిగి ప్రజాస్వామిక ప్రభుత్వాలకు అధికారం బదిలీ అయింది. ఆ తరువా మళ్లీ మిలిటరీ పాలనలోకి వెళ్లింది. సిరియా ఒక యూనిటరీ రిపబ్లిక్. ఇక్కడ ప్రభుత్వాధినేతగా ప్రధానమంత్రి దేశాధినేతగా ప్రెసిడెంట్ అంటారు.

1970 నుండి 2000లో చనిపోయే వరకు బాత్ పార్టీకి చెందిన హాఫీజ్ అల్ అసద్ అధ్యక్షుడిగా ఉన్నాడు. హాఫీజ్ చనిపోయాక అతని కొడుకు బషరల్ అసద్ 2000 నుండి నేటి వరకు అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. 1963లో ఏర్పడిన బత్ పార్టీ రాజకీయ ప్రత్యర్థులపై అణచివేతను ప్రయోగిస్తూ 1970లో అధికారంలోకి వచ్చింది. 2011 నాటికి 40 ఏళ్లుగా అసద్ కుటుంబ పాలనలో అవినీతి, అణచివేత, నిరుద్యోగం పెరుగుతూ వస్తున్నది. రాజకీయ స్వేచ్ఛ లేకుండా పోయి నియంతృత్వం రాజ్యమేలుతున్నది.

2010 సంవత్సరం చివర్లో 2011 మొదట్లో ట్యూనిషియా, ఈజిప్టులలో నియంత పాలనకు వ్యతిరేకంగా తీవ్రమైన నిరసనలు వెల్లివిరిశాయి. పెద్ద ఎత్తున ప్రజలు రోడ్డ మీదకు వచ్చారు. శాంతియుత ఆందోళనలు చేశారు. నియంతల పాలనకు చరమగీతం పాడారు. దీన్నే మల్లెపూవు విప్లవం అని అరబ్ వసంతం అని అంటున్నారు. అటు తరువాత ఆ దేశాల్లో ప్రజా ఉద్యమాలు కాంక్షించిన ఫలితాలు వచ్చాయా అంటే నిరాశలే మిగిలాయి.

ట్యూనీషియా, ఈజిప్టులలో గాని ఉన్న పాలకులు అమెరికా అనుకూలురే. ఈ ఉద్యమాలలో కదం తొక్కిన విద్యార్థులు, యువకుల మాదిరిగానే 2011లో సిరియాలో కూడా నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా విద్యార్థులు రోడ్ల మీదకు వచ్చారు. అసద్ గద్దె దిగాలని శాంతియుత ప్రదర్శనలు చేశారు. ఈ ఉద్యమాలకు అరబ్ వసంతం ఉత్ప్రేరకంగా పనిచేసింది.

అసద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థులను పోలీసులు నిర్బంధించి తీవ్రంగా హింసించారు. దీంతో లక్షలాదిగా విద్యార్థులు నిరసనలకు దిగారు. ఈ విద్యార్థుల నిర్బంధానికి ముందే 2011 జనవరి 28న అల్ హాపక్కా సంస్థకు చెందిన హసన్ అలి ఆక్లెహ్ అనే యువకుడు అసద్ పాలనకు వ్యతిరేకంగా మంటల్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనలతో సిరియాలో అసద్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు తీవ్రతరం అయ్యాయి.

అదే సమయంలో రాజకీయ ఖైదీలు జైళ్లలో నిరసనలకు దిగడంతో దేశమంతటా ఆందోళనలు, నిరసనలు పెరుగుతూ వచ్చాయి. దేశంలో అస్థిరత మొదలయింది.

2011 మార్చ్ 15 నాటికి దేశం మొత్తం వీధుల్లోకి వచ్చింది. బషరల్ అసద్ గద్దె దిగాలనే స్పష్టమైన డిమాండ్‌తో 2011 జూలై కల్లా దేశవ్యాప్త

చేసే దిశగా పావులు కదుపుతున్నారు. బడా కార్పొరేట్లన్ని కలిసి బ్యాంకుల్ని తాము తీసుకున్న అప్పుల్ని ఎగ్గొట్టడం ద్వారా బజారున పడేసి తామే సమర్ధవంతంగా నడపగలం అని చెప్పడం క్రోనీ క్యాపిటలిజం కొత్త పోకడ. ప్రజల పొదుపు సొమ్మును రుణంగా పొంది నిరర్ధక ఆస్తుల్ని పెంచడమే కాకుండా వారి చేతికే బ్యాంకుల్ని అప్పగిస్తే ఈ దేశ సగటు మనిషి జీవితం నుండి బ్యాంకులు మాయమైనట్టే. వారి బ్యాంకులు వ్యవసాయానికో, చేతి వృత్తులకో, కుటీర పరిశ్రమలకో అప్పులిచ్చే పరిస్థితి ఏలాగూ ఉండదు. పైగా అవే ప్రైవేట్ బ్యాంకులు దివాళ తీసిన సందర్భంలో మళ్లీ బెయిల్ అవుట్స్ రూపంలో బ్యాంకులోని ప్రజల పొదుపు సొమ్ముతోనే ఆదుకుంటాయి ప్రభుత్వాలు. ఒక రకంగా ప్రజల్ని పొదుపు మార్గం నుండి మళ్లించి జూద కార్యకలాపమైన స్టాక్ మార్కెట్‌లోకి మళ్లించాలనే ప్రయత్నమూ దీనిలో లేకపోలేదు.

పారిశ్రామిక సంస్థలకు బ్యాంకుల్ని ఏర్పాటు చేసుకొనే పరిస్థితి ప్రస్తుతం లేకపోయినా అదీ త్వరలోనే సాధించుకునే 'సత్తా' వాటికి ఉన్నది. ఈ దేశ ఆర్థిక రాజకీయ వ్యవస్థను శాసిస్తున్నది ఈ శక్తులే. ఒక్కొక్కటిగా ప్రభుత్వరంగ సంస్థల్ని చేజిక్కించుకొని ప్రజా జీవితం మీద పూర్తి నియంత్రణను పొందే దిశగానే కార్పొరేట్ వ్యవస్థ కదులుతున్నది. నేటి అభివృద్ధి నమూనాలో అది అసాధ్యమేమీ కాకపోవచ్చు.

ప్రజల పేరుమీద రాజకీయ వ్యవస్థ అధికారం చెలాయిస్తున్నదే కానీ ప్రజల కోసం కాదనేది ప్రజాజీవితపు అనుభవాలే చెబుతున్నాయి. లేకుంటే వేలకోట్ల బ్యాంకు కుంభకోణం చేసిన వ్యక్తి సూటుబూటులో దేశ ప్రధానితో ఫోటోలో పోజెలా ఇస్తాడు, వేలల్లో అప్పు తెచ్చుకున్న రైతెలా ఎండిన చేలో ఉరితాడుకెలా వేలాడుతాడు?

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

ఉద్యమం తీవ్రరూపం దాల్చింది. ఆందోళనలు మొదలైన నెల రోజులకే నూతన రాజ్యాంగాన్ని ప్రవేశపెడతామని, పాలనా పగ్గాలు ఎన్నికల ప్రక్రియ ద్వారా సంక్రమించేలా రాజ్యాంగ సవరణ తెస్తామని సైనిక పాలకులు హామీ ఇచ్చారు. శాంతియుత అధికార మార్పిడికి కట్టుబడి ఉంటామని, రాజకీయ ఖైదీలను విడుదల చేస్తామని, ప్రభుత్వ ఉద్యోగులను పెంచుతామని, ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తామని, అవినీతిని నిర్మూలిస్తామని, పత్రికా స్వేచ్ఛను కల్పిస్తామని, ఎమర్జెన్సీను ఎత్తి వేస్తామని బషరల్ అసద్ లండన్‌లో ప్రకటన చేశాడు.

2011 ఏప్రిల్ 19న ఎమర్జెన్సీ ఎత్తేశారు. కుర్దు శరణార్థులకు సిరియా పౌరసత్వం మంజూరు చేశారు. సున్నీలకు రాయితీలు ఇవ్వడం, సిరియాలో రాజకీయ, రక్షణ, న్యాయ వ్యవస్థల్లో సంస్కరణలు చేపడతామని అసద్ ప్రభుత్వం ప్రకటించింది. ఇవేవీ కూడా సిరియా ప్రజల్లో బాత్ పార్టీ దాని విధానల పట్ల వ్యతిరేకతను గూడు కట్టుకుని ఉన్న అసంతృప్తులను తొలగించలేకపోయాయి.

దేశంలో ఎమర్జెన్సీ ఎత్తేశాక ఆందోళనలు పెరుగుతూ వచ్చాయి. అసద్ ప్రభుత్వ బుజ్జగింపులకు తలొగ్గకుండా దేశ వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం అయ్యాయి. ఈ ఉద్యమాలపై సిరియా ప్రభుత్వం తీవ్ర స్థాయిలో అణచివేతలకు పాల్పడింది. దేశ ద్రోహుల పేరుమీద ఊచకోతలు జరిగాయి. హెచ్చరికలు లేకుండా తుపాకులు పేల్చారు. సిరియన్ సైనికులు అనేక నగరాల్లో కవాతు చేశారు. అన్ని నగరాల్లో విద్యుత్, ఆహార పరఫరా నిలిపివేయడం జరిగింది. డారా, హామ్స్, బనియాస్, డమస్కస్ వంటి నగరాల్లో కనిపిస్తే కాల్చివేత అమలు చేశారు.

అమాయకులపై ఊచకోతను నిరసిస్తూ సిరియన్ ఆర్మీలోని కొందరు ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించారు. వీరిపై ప్రభుత్వం వేటు వేసింది. అసద్ చర్యలను నిరసిస్తూ ఎందరో సైనికాధికారులు రాజీనామాలు చేశారు. వీరిలో చాలా మంది ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటు ఉద్యమంలో భాగస్వాములయ్యారు.

2011 జూలై 29న సిరియన్ విముక్తి 'సైన్యం' (ఫ్రీ సిరియన్ ఆర్మీ – ఎఫ్ఎస్ఎ) పేరుతో బషరల్ అసద్ ప్రభుత్వంపై సాయుధ పోరాటాన్ని ప్రకటించారు. వీరితో అప్పటికే పోరాటాల్లో ఉన్న ఉద్యమకారులు జతకలిశారు. ఇరవై వేల మందితో మొదలైన ఎఫ్ఎస్ఎ రెండేళ్లలో అరవై వేలకు చేరింది. ఎఫ్ఎస్ఎ లక్ష్యంగా అసద్ ప్రభుత్వ దళాలు నగరాలపై దాడులు చేస్తూ పోయాయి. స్వంత ప్రజలనే హతమార్చడానికి పూనుకున్నాయి. ఈ దాడులను అరబ్ లీగ్, గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిల్ (జిసిసి) సిరియా ప్రభుత్వాన్ని తప్పు పట్టాయి. 2012 జూలై 18న డమస్కస్‌లో జరిగిన బాంబు దాడిలో రక్షణ మంత్రి చనిపోయాడు. ఈ దాడికి ఎఫ్ఎస్ఎ బాధ్యత వహించింది.

ఎఫ్ఎస్ఎకు మద్దతుగా అమెరికా, టర్కీ, సౌదీ అరేబియా, ఇంగ్లాండ్, జర్మనీ, ఫ్రాన్స్, కెనడాలు సహాయ సహకారాలు అందిస్తున్నాయి. అమెరికా సిఐఎ మిలిటరీ శిక్షణను ఇచ్చింది. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం పోరాడుతున్న పాలస్తీన అరబ్బులను తీవ్రవాదులుగా వ్యతిరేకిస్తూ మరోవైపు సిరియాలో ప్రభుత్వ వ్యతిరేక శక్తులను స్వాతంత్ర్య ఉద్యమకారులుగా చెబుతూ ఆయుధాలు, డబ్బులు, తదితర సహకారాలు అందిస్తుండడం వారి ద్వంద నీతిని ప్రతిబింబిస్తుంది.

గతంలో అమెరికా, సౌదీ, అరేబియాలు ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ యూనియన్ జోక్యాన్ని అడ్డుకునే నెపంతో బిన్‌లాడెన్ వంటి వానికి ప్రోత్సహించి ముజాహిదిన్‌ల పేరుతో తాలిబన్‌లను సృష్టించాయి. తమకు అనుకూలంగా వ్యవహరించని బషరల్ అసద్ ప్రభుత్వాన్ని కూలదోయ డానికి అందివచ్చిన అవకాశంగా అత్యంత తిరుగుబాటు దార్లకు పెద్ద ఎత్తున సహాయ సహకారాలను అందిస్తున్నాయి. అమెరికా దాని మిత్ర పక్షాలకు సిరియాలో ప్రజాస్వామ్యం వెల్లి విరియాలనే, ఆ దేశ ప్రజలు స్వేచ్ఛ స్వాతంత్ర్యాలతో బతకాలనే ఆకాంక్షలేమి లేవు. అక్కడి ప్రజల పైనో తిరుగుబాటు దారులపైనో ప్రేమో, గౌరవమో లేవు. తమకు కీలు బొమ్మగా పనిచేయని ప్రభుత్వాన్ని పడగొట్టి తమ తాబేదారు పాలకులను నియమించే లక్ష్యంతో ఈ దేశాలు పనిచేస్తున్నాయి.

ఏ ప్రయోజనాలు లేకుండానే సిరియాలో కాని మరే దేశంలోనైనా అమెరికా ఎందుకు తల దూరుస్తోంది? ఏ సంపదలు ఆశించకుండానే వేల కోట్ల ధనాన్ని, సైన్యాన్ని ఎందుకు ఉపయోగిస్తోంది? స్వార్థపూరిత ప్రయోజనాలు, విపరీతమైన లాభాపేక్ష, సుఖ లాలసలు, విలాసాలు, తమ అహంకార సంతృప్తి, ఆదిపత్య చలాయింపుల కాంక్షతో ప్రత్యక్ష, పరోక్ష, యుద్ధాలకు వివిధ దేశాల్లో అంతర్యుద్ధాలకు సామ్రాజ్యవాద శక్తులు పాల్పడుతున్నాయి. మానవ వికాసం కోసం ప్రపంచ ప్రజల సంక్షేమం కోసం వినియోగించాల్సిన మేథస్సు, సంపద యుద్ధాలలో విధ్వంసాలకు, వినాశనాలకు వినియోగించడం విషాదకరం.

అమెరికా జోక్యం చేసుకున్న ఏ దేశం బాగుపడలేదు. ఇరాక్‌లో సద్దాం హుస్సేన్‌పై జీవరసాయన ఆయుధాలను ఉత్పత్తి చేస్తున్నాడనే తప్పుడు ఆరోపణలతో ఏకపక్ష యుద్ధం (దాడి) చేసి చివరకు సద్దాంను ఉరితీయించే వరకు అమెరికా నిద్రపోలేదు. నేటికీ తను చేసిన ఆరోపణలను నిరూపించలేకపోయింది. ఇరాక్ ప్రజలను నానా యాతన లకు గురిచేసి, లక్షలాది పసి పిల్లలకు మందులు అందకుండా చేసి వారి చావులకు కారణమైంది.

ఆఫ్ఘనిస్తాన్‌లో అదే పని చేసింది. అయితే తాలిబన్‌లు నేటికీ అమెరికా దళాలతో తలపడుతూనే ఉన్నారు. వీరిని అంతం చేసే నెపంతో మానవ రహిత విమానాలతో దాడులు చేస్తూ పాకిస్తాన్ ప్రాంతాలలోని అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నది. లిబియాలో గడాఫీని చంపించిన తరువాత అక్కడి చమురు సంపదలను కొల్లగొట్టడమే తప్ప చేసిందేమీ లేదు. ఇప్పుడు సిరియాలో దీనికి భిన్నంగా ఏముండదు.

అమెరికాలో ఆయుధ వ్యాపార పెట్టుబడి వర్గాలు సంక్షోభంలో ఉన్నప్పుడల్లా లేదా వాటికి లాభాలను సమకూర్చి పెట్టడంలో భాగంగా ప్రపంచంలో ఎక్కడో ఒక దగ్గర లేదా పలు ప్రాంతాలలో యుద్ధాలు రాజేయడం, యుద్ధ వాతావరణాన్ని ప్రోత్సహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఆయా ప్రాంతాల్లోని ప్రజల ప్రాణాలు, జీవితాలు, సంక్షేమాలు ఈ యుద్ధ పిపాసులకు అనవసరం. కావల్సిందల్లా లాభాలు, ఆధిపత్యాలు, విలాసాలు, అహంకారలను సంతృప్తి పరుచుకోవడమే. వాటిలో భాగంగా సపి పిల్లలను, మహిళలను, అమాయక అసహాయ ప్రజలను చంపేసే దారుణాలకు ఒడి గట్టడం. అటువంటి భీభత్సాలకు ఆజ్యం పోయడం, వాటిల్లో ప్రత్యక్షంగా పాల్గొనడం అనేది సామ్రాజ్యవాద శక్తుల చెప్పడానికి మాటలే లేని క్రూరత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

సిరియాలో 75 శాతం సున్నీ ముస్లింలు, 13 శాతం షియా ముస్లింలు, 8 శాతం క్రైస్తవులు, 3 శాతం డ్రుజులు ఉన్నారు. మైనారిటీగా ఉన్న షియా ముస్లింలకు చెందిన బషరల్ అసద్ కుటుంబం 40 ఏళ్లుగా పాలిస్తుండడం అధికారిక, కీలక స్థానాల్లో సున్నీలకు ప్రాధాన్యం లేకపోవడం, షియాల పెత్తనం సున్నీలకు మింగుడు పడని విషయం. అందువల్ల బషరల్ అసద్ పాలనను అంతం చేయడమనేది సున్నీ, షియాల మధ్య ఘర్షణగా కూడా చూడబడుతున్నది.

ఇరాన్‌లో మెజారిటీగా షియా ముస్లింలున్నారు. ఇరాక్ ప్రభుత్వం సిరియాలో షియా వర్గానికి చెందిన అసద్ ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు ఏటా వందల కోట్ల డాలర్లను ఖర్చు చేస్తున్నది. వందల మందితో కూడిన పోరాట దళాలను సిరియాకు పంపిస్తున్నది. సైనిక సలహాలను, రాయితీలతో ఆయుధాలను, రుణాన్ని, చమురును అందిస్తున్నది. లెబనాన్‌లోని షియా ఇస్లామిక్ రాజకీయ మిలిటరీ సంస్థ అయిన హిజ్బుల్లాకు ఇరాన్ ఆయుధాలను ప్రధానంగా సిరియా గుండానే పంపించాలి. హిజ్బుల్లా సంస్థ సిరియాలో అసద్‌కు మద్దతుగా వేల మంది ఫైటర్లను పంపించింది.

హిజ్బుల్లా సంస్థ అధునాతన ఆయుధాలను సమీకరించుకోవడంపై ఇజ్రాయిల్ ఆందోళన చెందుతున్నది. హిజ్బుల్లాను ఎదుర్కోవడానికి ఇజ్రాయిల్ సిరియా ప్రాంతంలో వైమానిక దాడులు చేసింది. 1980 నుండి సిరియాకు ఇరాన్ మిత్ర దేశంగా ఉన్నది. ఇరాన్ తనమిత్ర దేశాలకు ఆయుధ సరఫరాను సిరియా ద్వారానే చేస్తున్నది. దీనికి ప్రతిగా సిరాయాకు మిలిటరీ, రాజకీయ పరమైన మద్దతును ఇస్తున్నది. దీంతో ఇరాన్‌కు శత్రు దేశాలుగా ఉన్నవి సిరియాకు శత్రు దేశాలుగా మారిపోయాయి.

సిరియాలో తిరుగుబాటుదార్లకు టర్కీ గట్టి మద్దతుదారు. అయితే ప్రభుత్వ వ్యతిరేక సిరియన్ డెమోక్రటిక్ ఫోర్స్ (ఎస్‌డిఎఫ్)లో అత్యంత బలమైన భాగస్వామ్య సంస్థ వైపిజి (కుర్దుల రక్షణ దళం) మిలీషియాను నియంత్రించేందుకు టర్కీ ప్రయత్నిస్తున్నది. ఓ వైపు సిరియా ప్రభుత్వం వ్యతిరేక దళాలకు తోడుగా ఉంటూనే, అందులోని కుర్దిష్ దళాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నది టర్కీ.

సిరియా టర్కీ హద్దుల్లో ఎక్కువగా కుర్దుల జనాభా ఉంది. ఇరాక్, ఇరాన్, టర్కీ, సిరియా దేశాలలో కున్న కుర్దులతో కలిపి ప్రత్యేక కుర్దిస్తాన్ దేశాన్ని కాంక్షిస్తున్నారు కాబట్టి టర్కీ దేశ భద్రతకు కుర్దుల పోరాటాన్ని ముప్పుగా టర్కీ ప్రభుత్వం వాయవు సిరియాలో అఫ్రన్ ప్రాంతం నుంచి కుర్దుల రక్షణ దళం (వైపిజి) ను తరిమెందుకు జనవరి 2018లో టర్కీ దేశం ఆపరేషన్‌ను చేపట్టింది.

కుర్దులు ఐఎస్ఐఎస్, టర్కీ, సిరియా, ఇరాన్, ఇరాక్‌లలో కొట్లాడుతున్నారు. సిరియా, ఇరాక్, టర్కీలు కుర్దుల స్థావరాలపై బాంబులు వేస్తున్నారు. అమెరికా సిరియాలో కుర్దులకు, టర్కీలో టర్కులకు మద్దతునిస్తూ ద్వంద నీతిని ప్రదర్శిస్తున్నది.

సిరియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న కుర్దులకు అమెరికా, దాని మిత్ర దేశాలు మద్దతును ఇస్తున్నాయి. కుర్దుల పోరాటాన్ని వ్యతిరేకిస్తున్నది టర్కీ కాని అమెరికా కూటమిలో భాగస్వామిగా ఉంటున్నది.

అమెరికాకు క్షేత్ర స్థాయిలో కుర్దు అరబ్ మిలీషియాల కూటమి సిరియన్ డెమోక్రటిక్ ఫోర్స్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐఎస్ఐఎస్) నియంత్రణలో ఉన్న ప్రాంతాల నుండి ఐఎస్ఐఎస్‌ను ఎస్‌డిఎఫ్ దళాలు అమెరికా సహకారంతో తరిమేశాయి. ఐఎస్ఐఎస్‌ను తుదముట్టించేందుకు, ఇరాక్ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి, అంతర్యుద్ధానికి ముగింపు పలికేందుకు సిరియాలో సైన్యాన్ని అంచుతామని, ఎస్‌డిఎఫ్ బాసటగా నిలుస్తామని అమెరికా జనవరి 2016లో ప్రకటించింది.

సున్నీ పాలిత సౌదీ అరేబియాకు, షియా పాలిత ఇరాన్‌కు మధ్య దశాబ్దాలుగా ఉన్న వైరం సిరియాపై చూపింది. ఇరాక్‌లో బాతిస్టు పార్టీ (సద్దాం హుస్సేన్) పాలన అంతం అయ్యాక సున్నీ షియాల మధ్య ఆధిపత్య పోరుకు సిరియా వేదికగా మారింది.

గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిల్ (జిసిసి) సభ్యదేశాలతో పాటుగా ఆ ప్రాంతంలోని సున్నీ దేశాలన్నింటికీ రక్షణగా నిలవాలంటే సిరియాను చెప్పుచేతుల్లో పెట్టుకోవాలని సౌదీ అరబ్ ఆరాటపడుతున్నది. సిరియాలో ప్రభుత్వ వ్యతిరేక దళాలకు సైనిక, ఆర్థిక సహాయ సహకారాలను అందిస్తున్న ప్రధాన దేశం సౌదీ అరేబియా. ఇరాక్ ప్రభావాన్ని తగ్గించాలని సున్నీ పాలిత సౌదీ అరేబియా ప్రయత్నిస్తున్నది.

సిరియాలో ఐఎస్ఐఎస్ 2014లో వెలుగులోకి వచ్చింది. ఐఎస్ఐఎస్ అల్ ఖైదా నుండి వేరైన సంస్థ. ప్రస్తుతం అల్ ఖైదా, ఐఎస్ఐఎస్ వేర్వేరుగా పనిచేస్తున్నాయి. ఇరాక్ సిరియాతో కూడిన రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని ఐఎస్ఐఎస్ లక్ష్యం. సిరియాలోని రఖ్హ నగరాన్ని ఇరాక్‌లోని మౌసల్, ఫాలుజా ప్రాంతాలను తన ఆధీనంలోకి తెచ్చుకున్నది.

ఐఎస్ఐఎస్‌పై ఫ్రీ సిరియన్ ఆర్మీ, కుర్దిష్‌లు పోరాడుతున్నారు. ప్రస్తుతానికి అమెరికా, రష్యా సిరియా, ఫ్రీ సిరియన్ ఆర్మీ, సిరియన్ డెమోక్రటిక్ ఫోర్స్, కుర్దుల మిలీషియా దాడుల వల్ల చాలా వరకు ఐఎస్ఐఎస్ బలహీనమయింది. సిరియా ఉత్తర ప్రాంతంలో కొంత మేరకే నియంత్రణను కలిగి ఉన్నది.

అమెరికా, యూరప్‌లు సిరియాలో అసద్ ప్రభుత్వాన్ని, జిహాదీ సంస్థల అధికారాన్ని వ్యతిరేకిస్తున్నాయి. అసద్ ప్రభుత్వం, రష్యాలు సిరియాలో ఎలాంటి తీరుగుబాటు దాడులను సహించడం లేదు. వారందరిపై సత్వర, సంపూర్ణ విజయాన్ని కోరుకుంటున్నాయి. అందుకోసం ఎంత రక్తపాతమైనా జరగనీ గాక. ఆధునిక సెక్యులర్ రాజ్యం పేరుతో ఐఎస్ఐఎస్, అల్‌ఖైదా తదితర జిహాదీ సంస్థలకు వ్యతిరేకంగా దాడులు చేస్తున్నాయి.

రష్యా సిరియాకు 1960 నుండి మిత్ర దేశంగా ఉంటున్నది. రష్యాకు సిరియాలో విలువైన నావికా స్థావరాలు ఉన్నాయి. సిరియాలోని 48 శాతం ఆయుధ సామాగ్రి రష్యా నుండి కొన్నవే. రష్యా అత్యాధునిక ఆయుధాలను, ఎం125 వంటి యుద్ధ విమానాలను సిరియాకు అందించింది. 10 వేల మంది సైనికులను సిరియాకు పంపించింది. 2015లో సిరియాలో యుద్ధంలో ప్రత్యక్షంగా పాల్గొన్నది.

ఆయుధ మార్కెట్‌ను సృష్టించుకొని తన సైనిక శక్తిని విస్తరించుకొని ప్రపంచ శక్తిగా ఎదగడానికి మధ్య తూర్పు ప్రాంతంపై పట్టు కలిగి ఉండడం రష్యాకు కావాలి. అలాగే ఈ ప్రాంతంలో అశాంతి, అస్థిరత్వం అనేది మెజారిటీగా ముస్లింలున్న చెచెన్యా, అజర్‌బైజాన్, కజకిస్తాన్,

టుర్కిస్తాన్, తుర్కెమిస్తాన్, కజగియా ప్రాంతాలను ప్రభావితం చేస్తుంది. ఇది రష్యాకు ప్రమాదకరంగా మారుతుంది.

మధ్య ప్రాచ్యంగా పిలిచే పశ్చిమాసియా, ఉత్తర ఆఫ్రికా ప్రాంతం వ్యూహాత్మకంగా కీలకమైనది. ప్రపంచ మొత్తం చమురు నిక్షేపాల్లో మూడింట రెండు వంతులు ఇక్కడే ఉన్నాయి. ఈ ప్రాంతంపై పట్టు అమెరికాకు, దాని మిత్ర దేశాలకు అవసరంగా మారింది.

సౌదీ దేశాల నుండి వచ్చే చమురు పైపులైన్లు సిరియా నుండి అమెరికా దాని మిత్ర దేశాలకు రావాలి. అందుకోసం అమెరికాకు సిరియాపై నియంత్రణ అవసరమవుతున్నది. సిరియాలో తమ కీలుబొమ్మ ప్రభుత్వమున్నట్లయితే తమ ప్రయోజనాలను సులువుగా నేరవేర్చు కోవచ్చనేది ఇటు రష్యా, అటు అమెరికాల వ్యూహంలో భాగంగా ఉంటున్నది.

సిరియాలో ప్రస్తుతం అసద్ ప్రభుత్వ దళాల ఆధీనంలో జనావాసాలు అధికంగా ఉండే నగరాలు, ప్రాంతాలు ఉన్నాయి. అల్‌ఖైదాతో సంబంధాలున్న జబాతల్ నుస్రా తిరుగుబాటు దారుల ఆధీనంలో ఇద్లిప్ ప్రావిన్స్ ఉన్నది. నుస్రా సంస్థ 2012లో ఏర్పాటయింది. దీని ఆధీనంలో ఉన్న ఇద్లిప్ ప్రావిన్స్‌పై అసద్ సైన్యం, రష్యా దళాలు దాడులు చేస్తున్నాయి. ఈశాన్య సిరియా కుర్దుల నియంత్రణలో ఉంది. వీరు స్వతంత్రాన్ని ప్రకటించుకున్నారు. సిరియాలో కుర్దుల జనాభా 7-9 శాతం ఉంటుంది.

నేడు సిరియాలో ఆ దేశ ప్రజలకు స్వయం నిర్ణయాధికారం, స్వతంత్రత, స్వేచ్ఛలు లేకుండా పోయాయి. ఓ వైపు మతం పేరుతో ఛాందసత్వం, మరోవైపు నియంతల నిరంకుశత్వం.

ఇంకోవైపు సామ్రాజ్యవాదుల క్రూరత్వం సిరియాలోని ప్రజాస్వామిక, సెక్యులర్, సామ్యవాద, సార్వభౌమత్వాధికార కాంక్షలను నులిమి వేస్తున్నాయి. తీవ్రంగా అణచివేస్తున్నాయి.

బాంబులతో, వైమానిక దాడులతో, ప్రమాదకర మిస్సైల్‌లతో, నీతిబాహ్యమైన రసాయనిక ఆయుధాలతో, విషవాయువులతో సిరియా భూభాగాన్ని, అక్కడి ప్రజలను అతలా కుతలం, కర్తసిక్తం, ఎటుచూసినా విపరీత విధ్వంసం చేస్తున్నాయి.

2011లో దాదాపుగా 2-3 కోట్ల జనాభా ఉన్న సిరియాలో 40 లక్షల మంది గాయాలపాలయ్యారు. 5 లక్షలకు పైగా మరణించారు. 60 లక్షల మంది శరణార్థులుగా పక్క దేశాలకు వెళ్లారు. 60 లక్షల మంది సిరియాలోనే అంతర్గతంగా నిర్వాసితులయ్యారు. శరణార్థులుగా వెళ్లేవారి కష్ట నష్టాలు చెప్పనలవి కావు. ఆయా దేశాలు వారిని అనుమతించడం ఒక సమస్య. అక్రమంగా వచ్చిన వారిని జైలు పాల్జేస్తున్నారు.

27 లక్షల ప్రజలు టర్కీకు శరణార్థులుగా వెళ్లారు. ఆ తరువాత లెబనాన్, జోర్డాన్, ఇరాక్, ఈజిప్ట్‌లు శరణార్థులకు ఆశ్రయం ఇచ్చాయి. యూరప్ చేరుకోవడానికి పెద్ద ఎత్తున శరణార్థులు సముద్ర మార్గాన్ని ఎంచుకొని ప్రాణాలు కోల్పోయారు. ఎలాగోలా చేరుకున్న వారిని జైళ్లలో బంధించారు.

17,700 మంది జైళ్లలో మరణించినట్లు, వేల మంది జిహాదిస్టుల చేతుల్లో మరణించినట్లు యునైటెడ్ నేషన్స్ హై కమిషనర్ ఫర్ రెఫ్యూజీస్ (యుఎన్ఎచ్‌సిఆర్) చెబుతున్నది.

మహిళల పరిస్థితి దుర్భరంగా మారింది. ఐక్యరాజ్య సమితి గాని, ఇతర అంతర్జాతీయ సంస్థలు అందించే సహాయం పొందేందుకు దళారీలకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తున్నది. కోరికలు తీరిస్తే తప్ప ఆకలి తీరని పరిస్థితిని తలుచుకుంటేనే దారుణంగా ఉంటుంది.

1.31 కోట్ల మందికి ఏదో ఒక రూపంలో సహాయం అందించాలని, 70 శాతం పైగా కడు పేదరికంలో ఉన్నారని, ఆహార కొరత, అధిక ధరల కారణంగా 60 లక్షల సాయుధ బలగాలు చుట్టుముట్టిన ప్రాంతాలలో 29.8 లక్షల ప్రజలున్నారని ఐక్యరాజ్య సమితి చెబుతున్నది.

సిరియాలో నేడు ఎటు చూసినా శిథిలమైన, శిథిలమవుతున్న భవనాలు, రోడ్లు నానా భీభత్సం తాండవిస్తున్నది. సిరియాలో ఇజ్రాయిల్, ఇరాని, టర్కీ, అమెరికా, ఇరాక్, లెబనాన్ వంటి దేశాలు తమ సైన్యాలను పంపి అక్కడ ఒకరిపై మరొకరు దాడులు చేసుకుంటూ స్థానిక ప్రజలకు చోటు లేకుండా చేస్తున్నారు.

ఏక సమయంలో అనేక యుద్ధాలు జరుగుతున్న సిరియా బహుశా ప్రపంచ చరిత్రలో ఎన్నడూ జరగని క్రూరమైన సంఘటనలకు వేదికగా నిలుస్తున్నది. సిరియా వివిధ దేశాలకు, సంస్థలకు రణ రంగస్థలం అయింది. రానురాను సిరియా ఉనికికే ప్రమాదం పొంచి ఉందని అనిపిస్తున్నది.

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి 2012లో చేసిన జెనీవా తీర్మాణాన్ని అమలు చేయాలని సూచించింది. దాని ప్రకారం అన్ని పక్షాల సమ్మతితో పూర్తి అధికారాలతో తాత్కాలిక పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి. ఐక్యరాజ్య సమితి మధ్య వర్తిత్వంలో 2014లో తొమ్మిది సార్లు చర్చలు జరిగాయి.

రాజ్యాంగ సవరణలు చేపట్టడం, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడం పై చర్చలు జరిగాయి. కాని అసద్ చర్చలకు సుముఖంఅ లేదు. అసద్ వ్యతిరేక వర్గాలు అసద్ గద్దె దిగాల్సిందేనని అంటున్న ఫలితంగా పరిష్కారం దొరకని పరిస్థితి ఏర్పడింది.

అసద్ ప్రభుత్వం గాని అసద్ అనుకూల, వ్యతిరేక శక్తులు గాని ఒకరినొకరు పూర్తి స్థాయిలో ఓడించలేకపోతున్నారు, లేక గెలవలేక పోతున్నారు. ఫలితంగా సిరియాలో జరుగుతున్న యుద్ధాలకు ఫుల్‌స్టాప్ ఇప్పట్లో పడేలా లేదు. సామ్రాజ్యవాద శక్తులు ఇక్కడ తమ స్వార్థపూరిత ప్రయోజనాల కోసం పన్నిన పన్నాగాలకు సిరియా బలవుతున్నది. నిత్యం గత ఏడేళ్లుగా బాంబుల మోతలు, వైమానిక దాడులు, రసాయన ఆయుధాల ప్రయోగం, విధ్వంసం మొత్తంగా అక్కడి ప్రజల జీవితాలు చిన్నా భిన్నమవుతున్నాయి. రక్తంతో తడిసిపోతున్నది సిరియా.

2011 నుండి ఐదేళ్లలో 66 లక్షల జనాభా తగ్గిపోయిందని వరల్డ్ బ్యాంక్ చెప్పింది. జనావాసాలు తగ్గిపోయి, భవనాలు, రోడ్లు ధ్వంసం అయిపోయి మిగిలేదేముంటుంది. ఆ మిగిలిన ప్రాంతం ఎవరి ఆధిపత్యం కింద పాలించబడుతుందో చరిత్ర నిర్ణయిస్తుంది.

ఇది ప్రపంచ శక్తులు, సిరియాపై సాగిస్తున్న రక్త చరిత్రగా మిగిలిపోతున్నది. సిరియాలో ఇతర దేశాల జోక్యం పూర్తిగా పూర్తిగా తొలగించి ఆ దేశంలోని వివిధ సంస్థలు రాజకీయ చర్చల ద్వారా ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉన్నది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

అమెరికాలో బతుకు భయం భయం

అమెరికాలో ఆయుధ వ్యాపారులు విచ్చలవిడి అమ్మకాల అనుమతి కోసం రాజకీయ పార్టీలకు పెద్దమొత్తంలో నిధులిస్తూ, లాభాలనార్జిస్తూ అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారని అంటున్నారు **రాజేంద్రబాబు అర్విణి**

అమెరికాలో మరో దుర్ఘటన జరిగింది. ఫ్లోరిడా రాష్ట్రం, పార్క్‌లాండ్ పట్టణంలోని హైస్కూల్లో ఓ ఉన్మాది జరిపిన తుపాకీ కాల్పుల్లో 17 మంది మరణించారు. 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరణించిన వారిలో ఆ స్కూల్లో పనిచేస్తున్న ఒక ఫుట్‌బాల్ శిక్షకుడు, ఆటలాడే పిల్లల వైద్య అవసరాల కోసం నియమింపబడ్డ డాక్టరు, భౌగోళిక శాస్త్ర అధ్యాపకుడు, మిగతా అందరూ భవిష్యత్తులో దేశానికి అవసరమైన మానవ వనరులు. 14 నుండి 18 ఏళ్ల వయసున్న యువ విద్యా కుసుమాలు. కాల్పులు జరిపిన ఆ పాఠశాల పూర్వ విద్యార్థి నికోలస్ క్రూజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతనికి 19 ఏళ్ల వయస్సు. స్కూల్ నుండి సస్పెండ్ అయినవాడు. క్రూజ్ మానసిక వైకల్యం ఉన్న వ్యక్తి. స్కూల్లో మారణ హోమం సృష్టిస్తానని గతంలో పాలుసార్లు బహిరంగంగానే మిత్రులతో హెచ్చరించాడు.

ఫ్లోరిడా రాష్ట్రంలో అమలులో ఉన్న నియమ నిబంధనల ప్రకారమే చట్టబద్ధంగా అతను మారణాయుధాలను కొనుగోలు చేశాడు. 2018 సంవత్సరంలో ఫిబ్రవరి 14న ఈ కాల్పుల దారుణం జరిగింది. ఈ సంవత్సరం ఇది రెండవ నెలనే. ఇప్పటికే అమెరికాలోని వివిధ స్కూళ్లలో అయిదు కాల్పుల సంఘటనలు జరిగాయి. ఆ కాల్పులలో విద్యార్థులు, టీచర్లు చనిపోవడమో, గాయపడడమో జరిగింది. ఫొరిడా స్కూల్లో జరిగింది ఆరవ కాల్పుల సంఘటన. ఈ కాల్పులలో చనిపోయిన వారి సంఖ్య ఎక్కువ కాబట్టి దీనిపై మీడియా ప్రముఖంగా దృష్టి సారించింది.

అమెరికాలోని మరో రాష్ట్రం కనెక్టికట్‌లోని శాండీహుక్ స్కూల్లో 2012లో జరిగిన విచ్చలవిడి కాల్పులలో 26 మంది మరణించిన ఘటన తర్వాత విద్యార్థులు, టీచర్లు ఎక్కువ సంఖ్యలో అమెరికాలో పెచ్చరిల్లి పోయిన తుపాకీ సంస్కృతికి బలైన అత్యంత దారుణమైన హత్యోదంతం ఇదే. కనెక్టికట్ కాల్పుల ఘటన జరిగిన ఈ ఆరేళ్లలో అమెరికాలో విచ్చలవిడిగా లభించే తుపాకుల కారణంగా 1600 కాల్పులు జరిగాయి. అందులో 1800 మంది అమాయక ప్రజలు మరణించారు. 6,400 మంది గాయపడ్డారు. తుపాకీ సంస్కృతికి వ్యతిరేకంగా ప్రజలు చాలా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. అయినా అమెరికాలోని చట్ట సభలు ఏమాత్రం చలించలేదు. నియంత్రణ విధించే దిశలో చిత్తశుద్ధితో ప్రయత్నించలేదు.

గత సంవత్సరం లాస్ ఏంజిల్‌లో ఓ సంగీత కార్యక్రమంలో నృత్యం చేస్తున్న వారిపై జరిపిన కాల్పుల్లో 58 మంది మరణించడం తీవ్ర సంచలనం సృష్టించి, అంగట్లో సరుకుల్లాగా బజార్లో విచ్చలవిడిగా లభిస్తున్న తుపాకీల, మారణాయుధాల లభ్యతపై దేశ వ్యాప్తంగా చర్చ జరిగింది. తుపాకీలు కలిగి ఉండడానికి అర్హులు ఎవరు, తుపాకీల లభ్యతపై నియంత్రణ ఏ మేరకు ఉండాలి అన్న చర్చ కొంత కాలం సాగి, అమెరికా విధాన నిర్ణేతల మూగనోము కారణంగా ఆగిపోయింది.

ప్రపంచంలోని అన్ని దేశాలలో ప్రజలు తమ పరిచయస్థులతో, మిత్రులతో, కుటుంబ సభ్యులతో లేదా సహ ఉద్యోగులతో వాదులాడుతారు. అప్పుడప్పుడు అవి కొట్లాటలకు కూడా దారితీస్తాయి. కాని అమెరికాలో అయితే (స్థానికులలో) అట్లా ఎవరితోనైనా భేదాభిప్రాయం వస్తే గన్ తీసి కాల్చివేయడానికే అవకాశాలు ఎక్కువ.

ప్రపంచ జనాభాలో అమెరికా ప్రజలు 5 శాతం మాత్రమే. కాని, భూగోళంలో ఉన్న సాయుధులైన ప్రైవేట్ వ్యక్తులలో 42 శాతం మంది అమెరికాలోనే ఉన్నారు. ఈ వ్యాసం రాస్తున్న సమయానికి రెండు రోజుల ముందు కాన్సస్ సిటీలో ఓ వృద్ధాశ్రమంలోకి ఓ దుష్టుడు చొరబడి ఇద్దరు నర్సులను ఉత్తి పుణ్యానికే కాల్చి చంపేశాడు. ఆ మరురోజే మరొక పట్టణంలో మరొక ఘటన. అమెరికాలో పోలీసులను పిలువాలన్నా, వైద్య సహాయం కోసమైనా అగ్గిమాపక దళాల వారి కోసమైనా, మరే ఇతర అత్యవసర పరిస్థితిలలో నైనా ప్రభుత్వ సహాయం కావాలంటే 911కు ఫోన్ చేస్తే సాధ్యమైనంత త్వరలో అవి మన అందుబాటులో ఉంటాయి. అలా ఒక ఫోను పోలీసులకు వచ్చింది. కాని, పోలీసు శాఖవారు పొరపాటున తమ సిబ్బందిని తప్పు చిరునామాకు పంపించారు. వారు తమకు సూచించిన అడ్రస్‌కు వెళితే, ఆ ఇంట్లో ఒక మహిళా ఒంటరిగా ఉంది నేనేమీ సహాయం కోరలేదు. మీరు నా ఇంట్లోకి రావద్దు అని చెపుతున్నా నమ్మకుండా ఇంట్లోకి వెళ్లాడు పోలీసు ఆఫీసరు. అంతే, ఆమె తన దగ్గరున్న తుపాకీతో అతన్ని కాల్చేసింది. అతను అక్కడికక్కడే మరణించాడు. అతనితో పాటు వెళ్లిన ఇద్దరు ఆఫీసర్లు తీవ్రమైన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయినా, ఆ మహిళపై పోలీసులు కేసేమీ పెట్టలేదు.

తుపాకులు వీథుల్లో, ఇళ్లల్లో, దుకాణాల్లో ఎంత తరచుగా పేలుతున్నాయో చెప్పడానికే ఈ ఉదంతం ఉదాహరించాను. ఎక్కడో ఒక చోట ఎవరో ఒక మానసిక దౌర్భాగ్యుడు, ఓ ఉన్మాది తుపాకీ పేల్చకుండా, అమాయకులను పొట్టన పెట్టుకోకుండా, గాయపర్చకుండా అమెరికాలో పొద్దు పొడవదంటే ఆశ్చర్యం కాదు.

తుపాకీ సంస్కృతికి అమెరికన్లు ఎంతగా బానిసలైపోయారంటే, ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో తుపాకులు ఉండడం ఎంత ప్రమాదకరమో ఆలోచించే స్థాయి నుంచి ఎన్ని ఎక్కువ తుపాకులు వ్యక్తుల వద్ద ఉంటే అంత రక్షణ ఉంటుందని భావించే స్థితికి అమెరికన్లు దిగజారిపోయారు.

తుపాకీ ఉన్మాదం ఎంత పరాకాష్టకు చేరిందంటే ఫ్లోరిడా స్కూల్లో పనిచేస్తున్న టీచర్ల దగ్గర తుపాకులు ఉండి ఉంటే ఇంత మంది పిల్లలు ఆ ఉన్మాది కాల్పుల్లో మరణించి ఉండేవారు కాదని అనుకునేంత వరకు. ఈ మాట అన్నది ఎవరో కాదు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఫ్లోరిడా స్కూల్ కాల్పుల తర్వాత విద్యార్థుల, మేధావుల నిరసనగళానికి తలవొగ్గి ఆ రాష్ట్ర చట్టసభ తుపాకుల అమ్మకంపై నియంత్రణ విధించాలన్న ఉద్దేశంతో ఓ చట్టం ఆమోదించింది. ఆ చట్టంలో కూడా ఆ స్కూల్ డిస్ట్రిక్ట్ (అంటే మన స్థానిక ప్రభుత్వం లాంటిది) ఆమోదిస్తే ఉపాధ్యాయులకు కూడా తుపాకులు ఇవ్వాలన్న నిబంధన ఉంది. (ఆ చట్టాన్ని గవర్నర్ సంతకం చేసిన కొన్ని గంటలలోనే నేషనల్ రైఫిల్ అసోసియేషన్ అనే సంస్థ తుపాకుల నియంత్రణను వ్యతిరేకిస్తూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది).

అమెరికా జనాభా మొత్తంలో 40 శాతం ప్రజలు మారణాయుధాలు చట్టబద్ధంగా కలిగి ఉంటారు లేదా తుపాకి కలిగి ఉన్న గృహస్థు ఇంట్లో నివశిస్తూ ఉంటారు. (అంటే భర్త/భార్య, పిల్లలు). ఇది 2017లో చేసిన సర్వేలో బయటపడ్డ వాస్తవం. 2016లో అమెరికాలో ప్రైవేట్ వ్యక్తుల కాల్పులలో 1100 మంది మరణించారు. ప్రపంచం మొత్తం మీద 2015-16లో ప్రైవేట్ వ్యక్తులు జరిపిన తుపాకీ కాల్పులలో 64 శాతం మంది అమెరికా దేశంలో మరణిస్తే, ఇంగ్లాండులో 4.5 శాతం మంది, 13 శాతం మంది ఆస్ట్రేలియాలో చనిపోయారు. పోలీసు కాల్పులలో గాని, ప్రైవేట్ వ్యక్తులు తమను తాము రక్షించుకోవడం కోసం జరిపిన కాల్పులలో మరణించిన వారిని ఈ గణాంకాలలో చేర్చలేదని ఎఫ్‌బిఐ (అమెరికాలోని ప్రభుత్వ నిఘా సంస్థ) ప్రకటించింది. సాధారణ ప్రజల వద్ద ఉన్న గన్‌ల సంఖ్య తేల్చడం కష్టమైనప్పటికీ, ఓ ప్రభుత్వ సంస్థవారు వెల్లడించిన వివరాల ప్రకారం, అమెరికాలో 27 కోట్ల తుపాకులు ప్రజల దగ్గర ఉన్నాయి. ప్రజల దగ్గర ఉన్న మొత్తం తుపాకీల సంఖ్యతో లెక్కగడితే ప్రతి వందమంది అమెరికన్లలో 90 మంది దగ్గర మారణాయుధాలు ఉన్నట్లు గణాంకాలు చెపుతున్నాయి. యూరప్ దేశాలైన స్విడ్జర్‌ల్యాండ్, ఫిన్‌ల్యాండ్‌లలో కూడా దాదాపు 50 శాతం ప్రజల వద్ద తుపాకులు ఉన్నప్పటికీ, ఆ దేశాలలో 18 సంవత్సరాల వయస్సు పైబడ్డ ప్రతి పౌరుడు సైనిక శిక్షణ తప్పని సరిగా పొందాలి. ఆలోచనలలో గాని, జీవితంలో గాని ఆ ప్రజలు పాటించే క్రమశిక్షణతో పోలిస్తే అమెరికా వారికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా! ఆ దేశాలలో పిచ్చిగా జన సమూహాలపై కాల్పులు జరిగిన ఉదంతాలు దాదాపు మృగ్యమనే చెప్పాలి.

'మదర్స్ జోన్' అన్న ఒక పరిశోధనాత్మక పత్రిక ప్రకటించిన దాని ప్రకారం 1982వ సంవత్సరం నుండి అమెరికాలో జన సమూహాలపై విచ్చలవిడి కాల్పులు 90 సార్లు జరిగాయి. ఇవేవీ దారి దోపిడీ చేయాలన్న ఉద్దేశంతోనో, గ్రూపుల మధ్య వైషమ్యాలతోనో చేసిన కాల్పులు కావు. మానసిక వికారంతో అసలు సంబంధం లేని అమాయక ప్రాణాలు పొట్టనపెట్టుకున్న కాల్పులు ముగ్గురు, అంతకంటే ఎక్కువ మంది మరణించిన సందర్భాలనే ఈ సర్వేలో లెక్క గట్టారు. తమ తుపాకులతో తామే కాల్చుకుని ఆత్మహత్యలకు పాల్పడే వారి సంఖ్యతో పోల్చుకుంటే తమ మారణాయుధాలతో వేరే వారిని కాలిస్తే చనిపోయిన వారి సంఖ్య రెట్టింపుగా ఉంటుంది. 'అమెరికా జర్నల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్' వారు ప్రకటించిన దాని ప్రకారం ఏ రాష్ట్రంలో తుపాకుల అమ్మకం ఎక్కువగా ఉందో ఆ రాష్ట్రంలో ఆత్మహత్యల సంఖ్య కూడా అధికంగానే ఉంది.

అమెరికాలో తుపాకులు అమ్మే దుకాణానికి (మాల్స్) వెళ్లి 150 డాలర్లకు ఒక తుపాకీ కొనవచ్చు. కేవలం 62 డాలర్లకు ఒక తుపాకీ చొప్పున అమ్మిన షాపులు కూడా ఉన్నాయి. ఒక్కసారి తగ్గింపు ధరల సమయం వచ్చినప్పుడు ఇంకా తక్కువ ధరకే తుపాకులు దొరుకుతాయి. లాస్ వెగాస్‌లో గత సంవత్సరం ఒకేసారి కాల్పులు జరిపి 58 మందిని పొట్టన పెట్టుకున్న స్టీఫెన్ పెడ్డాక్ దగ్గర 70,000 డాలర్ల విలువ చేసే పలు రకాల తుపాకులు దొరికాయి. వాటిలో ఎక్కువ ఖరీదైనది 1500 డాలర్లు కాగా, తక్కువ ధరకు200 డాలర్లు. అంటే అంత చవకగా మారణాయుధాలు లభించే దేశం అమెరికా. ఇంత నికృష్టమైన వ్యాపారం, ఏమాత్రం విలువలు లేని వ్యాపారం చేసే దేశం అమెరికా తప్ప ప్రపంచంలో మరొకటి లేదేమో!

అమెరికాలో పుట్టి పెరిగి, అమెరికన్ సంస్కృతికి అలవాటు పడిన స్థానికులలో తుపాకీ సంస్కృతిపై మోజు పెరగడం ఆందోళన కలిగించే విషయం. గత 60 సంవత్సరాల కాలంలో తుపాకులు కలిగి ఉండడం పట్ల ప్రభుత్వ నియంత్రణ ఎందుకు అని ప్రశ్నించేవారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతూ ఉంది. ఫ్లోరిడా స్కూల్ కాల్పుల తర్వాత, గన్ కల్చర్‌ను గురించి వేడివేడిగా చర్చలు జరుగుతున్న తరుణంలోనే పెన్సిల్వేనియా రాష్ట్రంలో జరిగిన ఒక ఉప ఎన్నికలలో ఒక సెనేటర్ గెలిచాడు. ఆయన డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి. కాని, తుపాకి కలిగి ఉండే హక్కు - ప్రజలకు ఉండాలని వాదించే ప్రముఖ నాయకుడు. రిపబ్లికన్ పార్టీవారు తుపాకులు కలిగి ఉండడం ప్రజల హక్కని గట్టిగా వాదిస్తారు. సమర్థిస్తారు. డెమొక్రటిక్ పార్టీ వారైతే కొన్ని నియంత్రణలు ఉండాలని బయటికి చెప్పినప్పటికీ, అంతర్గతంగా ఏ నియంత్రణను ఒప్పుకోరు. ఆయుధాల తయారీదార్లు ప్రజల ఆలోచనలను కూడా ఎలా ప్రభావితం చేస్తారో ఓ ఉదాహరణగా దీన్ని చూడవచ్చు. ప్రైవేట్ స్కూళ్లల్లో ఇంగ్లిష్ మీడియంలో పిల్లల్ని చదివించడం భారతదేశంలో ఎలా సామాజిక హోదాగా మారిందో, మారణాయుధాలు కలిగి ఉండడం అమెరికా పౌరులలో సామాజిక హోదాగా మారింది. అయితే, తుపాకీ అమ్మకాలపై నియంత్రణ ఉండాలని భావించే వారి సంఖ్య కూడా అధికంగానే ఉంది. మానసిక వైకల్యం ఉన్నవారికి, 21 సంవత్సరాల వయసు లేనివారికి తుపాకుల అమ్మకంపై నిషేధం విధించాలని చాలా మందే కోరుతున్నారు.

తుపాకుల కొనుగోలు, వాడకంపై పటిష్టమైన నియంత్రణ విధించి, నియమ నిబంధనలు సరిగ్గా అమలు చేస్తే ఈ అనవసర మరణాల సంఖ్య చాలా వరకు తగ్గించవచ్చని ఆస్ట్రేలియా దేశం నిరూపించింది. ఆస్ట్రేలియాలో ఒకప్పుడు తుపాకులు చాలా సులభంగా దొరికేవి. ఎవరైనా నేరుగా దుకాణానికి వెళ్లి మారణాయుధాలను కొనుగోలు చేసే వీలుండేది. 1996లో 28 ఏళ్ల వయసున్న ఓ యువకుడు ఓ రెస్టారెంటుకు వెళ్లి, నింపాదిగా భోంచేసి, తన బ్యాగులో ఉన్న ఆటోమెటిక్ పిస్తోల్‌ను తీసి రోడ్డు మీద కిక్కిరిసి ఉన్న పాదాచారులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 35 మంది ప్రాణాలు బలికొన్నాడు. 23 మందిని గాయపరిచాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియన్ ప్రభుత్వం తుపాకుల అమ్మకంపై పలు నియంత్రణలు విధించింది. ప్రజల దగ్గర నుండి 6 లక్షల 50 వేల

తుపాకులను స్వాధీనపరుచుకుంది. అప్పట్నుంచి ప్రైవేట్ కాల్పుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఆత్మహత్యల రేటు కూడా 50 శాతం తగ్గింది.

అమెరికాలో 'నేషనల్ రైఫిల్ అసోసియేషన్' అన్న సంస్థ ఒకటి ఉంది. అది మారణాయుధాల తయారీదారుల ప్రయోజనాలు కాపాడే సంస్థ. అమెరికాలో తుపాకీ సంస్కృతిని పెంచి పోషించడంలో ప్రధాన పాత్ర వహిస్తుంది ఈ అసోసియేషన్. ఇదీ గాక, 'గన్ ఓనర్స్ అసోసియేషన్' (తుపాకుల యజమానుల సంఘం) అన్న మరో సంస్థ కూడా ఉంది. ఈ సంఘంలో క్రియాశీలక సభ్యులే 15 లక్షలు. ఈ రెండు సంస్థలు అమెరికాలో తుపాకుల కొనుగోలుపై ఏ రకమైన నియంత్రణ నైనా వ్యతిరేకిస్తాయి. ఎన్ని ఎక్కువ ఆయుధాలు పౌరుల దగ్గర ఉంటే దేశం అంత సురక్షితంగా ఉంటుందని వాదిస్తాయి. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆర్థికంగా మనం ఊహించలేనంత శక్తివంతమైన సంస్థ. తుపాకులకు సంబంధించి అమెరికా విధానాన్ని తమకనుకూలంగా మలుచుకునేందుకు ఎన్ని లక్షల కోట్ల డాలర్లయినా ఖర్చుపెట్టేందుకు వెనుకాడని సంస్థ.

అమెరికా చట్ట సభ సభ్యులకు ముడుపులు బహిరంగంగానే చెల్లిస్తుంది. అమెరికా సెనేట్ ఆఫీసు వారి ప్రభుత్వ రికార్డుల ప్రకారం అధికారికంగానే నేషనల్ రైఫిల్ అసోసియేషన్ వారు అమెరికా సెనేటర్లకు ఇచ్చిన ముడుపుల విలువ 35 లక్షల డాలర్లు. ఇవి కాక, గన్‌ల అమ్మకంపై నియంత్రణను వ్యతిరేకించే వారిని ఎన్నికలలో గెలిపించుకోవడం కోసం ఎన్నికల సందర్భంగా ఖర్చు పెట్టేది అదనం. దేశ వ్యాప్తంగా ఉన్న చట్ట సభల ఎన్నికల కోసం ఎన్ని కోట్ల లక్షల డాలర్లు ఖర్చు పెడుతుందో అదంతా అనధికారికమే. దానికి లెక్కలుండవు.

ఫ్లోరిడా రాష్ట్రం తుపాకుల అమ్మకంపై కొన్ని ఆంక్షలు విధిస్తే ఈ మధ్య ఓ చట్టం చేసింది. దానిలో తుపాకులు కొనాలంటే కనీస వయస్సు 21 సంవత్సరాలు (ఇంతకు ముందు 18 సంవత్సరాలే) ఉండాలని, మానసిక అస్వస్థత ఉన్నవారి దగ్గర నుండి తుపాకులు, మందుగుండు సామాగ్రి వెంటనే స్వాధీనపరుచుకోవాలని ఇలా మరికొన్ని నిబంధనలు ఉన్నాయి. చట్టం వెలువడిన రెండు గంటలలోనే నేషనల్ రైఫిల్ అసోసియేషన్ కోర్టులో ఆ చట్టాన్ని సవాల్ చేసింది. కోర్టు తీర్పు వెలువడేంత వరకు ఆ చట్టం అమలులోకి రాదు. ఆ తర్వాత తీర్పును బట్టి ఉంటుంది.

అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని పాఠశాల విద్యార్థులు తమ స్కూళ్లలో ఏ క్షణాన తుపాకీ కాల్పుల శబ్దాలు హోరెత్తిస్తాయోనని క్షణం క్షణం భయంతో బిక్కు బిక్కు మంటున్నారు. కాల్పుల ఘటనలు జరిగిన స్కూళ్లల్లో పిల్లలు ఓ విధమైన మానసిక అస్థిరత్వానికి లోబడుతున్నారని హెల్త్ సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఆ స్కూళ్లల్లో విద్యార్థుల తుపాకీ శబ్దాలు విన్నవారో, తుపాకీ గుండు చేసిన గాయానికి విలవిలలాడుతున్న వారినో, గుండు దెబ్బకు ప్రాణాలు విడిచిన వారినో చూసిన అనుభవం కలిగిన వారయి ఉంటారు. అంత భయంకరమైన అనుభవాన్ని అంత చిన్న వయసులోనే కడుపులో దాచుకుని వారు ఏ మానసిక స్థితికి చేరుకుంటారో తలుచుకుంటేనే ఒళ్లు జలదరిస్తుంది.

అయితే ఫ్లోరిడా కాల్పుల తర్వాత ఒక ఆశాకిరణం పొడసూపింది. విద్యార్థి తరం, యువతరం తుపాకీ సంస్కృతికి వ్యతిరేకంగా గళమెత్తింది. విద్యార్థుల రెండు స్ఫూర్తివంతమైన కార్యక్రమాలు చేపట్టారు. (1) దేశ వ్యాప్తంగా స్కూళ్ల బహిష్కరణ. (2) మా ప్రాణ రక్షణ కోసం కవాతు. ఫ్లోరిడా స్కూలు కాల్పులు జరిగిన ఫిబ్రవరి 14 నుండి వరుసగా వీలైన చోట్ల, వీలైన స్కూళ్లలో, వీలైన రోజులలో స్కూళ్లు బహిష్కరించి, పెద్ద ర్యాలీలు తీస్తున్నారు. ఫ్లోరిడా ఘటన జరిగి ఓ నెల పూర్తయిన మార్చ్ 14 నాడు వాషింగ్టన్, న్యూయార్క్ – తదితర నగరాలలో పెద్ద పెట్టున విద్యార్థులు స్కూళ్లు బహిష్కరించి 'చాలు చాలు మీ తుపాకుల క్రీడలు ఇక ఆపండి', 'టీచర్లకు తుపాకులు కాదు, పెన్సిళ్లు ఇవ్వండి', 'నివాళులు, ప్రార్థనలు ప్రాణాలు కాపాడలేవు, తుపాకుల నియంత్రణ కావాలి' అన్న నినాదాలతో ప్లే కార్డులు పట్టుకొని ర్యాలీగా అధ్యక్ష నివాసం శ్వేతసౌధం (వైట్ హౌజ్) ముందుకు తరలి వెళ్లారు. ఏప్రిల్ 20 వరకు ఎవరి వీలును బట్టి వారు ఒక రోజు బహిష్కరణ, ర్యాలీలు జరుగుతాయి. ఏప్రిల్ 20న పెద్ద ఎత్తున దేశ వ్యాప్తంగా బహిరంగ నిరసన ప్రదర్శన కోసం సన్నహాలు చేస్తున్నారు. ఏప్రిల్ 20కి ఉన్న ప్రాముఖ్యత ఏమిటంటే, 1999లో ఆనాడు కొలరాడోలోని కొలంబైన్ హైస్కూలులో కాల్పులు జరిగాయి. పలువురు విద్యార్థులు మరణించారు. వారిని విస్మరించుకోవడం కోసం ఆ రోజును ఎంచుకున్నారు. ఏప్రిల్ 20 వరకు తుపాకుల అమ్మకంపై ఆంక్షలు విధించకపోతే ఏప్రిల్ 20 తర్వాత నిరవధికంగా స్కూళ్ల బహిష్కరణ కొనసాగిస్తామని కూడా వారు ప్రకటించారు. మార్చ్ 24 నాడు మా ప్రాణ రక్షణ కోసం కవాతు కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. తుపాకుల నుండి రక్షణకై ప్రతిపల్లె అన్న స్వచ్ఛంద సంస్థ ఈ కార్యక్రమం చేపట్టింది. స్కూలు యాజమాన్యలు ఒక్కొక్కటి తుపాకుల వాడకంపై నియంత్రణ విధించండి, మా పిల్లల ప్రాణాలు కాపాడండి అన్న నినాదంతో ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చిన్న కొడుకు చదువుకుంటున్న 'బూరన్ స్కూలు' యాజమాన్యం కూడా అధ్యక్షుడు ట్రంప్‌కు ఈ విధమైన లేఖ రాసింది.

విద్యార్థులు, యువజనులు చేపట్టిన ఈ కార్యక్రమాలకు మీడియా కూడా మద్దతునిస్తున్నది. విస్తృతమైన ప్రచారం లభించేలా చూస్తున్నది. తల్లిదండ్రుల నుండి, టీచర్ల నుండి ప్రోత్సాహంతో విద్యార్థులు ముందుకు కదులుతున్నారు. కాని, కొన్ని స్కూళ్ల యాజమాన్యాలు బహిష్కరణకు, ర్యాలీలకు అభ్యంతరం తెలుపుతున్నాయి. ఈ కార్యక్రమాలు తుపాకీ సంస్కృతికి వ్యతిరేకంగా జరుగుతున్నాయి కాబట్టి, వీటిని ఇష్టపడని వాళ్లు ఆ ర్యాలీలపై కాల్పులు జరుపవచ్చునని భయంతో కొన్ని యాజమాన్యాలు అభ్యంతరం చెపితే, రిపబ్లికన్ పార్టీపై అభిమానంతో తుపాకీ కలిగి ఉండడం తమ హక్కని భావించే వాళ్లతో కూడిన యాజమాన్యాలు అభ్యంతరం చెప్పిన వాళ్లలో ఉన్నారు. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ వారు విద్యార్థుల వైపు స్థిరంగా నిలబడి తమవంతు కృషి చేస్తున్నారు.

తుపాకీ సంస్కృతికి వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఈ పోరాటం సఫలీకృతమైతే, తమ ఆయుధాల విక్రయం కోసం ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలు కొనసాగాలని కోరుకుంటున్న అమెరికా ఆయుధ వ్యాపారుల మీద అమెరికా ప్రజలు విజయం సాధించినట్టే!

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

రవాణా శాఖ సిబ్బందిపై ఇసుక మాఫియా దౌర్జన్యం

గుంటూరు జిల్లాలోని సత్తెనపల్లిలో విధి నిర్వహణలో భాగంగా తనిఖీలకు వెళ్లిన రవాణాశాఖ అధికారులపై ఇసుక మాఫియా మార్చ్ 2న దాడికి పాల్పడింది. ఎంవిఐ కిరణ్ ప్రభాకర్ తన సిబ్బందితో కలిసి సత్తెనపల్లి రోడ్డులో వాహనాల తనిఖీలు చేస్తుండగా అదే సమయంలో అటుగా వచ్చిన ఇసుకలోడు లారీని తనిఖీ నిమిత్తం నిలిపారు. ఓవర్‌లోడుతో ఉండడాన్ని గుర్తించిన అధికారులు లారీని వేబ్రిడ్జి వద్దకు తీసుకెళుతుండగా అక్రమంగా ఇసుక వ్యాపారం చేస్తున్న వ్యక్తులు లారీని నిలిపివేశారు. రవాణాశాఖ కానిస్టేబుల్‌పై దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఎంవిఐ కిరణ్ ప్రభాకర్ లారీ డ్రైవర్ సీటులోకి ఎక్కి వాహనాన్ని వేబ్రిడ్జిలోకి తీసుకెళుతుండగా కొందరు వ్యక్తులు లారీ టైర్లకు అడ్డుగా పడుకున్నారు. మరికొందరు లారీ అద్దాలను ధ్వంసం చేశారు. దీంతో డ్రైవింగ్ సీటులో ఉన్న ఎంవిఐ కిరణ్ ప్రభాకర్ గాయపడ్డారు.

మన్యం బంద్

బోయ, వాల్మీకులను ఎస్.టి. జాబితాలో చేర్చొద్దని, విభజన చట్టం హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన జెఏసి ఆధ్వర్యాన మార్చ్ 4న చేపట్టిన 'మన్యం బంద్' విజయవంతమైంది. బంద్ సందర్భంగా ఆయా మండల కేంద్రాల్లో ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించారు. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను మూసివేసి బంద్‌కు సహకరించారు. విశాఖ ఏజెన్సీలోని 11 మండలాల్లోనూ బంద్ సంపూర్ణంగా జరిగింది.

చలో గుంటూరు

గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడు ఘటనకు బాధ్యులైన వారిపై పదిరోజుల్లో ఎస్.సి, ఎస్.టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చ్ 4న గుంటూరులో జరిగిన 'చలో గుంటూరు' సభకు పెదగొట్టిపాడులో జనవరి 1న దళితులపై పెత్తందారులు జరిపిన దాడికి నిరసనగా స్థానిక ఉల్ఫ్‌హాల్ మైదానంలో ఆత్మగౌరవ సభ జరిగింది. ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సభకు దళిత సంఘీభావ కమిటీ అధ్యక్షులు జి. శాంతకుమార్ అధ్యక్షత వహించారు. వివిధ కమ్యూనిస్టు పార్టీలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు 57 ప్రజా సంఘాల నాయకులు ఈ సభలో పాల్గొన్నారు. దళితులు సామాజికంగా, ఆర్థికంగా ఎదగడంతో ఓర్వలేక పెత్తందారులు దాడులకు తెగబడుతున్నారని అన్నారు.

ఎస్.సి.ల వర్గీకరణ ఉద్యమం పై సదస్సు

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి చేపట్టిన ఎస్.సి. వర్గీకరణ ఉద్యమాన్ని బలపరుస్తూ విప్లవ రచయితల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మార్చ్ 4న సదస్సు జరిగింది. ఈ సదస్సులో ప్రొ. నాగేశ్వర్‌రావు, మందకృష్ణ మాదిగ, ఉదయబాను, రత్నమాల, వరవర రావు, ప్రసంగించారు. ఎస్.సి. వర్గీకరణ ఉద్యమం రాజ్యాంగం ఫలాలను అట్టడుగు కులాలకు చేరవేసే ఉద్యమం అని వక్తలు అన్నారు. లోకూరు కమిషన్ ఎస్.సి. రిజర్వేషన్ వర్గీకరణ కావాలనే నివేదిక ఇచ్చిందన్నారు. సదస్సుకు కాశీం, గీతాంజలి అధ్యక్షత వహించారు.

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్

ఆంధ్రప్రదేశ్ 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పూర్తిస్థాయి బడ్జెట్‌ను మార్చ్ 8న ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు శాసనసభలో ప్రవేశపెట్టారు. మొత్తం బడ్జెట్ అంచనా రు. 1,91,063.61 కోట్లు; మొత్తం రెవెన్యూ వసూల్లు రు. 1,55,507 కోట్లు; రెవెన్యూ వ్యయం రు. 1,50,271.99 కోట్లు; రెవెన్యూ మిగులు రు. 5,235.23 కోట్లు; మూలదన వ్యయం రు. 28,678.49 కోట్లు; ద్రవ్యలోటు అంచనా రు. 24,205 కోట్లు; పోలవరానికి రు. 9,000 వేల కోట్లు; కాపులకు రు. 1,000 కోట్లు కేటాయింపులు చేశారు.

మిలియన్ మార్చ్ స్ఫూర్తి ర్యాలీపై నిర్బంధం

తెలంగాణ జెఏసి ఆధ్వర్యంలో మార్చ్ 10న చేపట్టిన 'మిలియన్ మార్చ్ స్ఫూర్తి' ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. టిజెఏసి ఛైర్మన్ కోదండరాంను ఇతర నాయకులను, సిపిఐ, న్యూడెమోక్రసీ, అరుణోదయ, పిఓడబ్ల్యు, తదితర ప్రజా సంఘాలకు చెందిన వందలాది మంది నాయకులను, కార్యకర్తలను ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి స్ఫూర్తి సభకు వస్తున్న వారిని హైదరాబాద్ శివార్లలోనే అడ్డుకున్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరంకుశ పాలన సాగుతోందని, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని కోదండరాం ఆరోపించారు. అప్రజాస్వామికంగా నిర్బంధిస్తూ, అరెస్టులు చేస్తున్నారన్నారు.

పెట్టుబడి కాదు గిట్టుబాటు ధర కావాలి

సాగుకు పెట్టుబడి కాదు... రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో మార్చ్ 14న జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలోని కలెక్టర్ కార్యలయం ముందు బైఠాయించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా చేస్తున్న ఈ పోరాటం వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేవరకు ఆగదన్నారు. పెట్టుబడి అనేది గిట్టుబాటు ధరకు ప్రత్యామ్నాయం కానేకాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగొచ్చి పసుపు, మిర్చి, వరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

జనసేన పార్టీ నాలుగో వార్షికోత్సవ సభ

జనసేన పార్టీ నాలుగో వార్షికోత్సవాన్ని గుంటూరులోని మంగళగిరిలో మార్చ్ 14న నిర్వహించారు. ఈ సభలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి లోకేష్‌పైలను తీవ్రంగా విమర్శించారు. గతంలో తెలుగుదేశానికి మద్దతు ఇచ్చింది ఆంధ్రప్రదేశ్ పునర్ నిర్మాణానికే తప్ప ఆ పార్టీ పునర్ నిర్మాణానికి కాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అవినీతిమయం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఐదేళ్లు, పదేళ్లు, పదిహేనేళ్లు ఇస్తామని పార్లమెంట్‌లో అన్న బిజెపి ఇప్పుడు ఎందుకు వెనకబడింది. రాయలసీమ నుంచి ముఖ్యమంత్రులైనారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజలే ఎందుకు బతుకుతెరువు కోసం వలస వెళుతున్నారని ప్రశ్నించారు.

తెలంగాణ బడ్జెట్

తెలంగాణ 2018-19 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి ఈటెల రాజేందర్ మార్చ్ 15న అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈసారి బడ్జెట్ అంచనా రు. 1,74, 453.83 కోట్లు. వ్యవసాయరంగానికి రు. 12,734 కోట్లు, దళితులకు రు. 12,708 కోట్లు, దళితుల సబ్‌ప్లాన్‌కు రు. 16,452 కోట్లు, గిరిజనులకు రు. 8603 కోట్లు, కేటాయింపులు చేసింది. బడ్జెట్ ఆదాయ వ్యయాల మధ్య రు. 71,660 కోట్ల వ్యత్యాసం ఉంది.

శ్రీచైతన్య, నారాయణ అనుమతులు రద్దుచేయాలి

తెలంగాణలోని శ్రీచైతన్య, నారాయణ విద్యా సంస్థల అనుమతులు రద్దుచేసి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యార్థి వేదిక మార్చ్ 27న హైదరాబాద్‌లోని ఇంటర్‌మీడియెట్ బోర్డును ముట్టడించింది. ఈ సందర్భంగా పోలీసులకు విద్యార్థులకు వాగ్వాదం జరిగింది. విద్యార్థులను బలవంతంగా అరెస్ట్ చేశారు. ప్రైవేట్ సంస్థలు పెడుతున్న ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థిని, విద్యార్థులు ఆత్మహత్యలకు గురవుతున్నారని, దీనికి కారణమైన సంస్థలపై హత్యానేరం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పేదోళ్లకైనా, ఉన్నోళ్లకైనా ఒకే బడి - ఒకే చదువు ఉండాలని కోరారు. విద్యార్థులు శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల్లో చేరవద్దని, కె.జి. టు పి.జి ఉచిత విద్యకై పోరాడాలన్నారు. వీ

రెండు ఎన్‌కౌంటర్లు-14 మంది నక్సల్స్ మృతి

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులోని తడపాల అటవీ ప్రాంతంలో మార్చ్ 2న పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన కాల్పుల్లో 10 మంది మావోయిస్టులతో పాటు ఒక పోలీసు మృతిచెందారు. మృతుల్లో ఏడుగురు మహిళలు ఉన్నారు. ముగ్గురు పురుషులు ఉన్నట్లు భద్రాద్రి కొత్తగూడెం ఎస్‌పి అంబర్‌కిశోర్ ఝా వెల్లడించారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దులోని కోరాపుట్ జిల్లా నారాయణపట్నం అటవీ ప్రాంతంలో మార్చ్ 25న రాత్రి మావోయిస్టులకు, ఒడిశా డిస్ట్రిక్ట్ వలంటరీ ఫోర్స్‌కు చెందిన బలగాలకు మధ్య జరిగిన కాల్పుల్లో నలుగురు మహిళా మావోయిస్టులు మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఆర్.పి. కోచే తెలిపారు.

మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్ ముఖ్యమంత్రులు

మేఘాలయ ముఖ్యమంత్రిగా నేషనల్ పీపుల్స్ పార్టీ అధినేత కాన్రాడ్ సంగ్మా (40) మార్చ్ 6న బాధ్యతలు చేపట్టారు. కాన్రాడ్ సంగ్మాతో గవర్నర్ గంగాప్రసాద్ రాజ్‌భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయించారు. 60 స్థానాలున్న శాసనసభలో 21 మంది ఎంఎల్‌ఏలతో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా ఉన్నా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయలేకపోయింది. త్రిపురలో బిజెపి అత్యధిక స్థానాలు నెగ్గి అధికారాన్ని కైవసం చేసుకొంది. త్రిపుర పదో ముఖ్యమంత్రిగా విప్లవ్ కుమార్‌చే గవర్నర్ తథాగతరాయ్ మార్చ్ 9న అసోం రైఫిల్స్ మైదానంలో ప్రమాణ స్వీకారం చేయించారు. నాగాలాండ్ ముఖ్యమంత్రిగా 'నేషనల్ డెమోక్రటిక్-ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డిపిపి) సీనియర్ నాయకుడు నెయిఫియు రియోతో గవర్నర్ పి.బి.ఆచార్య మార్చ్ 8న ప్రమాణ స్వీకారం చేయించారు.

ఛత్తీస్‌గఢ్‌లో 9 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్ల మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మార్చ్ 13న మావోయిస్టుల గాలింపుకోసం వెళ్లిన సిఆర్‌పిఎఫ్ జవాన్ల మైన్‌ప్రూఫ్ వాహనాన్ని మావోయిస్టులు మందుపాతర పెట్టి పేల్చారు. ఈ ఘటనలో 9 మంది జవాన్లు మృతిచెందగా గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి ఎలిక్యాప్టర్‌లో తరలించారు. మావోయిస్టుల వేటలో భాగంగా 212వ పటాలం జవాన్లు కిష్టారం నుంచి పలోడికి వెళుతున్నారు. నిర్మాణంలో ఉన్న అదే రోడ్డుపై అమర్చిన మందుపాతరను మావోయిస్టులు పేల్చడంతో వాహనం 10 అడుగుల మేర ఎగిరి పడి ముక్కలై అందులో ఉన్న జవాన్లు మరణించారు.

మహారాష్ట్రలో రైతుల లాంగ్‌మార్చ్

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతు రుణాలను రద్దు చేయాలని, ఆదివాసుల భూములకు పట్టాలివ్వాలని డిమాండు చేస్తూ కిసాన్ సభ మార్చ్ 6న 15 వేలమందితో చేసిన 'లాంగ్‌మార్చ్' నాసిక్ నుంచి బయలుదేరి మార్చ్ 11న ముంబై చేరింది. మార్చ్ 12న శాసనసభ ముట్టడి లక్ష్యంగా మొక్కవోని దీక్షతో సాగిన యాత్రలో దారిపొడవునా వివిధ ప్రాంతాల నుంచి రైతులు చేరడంతో అంతిమంగా 50 వేలకు చేరి ముంబై నగరంలో కవాతుచేసి తమ సమస్యలు అసెంబ్లీ దృష్టికి మొత్తం సమాజం ముందుకు తెచ్చారు.

'గోరక్షకులు' హత్య కేసులో దోషులే

ఝార్ఖండ్‌లో గత ఏడాది గోమాంసం తరలిస్తున్నాడనే నెపంతో అస్గర్ అన్సారీని హత్య చేసిన కేసులో బిజెపి నాయకుడితో సహా 12 మందిని దోషులుగా నిర్ధారిస్తూ ఝార్ఖండ్ ట్రయల్ కోర్టు మార్చ్ 16న తీర్పును వెల్లడించింది. గతేడాది జూన్‌లో బజర్తాండ్ గ్రామానికి చెందిన అన్సారీపై గో రక్షకులు దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన అన్సారీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అన్సారీని ఉద్దేశపూర్వకంగానే కుట్రపన్ని హత్య చేశారని పోలీసులు వెల్లడించారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్ మృతులు

జమ్మూ కశ్మీర్‌లోని కుప్వారా జిల్లా హల్మత్‌పోరా అటవీ ప్రాంతంలో మిలిటెంట్లు ఉన్నారనే సమాచారంతో మార్చ్ 20న ఆర్మీ, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రతా బలగాలు, మిలిటెంట్ల మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో నలుగురు మిలిటెంట్లు మృతి చెందినట్లు కల్నల్ రాజేశ్ కాలియా తెలిపారు. కుప్వారా జిల్లా హల్మత్‌పోరా అటవీ ప్రాంతంలో మార్చ్ 21న భద్రతా బలగాలకు, మిలిటెంట్లకు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో ఐదుగురు భద్రతా సిబ్బంది మృతిచెందారు. మరికొంత మంది భద్రతా సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు మిలిటెంట్లు మృతి చెందినట్లు డిజిపి ఎస్.పి. వాయిద్ వెల్లడించారు.

లోక్‌పాల్ కోసం అన్నా హజారే నిరాహార దీక్ష

కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్తలను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త అన్నా హజారే మార్చ్ 23న నుంచి నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో హజారే ఈ దీక్షను చేపట్టారు. సమర్థ లోక్‌పాల్‌ను నియమించాలని, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఇదే మైదానంలో హజారే చేసిన ఉద్యమానికి స్పందించి కాంగ్రెస్ లోక్‌పాల్ చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే ఆయన జన్‌లోక్ పాల్ కోసం ఆయన పట్టుపట్టారు. బిజెపి తన మానిఫెస్టోలో సమర్థ లోక్‌పాల్ కోసం హామీ ఇచ్చినప్పటికీ నెరవేర్చలేదు.

ఇద్దరు జర్నలిస్టులను హత్యచేసిన ఇసుక మాఫియా

మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఇద్దరు జర్నలిస్టులు దారుణ హత్యకు గురయ్యారు. మధ్యప్రదేశ్‌లోని భిండ్ జిల్లాలో ఇసుక మాఫియాకు, పోలీసులకు ఉన్న సంబంధాలను బయటపెట్టిన టివి జర్నలిస్ట్ సందీప్ శర్మను మార్చ్ 26న లారీతో ఢీకొట్టి చంపించారు. ఇసుక మాఫియాతో తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని శర్మ మధ్యప్రదేశ్ మానవ హక్కుల కమిషన్‌కి, డిజిపికి, భిండ్ జిల్లా ఎస్.పి.కి లేఖ రాసిన ప్రయోజనం లేకపోయింది. బీహార్‌లోని భోజ్‌పూర్ జిల్లాలో దినపత్రికలో పనిచేస్తున్న మరో జర్నలిస్ట్ నవీన్ నిశ్చల్ మార్చ్ 25న రాత్రి బైక్‌పై వెళుతుండగా వెనకనుంచి ఓ ఎస్‌యువి వాహనం ఢీకొంది. దీంతో నవీన్‌తో పాటు ఆయన స్నేహితుడు అక్కడికక్కడే చనిపోయారు.

700 మంది జవాన్ల ఆత్మహత్య

గత ఆరేండ్ల కాలంలో దాదాపు 700 మంది జవాన్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. యుద్ధాల్లో మరణించిన వారికంటే ఆత్మహత్యలు చేసుకున్నవారే అధికంగా ఉన్నారని బిజెపి నేత మురళీ మనోహర్ జోషి నేతృత్వంలోని పార్లమెంటరీ ప్యానల్ తెలిపింది. స్వచ్ఛందంగా రాజీనామా చేసే సిబ్బంది సంఖ్య ప్రతి ఏటా 9000 మంది వరకు ఉన్నారని పేర్కొంది. దీనికి మానసిక, అస్థిరత, ఒంటరితనం, అంతర్గతంగా ఏర్పడే ఘర్షణలు, కలహాలే ప్రధాన కారణమని వివరించింది.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల కమిషన్ మార్చ్ 27న ప్రకటించింది. కర్ణాటకలోని 224 స్థానాలకు మే 12న పోలింగ్ జరగనుంది. మే 15న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపింది. 4.96 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓంప్రకాష్ రావత్ వెల్లడించారు. మొత్తం ఓటర్లలో 2.51 కోట్ల పురుష ఓటర్లు, 2.44 కోట్ల స్త్రీలు ఉన్నారని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే 60 లక్షల మంది కొత్త ఓటర్లు నమోదయ్యారని తెలిపారు. వీ

అమెరికా వాణిజ్య ఆంక్షలు

అమెరికా ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీగా సుంకం విధిస్తున్నట్లు మార్చ్ 2న నిర్ణయం తీసుకుంది. స్టీల్‌పై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం దిగుమతి సుంకం విధించింది. దిగుమతి సుంకం పెంచడం వల్ల అమెరికాలోని పరిశ్రమలకు లాభం కలుగుతుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ నిర్ణయం పట్ల ప్రపంచ దేశాలు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశాయి. సుంకం భారీగా పెంచడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకే కాకుండా అమెరికా ఆర్థిక వ్యవస్థకు కూడా ముప్పు వాటిల్లుతుందని ఐఎంఎఫ్ హెచ్చరించింది. ఈ నిర్ణయం వల్ల చైనా, యూరప్, కెనడా లాంటి దేశాలు తీవ్ర నష్టపోతాయి.

రోహింగ్యాల ఆకలి కేకలు

మయన్మార్ ప్రభుత్వం రోహింగ్యా ముస్లింలపై మరింత కక్ష కట్టింది. గత ఏడాది వారిపై తీవ్రమైన దాడులు జరిపి దారుణ మారణకాండ సృష్టించి వేలాది మంది ప్రాణాలను బలితీసుకుంది. ప్రాణాలు దక్కించుకోవడానికి రోహింగ్యాలు మయన్మార్ నుంచి పారిపోయారు. దాదాపు ఐదు లక్షల మంది రోహింగ్యాలు పొరుగు దేశాలకు వలసపోయారు. అక్కడ కూడా దుర్భరమైన పరిస్థితులు బతుకులు వెళ్లదీస్తున్నారు. తమ సొంత దేశమైన మయన్మార్‌లో ప్రభుత్వం తీవ్ర నిర్బంధాలకు గురిచేస్తోంది. రఖైనా రాష్ట్రంలో సైన్యం రోహింగ్యాలపై దారుణమైన ఆకృత్యాలకు, దాడులకు పాల్పడుతుంది. కృత్రిమ కరువు సృష్టించి బలవంతంగా వెళ్లగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తోందనీ ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సమితి తెలిపింది.

ఆంగ్‌సాన్ సూచీకి ఇచ్చిన అవార్డు వెనక్కి...

పెరూలో మయన్మార్ నేత ఆంగ్‌సాన్ సూచీకి ఇచ్చిన మానవ హక్కుల అవార్డును వెనక్కి తీసుకుంటున్నట్లు అమెరికా హోలక్షకాస్ట్ స్మారక మ్యూజియమ్ ప్రకటించింది. రోహింగ్యా ముస్లింలపై సైనిక చర్యను, వారిని దేశం నుంచి ఖాళీ చేయించేందుకు చేపడుతున్న చర్యల ప్రక్రియను నిలువరించేందుకు ఆమె ఏమీ చేయలేదని పేర్కొంది. 1991లో నోబెల్ శాంతి బహుమతి పొందిన సూచీకి ఆరేళ్ల క్రితం హోలోకాస్ట్ ఎలై వీసెల్ అవార్డును అందజేసింది.

శ్రీలంకలో హింస

శ్రీలంకలో మతఘర్షణలు చెలరేగడంతో అత్యవసర పరిస్థితి ప్రకటించారు. మార్చ్ 5 నుంచి కాండీలో మెజారిటీ బౌద్ధులకు, మైనారిటీ ముస్లింల మధ్య తీవ్ర ఘర్షణలు జరిగాయి. ఈ ఘర్షణల్లో ఇద్దరు మరణించారు. మైనారిటీ ముస్లింల ఇళ్లపై, వ్యాపార సంస్థలు, మసీదులపై దాడులు జరిగాయి. మతోన్మాద హింస చెలరేగకుండా ముందు జాగ్రత్తగా ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని విధించింది. రాజధాని కొలంబోలో అక్కడక్కడా ఘర్షణలు జరగడంతో సైన్యం జోక్యం చేసుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చింది.

స్పెయిన్‌లో మహిళల నిరసన

స్పెయిన్‌లో మహిళలు తమ పట్ల లింగ వివక్ష రూపుమాపాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోరుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చ్ 8న భారీ ర్యాలీ నిర్వహించారు. మాడ్రిడ్, బార్సిలోనా, వాల్సెనియాతో పాటు 200 నగరాలలో ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఐదుగురు మహిళా మంత్రులతో పాటు ప్రముఖులు మద్దతు తెలిపారు. ఒక నివేదిక ప్రకారం స్పెయిన్‌లో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు పురుషులతో పోల్చితే 19 శాతం తక్కువ వేతనాలు అందుతుందనీ, పని ప్రదేశాల్లో మహిళలపై నిత్యం లైంగిక దాడులు జరుగుతున్నాయనీ తెలిపింది. ఈ వివక్షను రూపుమాపాలని, లైంగిక దాడుల పట్ల తీవ్రమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది మహిళలు నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చైనా అధ్యక్ష పదవి కాలపరిమితి తొలగింపు

చైనా అధ్యక్షుడి కాలపరిమితిని తొలగిస్తూ రాజ్యాంగ సవరణలకు చైనా పార్లమెంట్ మార్చ్ 11న ఆమోదం తెలిపింది. దీంతో ప్రస్తుత అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ అధ్యక్ష పదవిలో మూడోసారి కూడా కొనసాగేందుకు మార్గం సుగమమైంది. బీజింగ్ గ్రేట్ హాల్ ఆఫ్ అసెంబ్లీలో హాజరైన మొత్తం 2963 ప్రతినిధుల్లో ఈ సవరణకు వ్యతిరేకంగా రెండు ఓట్లు వచ్చాయి. 2012లో చైనా మాజీ అధ్యక్షుడు హు జింటావో నుంచి అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన జిన్‌పింగ్ చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవితోపాటు చైనా సెంట్రల్ మిలిటరీ కమిషన్ చీఫ్ కూడా వ్యవహరిస్తున్నారు.

నేపాల్‌లో విమాన ప్రమాదం

నేపాల్ రాజధాని ఖాట్మండులో మార్చ్ 12న విమాన ప్రమాదం జరిగింది. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నుంచి అమెరికాకు బయల్దేరిన బంగ్లాదేశ్‌కు చెందిన బిఎస్ –211 విమానం ఖాట్మండ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో పన్నెండు మంది విమాన సిబ్బందితో సహా యాభై మంది మరణించారు. మరో పన్నెండు మంది తీవ్రంగా గాయపడ్డారు. పైలట్, విమానాశ్రయ సిబ్బంది మధ్య సాంకేతిక సమన్వయం లోపం కారణంగా ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు.

స్టీఫెన్ హాకింగ్ మృతి

ప్రముఖ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ (76) మార్చ్ 14న కేంబ్రిడ్జ్‌లోని తన నివాసంలో మృతి చెందారు. ఇంగ్లండ్‌లోని ఆక్స్‌ఫర్డ్ నగరంలో 1942, జనవరి 8న జన్మించారు. 21 సంవత్సరాలకే నరాల సంబంధిత వ్యాధితో శరీరం కదలలేని స్థితిలో 1963 నుంచి ఆయన చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. కదలలేని స్థితిలో ఉండి కూడా ఆయన భౌతిక శాస్త్రంపై ఎన్నో పరిశోధనలు చేశారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేసిన స్టీఫెన్ హాకింగ్ కృష్ణబిలాలు, బిగ్‌బాంగ్ థియరీపై అద్భుతమైన పరిశోధనలు చేశారు. సాపేక్ష సిద్ధాంతం, గురుత్వాకర్షణ ఏకతత్వ సిద్ధాంతాలపై అధ్యయనం చేశారు. భౌతికశాస్త్రంపై పెద్దగా అవగాహన లేని వారికి కూడా ప్రాథమిక సిద్ధాంతాలు సులువుగా అర్థమయ్యేలా హాకింగ్ వివరించారు. ఖగోళ శాస్త్రంలో ఆయన చేపట్టిన పలు పరిశోధనలు విప్లవం సృష్టించాయి. ఆయన రచించిన ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ బెస్ట్ సెల్లరగా నిలిచింది.

రష్యా అధ్యక్షుడిగా పుతిన్ మరోసారి

రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ మరోసారి ఎన్నికయ్యారు. మార్చ్ 18న జరిగిన ఎన్నికలలో మొత్తం 10.70 కోట్ల మంది ఓటు వేయగా, ఆయనకు 5.6 కోట్ల మంది (76 శాతం) మద్దతు పలికడంతో నాలుగోసారి రష్యా అధ్యక్షుడుగా పుతిన్ ఎన్నికయ్యారు. ఆయన గత 18 సంవత్సరాలుగా రష్యా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపడుతున్నారు. స్టాలిన్ తర్వాత దేశ రాజకీయాలను అత్యంత ప్రభావితం చేసిన నాయకుడిగా పుతిన్ గుర్తింపు పొందారు.

సిరియాలో ఆగని దాడులు

సిరియాలో భద్రతా బలగాలకు, తిరుగుబాటుదారులకు మధ్య ఘర్షణ కొనసాగుతూనే ఉంది. బాంబు పేలుళ్లు, వైమానిక దాడుల్లో సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు. మార్చ్ 16 ఉత్తర సిరియాలో కుర్దు వర్గానికి చెందిన ప్రజలు అధికంగా ఉండే ఆఫ్రిన్ నగరంపై టర్కీ సైన్యం దాడి చేయడంతో 18 మంది మరణించారు. మార్చ్ 20న గౌటా నగరంలోని ఓ పాఠశాలపై సిరియా ప్రత్యేక దళాలు జరిపిన వైమానిక దాడిలో 15 మంది విద్యార్థులు మృతి చెందారు. సిరియాలో తక్షణమే కాల్పుల విరమణ అమలు చేయాలని ఐక్యరాజ్య సమితి డిమాండ్ చేసింది. ఇరు వర్గాల మధ్య జరుగుతున్న దాడిలో మహిళలు, పిల్లలు, వృద్ధులు అధిక సంఖ్యలో మరణిస్తున్నారు. వీ

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(ఫిబ్రవరి 1 నుండి ఫిబ్రవరి 28, 2018 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (777), ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలో (633) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1410)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	3	-	27	29	3	4	6	3	2	3	3	1	2	27	29	-	-	-	2	-
హైదరాబాద్	-	-	-	17	12	2	6	-	-	2	1	4	3	2	18	12	-	-	-	-	-
కరీంనగర్	-	4	1	4	5	5	3	-	-	2	2	2	3	2	18	11	-	-	-	-	-
ఖమ్మం	-	4	-	10	17	1	4	2	-	2	-	5	5	2	18	10	-	-	-	-	-
మహబూబ్‌నగర్	-	-	-	2	4	3	6	4	5	3	5	4	2	4	38	2	-	-	-	-	-
మెదక్	1	9	2	2	4	9	2	4	1	4	4	9	5	9	20	24	-	-	-	5	-
నల్గొండ	-	4	-	1	4	2	2	-	-	1	-	1	1	-	19	8	-	-	-	-	-
నిజామాబాద్	-	1	-	2	4	-	1	-	-	1	1	1	-	2	9	6	-	-	-	-	-
వరంగల్	1	15	-	5	4	9	4	3	1	3	2	2	3	10	20	21	-	-	-	4	1
వికారాబాద్	-	2	-	3	2	1	1	-	-	-	-	1	1	5	14	6	-	-	-	-	-
తెలంగాణ	**3**	**42**	**3**	**73**	**85**	**35**	**33**	**19**	**10**	**20**	**18**	**32**	**24**	**38**	**201**	**129**	**-**	**-**	**-**	**11**	**1**
అనంతపురం	-	3	1	10	17	2	-	-	3	7	-	4	7	4	35	-	-	-	-	-	-
చిత్తూరు	-	-	-	2	4	2	2	-	-	3	4	4	8	1	17	-	-	-	-	-	3
కడప	-	1	-	5	5	-	-	-	-	2	-	-	-	3	10	5	-	-	-	-	-
గుంటూరు	-	1	-	1	2	1	4	-	-	-	2	2	2	1	9	7	-	-	-	-	-
కృష్ణా	-	-	-	4	3	1	2	-	-	-	2	1	1	2	11	7	-	-	-	-	-
కర్నూలు	-	2	-	5	4	2	-	-	-	1	5	3	-	-	18	9	-	-	-	-	-
తూర్పు గోదావరి	-	2	4	-	3	3	2	4	-	5	4	-	-	2	20	15	1	-	-	3	-
ప్రకాశం	-	2	-	7	6	-	2	-	1	3	1	-	2	3	14	8	-	-	-	-	-
శ్రీకాకుళం	-	-	-	3	7	2	2	1	2	2	-	-	4	-	13	11	-	-	-	-	-
పశ్చిమ గోదావరి	-	-	-	2	1	1	2	1	-	1	2	-	2	1	18	11	-	-	-	-	-
నెల్లూరు	-	-	-	4	6	1	3	-	-	4	1	3	-	1	12	10	-	-	-	-	-
విజయనగరం	-	1	-	2	6	3	2	1	-	-	1	2	-	1	8	5	-	-	-	-	-
విశాఖపట్నం	-	-	-	2	4	-	3	-	1	2	2	2	6	1	11	13	-	-	-	14	-
ఆంధ్రప్రదేశ్	**-**	**12**	**5**	**47**	**68**	**18**	**24**	**7**	**7**	**30**	**24**	**21**	**32**	**20**	**196**	**101**	**1**	**-**	**-**	**17**	**3**

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం


మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్‌లో వీక్షణం విడిప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ	హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్	9705055738
వెంకటేశ్వర బుక్ స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్	040-66131071
పస్ట్ లక్కీ పాన్ షాప్	విద్యానగర్ సిగ్నల్స్	9848672831
సుధాకర్ బుక్ స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక	9949337605
వెంకటేశ్వర బుక్ స్టాల్	రామ్‌నగర్ గుండు	9502964995
భవాని బుక్ స్టాల్	శివం రోడ్	9849836996
శ్రీభవాని బుక్ స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర)	9640712555
ఓరియన్ బుక్ స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర)	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా)	8977995537
రెడ్డి బుక్‌స్టాల్	అశోక్‌నగర్, హైదరాబాద్	
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమాండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహిదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలెబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీలక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
లక్ష్మణ్	చిక్కడపల్లి, హైదరాబాద్	93910 12051
మల్లిఖార్జున్ బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
బాల్‌రెడ్డి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	98660 18829
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
సాయిగణేష్ బుక్‌స్టాల్	టు టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, కరీంనగర్	93979 94268
మహాలక్ష్మి బుక్‌స్టాల్	సిటీ బస్‌స్టాండ్, హన్మకొండ చౌరస్తా, వరంగల్	99893 30297
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్ స్టాల్, కూల్ డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
శరత్ బుక్ స్టాల్	షాప్ నం. 3, ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుజూరాబాద్	98662 73720
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్ స్టాల్	శివాలయం వీధి, ప్రొద్దటూరు	81210 02112
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీధి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్ సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091
శ్రీసత్యసాయి బుక్‌స్టాల్	ఆర్‌టిసి కాంప్లెక్స్, రాజమండ్రి	73860 66226, 94419 07321

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 201 - April 2018 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/3/2018 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2017-19

వీక్షణం మీ నుంచి ప్రత్యేక వ్యాసాలు ఆహ్వానిస్తోంది


Date of Posting : 29th, 30th



ఈ మే 5కు కార్ల్ మార్క్స్ పుట్టి రెండు వందల సంవత్సరాలు అవుతుంది. తన విశ్లేషణ ద్వారా, ఆచరణ ద్వారా, జీవితం ద్వారా ప్రపంచానికి కొత్త వెలుగు అందించిన మార్క్స్ జీవితాన్నీ ఆచరణనూ ఈ రెండు వందల సంవత్సరాలలో వేలాది మంది విశ్లేషించారు. ఎంగెల్స్‌తో కలిసి మార్క్స్ రచించిన సమగ్ర రచనలు యాభై వేల పేజీలు వెలువడగా ఆయన రాజకీయార్థిక సిద్ధాంతాల గురించీ, తాత్విక, సామాజిక, సాంస్కృతిక ఆలోచనల గురించీ వివరణలూ విశ్లేషణలూ అన్వయాలూ కొనసాగింపులూ విమర్శలూ దూషణలూ లక్షల పేజీల సాహిత్యం వెలువడింది. ఆయన దృక్పథాన్ని అనుసరిస్తూ అనేక దేశాల్లో సిద్ధాంత అన్వయాలూ ఆచరణలూ జరిగాయి, జరుగుతున్నాయి. అయినా ఇంకా ఆయన గురించి తెలుసుకోవలసిందీ, ఆయన భావాల లోతు తవ్వితీయవలసిందీ, సమకాలీన సమాజానికి అన్వయించవలసిందీ ఇంకా ఎంతో ఉంది. మార్క్స్ ద్విశత జయంతి సందర్భాన్ని అందుకు వినియోగిస్తూ వీక్షణం మార్క్స్ జీవితం మీద, రచనల మీద, ప్రభావం మీద కొన్ని వ్యాసాలు ప్రచురించదలచుకుంది. ఇప్పటికే మేం ఎంపిక చేసి వ్యాసాలు రాయమని కోరిన రచయితలతో పాటు ఇతర రచయితలకూ, పాఠకులకూ కూడ వీక్షణం ఆహ్వానం పలుకుతోంది. మార్క్స్ గురించి మీ అభిప్రాయాలు, వ్యాసాలు, విశ్లేషణలు, మీకు నచ్చిన ఇతర భాషా వ్యాసాల అనువాదాలు మాతో పంచుకోండి. వీక్షణం మే 2018 సంచికను మార్క్స్ ద్విశత జయంతి ప్రత్యేక సంచికగా ప్రత్యేక వ్యాసాలతో దాచి ఉంచుకోదగిన సంచికగా తయారు చేద్దాం.



జూన్ 2కు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నాలుగు సంవత్సరాలు కానుంది. జూన్ 8కి ఆంధ్రప్రదేశ్ ఏర్పడి నాలుగు సంవత్సరాలు కానుంది. ఈ సందర్భంగా వీక్షణం జూన్ సంచికను తెలంగాణ మీద ప్రత్యేక వ్యాసాలతో, జూలై సంచికను ఆంధ్రప్రదేశ్ మీద ప్రత్యేక వ్యాసాలతో వెలువరించాలనుకుంటున్నాం.



నాలుగు సంవత్సరాల ప్రయాణంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల పాలనతీరు, వ్యవసాయం, పారిశ్రామికాభివృద్ధి, ప్రజా జీవనం, విద్య, వైద్య ఆరోగ్య రంగాలు, సంక్షేమం, సమస్యలు, పరిష్కారాలు, ఆందోళనలు, ప్రత్యామ్నాయ ఆలోచనలు వంటి ఏ విషయం మీదనైనా సరే మీ అభిరుచిని బట్టి వ్యాసాలు రాసి ఈ సంచిక కోసం పంపించ వలసిందిగా కోరుతున్నాం. ఈ సంచికల కోసం రాయదలచుకున్న వాళ్లు మే 10 వరకు (తెలంగాణ), జూన్ 10 వరకు (ఆంధ్రప్రదేశ్) పంపించగలరు.

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao